జనవరి 2014

రూ. 12/-

విపుల

విశ్వకథా వేదిక



విపుల 36వ వసంతంలో కాలుమోపిన సందర్భంగా 'ముప్ఫైఐదేళ్లనాటి విపుల కథల్ని' నేటితరం పాఠకలోకానికి అందిస్తున్నాం. అనువాద కథల్ని మాత్రమే ఈ శీర్షిక కింద పునర్ముద్రిస్తున్నాం. దీనికోసం సుప్రసిద్ధ రచయితలు, కథకులు విపుల ఆవిర్భావం నుంచి ఒక్కో సంచికను కూలంకషంగా చదివి ఒక్కో కథను ఎంపిక చేశారు. ఇందులో భాగంగా 1979 జనవరి విపుల నుంచి రామా చంద్రమౌళి ఎంపిక చేసిన ఎల్.ఎన్. గుప్తా గుజరాతీ కథ సెలవురోజు మీకోసం!

ఈనెల 2 న పుట్టినరోజు జరుపుకుంటున్న రామా చంద్రమౌళిగారికి జన్మదిన శుభాకాంక్షలు!

సెలవురోజు

కురుస్తున్న వర్షం ఆగిపోయింది. మేఘాలన్నీ చెదిరిపోయి, నీలాకాశంలోంచి సాయంకాలపు నీరెండ ప్రసరిస్తోంది. రంగు రంగుల దీపాలు స్వచ్ఛమైన కాంతులను వెదజల్లుతూ మెరిసిపోతున్నాయి. ఉన్నట్లుండి వచ్చిపడిన వర్షం ధాటికి, తలదాచుకోడానికి షాపు వరండాల కింద దూరిన వాళ్ళూ, అవసరం లేకపోయినా వర్షం నుంచి తప్పించుకోడానికి హోటళ్ళలో దూరి కప్పు కాఫీ సేవించి కూచున్న వాళ్ళూ - స్వేచ్ఛగా బయటికి వచ్చేస్తున్నారు.


నరేష్, సుషమ తమ పెద్దకూతురు పదేళ్ళ కవితనూ, మిగతా పిల్లలనూ వాళ్ళ అమ్మమ్మ దగ్గర వదిలేసి సాయంకాలం షికారుకని బయటకు వచ్చారు. మొదట పిల్లలంతా తమని వదిలి వెళ్తున్నందుకు మొండికేశారు. తల్లిదండ్రుల వెంబడి బయటకు పోవాలని పట్టుబట్టేరు.

కానీ ఆ జంటకు వాళ్ళు వుంటున్న ఇళ్లు వర్కర్లు కాలనీలోని రెండు గదుల ఇంట్లో ఎప్పుడూ అరుదుగా కానీ ఏకాంతం లభించదు, ఆ పరిసరాల నుంచి దూరంగా వుండటం గానీ జరగదు.

నిజమే, తమ రక్తాన్ని పంచుకుని పుట్టిన పిల్లలే. అయితే వాళ్ళు తమ జీవితాల గురించి కూడా కాస్తో కూస్తో చూసుకోవాలి గదా. అందుకే, కవిత ఏడుస్తూ మారాం చేస్తుంటే వీపుమీద ఒక్కటి వాయించి, సుషమతో బాటు కోపంగా బయటికి వచ్చేశాడు నరేష్. వాళ్ళు బస్సు దిగేసరికల్లా వర్షం మొదలయింది. వర్షం నుంచి తలదాచుకోటానికి పెట్రోలు బంకులో సిమెంటు రేకుల కప్పు కిందకి పరుగెత్తారు.

“కవిత మనకు బ్రహ్మాండమైన వీడ్కోలు ఇచ్చింది కదూ” కొంచెం కోపంతో విసుగ్గా గొణిగేడు నరేష్, సుషమ వేపు తన మాటల్ని అంగీకరిస్తుందేమోనని చూస్తూ.

ఆమె దీర్ఘంగా నిశ్వసించింది. ఆమె మౌనాన్ని చూసి నరేష్‌కి నిస్పృహ కల్గింది



కానీ పైకి ఏమీ అనలేదు.

ఈ భయంకర ప్రపంచంలో ఒక్క సుషమ మాత్రమే తనక్కావలసిన ఉత్సాహాన్ని, ఆవేశాన్ని ఇవ్వగలదని అతనికి బాగా తెలుసు. అయితే సుషమ, కవితను గురించి ఆలోచిస్తోంది. తన మనసులో కూతురు మీద అలలు అలలుగా చెలరేగుతున్న జాలిని అతికష్టం మీద పక్కకు నెట్టివేయగలిగింది. నరేష్, కోపం మీద కూతురును కాస్త గట్టిగానే కొట్టేడు. కానీ సుషమ ఏ మాత్రమయినా బాధను బయటికి వ్యక్తం చేసిందంటే అది ఈ ఆదివారం సాయంకాలపు 'మూడ్'నంతా చెడగొడుతుంది. ఎందుకంటే నరేష్ ఈ ఆదివారానికి, మతాధిపతులు తన మత సిద్ధాంతాలకూ, దేవుళ్ళకూ ఎంత విలువ ఇస్తారో అంత విలువ ఇచ్చేడు మరి.

వాళ్ళిద్దరికి మధ్య వున్న ముఖ్యభేదం ఏమంటే నరేష్ ప్రతివిషయాన్నీ తనకు సంబంధించే ఆలోచిస్తాడు. కానీ సుషమ మాత్రం ప్రతిచిన్నవిషయాన్నీ ఇతరులేమైనా అనుకుంటారేమోనని ఆలోచిస్తుంది. వాళ్ళు వుండే ఇల్లే గనుక కాస్త సౌకర్యంగా

వుండి వుంటే, తన భార్యతో కొన్ని గంటల యినా ఏకాంతంగా గడపాలనే కోర్కె అత నికి కలిగి వుండేది కాదు. కానీ వాళ్ళుండే పరిసరాలంతా తాగుబోతులతోనూ, ఇరుగూ పొరుగులు తిట్టుకునే తిట్లతోనూ, కేకలతోనూ, కుళ్ళు కంపుతోనూ నిండి వుంటుంది ఎప్పుడూ. అలాంటి నరకం నుంచి బయటపడి కాస్సేపయినా సంతో షంగా గడపాలనుకునే తను, అమాయకపు కూతుర్ని అలా కొట్టి వుండే వాడేకాదు.

సుషమకు నరేష్ మీద, కవిత మీదా ఎంతో జాలి కల్గింది. నరేష్ ఏనాడూఈ విషయాలను గురించి ఆలోచించడు. తనకి ఏమాత్రం విసుగు కల్గినా చాలు, కోపంతో వూగిపోతాడు.

★ ★ ★

ఒకరోజు రాత్రి - వర్షం బాగా పడు తోంది.

సుషమ కూతురు పక్క నుంచి లేచి, తన ఇద్దరు కొడుకులు పడుకున్న మంచాన్ని దాటి, నరేష్ మంచం దగ్గరకి వెళ్తోంది. మామూలుగా తన పక్కనే పడు కుని వున్న కవిత, తన కదలికకు నిద్ర మే ల్కొంది. ఎన్నిసార్లో తన తల్లి నీళ్లగదిలోకి వెళ్ళడానికి లేచినప్పుడల్లా ఆ పిల్లకు మెల కువ వచ్చేది. ఆ రోజు కూడా నిద్రలోంచి లేచి “నువ్వెందుకు పోతున్నావో నాకు తెలుసులే” అంటోంది.

అమోఘమైన ఆ చిన్నపిల్ల తెలివికి, ఆ పిల్ల తమ మీద మోపిన నేరానికి ఆ తల్లి దండ్రు లిద్దరూ స్థాణువులైపోయారు. ఆ చీకట్లో వాళ్ళ మొహాలు సిగ్గుతో ఎర్రబా రేయి. సుషమకు ఆ పిల్లను పట్టుకుని చిత గ్గొడదామా అన్నంత కోపం వచ్చింది. కానీ అలా శిక్షించడం వల్ల తమ చర్యలన్నీ పక్కింటి వాళ్ళకు తెలియడం తప్ప, ఇంకేమీ ఉండదని అతి ప్రయత్నం మీద మానుకుంది.

నిజానికి ఆ కాలనీలో ఇలాంటి సంఘట నలెన్నో జరిగాయి. అయితే అక్కడ నివ సించే వాళ్ళంతా ఇలాంటి వాటిని గురించి పెద్దగా పట్టించుకోకుండా అవి తమ దైనం దిన జీవితంలో ఒక భాగంగా పరిగణి స్తారు. ప్రతి కుటుంబంలోనూ కొల్లలు, కొల్లలుగా వుండే పిల్లలు, వర్షాకాలంలో ఈగలు ముసిరినట్లు గుంపులు గుంపు లుగా ముసుర్తూ వుంటారు.

నరేష్, సుషమల కుటుంబం మధ్యతర గతి కంటే కాస్త తక్కువ. సుషమ ఒక ప్రైమరీస్కూల్లో టీచరుగా పనిచేస్తూ నెలకి రెండు వందలు తెచ్చుకుంటోంది. రికా ర్డుల్లో మాత్రం నాల్గు వందలకు సంతకం పెట్టాలి. ఆమెకు ఆశ్చర్యం కల్గించే విషయం ఏమంటే, ఇలాంటి పరిసరాల్లో వుంటూ కూడా మిల్లువర్కర్లు ప్రతి సంవ త్సరం పిల్లల్ని కనడం. దీనికోసం వాళ్ళు చేసుకునే ఏర్పాట్లు ఎంతో అసంతృప్తిగా వుంటాయి. రెండు మంచాలకూ మధ్యగా ఒక పాతచీరని తెరలాగ కట్టేస్తారు. ఆ తెర తమవేపు ఆసక్తిగా, వింతగా చూసే చూపుల నించి కనబడకుండా చేస్తుంది కానీ, వాళ్ళు విడిచే శ్వాసలనీ, మూల్గులనీ దాచివేయలేదు కదా!

సంపాదనపరులైన కొడుకులు, కూతు ళ్ళతో నివసించే ముసలివాళ్ళు కూడా ఈ పద్ధతికి అలవాటు పడిపోయారు. ఎందు కంటే వాళ్ళు కూడా ఒకప్పుడు ఈ పద్ధతిని అనుసరించిన వాళ్ళే కాబట్టి. ఈ ముసలి వాళ్ళు సాధారణంగా వంటగదిలో పడుకుం టారు. ఇక ప్రేమికుల జంట వంటగది దాటి స్నానాల గదిలోకి వెళ్ళినప్పుడల్లా ఈ ముసలివాళ్లు మేలుకునే ఉంటారు.

తమ పిల్లల మనస్తత్వం మీద ఇలాంటి విషయాలు ఏ ప్రభావాన్ని కల్గిస్తాయోనని అప్పుడప్పుడూ దీన్నిగురించి నరేష్, సుష మలు చర్చిస్తూ వుంటారు.

వాళ్ళు పెరిగి పెద్దవాళ్ళయే కొద్దీ తమ తల్లిదండ్రుల మీద కోపాన్ని, అసహ్యాన్ని

గమనిక : విపులకు కథలు, అనువాద కథలు, ఇతర రచనలు, కార్టూన్లు, నేనెవరిని, వినోదిని కూపన్లు పంపేవారు పారితోషికం, బహుమతులు పొందడంలో అసౌకర్యం కల గకుండా ఉండేందుకు విధిగా వారు తమ పూర్తి చిరునామా, పిన్‌కోడ్, వయసు, ఫోన్ నంబరు స్పష్టంగా రాయాలి. తిరస్కృత రచనలు కావాలనుకునేవారు సొంత చిరునామా తో తగినన్ని స్టాంపులు అంటించిన కవరు జతచేయాల్సిందిగా మనవి. చందాదారులు కూడా తాము పంపే డి.డి. వెనుక భాగంలో విధిగా చిరునామా, ఫోన్ నెంబరు ఇవ్వాలి.

పెంచుకుంటూనే వుంటారా? ఇక్కడి పిల్ల లంతా ఎక్కువగా సినిమాల్లో 'బ్లాక్'లో టికెట్లు అమ్మేవాళ్ళుగానూ, జేబులు కొట్టే వాళ్ళుగానూ తయారుకావడానికి బహుశా ఇదొక కారణం అయివుంటుంది.

ఒకరోజు ఒకబ్బాయి "ఎందుకు నాకు లెక్చర్ ఇస్తావు? రాత్రంతా నువ్వు చేసేది నాకు తెలియదేమిటి!" అంటూ వాళ్ళమ్మని నిలదీసి అడుగుతూ వుండడం సుషమ విన్నది. పాపం! మధ్యవయస్కురాలయిన ఆ తల్లి, చుట్టూ అందరూ తనని చూసి నవ్వుతూంటే సిగ్గుతో చచ్చిపోయింది అంద రిముందూ.

ఇలాంటి పరిసరాల్లో జీవించే పిల్లల భవిష్యత్తు ఏమవుతుంది? వాళ్ళు ఇప్పటికే ఎన్నోరకాల తిట్లకు అలవాటు పడిపోయారు. తాము అందరి నుంచీ దూరంగా, ప్రత్యేకంగా ఎవర్నీ పట్టించుకో కుండా వున్నప్పటికీ తమ ఇంట్లోనే జరిగే విషయాల నుంచి వాళ్ళను దూరం చేయ లేరు కదా.

వాళ్ళకు ముగ్గురు పిల్లలు. కవిత సుషమ పక్కలో పడుకుటుంది. ఇద్దరు కొడుకులూ ఒక మంచం మీద పడుకుం టారు. నరేష్ ఒక్కడూ తీగతో అల్లిన చిన్నమంచం మీద పడుకుంటాడు.

ఇంతెందుకు? నిజానికి నరేష్‌కి ఎదుర యిన ఒకానొక అనుభవమే ఒక చేదు అనుభవం. ఒకరోజు రాత్రి అతను నిద్ర లేచి బాత్‌రూంకని వెళ్లేడు. వంట గదిలో అతనికి కనిపించిన దృశ్యం అతన్ని పిచ్చి వాణ్ణి చేసేసింది.

అతని తల్లీ, తండ్రి బలమైన కౌగిలిలో ఒకరినొకరు హత్తుకుపోతూ కనిపించేరు. అతని మనసంతా అసహ్యంతో నిండిపో యింది. ఈ సంఘటన నరేష్ మస్తి ష్కంలో చెరగని ముద్ర వేసింది. దాన్ని మరచిపోవడానికి అతనికి ఎన్నోరోజులు పట్టింది. ప్రతిపనిలోనూ అతనికి అదే గుర్తుకు వచ్చేది. అతను పనిచేసే వార్తాప త్రిక ఆఫీసులో దీనివల్ల తగిన ప్రతి ఫలాన్ని అనుభవించేడు.

ఆ సంఘటన జరిగిన రోజు రాత్రి విక లమయిన మనస్సుతో ఒక ముఖ్యమయిన కథకు తప్పుడు శీర్షిక ఇచ్చేడు. దానివల్ల నగరంలో నవ్వుల పాలయింది ఆ పత్రిక. దాంతో ఆ పత్రిక సంపాదకుడు అతన్ని పిలిచి 'నువ్వు సబ్ ఎడిటర్‌గా పనిచేయడా నికి ఏ మాత్రమూ పనికిరావని' దులిపే శాడు. ఆ చీవాట్లు బాణాల్లాగా గుచ్చుకుని అతని మనసును గాయపర్చేయి. అందు లోనూ జర్నలిజం తన వృత్తి అయినందు వల్ల అతని బాధకు అంతేలేదు. అతను జరిగిన విషయాన్ని వివరించి సంపాదకు నికి చెప్పలేడు. అలాగని అతను పెట్టిన చీవాట్లని పట్టించుకోకుండా వుండనూ లేడు.

రాజీనామా రాసి సంపాదకుని మొహాన కొట్టేద్దామని కాస్సేపు అనుకున్నాడు. కానీ మరుక్షణంలోనే అతని కోపం పోయింది.

సుషమ ఇంటికి నెలకి రెండు వందలు తెస్తుంది. తనకి రెండు వందల యాభై వస్తుంది. సుషమ పనిచేస్తున్న స్కూలు మేనేజిమెంటువాళ్ళు ప్రతి సంవత్సరం

వార్తాపత్రికల్లో వాళ్ళ స్కూలులో వాళ్ళు బోధించే నిజాయితీ గురించి పొగుడుకుంటూ సప్లిమెంటు ఇవ్వడం వల్ల నరేష్‌కుగానీ, సుషమకుగానీ లాభించేది ఏమీ లేదు. పైగా అది చూసినప్పుడల్లా జుట్టు పీక్కుందామనిపించేది అతనికి. అతని స్నేహితుల్లో చాలామంది తనలాగ కాకుండా ఉక్కుఫ్యాక్టరీలో ఉద్యోగాలు చేస్తూ నెలకు వెయ్యి రూపాయలు పైగా సంపాదిస్తున్నారు. కానీ ఇప్పుడు తాను ఏమీ చేయలేడు. ఈ ఉద్యోగం తప్ప గత్యంతరం లేదు తనకు. ఈ ఉద్యోగాన్ని పట్టుకుని వెళ్ళాడవలసిందే తను.

ఆ రోజు రాత్రి జరిగిన సంఘటన లాంటిది మళ్ళీ జరిగి, అతను పూర్తి పిచ్చి

అనువాదం :
పి.యల్. దేవి

వాడుగా మారిపోకముందే అతని అదృష్టం కొద్దీ వాళ్ళ నాన్న చనిపోయేడు. అలాంటిది మళ్ళీ జరిగివుంటే తన ఉద్యోగంలో ఎన్నో తప్పులు చేసి, ఏనాడో ఉద్యోగానికి రాజీనామా ఇచ్చి ఉండాల్సి ఉండేది మరి. పరిస్థితులు తనని చాలా దెబ్బతీసి ఉండేవని అనుకున్నాడతను. దానికితోడు సుషమ ఉద్యోగాన్ని వాళ్ళ మేనేజిమెంటు వాళ్లు తీసేసి ఉంటే ఇక కష్టాల సంగతి చెప్పాల్సిన పనేలేదు. అదీగాక ఉద్యోగంలో అయిదు సంవత్సరాల సర్వీసు ఉన్నప్పటికీ, ఆమె ఇప్పటికీ తాత్కాలిక ఉద్యోగే. ఆమె తోబాటుగా ఉద్యోగం చేసే కొందరికి మూడేళ్లలోనే పర్మనెంటు అయింది. కానీ సుషమకు కాలేదు. కష్టాలెప్పుడూ కలసికట్టుగానే వస్తాయిగానీ, ఒంటరిగా రావు కదా! ఏదయినాగానీ ఎదుర్కోడానికి సిద్ధంగా ఉన్నాడతను.

ఇంకో విషయం కూడా అతన్ని వేధిస్తూ వుంది. మొట్టమొదట వాళ్ళా ఇంట్లో చేరినప్పుడు ఇరుగుపొరుగుతో బాగా కలివిడిగా ఉండాలని ప్రయత్నించేరు. కానీ వాళ్ళ నడవడిక, వాళ్ళు చర్చించే విషయాలూ, వాళ్ళు తాగే నాటుసారా, వాళ్ళ నోళ్ళలోంచి వచ్చే బండబూతులూ, వాళ్ళ కొట్లాటలూ ఇవన్నీ వాళ్ళ నుంచి దూరంగా ఉండేలా చేశాయి. కానీ తన పేపరుకు రాసేటపుడు తానొక మధ్యతరగతి వాడినన్న విషయం మరచిపోయి కార్మికుల సహజసిద్ధమైన మానవత్వాన్ని గురించి ఎంతో జాలిగా రాసేవాడు. వాళ్ళ జీవితాలు అలాగే ఎదుగూ బొదుగూ లేకుండా ఉంటే, వాళ్ళలో ఎంతో మంది మంచివాళ్ళు కూడా పూర్తి నేరగాళ్లుగా మారిపోయే అవకాశం ఉందని రాసేవాడు. ఒకవైపు వాళ్ళని అసహ్యించుకుంటూ మరోవైపు వాళ్ళ మీద జాలి కురిపిస్తూ రాసే తన కపటబుద్ధికి తనకే ఆశ్చర్యం వేసేది ఒక్కోసారి.

అతను వాళ్ళని గురించి ఎంతో ఆసక్తిగానూ, జాలిగానూ పత్రికల్లో రాసినప్పటికి, మొత్తంమీద నాలుగైదుసార్లు కూడా వాళ్ళతో కలివిడిగా ఉండలేకపోయాడు.

తానెప్పుడయినా తాను రాసిన విధంగా వాళ్ళతో స్నేహంగా ఉండగలడా? తాను చాలామందిలాగా ద్వంద్వభావాలు కలవాడని మనసులో అంగీకరించినా, ఎవరయినా ఆ విధంగా అంటే మాత్రం ఒప్పుకునేవాడు కాదతను. వాళ్లతో వాదనకు దిగేవాడు. ఇవన్నీ ఇలా ఉన్నప్పటికి తనలో చెలరేగే ద్వంద్వభావాలని తనలోంచి వేరు చేయలేకపోయేవాడు. ద్వంద్వ భావాల్లోనే జీవించేవాడు. నటించేవాడు. కానీ, తెచ్చిపెట్టుకున్న ధైర్యంతో తన మనసుని తానే మోసం చేసుకునేవాడు కాదు. కానీ జీవితంలో తనకు తగిలే ప్రతిదెబ్బకూ, తన రెండు గదుల వాటాలో తన హృదయానికి తగిలిన దెబ్బను గుర్తుతెచ్చుకునేవాడు. తాను మధ్యతరగతి కుటుంబీకుల మధ్య

మనసు లోతులను స్పృశించిన మంచి కథ



'విపుల' 1979 జనవరి సంచికలో పదిహేను తెలుగేతర భాషా కథలున్నాయి. అన్నీ సమున్నతమైన మానవ విలువలకు సంబంధించివే. అందులో యల్.ఎన్. గుప్తా 'సెలవు రోజు' (గుజరాతీ) గొప్పకథ. దీన్ని పి.ఎల్. దేవి మూల పరిమళం భంగపడకుండా అద్భుతంగా అనువదించారు.

కథ మనిషిని ఆలోచింపజేస్తూనే, ఉన్నతీకరిస్తూనే, వెంటాడాలి. ఈ 'సెలవురోజు' కథ చాలాకాలం వెంటాడుతుంది. మనిషిలో రెండు ప్రపంచాలుంటాయి. ఒకటి.. తన ధర్మాలు, విధులు బాధ్యతలు.. చుట్టూ ప్రపంచం, కుటుంబం, వాటికి సంబంధించిన సాపేక్ష అనుబంధాలు. రెండు.. తనకు మాత్రమే చెందిన వ్యక్తిగత ఆంతరిక ప్రతిఫలనలు.. మోహం, దాహం, ప్రేమ.. ఆకలి.. దుఃఖం.. తృప్తత.. ఇవీ. మనిషి అనేక చిన్న చిన్న అనుభవాలను, అనుభూతులను పొందలేక పడే నిశ్శబ్ద ఘర్షణ సంక్లిష్టమైంది. అత్యంత మార్మికమైంది. ఆ దిశలో ఈ 'సెలవురోజు' కథ కొత్త కిటికీని తెరిచి, దయనీయ జీవిత శకలాన్ని 'డాక్యుమెంట్' చేసి చూపుతుంది.

ఇప్పటికీ అపరిష్కృత సమస్యగా కొనసాగుతున్న సందర్భాన్ని అప్పట్లోనే రచయిత స్పృశించారు. మొదట్నుంచి చివరిదాకా 'వర్షం' కథలో ఒక పాత్రయి మనసును అనుభూతింపజేస్తూనే ఉంటుంది.

అతి సున్నితమైన అంతర్జ్వలనాన్ని రచయిత విప్పి చెప్పాడు. ఈ కథలో నరేష్ చేష్టలన్నీ సహజమైనవి.. సహేతుకమైనవి.. వ్యక్తిగత కోణంలోనివి. సుషమ మాత్రం సమాజ కోణంలో ప్రతి సందర్భాన్నీ గ్రహిస్తూనే.. యవ్వనవతియైన స్త్రీగా ధర్మబద్ధమైన అతనికి సహకరిస్తుంది.. ఆనందింపజేస్తుంది.. తనూ ఆనందిస్తుంది. ఈ అతి సహజ మానవ ప్రవర్తనను సమర్థంగా, నిష్కపటంగా అక్షరబద్ధం చేయడం వలన ఈ కథ ఒక మంచి కథగా నిలిచింది.

– రామాచంద్రమౌళి
సీనియర్ కవి, రచయిత

విలక్షణ కథకులు

వరంగల్లుకు చెందిన రామా చంద్రమౌళి కవి, కథా రచయిత, సాహితీ విమర్శకులు, నాటక కర్త. ఇప్పటి వరకు 18 నవలలు, 243 కథలు, ఎనిమిది కవిత్వ సంపుటాలు, రెండు విమర్శనా గ్రంథాలను వెలువరించారు. ఆయన 'భూమి దుఃఖం' కథ ఏడు భారతీయ భాషల్లోకి, ఇంగ్లీషులోకి అనువదితమైంది. దీన్ని దూరదర్శన్ 'నా భూమి' పేరుతో టెలిఫిల్మ్ తీయగా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి 'స్వర్ణ నంది పురస్కారం' అందుకుంది. '22వ వరల్డ్ కాంగ్రెస్ ఆన్ పొయెట్స్' గ్రీస్‌లో భారత ప్రతినిధిగా, సార్క్ దేశాల సాహిత్య శిఖరాగ్ర సదస్సులో భారత ప్రతినిధిగా పాల్గొన్నారు. రామా చంద్రమౌళి కవిత్వం, కథలు ఐదు సంపుటాలుగా ఆంగ్లంలో వెలువడ్డాయి. తెలుగు విశ్వవిద్యాలయం, కొలకలూరి భాగీరథీ, సినారె, డా. ఆవంత్స సోమసుందర్ కవితా పురస్కారాలు ఆయనను వరించాయి.

వుండి ఉన్నట్లయితే ఇలాంటి బాధల నుంచి దూరంగా ఉండి ఉండేవాడు. మూడు గదుల వాటాలో అలాంటి పీడకలల నుంచి రక్షింపబడేవాడు. సుషమను తన పక్కలో పడుకోమని బలవంతం చేసినప్పుడల్లా, కిర్రుమనే మంచం చప్పుడుకు పిల్లలెవరైనా లేచి చూస్తే ఎంతో అసహ్యంగా ఉంటుందని ఆమె వారించినప్పుడు ఆనాటి పీడకలలాంటి సంఘటన గుర్తుకు వచ్చి చిర్రుబుర్రులాడేవాడు.

తన ఆలోచనా పిశాచాలు మనసును మబ్బుల్లా కమ్మేసి, తనలోని ధైర్యాన్ని నశింపజేసి, తన పనుల్లో ఆటంకాలు కల్గించి సంపాదకుల నుంచి చీవాట్లు తగిలేలా చేశాయి.

★ ★ ★

వర్షం తగ్గగానే పెట్రోలు బంకులోంచి

బయటకు వచ్చారు. "రసవంతికి వెళ్దాం" సూచించేడు నరేష్. అదొక ఓపెన్ ఎయిర్ రెస్టారెంటు. వేసవికాలం గడిచిపోయినప్పటికీ దాన్ని ఇంకా మూసివేయలేదు. ఆరు బయట వేసిన చెక్కబెంచీలు వర్షానికి తడిసిపోయి ఉంటాయి. ఇలాంటి సమయంలో అక్కడికి ఎందుకు వెళ్లాలన్నట్లుగా అతనివేపు వింతగా చూస్తూనే అతన్ని అనుసరించింది సుషమ.

హోటల్లో అతనికి ఎదురుగ్గా కూచుందామె. మామూలుగా అయితే అలాగే కూర్చోవాలి. కానీ నరేష్ ఆమెను తన పక్కన వచ్చి కూచోమని బలవంతం చేశాడు. ఆశ్చర్యంతో ఆమె అతను చెప్పినట్లే చేసింది. ఎంతో కష్టంమీద కూడగట్టుకున్న అతని ప్రశాంతతను చెడగొట్ట దల్చుకోలేదు ఆమె.

ఆమె అతని పక్కన వచ్చి కూర్చున్న కాస్సేపట్లోనే నగరంలోని దీపాలన్నీ ఆరిపోయాయి. వర్షం వల్ల కరెంటుకు అంతరాయం కల్గినట్లుంది. నరేష్ ఒక చేయి ఆమె తొడమీద పాకిస్తూ, ఇంకోచేతిని ఆమె భుజాల మీద వేసి నిమురుతూ, వక్షోజాల మీదికి చేయి జార్చేడు. ఆ హోటల్లో ఉన్నది వాళ్ళిద్దరే. అదీగాక చుట్టూ కటిక చీకటిగా ఉన్నందువల్ల భయపడాల్సిందేమీ లేదు. అయితే అతని ప్రయత్నాన్ని భగ్నం చేస్తూ, బేరర్ వెలిగించిన కొవ్వొత్తితో తాము కూర్చున్న బల్ల దగ్గరికి వచ్చేసరికి, సుషమను వదిలి పక్కకు జరిగాడు నరేష్.

తనలో తాను తిట్టుకుంటూ గొణుక్కున్నాడు నరేష్. కానీ బేరర్ రాకతో సుషమ మటుకు పెద్ద బరువు దించినట్లుగా ఫీలయింది. నరేష్‌కేసి చూసి పేలవంగా నవ్వింది. త్వరగా 'టీ' తాగడం ముగించేరు.

'ఎక్కడకు వెళ్ళాలి? ' మళ్ళీ మొదటిప్రశ్నే తలెత్తింది. నరేష్ భంగపాటును గమనించి అర్ధోక్తిగా నవ్వుతూ ఆ ప్రశ్న వేసింది సుషమ. ఇవన్నీ గమనించే స్థితిలో లేడు నరేష్. కాస్సేపయినా సుషమకు దగ్గరగా ఉన్నందువల్ల అతనికి కొంచెం తేలిగ్గా, సంతోషంగా ఉంది.

"మహారాజా బాగ్ వెళ్దాం పద" చెప్పేడు నరేష్.

"మీకేవయినా అర్ధం అనేది ఉందా? ఇంత వర్షంలో ఆ పార్కుకా? ఎక్కడ కూచుంటాం మనం? గడ్డి అంతా తడిసిపోయి బురద బురదగా ఉంటుందిప్పుడు. ఈ వర్షంలో పిచ్చివాళ్ళు తప్ప ఇంకెవరూ వెళ్లరక్కడికి" అంది సుషమ కాస్త ఆశ్చర్యంగానూ, కొంచెం ఎగతాళిగానూ.

"నాన్సెన్స్" నరేష్ ఆమె మాటల్లోని యథార్థాన్ని పట్టించుకునే స్థితిలో లేడు. వాళ్ళు అలాగే ఒక ఫర్లాంగు నడిచి పార్కు చేరుకున్నారు. కరెంటు వచ్చి దీపాలు వెలుగుతున్నప్పటికీ, బాగా చీకటిపడిపోయిన ఇలాంటి సమయంలో అక్కడికి వెళ్ళడం ఎంత వింతగా ఉంటుందో అనే ఆలోచిస్తోంది సుషమ. ఈ వాతావరణంలో ఎవ్వరూ అక్కడికి రారు.

వాళ్ళు పార్కులోకి ప్రవేశించేసరికి ఎదురుగా వర్షం నీళ్ళతో నిండిన గుంటలు. దారి అంతా బురదతో నిండివుంది. బాగా తడిసిపోయిన గడ్డి అదోరకమైన వాసన వేస్తోంది. ఆ వాతావరణంలో విపరీతమైన చలి పుడుతోంది. కనుచూపు మేరలో ఎవరూలేరు. ఒక పెద్ద మర్రిచెట్టుకింద, చిమ్మచీకటిగా వున్న ప్రదేశంలో బల్లమీద వున్న నీటిని తుడిచి కూర్చున్నారిద్దరూ.

ఉన్నట్లుండి ఆమెను ఒళ్ళోకి లాక్కున్నాడు నరేష్.

"అబ్బ! వుండండి ఎవరయినా చూస్తారు!" అంటోంది సుషమ.

"తెలివితక్కువగా ప్రవర్తించవద్దు" చిన్నగా అన్నాడు నరేష్ పళ్ళు బిగపట్టి, శబ్దం బయటకు రాకుండా కంఠంలోనే అణిచి వేస్తూ.

అతని కళ్ళు కోరికతో నిండి మెరుస్తున్నాయి. సుషమకు భయం వేసింది. 'ఇలాంటి బహిరంగ ప్రదేశంలో ఈయనెందుకిలా ప్రవర్తిస్తున్నారు? తామేమీ హిప్పీలు కాదే? ' అనుకుంటోంది ఆమె.

అతను తన మొహాన్ని ఆమె మొహంకేసి రుద్దుకుంటూ ఆమె పెదాల మీద ముద్దులు కురిపిస్తోన్నాడు. ఇంతలో 'ఈల' ఒకటి వినిపించింది. దాంతో బాటుగా 'పార్కులో కూర్చునే 'టైం' అయిపోయిం'దంటూ తోటమాలి కంఠం కూడా వినిపించింది.

"ఛీ! అంతా శని" గొణుక్కుంటూ లేచి ఆమె చేయిని పట్టుకోబోయేడు నరేష్.

చేతిని విదిలించి కొట్టిందామె. తోటమాలి వాళ్ళకు దగ్గరగా వచ్చాడు. అతను మంచివాడిలా వున్నాడు. అదే వేరొకళ్లయితే ఇలాంటి బహిరంగ స్థలాల్లో వ్యభిచారం చేస్తున్నారని నేరం మోపి, బెదిరించి డబ్బులాగేవాళ్ళు.

మళ్ళీ మూడోసారి అదేప్రశ్న తలెత్తింది. 'ఎక్కడకు వెళ్ళాలి? ' అని.

"ఇంటికి" చెప్పింది సుషమ.

"నాన్సెన్స్" తిరగబడ్డాడు నరేష్. "ఏదయినా పిక్చరు సెకండ్‌షోకి వెళ్దాం! ఎక్కువ రష్‌లేని పాత సినిమా ఏదయినా వుంటే చూసివెళ్దాం" అన్నాడు.

ఒప్పుకోక తప్పలేదు సుషమకు.

ఏభైరెండోవారం నడుస్తున్న ఒక సినిమాని ఎన్నుకుని దానికి వెళ్ళేరు. బాల్కనీ

టికెట్టు తీసుకొని పైకి వెళ్ళేరు. వాళ్ళ అదృష్టం కొద్దీ వాళ్ళు తప్ప ఎవరూ లేరు బాల్కనీలో. ఒంటరితనం చిక్కింది వాళ్ళకు. విచ్చలవిడిగా ప్రవర్తించడం మొదలుపెట్టాడు నరేష్. సుషమ కూడా నిగ్రహాన్ని కోల్పోయి, చీకట్లో తడుముతున్న అతని చేతులకు అనువుగా తన శరీరాన్ని అందిస్తోంది. సినిమా మొదలయి అర గంట గడిచినా ఎవరూ బాల్కనీలోకి రాక పోయేసరికి తన ఇంట్లో ఏదయితే తనకి లభించడంలేదో దాన్ని పొందేందుకు నిశ్చయించుకున్నాడు నరేష్.

సినిమా వదిలేసరికి ఒంటిగంటయింది. బస్సు అయితే వాళ్ళ కాలనీకి ముప్పై పైసలకే వెళ్ళొచ్చు. అయితే అది రాత్రి పది గంటలకే ఆగిపోయి ఉంటుంది. ఇప్పుడు రిక్షాని మాట్లాడుకొని వెళ్ళడం తప్ప గత్యంతరం లేదు. మళ్ళీ వర్షం మొదలయినందు వల్ల రిక్షావాళ్ళు కొండెక్కి కూర్చుంటారు.

జేబులు తడుముకున్నాడు నరేష్. ఇక రెండు రూపాయలు మాత్రమే వున్నాయి జేబులో. రిక్షావాళ్ళతో బేరమాడటం మొదలుపెట్టాడు. మూడు రూపాయలకి తక్కువగా ఒప్పుకోవడం లేదెవరూ- చివరికి వర్షం ఆగేకా ఐదు రిక్షాల తర్వాత ఆరో రిక్షావాడు రెండు రూపాయలకు వాళ్ళను తీసుకెళ్ళడానికి ఒప్పుకున్నాడు. రిక్షాలో ఇరుక్కుని కూర్చునేసరికి మళ్ళీ తుంపర మొదలయింది. చల్లనిగాలి మొహాలకి కొడ్తోంది. ఆ రోజు వాళ్ళు ఎంత ఖర్చుపెట్టిందీ లెక్క వేసుకుంటున్నాడు నరేష్ 'పదిహేను రూపాయలు' లెక్కపెట్టేడు.

'ఓరి భగవంతుడా! ఒక్క ఆదివారం సరదాకోసం పదిహేను రూపాయలు!' ఈ ఆలోచన అతణ్ని వణికేలా చేసింది. 'సరే, ఖర్చయిపోయింది ఎలాగూ తిరిగి రాదు' అని తనకు తాను సమాధానపర్చుకున్నాడు.

'అలాంటపుడు ఈ ఛాన్సును ఇంకా బాగా ఉపయోగించుకుంటే?' సుషమ నడుంచుట్టూ చేయివేశాడు. 'బయట సన్నగా తుంపర పడుతూంటే, ఆమె వీపు మీద చేయివేసి నిమురుతూ ఉంటే... ఇంతకంటే ఆనందం ఏముంది?'

ఆమెను మరింత దగ్గరగా లాక్కున్నాడు. ఆమె రవిక హుక్సు తొలగించి వక్షోజాల మీద చేతులు వేసి నిమురుతున్నాడు. సుషమ అడ్డుపెట్టలేదు.

బహుశా ఇలాంటి అవకాశం మళ్ళీ రాదని ఆమెకు కూడా అనిపించిందేమో! కొన్నిగంటలు మాత్రమే గడిపిన ఆనందం కోసం చేసిన ఖర్చుని బేరీజు వేసుకుని చూసి, దాన్నుంచి మరింతగా సుఖాన్ని అనుభవించడం మంచిదని, మధ్యతరగతి సంసార స్త్రీగా ఆమె అనుకున్నది.

ఇంటికి వస్తూనే నరేష్ నిద్రపోకుండా మంచం మీద అలాగే పడుకుని వున్నాడు. అతనారోజు ఖర్చు చేసిన పదిహేను రూపాయలు అతన్ని పట్టి పీడిస్తున్నాయి. మళ్ళీ అంత డబ్బు ఎలా సంపాదించాలి? బహుశా అతను ఇంకో ఆదివారం కోసం ఎదురు చూడకూడదు.

తెలతెలవారుతుండగా కునుకు పట్టిందతనికి. తెల్లవారి నిద్ర లేచేసరికి కాలనీలో కేకలతో, అరుపులతో, అల్లర్లతో గది అంతా నిండిపోయింది. పిల్లల గోల, గయ్యాళి భార్యల అరుపులూ, దానికి జవాబులుగా మగవాళ్ళు తిట్టే బండబూతులూ...

బయట మేఘాలన్నీ చెదిరిపోయి సూర్యుడు ప్రకాశంగా వెలుగుతున్నాడు ఆ కాలనీ మీద. కానీ అతని ఆంతర్యంలో ఎడతెగని ఆలోచనల మసక చీకట్లు కమ్ముకుంటున్నాయి.

గమనిక: ఈ శీర్షికలో ప్రచురిస్తున్న ఆయా భాషల కథలు విపులలో తెలుగు అనువాదంగా వెలువడి 35 ఏళ్ళయిందని గ్రహించగలరు. మొదటిసారి మూల రచయిత / అనువాదకులకు విపుల పారితోషికం చెల్లించింది కనుక వారికి మరోసారి పారితోషికం ఉండదని మనవి. V

తృప్తి

ఆ ముసలామె కూడా శిబిరం ఎదురుగా ఏర్పడిన గుంపులో కలిసిపోయింది. ప్రచండమైన వరదల వల్ల కుటుంబసభ్యులనీ, సర్వస్వాన్నీ కోల్పోయిన నిర్భాగ్యుల కోసం సహాయ చర్యలు చేసేవాళ్ళతో, దానం ఇచ్చేవాళ్ళతో, తీసుకునేవాళ్ళతో ఆ శిబిరం గందరగోళంగా ఉంది. స్వయం సహాయక బృందం సభ్యులు గుంపుని సర్దుబాటు చేయటంలో నిమగ్నమయ్యారు. సహాయక బృందంలోని సభ్యులు కొందరు అప్పటిదాకా బియ్యం, గోధుమలు, బట్టలు పంచిపెట్టారు. పంపిణీలో కుస్తీపట్లు బాగా జరిగాయి. అలజడి సద్దుమణిగేప్పటికి చాలాసేపు పట్టింది.



అప్పుడే ఓ పక్కగా నుంచున్న ముసలామె వారి దగ్గరికి వచ్చింది. ఒకడు ఆమెను గుర్తుపట్టి కోపంగా “ఓ ముసల్దానా! ఇక్కడికెందుకు వచ్చావు? ఇక్కడ బిచ్చం వేయరు. అతి కష్టమ్మీద దాతల్ని పిలిపించి వరదబాధితుల కోసం దానం చేస్తున్నాం. నీకిక్కడేం దొరకదు పో”

అతని మాటలతో అక్కడ కూర్చున్నవాళ్ళందరికీ ఆమె బిచ్చగత్తె అని అర్థమైపోయింది. ఇంకోడు ఆమెకు అర్థం కావటం కోసం భాష మార్చి “ఇక్కడ మేమే అడుక్కుంటున్నాం. ఇక నీకేం దొరుకుతుంది” అని కసురుకున్నాడు. వీళ్ళిలా మాట్లాడుతుండగానే ఆమె వారికి మరింత దగ్గరగా వచ్చింది. తన జోలెలోంచి ఏదో పొట్లం తీసి “నేను ఇవాళ బిచ్చమెత్తుకోవడానికి రాలేదు బాబూ. నాకీరోజు ఎంత దొరికిందో దాన్తో ఈ మిఠాయిలు కొనగలిగాను. ఇవి నేను ఆకలిగా ఉన్నవారికి దానం చేద్దామనుకుంటున్నాను. మీరు దీన్ని తీసుకుని ఆహార పదార్థాల కౌంటర్లో వారికి ఇవ్వండి” అంది.

సహాయ బృందం వారంతా నిశ్చేష్టులై ఉండిపోయారు. తమ బృందంలోని వ్యక్తుల సంఖ్య ఒకటి పెరిగినట్టనిపించింది వారికి. ఆమె స్థానం అందరికంటే ఉన్నతమైనదిగా తోచింది. ఆ ముసలామె తనకి భిక్షలో దొరికిన డబ్బుల్తో కొన్ని మిఠాయిలు దానంచేసి పరమానందంతో ముందుకి కదిలింది. ఎప్పుడూ ఒకరిముందు చాచి ఉండే తన చేత్తో ఈ రోజు దానం చేసిన తృప్తితో తలమునకలైపోయింది.

హిందీ మూలం: **మృదులా సిన్హా**

అనువాదం: **హారిక**

చౌరస్తాలో అమ్మ

బిజినెస్ పనిమీద కారుని వేగంగా డ్రైవ్ చేస్తున్నాడు వంశీ. సిగ్నల్ పడడంతో చౌరస్తాలో కారు ఆగింది. ఆగిన వాహనాల దగ్గర కొచ్చి కొంతమంది యాచిస్తున్నారు. వంశీ కారు దగ్గరకో వృద్ధురాలు వచ్చి చేయిచాచింది. రేగిపోయి పీచులైన జుట్టు, ముడతలు పడిన ముఖంతో లోతుకుపోయిన కళ్లతో వుందా



వృద్ధురాలు. కారు అద్దాలు పైకెత్తి పది రూపాయల నోటు చేతికి అందిస్తూ ఆ వృద్ధురాలు ముఖంలోకి చూసి షాక్ తిన్నాడు వంశీ. ఆమె కూడా వంశీని చూసి ఉలిక్కిపడి అక్కడి నుండి వడివడిగా దూరంగా వెళ్లిపోయింది. వంశీ ముఖం జేవురించింది. బిజినెస్ పని వాయిదా వేస్తున్నట్టు ఫోన్ ద్వారా చెప్పి నేరుగా హైటెక్ సిటీకి వెళ్లి పాత మిత్రుడు అనిల్‌ను కలిశాడు. పదేళ్ల తర్వాత కలిసిన వంశీని రిసీవ్ చేసుకుని క్యాంటీన్‌లో స్వీట్లు తినిపించాడు అనిల్. మాటల సందర్భంలో అనిల్ పేరెంట్స్ గురించి అడిగాడు వంశీ.

"నాన్నగారు ఈ మధ్యనే పోయారు. అమ్మ నా దగ్గరే వుంటున్నది. అప్పుడప్పుడూ అమ్మ నీ గురించి కూడా అడుగుతుంది. నా భార్యా, నేను అమ్మకు ఏ లోటూ రాకుండా చూసుకుంటున్నాం" గొప్పగా చెప్పాడు అనిల్.

"అలాగా వెరీగుడ్ ఓ అరగంట నాతోరా!" అంటూ అనిల్‌ని వెంటబెట్టుకుని కారులో చౌరస్తా దగ్గరకు తీసుకువచ్చాడు వంశీ.

అక్కడ చేయి చాచి యాచిస్తూ కనిపిస్తున్న వృద్ధురాలిని చూపించి "ఆమె ఎవరో చూడు" అన్నాడు వంశీ. అంతే ఆ వృద్ధురాలిని చూడగానే అనిల్ ముఖంలో నెత్తురు చుక్క లేదు. గుటకపడక గుడ్లప్పగించి చూడసాగాడు.

"ఇదేనా అమ్మను ఏ లోటు రాకుండా చూసుకోవడం అంటే?" సీరియస్‌గా అడుగుతున్న వంశీ కళ్లలోకి చూడలేక తలదించుకున్నాడు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అనిల్.

– పి.వి. రమణకుమార్,

చిలకలూరి పేట

అల్లరి

"రాత్రానూ దీని అల్లరి శ్రుతిమించు తోంది" భార్య అరుపులు విని గబుక్కున బెడ్‌రూంలోకి పరిగెత్తుకొచ్చాడు భర్త.

మూడేళ్ల మౌనిక గుక్కపెట్టి ఏడుస్తోంది. తండ్రిని చూడగానే, మరింత రాగం తీయసాగింది.



చూడగానే అతనికి విషయం అర్థమైంది. చెల్లాచెదురుగా పడి ఉన్నాయి మొబైల్ విడి భాగాలు. పాప మొబైల్ పగలగొట్టటంతో తల్లి నాలుగు తగిలించింది. అది నాలుగు రోజుల క్రితం కొన్న కొత్త మొబైల్. కోపం రావటం సహజం.

"ఇందులో డబ్బులు వేశానని నిన్న నువ్వు మమ్మీకి చెప్పావుగా! ఐస్‌క్రీం కొనుక్కుందామని దీన్ని పగలగొట్టాను" ముద్దుముద్దుగా పాప చెబుతుంటే అతనికిక నోటి మాట రాలేదు.

ముందు రోజు రాత్రి- రీఛార్జి గురించి భార్యతో చెప్పిన మాటలు గుర్తుకొచ్చాయి. తనని చూడగానే ఎగిరి మీదకు దూకిన పాపను గుండెలకు హత్తుకొన్నాడు.

– పార్థసారథి చిరువోలు
కూకట్‌పల్లి

పరిమళించిన మానవత్వం

రాత్రి ఎనిమిది గంటలవేళ.. ఆ బస్సు వేగంగా పరుగులు తీస్తోంది. సీట్లలో జారగిల బడి కొందరు జోగుతుంటే... కొందరు గుర్రు పెడుతున్నారు. మరికొందరు ముచ్చట్లాడుతు న్నారు. హఠాత్తుగా స్త్రీల సీట్ల వైపు అరుపులు, కేకలు చెలరేగాయి. ఓ స్త్రీ నిల బడి బస్సు ఆపమని అరుస్తోంది. డ్రైవరు, కండక్టరు బస్సాపి ఏమయిందంటూ ఆ స్త్రీని అడిగారు.



"ఈమెకు ప్రసూతి నొప్పులొ స్తున్నాయి" అని చెప్పింది.

డ్రైవరు "దగ్గర్లో ఊరు కూడా లేదు. మగాళ్లంతా క్రిందకు దిగండి" అంటూ అందరినీ కిందకు దింపారు. చుట్టూ చీకటి. అందరూ రోడ్డు మీదకు వచ్చారు.

"నిండు గర్భిణి ప్రయాణం ఎందుకు చెయ్యాలి? " అని కొందరు అసహనం ప్రకటి స్తుంటే మరికొందరు తమకు తోచినట్లు రకర కాలుగా అనుకుంటున్నారు. ఆడవాళ్లు రెండు చీరలు తీసి సీట్లకు తెరలు కట్టి ప్రసూతికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఎవరోవచ్చి వేడినీళ్లు కావాలన్నారు. రోడ్డుమీద నిలబడ్డ కొందరు ఎండు పుల్లలు ఏరి మంటవేశారు. ఎవరో టిఫిన్ బాక్స్ తెచ్చారు. మరొకరు వాటర్ బాటిల్ తెచ్చారు. ఒకరు మూడురాళ్ల పొయ్యి పెట్టారు. అలా తలా ఓ పనిచేస్తూ నీళ్లు కాచారు.

బస్సులోని ఆడవాళ్లు ఆమెను సముదాయిస్తున్నారు. అనుభ వం ఉన్న వాళ్లు కాన్పు చేయడా నికి ప్రయత్నిస్తున్నారు. అరగం టలో ఆమె కేకలు ఆగటంతో బిడ్డ ఏడుపు వినిపించింది.

కింద వున్న వాళ్లలో కొందరు ఆకాశం వైపు చూస్తూ చేతులెత్తి మొక్కారు దైవలీలకు. మరో అరగంటలో అంతా పరిశుభ్రమయింది. బిడ్డను వేడినీళ్లతో తుడిచి... గుడ్డలో చుట్టి ఆ తల్లికి అందించారు.

కండక్టరుతో సహా అందరూ బస్సెక్కారు. డ్రైవరు బస్సును స్టార్ట్ చేశాడు.

– ధప్పూరి శ్రీధరాచార్యులు
సీతారాంబాగ్, హైదరాబాద్

సన్మానం

ప్రపంచ తెలుగు 'మహాసభ'లు తిరుపతిలో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. పిలిచినా, పిలవకపోయినా ప్రతిసభలో పాల్గొని, సభికులకు బలవంతంగా తమ కవితలు వినిపించి విచిత్ర రోగాలకు గురి చేసే కవులు కుక్కుటేశ్వర్, జిలాని బాషాలు కూడా అక్కడకు వెళ్లారు. ముందుగా పేర్లు నమోదు కాని కవులకు కవితలు వినిపించే అవకాశం గగనకుసుమంగా మారింది. అక్కడి ఉప వేదిక అయిన సాహిత్య వేదిక దగ్గర మూడురోజులు పడిగాపులు పడి, చివరికి తెలిసిన పెద్దాయన కాళ్లూ గెడ్డాలు పట్టుకుని ఎలాగో తమ కవితలు చదవగలిగారు. కానీ ఎటువంటి పురస్కారాలు అందుకోలేకపోయారు. ఆ బాధను గుండెల్లో దాచుకుని ఇళ్లకు చేరారు.



రెండు రోజుల తర్వాత ఆ బాధతో కుమిలిపోతున్న కుక్కుటేశ్వర్ దగ్గరకు మిత్రుడు జిలాని బాష ఉత్సాహంగా వచ్చి "ఘరానా సంస్థ వారు మనకు సన్మానం చేస్తామంటున్నారు సార్" అన్నాడు. అంతే ఎగిరి గెంతబోయి కుర్చీలోంచి కిందపడ్డాడు కుక్కుటేశ్వర్.

"తిరుపతి సభల్లో పాల్గొని వచ్చిన నగర కవులు" అంటూ ఘరానా సంస్థ వారు ఇద్దరికీ ఘనంగా సన్మానం చేసి పత్రికల వారికి ఫోటోలతో సహా ప్రకటనలు అందజేశారు. తిరుపతిలో పరపతిపోయినా సొంత ఊరిలో ఘరానా సంస్థవారి సన్మానంతో గజారోహణ చేసి, గండపెండేరం తగిలించుకున్న ఆనందంతో సంబరపడిపోతున్న కుక్కుటేశ్వర్ దగ్గరికి జిలాని బాష వచ్చి "సంస్థ వారు డబ్బులు తీసుకురమ్మంటున్నారు" అన్నాడు.

"డబ్బులేమిటి? " అంటూ గుటకలు మింగాడు కుక్కుటేశ్వర్.

"చాల్లేండి సన్మానం ఊరికే వస్తుందా? మీ వాటాగా నాలుగువేలివ్వండి" అంటూ నాలుగు వేలు వసూలు చేసుకుని బైటకు వచ్చి అందులోని వెయ్యి రూపాయలు వేరే జేబులో పెట్టుకుని, మిగిలిన మూడు వేలు ఘరానా సంస్థ వారికి అందజేశాడు కవి జిలాని బాష.

– పి.వి. రమణకుమార్,
చిలకలూరిపేట

అమ్మకం

ఆ రోజు నా భార్య పుట్టిన రోజు కావడంతో బహుమతి కొందామని షాపుకెళ్ళాను. అందమైన రాధా కృష్ణుల బొమ్మ ముగ్ధమనోహరంగా.. రంగు రంగులతో.. ప్రేమకు ప్రతిరూపంగా ఉన్న ఆ బొమ్మ నాకు బాగా నచ్చింది. 'ప్లాస్టర్ ఆఫ్ పారిస్'తో చేసిందేమో.. షాపు యజమాని ఖరీదు ఎక్కువే చెప్పాడు.

'రేటు తగ్గించరా? ' అని నేనడిగేలోగా నాలాంటి మరొకరూ 'అదే బొమ్మ' కావాలనడిగాడు. అందుకు దుకాణదారు "సారీ సార్! ఒకటే ఉంది. రెండో బొమ్మ లేద" ని చెప్పాడు.



అప్పుడు "బొమ్మ అసలు ఖరీదు కంటే ఓ వంద రూపాయలు అదనంగా ఇస్తా! ఆ బొమ్మను నాకే ఇవ్వండీ!" అని ఆ రెండో వ్యక్తి దుకాణదారుని అడిగాడు.


అప్పుడు ఆ వర్తకుడు కనుబొమ్మలు పైకెత్తి 'ఏం చేయమంటారన్న'ట్లుగా నా వంక చూశాడు. బొమ్మకు డిమాండ్ పెరిగింది. బేరం మాట దేవుడెరుగు? ఆ రెండో వ్యక్తి ఇస్తానన్న డబ్బు నేనే ఇచ్చి ఆ బొమ్మను దక్కించుకున్నాను.


మోటారు సైకిలుమీద బయలుదేరబోతే, జేబులో తాళంచెవి కనబడలేదు. షాపులో కెళ్ళి వెతికాను. దొరికింది. బైటకు నడవబోతూ దుకాణంలోకి చూశాను. నేను కొన్న రాధాకృష్ణులలాంటి బొమ్మ మరో వ్యక్తి కొనబోతుండగా.. నాతో పోటీ కొచ్చిన వ్యక్తి మళ్లీ 'నాకూ అదే బొమ్మకావాల'ని పట్టుబడుతున్నాడు. షాపువాడు బొమ్మ రేటు మళ్లీ పెంచడానికి చేస్తున్న ప్రయత్నానికి ఆశ్చర్యపోవడం నావంతయింది.


– కె.వి.లక్ష్మణరావు,
మానేపల్లి, తూ.గో. జిల్లా


నా ముగ్గు తొక్కేటి
లోపలికి వచ్చాక
మొగుడైతే ఏంటట...?
ఎవడైతే ఏంటట...?
నాగ్రాజ్.

'సరసిజం





అల్లి బిల్లి సాఫ్ట్‌వేర్ కంపెనీ...
సంక్రాంతి ముగ్గులు నేర్పించే సాఫ్ట్‌వేర్ లభించును.
Ramprasad



ఇదిగోండి మీ లంచం !
ఆఫీసు
ఉల్లి


ఈసారికి క్షమించేయండి సాబ్!! నా సీటు ఇక్కడేసుకుంటే
మరో ఇద్దరిని ఎక్కించుకోవచ్చుని....


బ్యాంకులో దోచిన సొమ్మంతా ఇంటికి తెచ్చారెందుకు-?
అక్కడే నా పేర బ్యాంకులో వేసెయ్యక పోయారూ ?!
?!


వంద లోనుండి యాభై తీసెయ్యొచ్చు! కానీ..
నిన్నటి హోం వర్కు లో నుండి..
ఈరోజుటి హోం వర్కు
తీసెయ్యలేమండీ...
మేస్టారూ!!


మరణానంతర మార్గాలు

కురుక్షేత్ర మహాసంగ్రామంలో అర్జునుని బాణపరంపరకు భీష్మాచార్యులు కౌరవులందరు చూస్తుండగా.. భూదేవి వణికిపోతుండగా.. తూర్పు తలగా ఒరిగిపోయాడు.

పుణ్యవ్రతుడైన భీష్ముడు నరకమార్గమైన దక్షిణాయనంలో మరణిస్తున్నాడే అని దేవతలు దుఃఖించారు. దానికి భీష్ముడు..

'రవి గెల్చి యుత్తరాయణ
మవునంతకు నంపపాన్పునందిట్లు మహో
త్సవ లీల నిలుతు...'

ఉత్తరాయణం వచ్చేవరకు అంపశయ్య మీద ఉంటానని చెప్పాడు. ఉత్తరాయణంలో మరణిస్తే ఉత్తమలోకాలు కలుగుతాయని, దక్షిణాయనంలో మరణించినవారికి నరకం ప్రాప్తిస్తుందని దీనినిబట్టి తెలుస్తోంది. భారతీయ ఆధ్యాత్మిక పరంపరలో ఉత్తరాయణం చాలా ప్రశస్తమైంది. ఉత్తరాయణ శుక్లపక్షంలో దేహత్యాగ మొనర్చినవారికి పునర్జన్మ ఉండదని శ్రీమద్భగవద్గీత చెబుతోంది. అందుకే భీష్ముడు ఉత్తరాయణం వచ్చిన తరువాతే ప్రాణాలు విడిచాడు. శ్రీవైష్ణవ సంప్రదాయంలో పన్నెండు మంది ఆళ్వార్లు ఉండగా వారిలో నమ్మాళ్వారు కూడా ఉత్తరాయణ పుణ్యకాలంలోనే దేహత్యాగ మొనర్చి విష్ణు సాన్నిధ్యం పొందారు.



సూర్యుడు మకరరాశిలోకి ప్రవేశించినప్పటి నుంచి అంటే సంక్రాంతి పర్వదినం నుంచి ఉత్తరాయణ పుణ్యకాలం ఆరంభమవుతుంది. 'ఆయనే దక్షిణే రాత్రిః, ఉత్తరేతు దినా భవేత్' అని కపింజల సంహిత చెబుతోంది. దేవతలకు దక్షిణాయనం రాత్రి కాగా, ఉత్తరాయణం పగలు. ఇప్పటి నుంచి చీకటిమయమైన రాత్రి తగ్గి, వెలుగుతో కూడిన పగలు పెరుగుతుంది. జీవితాన్ని ఉన్నతి- పరమాత్మ ప్రాప్తి వైపుగా సాగించటానికి ప్రకృతిలో కలిగే ఈ మార్పు మనకు ప్రేరణగా నిలుస్తుంది. అజ్ఞానమనే చీకటిని దూరం చేసి, ఆత్మజ్ఞానమనే వెలుగు పొందడానికి ప్రయత్నించాలి.

క్రియాభేదాత్ ఫలభేదః - అనే న్యాయాన్ని అనుసరించి ఎవరు ఎలా జీవిస్తారో దానిని బట్టి వారి మరణకాలం, మరణానంతరం పయనించే మార్గం, పొందే గమ్యం నిర్దేశింపబడతాయి. జన్మరాహిత్యాన్ని పొందుతారా? తిరిగి జన్మిస్తారా? అనేదీ నిర్ణయమవుతుంది. సంపూర్ణ శరణాగతులై పరమాత్మయందు అనన్య భక్తిగలవారు ఎప్పుడు, ఏవిధంగా దేహత్యాగమొనర్చవలెనను విషయమును పట్టించుకోరు. వారికి సర్వస్వము పరమాత్మయే. కావున వారు సులభముగా, సౌఖ్యముగా దేవదేవుని చేరుదురు. అదికాక కర్మ-జ్ఞాన హఠయోగాది ఆధ్యాత్మికానుభవములపై ఆధారపడువారు, అనన్యభక్తులు కానివారు తగిన సమయమున, తగిన కాలమున దేహత్యాగమొనర్చి జననమరణ యుక్తమైన ఈ ప్రపంచమునకు తిరిగి రావాలా? వద్దా? అనేది నిశ్చయించుకుంటారు.

'కర్మణా పితృలోకః.. విద్యయా దేవలోకః' కర్మచేత పితృయానం ప్రాప్తిస్తే, జ్ఞానం చేత దేవయానం సిద్ధిస్తుందని శాస్త్రవచనం. బ్రహ్మోపాసకులు అంటే ఆత్మజ్ఞానం కలవారు మరణానంతరం పయనించే మార్గాన్ని దేవయానం అంటారు. దీనికే అర్చిరాది మార్గం, శుక్లగతి అనీ పేర్లు.

అగ్నిర్జ్యోతిరహః శుక్లః షణ్మాసా ఉత్తరాయణమ్
తత్ర ప్రయాతా గచ్ఛన్తి బ్రహ్మ బ్రహ్మవిదో జనాః

జ్ఞానులు మరణానంతరం ప్రకాశమానమైన దేవయానంలో పయనించి జ్ఞానానంద స్వరూపమైన పరబ్రహ్మమును పొందుతారు. ఈ ప్రయాణం ఆనందప్రదంగా సాగుతుంది. అగ్ని, కాంతి, దినం, శుక్లపక్షం, ఉత్తరాయణం, సంవత్సరం, వాయువు, సూర్య, చంద్ర, విద్యుత్, వరుణ, ఇంద్రలోకం... ఈ విధంగా పయనించి క్రమంగా పరబ్రహ్మమును చేరుతారు.

ఇక్కడ అగ్ని అంటే అగ్ని అభిమానదేవత అని... దినం అంటే పగటి అభిమానదేవత అనీ అర్థం. అభిమానదేవతలనే అతివాహికులు అంటారు. 'అతివాహికా స్తల్లింగాత్..' అనే బ్రహ్మసూత్రం అగ్న్యాదులను అతివాహికులుగా గ్రహించమని ప్రబోధిస్తోంది. అతివాహికులు

పునరపి జననం...

'కృతాత్యయేను శయవాన్' అని బ్రహ్మ సూత్రం. కృతాత్యయే.. అంటే చంద్రలోకంలో పుణ్యకర్మ క్షయమైనపుడు- అనుశయవాన్.. మిగిలిన పుణ్యఫలంతో కిందికి దిగుతాడు అని అర్థం. చంద్రలోకం నుంచి తిరిగి భూలోకానికి చేరడానికి ఈ పితృయానంలో అవరోహణ క్రమం ఉంది. ఈ ప్రయాణ వివరాలను ఛాందోగ్య, బృహదారణ్యక ఉపనిషత్తులు అభివర్ణించాయి.

ఆకాశాత్ వాయుం- వాయోః వృష్టిం - వృష్టేః పృథివీం ప్రాప్య అన్నం భవన్తి. తే పునః పురుషాగ్నౌ హూయన్తే. తతో యోషాగ్నౌ జాయన్తే. తే లోకాన్ ప్రత్యుత్థాయినః

చంద్రలోకం నుంచి భూలోకానికి తిరిగి పయనించే అవరోహణ క్రమంలో ప్రథమంగా ఆకాశానికి చేరుతారు. అక్కడి నుంచి వాయువుతో కలిసి మేఘంలోకి ప్రవేశిస్తారు. మేఘం నుంచి వర్షరూపంలో భూమికి దిగుతారు. ఇక్కడ ఓషధులను ఆశ్రయించి కొంతకాలం సూక్ష్మంగా ఉండి అన్నంగా మారుతారు. ఆ అన్నమును పురుషుడు భుజించగా వీర్యరూపంలో ఆ పురుషునిలోనే ఉంటారు. ఆ పురుషుని నుంచి స్త్రీగర్భంలోకి ప్రవేశించి దేహాన్ని ధరిస్తారు. ఇదీ అవరోహణక్రమం.

అంటే 'తీసుకొనిపోయేవారు..' అని అర్థం. అగ్ని అభిమానదేవతను చేరగా, అగ్నిదేవత తీసుకొనిపోయి పగటి అభిమానదేవతకు, పగటిదేవత శుక్లపక్షదేవతకు ఇలా ఆయా దేవతలకు అప్పగిస్తారు. ఆయా లోకాలలో ఈ జీవులు ఘనంగా పూజలందుకుంటారు. మానవలోకం ఉన్నట్లే మరెన్నో లోకాలు ఉన్నాయని మన శాస్త్రాలు చెబుతున్నాయి.

పరబ్రహ్మను చేరేముందు 'విరజ' నదిలో స్నానం చేస్తారు. 'విరజ' అంటే విగత రజస్... విడిచిన రజోగుణం కలది అని అర్థం. ఉపాసకులు తమలో మిగిలిన రజోగుణాన్ని ఈ నదిలో విడిచి పెట్టేస్తారు. తమోగుణం మరణానికి ముందే నశించిపోతుంది. కనుక ఇప్పుడు కేవలం సత్త్వగుణ ప్రధానులై, స్వయం ప్రకాశమానమైన పరమపదంలోకి ప్రవేశించి పరమాత్మ సాయుజ్యాన్ని పొందుతారు. వీరిని బ్రహ్మజ్ఞానులు, బ్రహ్మవిదులు అని గీతాచార్యుడు వ్యవహరించాడు. ఇది పునరావృత్తి లేని మార్గం.

పునరావర్తన రహితుం
డనఘా పరమాత్ము జెందినట్టి పురుషుండ
వ్వినుతావస్థను మోక్షం
బని చెప్పుదు రంత కంటె నధికము గలదె?

అని మహాభారతం శాంతిపర్వం చెబుతోంది.

పితృయానం

ఫలాపేక్షతో సకామకర్మలు ఆచరించినవారు మరణానంతరం పయనించే మార్గాన్ని పితృయానం అంటారు. ఇది ధూమాది మార్గం. పొగచూరి, అంధకారంతో నిండి ఉంటుంది. 'అథ యే యజ్ఞేన దానేన తపసా లోకాన్ జయన్తి తే ధూమ మభిసంభవన్తి' - యజ్ఞం, దానం, తపస్సు ఆచరించిన వారు ధూమమార్గంలో పయనిస్తారని బృహదారణ్యకోపనిషత్తు చెబుతోంది. అగ్నిహోత్రాది కర్మలు, ఇష్టాపూర్త, దత్తాదికర్మలను ఆచరించేవారు పితృయానంలో పయనిస్తారు. ఇష్టములంటే యజ్ఞయాగాదులు. వాపీకూపతటాకాది నిర్మాణాలు పూర్తములు. దత్తాదులు అంటే దానధర్మాలు. ఉచిత విద్యాలయాలు, వైద్యాలయాలు, అనాథ శరణాలయాలు, తాగునీటి పథకాలు ఇవన్నీ దత్తాదులే. గోసువర్ణవస్త్ర అన్నదానాదులూ దత్తాది కర్మలే.

ధూమో రాత్రిస్తథా కృష్ణః షణ్మాసా దక్షిణాయనమ్
తత్ర చాన్ద్రమసం జ్యోతిర్యోగీ ప్రాప్య నివర్తతే

సకామకర్మలు ఆచరించినవారు మరణించగానే సూక్ష్మశరీర ధారులై ధూమ అభిమానదేవతను చేరుతారు. అక్కడి నుంచి రాత్రి అభిమానదేవతను, ఆపై కృష్ణపక్షం, దక్షిణాయనం, అక్కడి నుంచి చంద్రలోకాన్ని చేరుతారు. చంద్రలోకంలో జలమయ దేహాలను ధరించి దివ్యమైన భోగాలను అనుభవిస్తారు. చంద్రలోకంలో జ్యోతిని పొందుతారు. జ్యోతి అంటే కర్మఫలం. ఆచరించిన పుణ్యకర్మల ఫలం అనుభవించి కొద్దిగా మిగిలి ఉండగానే తిరిగి భూలోకానికి ప్రయాణమవుతారు. దీనినిబట్టి భౌతికేంద్రియములకు కానరాకున్నను చంద్రలోకమున ఉత్తమ తరగతికి చెందిన జీవులున్నారని తెలుస్తోంది.

'గతీ శాశ్వతే నిత్యే సంసారస్య నిత్యత్వాత్' - సంసారం అనాదిగా ఉన్నట్లే ఈ దేవయాన, పితృయానాలు కూడా అనాదిగా ఉన్నాయి. ఉపాసకులు, కర్మపరులు ఉన్నంతకాలం ఈ రెండు మార్గాలు ఉంటాయి.

– చారి



★ డిసెంబరు సంచికలో తెలుగుకథ 'ఇది చాలా తప్పు గురూ' సందేశాత్మకంగా ఉంది. ఆహార పదార్థాలను వృథా చేసిన వారికి జరిమానా వేస్తోన్న జర్మనీ ప్రభుత్వ చర్య అభినందనీయం. ఎందరికో స్ఫూర్తిదాయకం. భారతీయ భాషల కథల్లో 'అమ్మకానికి ఆడపిల్ల' ఆలోచింపజేసింది. ప్రపంచ భాషల కథల్లో 'దేవుడు భోజనానికి వచ్చిన రోజు' బాగుంది.

– పి.ఎస్. సుశీలమ్మ,
కొత్త చెరువు, అనంతపురం జిల్లా

★ డిసెంబర్ ముఖచిత్రంగా చిన్నపాప నిత్యశ్రీ బాగుంది. భారతీయ భాషల్లో బెంగాలీ కథ 'తుంటరి లేఖలు', ప్రపంచ భాషల్లో కెనడా కథ 'దృశ్యాలు' బాగున్నాయి. తెలుగుకథల్లో 'ఇది చాలా తప్పు గురూ!' సందేశాత్మకంగా ఉంది. 'కథకులఫైల్'లో కాళోజీ నారాయణ రావు గారి కథ వేయడం ముదావహం. ఆయన గురించి కూడా బాగా రాశారు.

– గొల్లపూడి శ్రీనివాస్,
న్యూ మారుతీనగర్, హైదరాబాద్

★ పిల్లల ముఖచిత్రంతో 'విపుల'ను అందించడం అభినందనీయం. 'నేనెవరిని' సరైన సమాధానాలు రాసిన వాళ్ళ పేర్లను ప్రకటించినట్లే 'వినోదిని' సరైన సమాధానాలు రాసిన వాళ్ళ పేర్లు కూడా వేస్తే బాగుంటుంది!

– పక్కి బాలకృష్ణారావు,
గరివిడి, విజయనగరం జిల్లా

★ డిసెంబరు సంచిక పాఠకుల పాలిట పదాక్షర ప్రవల్లిక. కథామృతబిందు సహిత విపంచిక. మా ఇంటిల్లిపాదికీ లభించిన వరాల పూదోట. 'జ్ఞానధార'లో వివరించిన 'మాసానాం మార్గశిరోహం' అన్న పరమాత్మ వచనం ద్వారా మార్గశిర మాస విశిష్టత గురించి అద్భుతంగా తెలియజేసినందుకు నమస్సుమాంజలులు.

– టి.వి.డి.ఎన్.ఎస్. రామారావు, హైదరాబాద్

★ డిసెంబరు సంచికలోని తెలుగుకథ 'ఏది నీదారి?' బాగుంది. మతాలన్నీ మౌలికంగా మనిషికి సర్వహితం చేకూర్చే సూత్రాల వైపే మొగ్గు చూపిస్తాయి. ఆ దారినే మనం ఖరారు చేసుకోవాలి. కథలో ఉపన్యాస ధోరణికన్నా ఉపదేశ మార్గాన్ని అవలంబించి ఉంటే బాగుండేది.

– వి.బి. శంకర్, సికింద్రాబాద్

★ డిసెంబరు సంచికలో ప్రతీకథా ఆణిముత్యమే. తెలుగుకథల్లో 'ఏదీ నీ దారి?', 'ఇది చాలా తప్పు గురూ!' బాగున్నాయి. తొలి తమిళకథ 'గుంటకట్ట రాగిమాను చెప్పిన కథ', అస్సామీ కథ 'ఓ పసివాడి కథ' ఆకట్టుకున్నాయి. 'కథకుల ఫైల్'లో కాళోజీ గారి 'మన మే నయం' అద్భుతం. 35ఏళ్ల నాటి విపుల కథ 'బలిపశువు', 'జ్ఞానధార' అలరించాయి.

– మంచాళ శ్రీలక్ష్మి, వైజాగ్

★ డిసెంబరు 'విపుల'లోని 'ఇది చాలా తప్పు గురూ!" కథ గొప్ప సందేశాన్ని ఇచ్చింది. మన దేశంలో కూడా ఆహార పదార్థాలు వృథా చేసే వారికి ఇలా ఫైను కట్టించే విధానం వస్తే ఎంత బాగుంటుందో కదూ!

– డి. ఎస్. శంకర్, వక్కలంక

★ డిసెంబరు సంచికలో తెలుగుకథలు ఒక దానిని మించి ఒకటి పోటీ పడ్డాయి. భారతీయ భాషల కథల్లో 'తుంటరి లేఖలు' నవ్వించింది. ప్రపంచకథల్లో 'దేవుడు భోజనానికి వచ్చినరోజు' మానవత్వానికి మించింది మరేదీ లేదని నిరూపించింది. 'జ్ఞానధార'లో 'పత్రం, ఫలం, పుష్పం, తోయం' వ్యాసంలో వాటికి ఎందుకంత ప్రాధాన్యత ఉందో బాగా వివరించారు.

– లహరి, చెల్పూర్, వరంగల్ జిల్లా,

★ డిసెంబరు సంచికలో కథలన్నీ బాగున్నాయి. తెలుగుకథల్లో 'ఏదీ నీ దారి?' అత్యుత్తమం. 'ఇది చాలా తప్పు గురూ!' కథ ద్వారా ఆహారాన్ని వృథా చేసేవారిపై జర్మనీలో ఫైన్ వేయడం చదివి ఆశ్చర్యంతో పాటు ఆనందం కలిగింది. మనదేశంలోనూ అటువంటి చర్యలు అవశ్యం, ఆచరణీయం.

– సూరి నాగరాజు, రామవరప్పాడు

★ డిసెంబరు సంచికలోని కథలన్నీ సందేశాత్మకంగా, సమాజంలో నేటిమనుషుల పోకడలకు, మనస్తత్వాలకు అద్దం పట్టేవిధంగా ఉన్నాయి. తెలుగు కథ 'ఏదీ నీదారి?', 'ఇది చాలా తప్పు గురూ!' కథలు బాగున్నాయి. పిల్లలపై పెద్దలు తెస్తోన్న ఒత్తిడిని అస్సామీ కథ 'ఓ పసివాడి కథ' విదితం చేసింది. శత్రువులను, మిత్రులను సమంగా ఆదరించిన ఎలిజబెత్ గొప్ప మనసును బెల్జియం కథ 'దేవుడు భోజనానికి వచ్చిన రోజు' హృద్యంగా ఆవిష్కరించింది.

– చింతపల్లి విజయలక్ష్మి, ప్రసాదంపాడు

ఏమవుతారు



"భూమికి చంద్రుడికీ సంబంధం ఏంటి? "

"అక్కాతమ్ముళ్ళ సంబంధం"

"ఎలా? "

"మనకి భూమేమో పుడమి'తల్లి', చంద్రుడేమో చంద'మామ' కాబట్టి!"



అక్షరాలా....

విందులో స్వాహారాయుడు రెండుగంటల నుంచీ తింటూనే ఉన్నాడు. మాటిమాటికీ దానయ్యని సమయం అడుగుతున్నాడు.

దానయ్య అడిగాడు "ఎంతసేపు తింటావ్? "

"నేనూ తినీ తినీ అలసిపోయాను. కానీ ఏంచేయను! శుభలేఖలో 'విందు పదకొండు గంటలదాకా' అని రాసుంది కదా..."



సెమిస్టర్ విధానం..!

ఇంజనీరింగ్ లెక్చరర్ తన ఆరునెలల పాపకి పుట్టినరోజు వేడుక చేస్తున్నాడు. వచ్చిన వాళ్ళంతా ఆరు నెలలకు పుట్టిన రోజేంటని నోరు నొక్కుకుంటున్నారు. ఒకాయన ధైర్యంగా అడిగేశాడు.

"అదీ...మేము సెమిస్టర్ విధానం ఫాలో అవుతాం...!"

సరిగ్గానే వినపడింది



"ఆ అమ్మాయికి చెవుడను కుంటా, ఒకటడిగితే ఇంకోటి చెప్తోంది"

"నువ్వేం అడిగావ్ ఆమేం చెప్పింది? "

"నేను ఐలవ్యూ అంటే ఆమె నిన్నే కొత్తచెప్పులు కొన్నా అంది"



బహుమతి

ప్రేమికుడు ప్రియురాలి పుట్టినరోజున కలవడానికి వెళ్ళాడు.

ప్రియురాలు: నాకోసం ఏం తెచ్చావ్?

ప్రేమికుడు: రోడ్డవతల ఆ ఎర్రరంగులో మెరిసిపోతున్న కారుంది చూశావా...

ప్రియురాలు: ఆc...చూస్తున్నా....(ఆనందంగా)

ప్రేమికుడు: అదే రంగు లిప్ స్టిక్ తెచ్చాను!



అక్కడ చూశా!

ఓ యువకుడు బస్టాపులో నుంచున్న యువతిని ఎలాగైనా మెప్పించాలని పోజులు కొడుతున్నాడు.

"మిమ్మల్ని చూస్తుంటే ఎక్కడో ఎప్పుడో చూసినట్టు, మీరు నాకు బాగా తెలిసినట్టు అనిపిస్తోంది"

"అయ్యుండచ్చు. నేను పిచ్చాసుపత్రిలో నర్సుని..."

కథకుల ఫైల్ - 42

- రాచమల్లు రామచంద్రారెడ్డి

దేశంలోని దేవకన్యలు


ఆస్పత్రి వరండాలో అటూ యిటూ తిరుగుతున్నాను- ఏం చేయడానికీ తోచక. ఇంకో గంటవరకూ డాక్టర్‌కు పని తెమిలేటట్లు లేదు. పరీక్ష చేయించుకోవలసిన రోగులు యింకా పదిమంది దాకా వున్నారు. ఆ ఆస్పత్రి వున్నది వూరిబయట. అటు ఊర్లోకిగానీ, ఇటు వూరి బయటకు గానీ షికారు పోదామనుకుంటే అంతా బురదే.

అసలు ఆ వర్షంతోనే ఆనాడు నేనా వూర్లో యిరుక్కోవలసి వచ్చింది. ఆ వూరికి రోడ్డంటూ ఒకటుంది. ఆ రోడ్డుమీద బస్సు కూడా ఒకటుంది, రోజుకు ఒకసారి అటూ, ఒకసారి యిటూ. అసలే ఆ బస్సుకు టైం ప్రకారం నడవాలనే పట్టుదలలేదు, ఇక వర్షం వస్తే చెప్పకుండానే సెలవు పెడ్తుంది.. ఆ సెలవు ఒకరోజు కావచ్చు, పది రోజులు కావచ్చు. అందులో ఆ బస్సును అనవలసిన పనికూడా లేదు, ఆ రోడ్డు అటువంటిది. ఆ రోడ్డు వున్నది బస్సులు నడవడానికి కాదు, బస్సులను పరీక్షించడానికి. భక్తులను పరీక్షించడానికి భగవంతుడున్నట్లు. ఆ బస్సు నడిచిన నాడూ, నడవనినాడూ కూడా, ప్రయాణి

రాజీ ఎరుగని రాచమల్లు

రాచమల్లు రామచంద్రారెడ్డి (రారా) కథా శిల్పాన్ని సమగ్రంగా వివరించగల సాహితీ శిల్పకారులు. సాహిత్య పరంగా నిర్దుష్టమైన అభిప్రాయాలు, నిబద్ధత గలిగిన విమర్శకులు. కథాకథన పద్ధతికి నూతన ఒరవడి దిద్దిన రారా కడప జిల్లా పులివెందుల తాలూకా పైడిపాళెం గ్రామంలో విద్యావంతుల కుటుంబంలో జన్మించారు. విద్యార్థి దశలోనే కళాశాల యాజమాన్య నిరంకుశ విధానాలపై ఉద్యమించి రాజీలేని పోరాటం సలిపారు. ఫలితంగా కళాశాల నుంచి బహిష్కృతులైనా తలవంచలేదు. మార్క్సిజంతో, అభ్యుదయ సాహిత్యంతో సాన్నిహిత్యం పెంచుకున్న వీరు సునిశిత విమర్శనా వ్యాసాలు వెలువరించి తెలుగు సాహిత్యాన్ని జాగృతం చేశారు. అభ్యుదయ భావాల అవగాహనతో వాస్తవికతకు దగ్గరగా కథలు రాయడం మొదలుపెట్టారు. 'అలసిన గుండెలు' కథాసంపుటి తెలుగు సాహిత్యంలో అపూర్వ విలువలతో భాసిల్లింది. అలాగే అరుదైన కథలతో బాలసాహిత్యాన్ని సృజించారు.

సాహితీ విలువలు ఏమాత్రం లేని పుస్తకాలు సమాజానికి ఘోరమైన అపకారం చేస్తున్నాయంటూ- ఆనాడు విస్తృతంగా ప్రచారంలో ఉండిన నవలల్ని రారా నిర్మొహమాటంగా విమర్శించారు. తెలుగు సాహిత్యంలో లబ్ధప్రతిష్ఠులైన కవులనేగాక, ఆనాడు కొత్త కెరటంలా విజృంభిస్తున్న దిగంబర కవులను, ఆ పరంపరలో మరికొందరు ప్రసిద్ధులనూ తీక్షణంగా విమర్శించారు. రాజీలేని ధోరణిలో విమర్శనా సాహిత్యాన్ని వెలువరించడంతో ప్రముఖ విమర్శకులుగా ప్రసిద్ధులయ్యారు. అనువాద ప్రక్రియపై కూడా వీరు విశేష కృషి సలిపారు. అనువాద పరిశోధకుడుగా రారా రష్యా వెళ్లి కమ్యూనిస్టు సాహిత్యాన్ని అనువదించారు. రారా విశాలాంధ్ర, ఈనాడు దినపత్రికల్లో కొంతకాలం పని చేశారు.



పేరు	:	**రాచమల్లు రామచంద్రారెడ్డి (రారా)**
జననం	:	1922వ సంవత్సరం ఫిబ్రవరి 28వ తేది
జన్మస్థలం	:	కడప జిల్లా పైడిపాళెం గ్రామం
ప్రసిద్ధి	:	అభ్యుదయ కవి, సాహితీ విమర్శకులు, పత్రికా సంపాదకులు. కుహనా రాజకీయాలను ఎండగడుతూ 'సవ్యసాచి' అనే పక్షపత్రికను, విమర్శనా పద్ధతికి గీటురాయిలా 'సంవేదన' అనే త్రైమాసిక పత్రికను స్థాపించి సంచలనం సృష్టించారు. నిష్పాక్షిక విమర్శనా సంపుటి 'సారస్వత వివేచన' అనే వీరి గ్రంథానికి ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ... 'అనువాద సమస్యలు' గ్రంథానికి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారాలు లభించాయి.
రచనలు	:	అలసిన గుండెలు (12 కథల సంపుటి) చంద్రమండలం- శశిరేఖ, విక్రమార్కుని విడ్డూరం (బాలల కథలు) సారస్వత నివేదన (విమర్శనా సంపుటి) అనువాద సమస్యలు
మరణం	:	1988వ సంవత్సరం నవంబరు 24వ తేది

కుల మీద కసి తీర్చుకుంటుంది. భక్తులు కీర్తనలు వ్రాసీ, పాడీ, ప్రజల సంగీత అభిరుచుల మీద కసి తీర్చుకున్నట్లు.

చేసేది లేక ఆస్పత్రి వరండాలో అటూయిటూ తిరుగుతున్నాను, డాక్టర్ మీద విసుక్కుంటూ. నిన్న ఉదయమే పోతానంటే డాక్టరే నన్ను బలవంతంగా ఆపినాడు. ఆ బస్సు యిక రెండుమూడు రోజులు వచ్చేటట్లు లేదు. అంతవరకూ నేనీ దిక్కులేని కొంపలో దినాలు గడపక తప్పదు. బాల్యస్నేహితుడు డాక్టర్ మూర్తి వుండబట్టిగానీ, లేకపోతే యీ వూరు చూడవలసిన దురవస్థ నాకీ జన్మలో పట్టేదికాదు. ఈ పాడు వూర్లో మూర్తి ఎందుకున్నాడో నాకెప్పుడూ ఆశ్చర్యమే. ఆశ్చర్యమే కాదు, కోపం గూడా. ఏ టౌనులో ప్రాక్టీసు పెట్టుకున్నా ఇంతకు పదింతలు సంపాయించగలడు- ఇంతకు నూరింతలు సుఖపడగలడు. ఈ మాటే నేను మూర్తితో ఎన్నిసార్లో అన్నాను. కానీ చిరునవ్వు నవ్వడం తప్ప యే సమాధానమూ చెప్పడు. ఆ చిరునవ్వు కూడా యేదో వింతగా వుంటుంది- నీకు అర్థం కాదులే అన్నట్లు. లేక ఆ చిరునవ్వు వెనుక విచారమో, విషాదమో వుందేమో?

ఈరోజైనా నిలదీసి అడుగుతాను- ఈ నరకకూపం వదలి పెడ్తావా- లేక- వదలి పెట్టకపోతే ఏమని బెదిరించాల్నో నాకే తెలియలేదు. పోనీ తన భార్యాబిడ్డల కోసమైనా వదలిపెట్టమని చెప్తాను. ఏముందీ వూరిలో? ఒక వింతలేదు- వినోదం లేదు- సంస్కారం లేదు- నాగరికత లేదు- ఒక సంఘం లేదు- ఒక స్నేహితుడు లేడు- కనీసం చదువుకుందా మనుకుంటే ఒక పుస్తకం కూడా దొరకదు- ఒట్టి పల్లెకొంప. వర్షం వస్తే అంతా బురద. గాలి వీస్తే అంతా దుమ్ము. అదీ కాకపోతే అలవిగాని ఎండ. పగలంతా ఈగలు, రేయంతా దోమలు. ఎప్పుడూ వూర్లో యేదో ఒక రోగం వుంటుంది- మశూచో, మలేరియానో, మరొకటో, మరొకటో, యిది మనుషులు వుండదగిన ఊరే కాదు- అసలు ఈ ఊరిలో వున్నది మనుషులేనా? అని అనుమానం- అసలు ఇది ఊరేనా అని? ఇది నరకలోకానికి మాడల్- ఇది మానవ నాగరికతకు మచ్చ- మానవ చరిత్రకు అపచారం- మానవుని మర్యాదకు కళంకం.

ఆవేశం ఎక్కువైనందువల్లనేమో ఆలోచన హఠాత్తుగా ఆగిపోయింది. నా ఆవేశానికి నేనే నవ్వుకుంటూ గడియారం చూసుకున్నాను- ఇంకా పది కాలేదు. సిగరెట్ అంటించుకుంటూ నిలబడి ఊరివైపు చూసినాను.

ఒక్కక్షణం నా కండ్లను నేనే నమ్మలేక పోయినాను. కండ్లు మూసి మళ్లీ తెరిచినాను- మళ్లీ అదే దృశ్యం- ఎవరో దేవకన్య.. ఇటువైపు వస్తూ వుంది- మెల్లగా అడుగులు వేసుకుంటూ- వయ్యారంగా అడుగుతీసి అడుగు పెడ్తూ- అది నడక కాదు- నృత్యం. దేవకన్య నావైపే వస్తూ వుంది. ఆమె ధరించినవి మణిమయాంబరాలు- చెవులలో శతకోటి సూర్యప్రభలు- తలమీది వెంట్రుకలలో వెలుగునీడల రాసక్రీడలు- ముఖంలో అపూర్వమైన తేజస్సు- అతిలోకమైన సౌందర్యం. దేవకన్య నావైపే వస్తూ వుంది. అనిమేష దృష్టితో ఆమెవైపే చూస్తూ వున్నాను. ఆమె మెల్లగా వస్తూనే వుంది. నావైపే వస్తూ వుంది. దగ్గరకు వచ్చేకొద్దీ ఆకారం స్పష్టమౌతూ వుంది. అవిగో విచ్చిన గులాబీల వంటి చెంపలు, చెంపకు చేరెడేసి కన్నులు, తీర్చిదిద్దిన నల్లని కనుబొమలు. ఆఁ- కాదు- ఆమె దేవకన్య కాదు. దగ్గరకు వచ్చేకొద్దీ తేలిపోయింది. ఆమె దేవకన్య కాదు- మామూలు కన్య.

నిన్న వచ్చిన వర్షం వలన గాలిలో దుమ్మూ ధూళీ లేక వాతావరణం పరిశు

భ్రంగా వుండడమూ, ఉదయం పదిగం టలే అయినా ఎండ తీవ్రంగా వుండ డమూ, ఆ పరిశుభ్రమైన వాతావరణంలో సూర్యుని తీక్షణ కిరణాలలో ఆ అమ్మాయి వేసుకున్న చౌకరకం లినస్ గుడ్డల మిల మిలా, చెవులలోని రంగూన్ రాళ్ళ తళ తళా నాకేదో భ్రమ కల్పించినట్లుంది. ఆ వూరిమీద నా మనసులో కలిగిన అనవస రమైన ఆవేశం కూడా ఆ భ్రమకు కొంత కారణమేమో. కారణమేమైనా ఆ అపూర్వ మైన భ్రమ ఆ నిమిషంసేపూ నన్ను సంపూర్ణంగా లోబరచుకుంది. మరు నిమి షంలోనే భ్రమ వదిలిపోయినా, ఆ దివ్య సౌందర్యమూర్తి నా హృదయంలో గాఢంగా హత్తుకుపోయింది.

క్రమంగా ఆ అమ్మాయి దగ్గరకు వస్తూ వుంది- మెల్లగా వస్తూ వుంది- అడుగులో అడుగు వేసుకుంటూ వస్తూ వుంది. కానీ ఆ నడక నృత్యం కాదు- యౌవన భారంచే కలిగిన మందయానమూ కాదు. ఆ నడ కలో ఏదో అసహజత్వం వుంది. నడకలో ఉత్సాహం లేదు- కదలికలో ఉల్లాసం లేదు- అడుగు తీసి అడుగు పెట్టడంలో ఆనందం లేదు.

ఆ అమ్మాయి మరికొంత దగ్గరకు వచ్చింది- బరువుగా నడుస్తూ. ఆ అమ్మాయి జబ్బుగా వున్నట్లుంది. ఔను- ఆమె ఆరోగ్యం బాగలేదు- అందుకే అంత బరువుగా నడుస్తున్నది. అదుగో ఏదో చేతిలో సీసా వుంది- మందు కోసమేమో ఆస్పత్రికి వస్తూ వుంది- లేకపోతే ఆస్పత్రికి రావలసిన పని ఏముంది?

ఆ అమ్మాయి ఇప్పుడు చాలా దగ్గరకు వచ్చింది. వయస్సు పండ్రెండేండ్లు వుండ వచ్చు. పల్లెటూరి పిల్లే అయినా చక్కని ముక్కు- విశాలమైన కండ్లు- దీర్ఘములైన కనుబొమలు- కోలముఖం- కొనదేలిన గడ్డం- ఉన్నతమైన నొసలు. కానీ అన్ని అవయవాల్లోనూ అనారోగ్యం తాండవిస్తూ వుంది. చిక్కిశల్యములైన చేతులు- కాంతి లేని కండ్లు- కళ లేని ముఖం- పాలిపో యిన చెక్కిళ్ళు- ఆకర్షణ లేని శరీరం- ఆనందం లేని నడక.

ఆ అమ్మాయి ఆస్పత్రిలోకి పోయింది- బరువుగా- బాధగా- కాళ్ళీడ్చుకుంటూ. నా గుండెలు బరువెక్కినాయి- నా మనసులో బాధ బయలుదేరింది. దేవకన్యగా, పుడ మికి దిగిన సౌందర్య దేవతగా, ఒక నిమిషం నన్ను మైమరపించింది ఈ బాలి కేనా...? మృత్యుముఖంలో వున్న ఈ మర్త్య బాలికేనా? 'మృత్యుముఖంలో' అన్న ఆలోచన రాగానే భయంతో నా ఒళ్లు జలదరించింది. ఈ అమ్మాయి మృత్యుము ఖంలో వుందా? సంపూర్ణారోగ్యంతో దివ్య సుందరమూర్తిగా వుండవలసిన ఈ బాలి కకు మృత్యు వాసన్నమైందా? ఏ పాపమూ ఎరుగని ఈ పవిత్రమూర్తి మర

నిర్వహణ :
డా. వేదగిరి రాంబాబు

ణావస్థలో వుందా? నాకు ముచ్చెమటలు పోసినాయి. మృత్యువు నన్నే వెంటబడి నట్టు- లోకమే ప్రళయోన్ముఖమైనట్లు- ఆ అమ్మాయి మరణానికి నేనే కారణమైనట్లు- ఏదో బాధ- ఏదో అనుతాపం- కార్చిచ్చు వలె నా సర్వాంగాలనూ దహిస్తూ వుంది.

ఆ స్థితిలో ఎంతసేపు ఉన్నానో తెలి యదు. ఆ అమ్మాయి ఆస్పత్రిలో నుండి బయటికి వచ్చి ఊరిముఖం పట్టింది. చేతి లోని సీసాలో ఏదో మందు వుంది. మూర్తి చాలా చిత్తశుద్ధిగల డాక్టరు- మంచి మందే ఇచ్చివుంటాడు- ఆ అమ్మాయి జబ్బు తప్పక నయమౌతుంది. ఎంత జబ్బు అయితే మాత్రమేమి? ఈ కాలంలో మందుకు లొంగని రోగమే లేదు. ఆ అమ్మాయి క్రమంగా దూరమౌతూవుంది.

చిక్కి పుల్లలవలె ఉన్న చేతులు- సాగిన మెడ- సగం ఊసిపోయిన జుట్టు- క్రమంగా అస్పష్టమౌతున్నాయి.

"ఏమోయ్! ఆ అమ్మాయివైపు అంతగా చూస్తున్నావ్? " డాక్టర్ ప్రశ్నకు ఉలికిపడి నాను. మూర్తి ఎప్పుడు వచ్చి నా ప్రక్కన నిలబడినాడో గమనించనే లేదు.

"ఎవరు మూర్తీ ఆ అమ్మాయి? " అన్నాను డాక్టరు వైపు చూస్తూ.

"ఏం? అందంగా వుంది కదూ? "

ఆ అమ్మాయి అందాన్ని గురించి డాక్టర్ నాతో ఏకీభవించినందుకు తృప్తితో తల ఆడిస్తూ అన్నాను "ఔను- చాలా అందంగా వుంది. ఎవరా అమ్మాయి? "

"నేనీ ఊరిలో పదేండ్లనుండీ వున్నాను. ఇంత అందమైన అమ్మాయిని ఎన్నడూ చూడలేదు. కానీ ఈ అందం ఎన్నాళ్లుం టుందో? "

"ఏం మూర్తీ?

"ఆ అమ్మాయికి క్షయ"

"ఆఁ!" ఆశ్చర్యంతో డాక్టర్ ముఖంవైపు చూసినాను. డాక్టర్ ఏమాలోచిస్తున్నాడో పరధ్యానంగా వున్నాడు.

"ఎవరు మూర్తీ ఆ అమ్మాయి? " అని డాక్టర్ నడిగినాను.

డాక్టర్ ఒకక్షణం నా వైపు తీక్షణంగా చూసి విషాదంగా చిరునవ్వు నవ్వుతూ అన్నాడు "ఎవరైతే నేం? మామూలు పల్లె టూరు మనిషి. ఆ పిల్ల తండ్రి ఒక చిన్న రైతు. ఈ వూరుకాదు- పొరుగూరు. పది రోజులనాడు తండ్రీబిడ్డా నాదగ్గరికి వచ్చి నారు. నిన్న వర్షం వచ్చినందువల్ల పొలం పని చూసుకోడానికి తండ్రి వాళ్ళ ఊరికిపో యినాడు"

"క్షయ అయితే మరి ఇక్కడెందుకు న్నది? ఎక్కడైనా శానిటోరియంకు తీసుకు పొమ్మని చెప్పలేదా నీవు? " అన్నాను.

"చెప్పడానికేం? స్విట్జర్లండుకు పొమ్మని కూడా చెప్పవచ్చు. పోవడానికి డబ్బు కావద్దూ? "

ఏమనడానికీ తోచక తలవంచుకు న్నాను.

డాక్టరే మళ్లీ అన్నాడు "వాళ్లు వచ్చిన నాడే చెప్పినాను- వెంటనే శానిటోరియం పోవలసిన కేసని"

ఆ దివ్యసుందర విగ్రహం నా మన సులో పీఠం వేసుకుంది. తలవంచుకునే అన్నాను "డబ్బు నేనిస్తాను. ఆ అమ్మాయి ని శానిటోరియంకు పంపలేవు మూర్తీ? "

ఒకక్షణం నిశ్శబ్దంగా వుండి "ఇటు చూడు" అన్నాడు డాక్టర్.

ఊరూపేరూ తెలియని అమ్మాయి మీద అంతటి ఔదార్యం కనబరచినందుకు సిగ్గు పడుతూ తలఎత్తి అతని కండ్లలోకి చూసి నాను.

"ఎంతమంది క్షయరోగులను నీ సొంత డబ్బుతో రక్షించగలవ్? దేశంలో ఎన్ని లక్షలమంది ఎన్నెన్ని రోగాలతో చస్తు న్నారో తెలుసునా? వాళ్ళందరినీ బ్రతి కించే శక్తి నీకున్నదా? " అన్నాడు డాక్టర్.


అతని ఎగతాళితో నాలోని అహంకారం పైకి వచ్చి ఆత్మ సమర్థన ప్రారంభించింది. "అందరికీ సహాయం చేయలేనని ఒకరిద్ద రికి కూడా చేయవద్దంటావా? " అన్నాను.

"ఆ అమ్మాయి అందం చూసి నీలో ఔదార్యం అంకురించింది- అంతేకదూ? "

ఆ ప్రశ్నతో నా ఒళ్ళంతా సిగ్గుతో కుంచించుకు పోయింది.

మూర్తి నవ్వుతూ నా వీపు తట్టి "సౌం దర్య పక్షపాతం నేరం కాదులే. అయినా అమ్మాయి సౌందర్యం మన చేతులు దాటి పోయింది. ఒక నెలముందే అయివుంటే ఆ అమ్మాయిని నేనైనా బ్రతికించగలిగి వుండేవాణ్ణే" అంటూ మళ్ళీ ఆస్పత్రిలోకి పోయినాడు.

పరిపరివిధాల ఆలోచనలతో నా మనస్సు సుడిగుండం మాదిరి వుంది. దిక్కుతెలియక రోడ్డు వెంట ఊరి బయ



టికి దారితీసినాను. రోడ్డంతా బురద. అక్కడక్కడా గుంతలలో నీళ్ళు. మనస్సులో అర్థమూ గమ్యమూ లేని ఆలోచనలు- ఆలోచనల చుట్టూ ఆవేదన. రోడ్డు కిరువైపులా పొలం మీద ఎద్దులూ మనుషులూ పనిచేసుకుంటున్నారు- విత్తనం వేస్తున్నారేమో? అదేమీ గమనించకుండా రోడ్డువెంట నడుస్తున్నాను.

తల మాడిపోయే ఎండలో ఒక గంటసేపైనా నడచి వుంటాను. అంత ఎండలో ఎద్దులు పనిచేస్తూనే వున్నాయి- ఎద్దుల వలెనే మనుషులు కూడా పనిచేస్తున్నారు. ఎద్దులకూ మనుషులకూ తేడా ఏమీ కనపడడం లేదు. ఆ ఎద్దులమీదనైనా ఆ మనుషులకు కనికరం కలగవచ్చు అప్పుడప్పుడూ- కానీ ఆ మనుషులను కనికరించే నాథుడే కనిపించడు. ఈ ఎద్దుల మాదిరే మనుషులు బ్రతికే పద్ధతినేనా పల్లెటూరి ప్రశాంత జీవితమని మన దేశభక్తులు లొట్టలు వేస్తూ వర్ణించేది? నిజమే- ఎద్దుల జీవితం ప్రశాంతంగానే వుంటుంది. కన్నబిడ్డలకు క్షయ వస్తే బ్రతికించుకుందామనే ఆరాటం గానీ, బ్రతికించుకో వచ్చుననే జ్ఞానంగానీ లేని ఎద్దుల జీవితం ప్రశాంతంగా ఎందుకుండదు!

ఉట్టిపాటుగా వర్షం వచ్చింది. మూడు నిమిషాల్లో తడిసి ముద్దయినాను. అనవసరంగా తెచ్చిపెట్టుకున్న నా అవస్థకు నేనే నవ్వుకొని ఊరి దారి పట్టినాను. హఠాత్తుగా ఒక ఆలోచన వచ్చింది. ఆ అమ్మాయి పరిస్థితి నిజంగా అంత ప్రమాదకరంగా లేదేమో! నా మీద అభిమానంతో- నా డబ్బు ఖర్చు కావడం ఇష్టంలేక డాక్టర్ మూర్తి అబద్ధమాడినాడేమో? త్వరత్వరగా నడుస్తూ ఆస్పత్రి చేరినాను. నా కొరకు ఎదురుచూస్తున్న డాక్టర్ వరండాలో వున్నాడు. "మూర్తీ ఆ అమ్మాయిని వెంటనే మదనపల్లెకు పంపించు- డబ్బు నేనిస్తాను" అన్నాను.

"ఆమె తల్లిదండ్రుల అనుమతి లేకుండానే పంపిస్తానా? "

"తల్లిదండ్రులు అనుమతి ఇవ్వరంటావా? తమ బిడ్డ క్షేమం కోరరూ వాళ్లు? "

"ఎందుకు కోరరూ? కానీ నీవు క్షేమమనుకున్నదే వాళ్లూ క్షేమమనుకోవాలి గదూ? "

"ఏమిటి మూర్తీ నీవనేది? " అన్నాను విసుగ్గా.

"ఆ అమ్మాయి మొదట వచ్చినరోజే ఆమె తండ్రితో చెప్పినాను- కొన్ని మందులూ, ఇంజక్షన్లూ అర్జంటుగా తెప్పిస్తే తప్ప నేనేమీ చేయలేనని. ఆ తండ్రి ఏమన్నాడో తెలుసునా? ఆయుస్సు తీరినవాళ్ళను మందులూ, ఇంజెక్షన్‌లూ బ్రతికిస్తాయా సార్? " అన్నాడు.

"ఛీ - ఆ తండ్రి మనిషేనా? " అన్నాను తీవ్రమైన అసహ్యంతో.

మూర్తి నావైపు చూసి ఒక విషమహాసం చేసి అన్నాడు "ఏం? పల్లెటూరి రైతులు వేదాంతం మాట్లాడితే అసహ్యంగా వుందా? ఈ వేదాంతం మాట్లాడే మన దేశనాయకులు విదేశాల్లో కూడా పూలదండలు వేయించుకుంటున్నారు. ఈ వేదాంతం చూసుకునే మాది ఆధ్యాత్మిక దేశమని మన జాతీయనాయకులు రొమ్ములు విరుచుకొంటున్నారు. ఔన్లే - ఈ మాటే గొప్పవాళ్ళు మాట్లాడ్తే నీవూ చప్పట్లు కొట్టావు. కానీ పల్లెటూరువాళ్ళు మాట్లాడ్తే అసహ్యించుకుంటావ్"

ఇటువంటి జవాబు వస్తుందని నేనూహించలేదు. దిగ్భ్రమతో మూర్తివైపు చూస్తూ నిలబడినాను. మూర్తి జాలిగా నవ్వుతూ నాచేయి పట్టుకొని అన్నాడు "ఆ అమ్మాయి యిక వారం రోజులు కూడా బ్రతికే ఆశ లేదు. కానీ నీ మనశ్శాంతి కొరకు మదనపల్లెకు పంపించదలచుకుంటే నేనేమీ వద్దనను. ఆమె తండ్రి రేపో, మరునాడో వస్తాడు - మాట్లాడుదాంలే.

దేవకన్యలను పట్టించుకోని దేశం



రాచమల్లు రామచంద్రారెడ్డి విమర్శకులుగా సుప్రసిద్ధులైనా, మంచి కథారచయిత కూడా. తక్కువ కథలు రాసినా, సత్తా ఉన్నవి, పాఠకులను ఆలోచింపచేసేవి రాశారు. 'దేశంలో దేవకన్యలు' కథ చిన్నదే కానీ కథాంశం పరిధి మాత్రం పెద్దది. రచయిత తానే కథలో పాత్రయినట్లు ఉత్తమ పురుషలో కథనం సాగుతుంది. ముగిసిన తరువాత ఆ కథ, కథలో మరణించిన అందమైన యువతి, ఆ యువతి వంటి అనేకమంది పాఠకులను వెన్నాడుతూ, ఎన్నో ప్రశ్నలను రేపుతారు. అందమైనవాళ్లే కాదు దేశంలో మంచి వైద్యం అందక మరణించే వారంతా దేవకన్యలే అనే భావన కలగాలని కథకాపేరు పెట్టారు.

నిజానికిది కటువైన సామాజిక విమర్శ. మన రాజ్యాంగానికి విసిరిన ఒక సవాలు. జీవించే హక్కును పాఠకులకు అర్థం చేయించే ఒక ప్రయత్నం. ఇందులో కల్పన లేదు.. కఠిన వాస్తవం తప్ప. గ్రామీణ పేదరికం గురించి, గ్రామీణులను అజ్ఞానంలో ఉంచిన ప్రభుత్వాల గురించీ రచయితకున్న అసహనం, కోపం చాలా పదునుగా అభివ్యక్తమయ్యాయి.

అందంగా లేని వాళ్ళకు జబ్బులొస్తే వాళ్ళకు జీవించే హక్కు లేదా? దేశంలో పుట్టిన ప్రతి వారికీ ఆరోగ్యంగా జీవించే హక్కును రాజ్యాంగం వాగ్దానం చెయ్యలేదా? ఆ హక్కు సంగతేమిటి? డబ్బుకి కొందరిని బతికించటానికీ, మరికొందరిని చంపటానికి అధికారం ఉండటంలోని ఔచిత్యమేమిటి? డబ్బుకి ఆ అధికారం ఇచ్చిన సామాజిక వ్యవస్థ సంగతేమిటి? ఇలా ఈ చిన్ని కథ ఎన్నో పెద్ద ప్రశ్నల్ని రేపుతుంది. సమాధానాల అన్వేషణ దిశగా దారి చూపుతుంది. పరిష్కారాలు దరిదాపులో కనిపించని సమస్యలు చుట్టుముట్టినపుడు సామాన్యులు కర్మసిద్ధాంతాన్ని, వేదాంతాన్ని ఆశ్రయిస్తారు. ఆ వేదాంతాన్ని చీల్చి చెండాడి సత్యాన్ని ప్రజలకు అర్థం చేయించాల్సిన బాధ్యత విజ్ఞులకు, మేధావులకు ఉందనే సూచన ఈ కథలో ఇమిడి ఉంది.

ఆరోగ్యంగా జీవించే హక్కు తమకుందని తెలియని సామాన్యుల గురించి ఆలోచించమని మనల్ని హెచ్చరిస్తుందీ కథ. మార్పు సామాజికంగా రావాలి. వ్యవస్థాపరంగా రావాలి. అప్పుడు మాత్రమే దేశంలోని దేవకన్యలే కాదు పౌరులందరూ ఆరోగ్యంగా, ఆనందంగా బతకగలుగుతారనే మంచి విషయాన్ని చెప్పిన కథ ఇది. మేధావి, అభ్యుదయ రాజకీయ పరిజ్ఞానం ఉన్న రచయిత మాత్రమే రాయగలిగిన గొప్ప కథ ఇది.

– ఓల్గా, సుప్రసిద్ధ రచయిత్రి

ఇక పోదాం రా, భోంచేద్దాం"

ఆస్పత్రి ప్రక్కనే వున్న డాక్టర్ యింటికి పోయి తడిసిన గుడ్డలు మార్చుకొని భోంచేస్తున్నాము. నేను అడుగుదామనుకొని మరచిపోయిన ప్రశ్నకు డాక్టరే సమాధానం ప్రారంభించినాడు. "నేనూ ప్రజాసేవ చేయాలనే ఈ ఊర్లోనే స్థిరపడిపోయినాను. నా శక్తికొలది రోగులకు ఉచితంగా సేవ చేస్తూనే వున్నాను. కానీ ఇదేమీ లాభంలేదు. ఇది ప్రజాసేవ అనుకోవడం ఆత్మవంచన"

"అదేమిటి మూర్తీ? రోగులకు ఉచితంగా చికిత్స చేయడం ప్రజాసేవ కాదూ? " అని ఆశ్చర్యపడుతూ అడిగినాను.

"నేను ఎంత సేవచేసి ఏమిలాభం? ఆ సేవకు ఫలితం వుంటే గదా? ఆ అమ్మాయి ప్రాణం రక్షించగలిగితే గదా నా సేవ ప్రజాసేవ అవుతుంది? "

నాకు అర్థంకాక ప్రశ్నార్థకంగా మూర్తి వైపు చూసినాను. అతను యాంత్రికంగా చెప్పుకుపోతున్నాడు "ఆ అమ్మాయి నిజంగా చావవలసిన అవసరమే లేదు. ఆ అమ్మాయిని రక్షించగల శక్తి వైద్యశాస్త్రానికుంది. ఆ వైద్యశాస్త్రం చదువుకున్న డాక్టర్లూ - నాబోటి వాళ్లు - వున్నారు. ఆ అమ్మాయిని బ్రతికించగల మందులూ దేశంలో వున్నాయి విస్తారంగా. కానీ ఆ అమ్మాయి ఇక నాలుగైదు రోజులకంటే

ఎక్కువ బ్రతకదు. ఆ అమ్మాయి అనవసరంగా మృత్యుదేవతకు ఆహుతి అవుతుంటే అడ్డుపడలేని నా సేవ మానవ సేవ అవుతుందా? "

మూర్తి హృదయంలో యింత వేదన వుందని నేనెన్నడూ ఊహించలేదు. అతని కంఠాన్ని క్రమంగా విషాదచ్ఛాయలు ఆవరించినాయి.

"డబ్బును గురించేనా అంటున్నావ్? " అన్నాను.

"అవును. డబ్బులేందె మందులు రావు. డాక్టర్లుకూడా కొందరు రారు. కానీ డబ్బు లేకున్నా రోగాలు వస్తాయి. మందులూ వున్నాయి. రోగులూ, డాక్టర్లూ వున్నారు. కానీ వీళ్ళకెవ్వరికీ స్వాతంత్ర్యం లేదు - అందరినీ శాసించే హక్కు డబ్బుకు వుంది"

ఆ డబ్బు నా దగ్గర కొంత వుందన్న సంతృప్తితో "అందతా ఎందుకులే మూర్తీ. డబ్బు నేనిస్తాను, ఆ అమ్మాయిని బ్రతికించలేవూ? " అన్నాను.

మూర్తి అదే ధోరణిలో సమాధానం చెప్పినాడు. "నీవంటి దాతలు మన దేశంలో పూర్వం నుండీ వుంటూనే వున్నారు. బలిచక్రవర్తి కాలం నుండీ దాన ధర్మాలు చేస్తూనే వున్నారు. కానీ ఎన్నిధర్మాలు చేసినా దారిద్ర్యం పెరుగుతూనే వుంది. దరిద్రుల సంఖ్య పెరుగుతూనే వుంది. అన్నానికి మొగంవాచిన వాళ్ళ సంఖ్య పెరుగుతూనే వుంది. మందులు కొనలేక మరణాన్నాహ్వానించే వాళ్ళ సంఖ్య పెరుగుతూనే వుంది"

అతని ధోరణేమిటో నాకు అంతుచిక్క లేదు. నా ధ్యాసంతా ఆ అమ్మాయి మీదనే వుంది. "ఆ అమ్మాయి సంగతి చెప్పు మూర్తీ" అన్నాను.

"ఆ అమ్మాయి బ్రతకదని ఎన్నిసార్లు చెప్పేది! ఆమె దగ్గినప్పుడంతా రక్తం పడుతూ వుంది. పోనీ బ్రతికినా ఆ అమ్మాయి నొక్కదాన్నే కదా నీ డబ్బు బ్రతికిస్తుంది? ఆ అమ్మాయిలోని అపురూపమైన అందాన్ని చూసి నీవు డబ్బిస్తున్నావు. కానీ దేశంలోని అమ్మాయిలందరూ వాళ్ళ వాళ్ళ తల్లిదండ్రులకు అపురూపంగానే వుంటారు. అందంగానే వుంటారు. వాళ్ళకూ బ్రతకడానికి హక్కు వుంది. వాళ్లందరి హక్కునూ గుర్తించలేని నీ ఔదార్యం, ఔదార్యం కాదు. రోగం వచ్చిన వాళ్లలో కొంతమందిని బ్రతికించడానికీ, తక్కిన వాళ్ళకు మరణదండన విధించడానికీ నీ డబ్బుకు రెండధికారాలు న్నాయి. మొదటి అధికారం ఔదార్యమైతే, రెండవది రాక్షసత్వమౌతుంది"

మూర్తి ధోరణికి నాకీసారి భయం కలిగింది. మూర్తికి మతిచెడిందా? లేక నాకే మతిచెడిందా? ఇక ఏం మాట్లాడినా మూర్తి మనస్సు మరీ వికలమౌతుందని మౌనంగా వుండిపోయినాను.

భోంచేసిన వెంటనే ఒళ్ళు బాగలేదని సాకు చెప్పి పండుకున్నాను. ఎండలో నడిచీ, వర్షంలో తడిసీ నాకు నిజంగానే ఒళ్లు బాగాలేదు. సాయంత్రం మూడు గంటలయ్యేటప్పటికి జ్వరం తగిలినట్టు అనుమానం వచ్చి డాక్టర్‌ను చూడమన్నాను.

మూర్తి చూసి రెండు మాత్రలిచ్చి "ఏమీ ప్రమాదం లేదులే, కదలకుండా పండుకో" అన్నాడు నవ్వుతూ.

తరువాత నాలుగు రోజులు స్పృహలేకుండా జ్వరం వచ్చింది అప్పుడప్పుడు స్పృహ వచ్చినా ఆ అమ్మాయి విషయం జ్ఞాపకం రాలేదు. ఐదవరోజు ఉదయం జ్ఞాపకం వచ్చి డాక్టర్ నడిగినాను "ఆ అమ్మాయి ఎట్లున్నది మూర్తీ? "

మూర్తి ఒక్కక్షణం తటపటాయించినట్లు కనబడినాడు. తరువాత స్థిరంగా నావైపు చూస్తూ పాఠం అప్పగించినట్టు అన్నాడు "నీ అందమైన అమ్మాయి చచ్చిపోయింది. నిన్న సాయంత్రం రక్తం కక్కుతూ చచ్చిపోయింది"

ఇంగ్లండ్ కథ

- జెఫ్రీ ఆర్చర్

మెరుపుతపాలా

ఇంగ్లండు దేశపు మహారాణి బ్రిటిష్ సామ్రాజ్యపు అధినేత్రి నుంచి మెరుపుతపాలా(తంతివార్త) అందగానే ఆల్బర్ట్ మొహంలో ఓ చిరునవ్వు విరిసింది. జన్మదిన శుభాకాంక్షలు అందజేసిన ఆ సందేశాన్ని ఓ వందసార్లైనా చదువుకుని ఆనందసాగరంలో మునిగిపోయాడు ఆల్బర్ట్‌వెబ్బర్.

"శ్రీ ఆల్బర్ట్ వెబ్బర్ గారికి నూరవ జన్మదిన శుభాభినందనలు. ఇలాగే ఆయురారోగ్యాలతో మీరు వర్ధిల్లాలని మా ఆకాంక్ష" రాణీ ఎలిజబెత్ స్వయంగా పంపిన ఒక అమూల్యమైన పుట్టినరోజు కానుక అందుకున్న ఏ బ్రిటిష పౌరుడైనా ఆల్బర్ట్‌లాగే ఆనందానంద కందళిత హృదయారవిందుడు కావలసిందే.

"ఇలాంటి అపూర్వమైన కానుక కోసం ఎదురుచూడటం ఇక నీ వంతు" అంటూ ఆ మెరుపు తపాలాను భార్యామణి బెట్టికి అందించాడు ఆల్బర్ట్. అది చూడగానే బెట్టి మొహంలోనూ చిరునవ్వు దీపం వెలిగింది. ఆల్బర్ట్ నూరేళ్ల పండుగ సందర్భంగా మేయర్‌గారు ఏర్పాటు చేసిన సన్మానసభకు ఏర్పాట్లు ఒక వారం నుంచి జరుగుతూనే ఉన్నాయి. ఈ రోజు పురపాలక సభావేదికపైన ఉపన్యాసాలు, ఆ తర్వాత విందుభోజనాలు, సంబరాలు, వేడుకలు అన్ని అచ్చుకట్టుగా కుదిరాయి. మొదటి పేజిలో ఆల్బర్ట్ ముఖచిత్రంతో స్థానిక వార్తాపత్రిక 'సోమర్‌సెట్ గెజిట్' ఉదయాన్నే వెలువడింది. బ్రిటిష ప్రసార మాధ్యమ బృందం 'పాయింట్ వెస్ట్' ఆల్బర్ట్ దంపతులను పరామర్శించటానికి బయలుదేరింది. గౌరవనీయులైన నగర మేయరు, స్ట్రీట్ నగరపాలక సభ్యుడు టెడ్‌హార్డింగ్, పురప్రముఖుడు బ్రాడ్లీబాంక్ శతాయుష్కుడు ఆల్బర్ట్‌కి స్వాగతం పలకటానికి సన్నద్ధం అయ్యారు. మేయరుగారి కచ్చేరి చేరుకోగానే ఆల్బర్ట్, పార్లమెంట్ సభ్యుడు డేవిడ్ హీత్‌కోట్ అమోరీతో కరచాలనం చేశారు. కెమెరాలు క్లిక్‌మంటూ చుట్టూ వెలుగులు వెదజల్లాయి. సభామండపంలో వందమందికిపైగానే అతిథులు ఆల్బర్ట్ రాకకోసం ఎదురుచూస్తున్నారు. లోపలికి అడుగువేయగానే చప్పట్లు మారుమ్రోగాయి. ఒక్కసారి లేచి అందరూ కరచాలనం చేయటానికి ముందుకు దూసుకు వచ్చేశారు. అందులో చాలామంది అపరిచితులే కనిపించారు ఆల్బర్ట్‌కి.

వంద సంవత్సరాల క్రితం అంటే 1907లో సరిగ్గా ఈ రోజే పుట్టిన ఆ శతవర్షీయుడి పుట్టినరోజు సన్మానసభకు ఘనంగా ఏర్పాటు జరిగింది. అతడి చుట్టూ అతడి పిల్లలు అయిదుగురితో పాటు పదకొండుమంది మనుమలు, మనుమరాళ్లు, పందొమ్మిది మంది ముని మనుమలు, ముని మనుమరాళ్లూ కూడా పాల్గొన్నారు. ఠంచనుగా మూడుగంటలా ఇరవైఏడో నిమిషానికల్లా, వెండి పిడి వున్న చాకు ఆల్బర్ట్‌చేతికి వచ్చింది. అది మూడు దొంతరల 'బర్త్‌డే కేకు' గుండెల్లో లోతుగా



దిగబడింది. మళ్లీ ప్రేక్షకులు కరతాళధ్వనులు చేశారు. మాట్లాడమని కేకలేశారు. ఆ గందరగోళంలో ఆల్బర్ట్ చెప్పదలుచుకున్న రెండుముక్కలు మరిచిపోయాడు. ఆ నిశ్శబ్ద వాతావరణం అతణ్ణి మరింత కలవరపెట్టేసింది.

"మాట్లాడు" అని బెట్టి ఆల్బర్ట్‌ని డొక్కలో పొడిచింది.. ఓసారి కళ్ళుమూసుకుని తెరిచి చుట్టూ కలియజూశాడు ఆల్బర్ట్. "నా హృదయపూర్వకమైన కృతజ్ఞతలు" అన్న మాటలు అతడి పెదాలనుంచి ఎట్టకేలకు ఊడిపడ్డాయి. అంతకుమించి ఆశించని జనాలు "హేపీబర్త్‌డే" పాటను వెంటనే అందుకున్నారు. బృందగానం మైమరపించగా ఎదురుగా వున్న వంద కొవ్వొత్తుల్ని ఆర్పే కార్యక్రమం చేపట్టాడు ఆల్బర్ట్. ఏడుసార్లు ఉఫ్‌మని ఊదగానే అతడిపని అయిపోయింది. మిగతా కొవ్వొత్తుల్ని ఆర్పటానికి కుటుంబంలోని కుర్రకారు ఉత్సాహంగా ఉరకలేసింది. సభామంటపం నవ్వులతో గొల్లుమన్నది. చప్పట్లు మరింత గట్టిగా వినిపించాయి. అవి సద్దుమణగగానే మేయర్‌గారు లేచి బంగారు అంచుల నల్లని గౌను సర్దుకుంటూ గొంతు సవరించుకుని ఉపన్యాసం ప్రారంభించారు.

అనువాదం :
ఉప్పు రాఘవేంద్రరావు

"పురజనులారా! ఈ రోజు మనం ఇక్కడ ఎందుకు చేరామో నేను వేరుగా చెప్పనవసరం లేదు. శ్రీ ఆల్బర్ట్‌గారి నూరేళ్ల పండుగ సందర్భంగా మనం ఇక్కడ పోగయ్యాం. ఆల్బర్ట్ మన ఊరి గౌరవనీయులైన సభ్యుడు. మనలో ఒకడై అందరి ప్రేమకు పాత్రుడయ్యాడు. 1907 ఏప్రిల్ నెలలో ఈ స్ట్రీట్ నగరంలోనే ఆయన పుట్టారు.

1931లో హోలీట్రినిటీ చర్చిలో శ్రీమతి బెట్టీని వివాహం చేసుకున్నారు. మన ఊరి పాదరక్షల కర్మాగారానికి అతడి జీవితం అంకితం అయింది. సి అండ్ జె క్లార్క్ ఫ్యాక్టరీకి ఆయన దూరంగా వున్నది కేవలం నాలుగు సంవత్సరాలే. ఒక స్వచ్ఛంద సైనికుడిగా సోమర్‌సెట్ కాల్బలంలో సేవలందించి 1945లో మళ్లీ అదే కంపెనీలో చేరాడు. ఉపనేతగా ఎదిగాడు. అయినా ఆల్బర్ట్‌ని వదిలించుకోవటం అంత సులువుకాదు. అరవైయ్యేవపడిలో నైట్ వాచ్‌మెన్‌గా చేరి డెబ్బైవరకు పనిచేస్తూనేవున్నాడు.."

మేయరుగారు సభాస్పందన కోసం ఉపన్యాసంలో ఒక విరామం కల్పించారు. అది కనిపెట్టిన ప్రేక్షకులు మళ్లీ ఒక్కసారి నవ్వులు, చప్పట్లు రువ్వారు. మేయరుగారు సావధానంగా ఉపన్యాసం కొనసాగించారు గొంతు సవరించుకుని.

"చిన్ననాటి నుంచి ఆల్బర్ట్‌కి ఆటలంటే మహా ఇష్టం. మన ఊరి 'ఫుట్‌బాల్‌క్లబ్' కి పూర్తి మద్దతునిచ్చారు. ఈ క్రీడారంగానికి ఆయన ఎప్పుడూ దూరం కాలేదు. అది గమనించి ఫుట్‌బాల్‌క్లబ్ ఆయన్ని జీవిత సభ్యుడిగా నమోదు చేసుకోక తప్పలేదు. ఆల్బర్ట్‌కి ఇతర క్రీడలలో కూడా ఆసక్తి, ప్రావీణ్యం ఉన్న విషయం మీరందరూ గమనించే ఉంటారు.

ఆల్బర్ట్ జీవితకాలం ఒక ఇంద్రధనస్సు లాంటిదని నేనంటే మీరూ ఔనంటారని నా నమ్మకం. అతను మరింత కాలం ఇలాగే జీవించాలి. ఎందుకంటే, మరో మూడేళ్లకి మనమంతా ఇక్కడే ఆయన భార్యామణి బెట్టి నూరేళ్ల పుట్టినరోజు సంబరం జరుపుకోబోతున్నాం. ఆమె రాబోయే రెండువేల పది నాటికి కాబోయే శతవర్షీయసి అంటే నాకే నమ్మకం కుదరటం లేదు.." బెట్టి వంక చూసారు

మేయరు సాభిప్రాయంగా.

"హియర్ హియర్" జన స్పందన విని పించగానే బెట్టి కాస్త బెట్టు చేసి సిగ్గుప డుతూ చివరికి తలపంకించింది. ఆల్బర్ట్ ఆప్యాయంగా ఆమె చెయ్యి అందుకు న్నాడు. మిగతా పురప్రముఖులూ మాట్లా డాక, ఆల్బర్ట్‌ని నుంచోబెట్టి మరిన్ని ఫొటోలు తీయించుకున్నారు. మేయర్ గారు స్వయంగా దంపతులను తన విలు వైన మెరుపుల రోల్స్‌రాయ్స్ కారులో కూచోబెట్టి ఇంటికి సాగనంపారు. అంతటి ఘనసత్కారానికి నోచుకొన్న ఆల్బర్ట్ దంప తులు ఉబ్బితబ్బిబ్బు అయ్యారు.

మార్నే టెర్రేస్‌లోని సొంత ఇల్లు రాగానే కారు తలుపులు తెరిచాడు డ్రైవరు. భుక్తా యాసంతో అలసిసొలసి నిద్రాదేవి ఒడిలో ఒదిగిపోయారు ఆల్బర్ట్ బెట్టిలు. నూరేళ్ల పుట్టినరోజు పండగ ధ్యాస, శ్వాసగా ఆ రాత్రి మైమరచిపోయాడు ఆల్బర్ట్.

తర్వాత మూడేళ్లదాకా ఆల్బర్ట్ దంప తుల జీవితంలో ఎలాంటి మార్పూ లేదు. అప్పుడప్పుడూ మోకాళ్లనొప్పుల్లాంటి చిన్న చిన్న రుగ్మతలు తప్ప ప్రాణం తీసే జబ్బులు ఏవీ దరికి రాలేదు. ఆ కుటుం బంలో జూడ్ అనే ముని-మునిమనుమ రాలు జన్మించటమే ఒక గొప్ప విశేషం

అనుకోవచ్చు. ఆల్బర్ట్ అర్ధాంగి బెట్టి నూరేళ్ల పుట్టినరోజు పండుగ దగ్గర పడే సమయానికి ఆల్బర్ట్ బాగా సన్నబడి నీర సించాడు. అంచేత ఆ సంబరం అంబరం అంటేలా టౌన్‌హాల్లో కాకుండా ఇంటి దగ్గరే జరిపించటానికి బెట్టి పట్టుబట్టి ఎలాగో భర్తను ఒప్పించింది. పుర ప్రము ఖులు ఎవరూ లేకుండా ఆ పండుగ కుటుంబ సభ్యులకే పరిమితం చేయిం చింది. కాని, ఆల్బర్ట్‌కి బెట్టి బర్త్‌డే కూడా తనలా ఘనంగా దర్జాగా మేయరుకారులో ఊరేగింపుతో జోరుగా సాగాలని ఉన్నది.

కాని, అది కుదరకపోవటం ఆల్బర్ట్‌కి కాస్త నిరాశగానే ఉంది. ఆ రోజు రోల్స్ రాయ్ కారులో ఇద్దరూ దర్జాగా కూచున్న సన్నివేశం అతడి మనోవీధిలో ఇప్పటికీ మెరుస్తూనే ఉంది. మేయర్‌కి కూడా తన పరపతి పెంచగల ఒక సువర్ణ అవకాశం జారిపోతున్నందుకు కాస్త దిగులుగానే ఉన్నది. బెట్టి నూరేళ్లవేడుక సందర్భంగా తన ఫొటో పత్రికలో ప్రముఖంగా కని పించే అవకాశం కోల్పోయినట్టేనని బాధగా ఉంది ఆయనకి.

ఊహించినట్టుగానే, బెట్టి నూరేళ్ల పండుగ రోజున శుభాకాంక్షలు వెల్లువె త్తాయి. వందకు పైచిలుకు ఉత్తరాలు, టెలిగ్రాంలు అందాయి. ఇంతమంది శ్రేయోభిలాషుల సందేశలహరి చూచినా, ఆల్బర్ట్‌కి అసంతృప్తి పోలేదు. పైగా రాణీ గారి శుభాకాంక్ష తంతి వార్త అందకపో వటం అతడికి అస్సలు మింగుడు పడ లేదు. బహుశ పోస్టాఫీసు వారి అశ్రద్ధ వల్ల టెలిగ్రాం ఇవ్వడంలో జాప్యం అయి ఉంటుందని, తప్పకుండా ఆలస్యంగానైనా అందుతుందని ఆశించాడు. ఆశ నిరాశే అయింది. బెట్టి నూరేళ్ల పుట్టిన పండుగ నిరాడంబరంగానే జరిగిపోయింది. ఆమె కోరుకున్నది జరిగింది.

"అబ్బబ్బ! రచ్చ దేనికి ఆల్బర్ట్? రాణీగా రికి లక్ష పనులుంటాయి. ఇంతకన్నా ముఖ్యమైన పని ఏదో ఉంటుంది. గొడవ చేయకు ఆల్బర్ట్" అని మందలించింది బెట్టి. కాని ఆల్బర్ట్‌లో ఏదో వెలితి. భార్య పట్ల సానుభూతి. ఒక్క వారం వేచి చూచినా రాణీగారి శుభాకాంక్షలు అందక పోవటంతో, కార్యరంగంలో దూకటానికి నిశ్చయించుకున్నాడు ఆల్బర్ట్. ప్రతి గురు వారం డెబ్బై మూడేళ్ల కూతురు ఎలీన్ తల్లి బెట్టిని షాపింగ్‌కి తీసుకువెళ్తూ ఉంటుంది.

ఏమీ కొనకపోయినా కాలక్షేపం కోసం బెట్టి బయలుదేరుతుంది. ఆ చుక్కలు చూపిస్తున్న ధరలు బెట్టిని కలవరపెడు తూనే ఉన్నాయి. పౌను విలువ పడిపో యింది. ఒకప్పుడు పెన్నీ బ్రెడ్డు వారానికి సరిపోయేది. తక్కువ సంపాదనతోనూ సంతృప్తిగా బ్రతికే రోజులు పోయాయని ప్రతిసారి దిగులుపడుతూనే ఉంది బెట్టి పాపం!

అవకాశం కోసం ఎదురుచూస్తున్న ఆల్బర్ట్ గురువారం తల్లీ కూతుళ్లు అలా బయటకి వెళ్లగానే ఇటు తన గదిలోకి దూరాడు. ఓ నంబరుడయల్ చేశాడు.

"డైరెక్టరీ ఎన్‌క్వైరీ? ఏ నంబరు కావాలి ప్లీజ్?" అటు నుంచి వినయంగా మాటలు వినిపించాయి.

"బకింగ్‌హామ్ ప్యాలెస్"

కాస్త ధైర్యంగా తడబాటు లేకుండా చెప్పాడు ఆల్బర్ట్. ఆపరేటర్ ఒక క్షణం



తటపటాయించినా, నంబరు కలపటానికే సిద్ధం అయ్యాడు.

"ఒక్క క్షణం" ఆగమని ఆపరేటర్ ఫోన్ పెట్టేశాడు. ఆల్బర్ట్‌కి ఆ క్షణమే ఒక యుగం అనిపించింది. ఎలాంటి జవాబు వస్తుందో! తక్షణం ఆపరేటర్ గొంతు ఫోన్‌లో గురగురలా ఉంది. ఫోన్ ఎత్త గానే, ఆల్బర్ట్‌కి నంబరు ఇచ్చేశాడు. ఆల్బర్ట్ ఆశ్చర్యానికి అంతే లేదు. మళ్ళీ చెప్ప మన్నాడు ఆపరేటర్‌ని, టోపీ తలపై నుంచి కాస్త ఎత్తి పట్టుకుని-

"02077667300"

నంబరు రాసుకుని ఆపరేటర్‌కి కృతజ్ఞ తలు తెలిపి ఫోన్ పెట్టేశాడు రాబర్ట్. ధైర్యం చిక్కబట్టుకోవటానికి కొంత సమయం కావలసి వచ్చింది అతడికి. రిసీ వర్ గట్టిగా పట్టుకుని రాణీవారి ఆవాసపు నెంబరు డయల్ చేశాడు. అటు వైపు రింగ్ స్పష్టంగా వినిపిస్తున్నది. కానీ ఎవరూ ఎత్తలేదు. లాభం లేదనుకుంటూ రిసీవర్ పెట్టబోయాడు. అవతలి నుంచి ఒక ఆడగొంతు రవళించింది.

"బకింగ్ హామ్ పాలెస్. ఏం కావాలి తమరికి? "

"నూరేళ్ళ పండుగ గురించి తెలుసుకో వాలి" అన్నాడు ఆల్బర్ట్.

"ఎవరు మాట్లాడుతున్నారు? "

"నా పేరు ఆల్బర్ట్ వెబ్బర్"

అంతలో "హలో" అంటూ మరో మగ గొంతు గంభీరంగా వినిపించింది.

"హంఫ్రే క్రాన్‌షా మాట్లాడుతున్నాను"

ఆ గొంతు తను ఇదివరకు విన్నదే. "గుడ్ మార్నింగ్" చెప్పాడు ఆల్బర్ట్ వెంటనే.

"సహాయం కోసం ఎదురు చూస్తున్నాను" అన్నాడు కాస్త బెరుగ్గా.

"తప్పకుండా. చేయగలిగిన సహాయం చేస్తాను మిస్టర్ వెబ్బర్" అన్నాడు రాణీవాసపు రాజ ప్రతినిధి.

"థేంక్స్. మూడేళ్ల క్రితం నా నూరేళ్ళ పండుగ జరిగింది"

"నా అభినందన మందారాలు" జవాబు వెంటనే వినిపించింది. మళ్లీ కృతజ్ఞతలు చెప్పాడు ఆల్బర్ట్ వెబ్బర్.

"కాని, నేను ఇప్పుడు మరో విషయం గురించి మాట్లాడదలచాను. ఆ సందర్భంలో రాణీవారు నాకు శుభాకాంక్షలు తెలియజేస్తూ ఒక టెలిగ్రామ్ పంపారు. ప్రస్తుతం మా ఇంటి గోడ మీద అదో విలువైన చిత్రపటం. నేను అపురూపంగా దాచుకున్నాను"

"అది మీ ఔదార్యానికి నిదర్శనం మిస్టర్ వెబ్బర్" అన్నాడు రాజ ప్రతినిధి.

"రాణీవారు ఇప్పటికీ ఆ సంప్రదాయాన్ని పాటిస్తున్నారా, ఆ విషయం తెలుసుకోవాలని వుంది"

"ఖచ్చితంగా. రాణీగారికి ఈ సంప్రదాయం ఇలాగే కొనసాగాలన్న కోరిక వున్నది. ఇప్పుడు శతాయుష్కుల సంఖ్య బాగా పెరిగిన మాట వాస్తవం"

"చాలా సంతోషం మిస్టర్ క్రాన్‌షా. అలాంటి అందమైన మైలురాయిని నా భార్యామణి రెండు వారాల క్రితమే దాటింది. రాణీగారి అభినందన సువార్త అందించే టెలిగ్రాం అందకపోవటమే విచారకరం"

"ఇలా జరిగినందుకు నేను చింతిస్తున్నాను. ఎక్కడో చిన్న పొరపాటు జరిగి వుంటుంది. ఉండండి. ఇప్పుడే తేలుస్తాను. అన్నట్టు మీ శ్రీమతి పూర్తి పేరు చెప్పండి"

"ఎలిజబెత్ వయొలెడ్ వెబ్బర్ ఉరఫ్ బ్రెయిత్ వెయిట్" గర్వంగా తన ప్రియ సతి బెట్టి పూర్తి పేరు వల్లె వేశాడు ఆల్బర్ట్. దస్తావేజు వెతకడానికి కాస్త టైం పట్టినా, క్రాన్‌షా శీఘ్రంగానే స్పందించాడు.

"ఆలస్యానికి చింతిస్తున్నాను మిస్టర్ వెబ్బర్. మొత్తానికి మీ సతీమణి వివరాలు దొరికాయి" క్రాన్‌షా స్పందించిన తీరు ఆల్బర్ట్‌కి ఎంతో ఉత్సాహాన్నిచ్చింది.

"ఇప్పుడు నాకెంతో ఆనందంగా ఉంది" అన్నాడు తబ్బిబ్బు పడిపోతూ.

"నాకూ ఆనందంగానే వున్నది"

"మరి రాణీగారి శుభాభినందనలు ఎప్పుడు అందుతాయో తెలుసుకోవచ్చా?" ఆల్బర్ట్ అడిగాడు ఆదుర్దాగా.

అవతలి వైపు ఒక్క క్షణం నిశ్శబ్దం రాజ్యమేలింది.

"మీ సతీమణి తాలూకు నూరేళ్ళ శుభాకాంక్షల మెరుపు తపాలా ఐదేళ్ళ క్రితమే రాణీగారు పంపిణీ చేశారు" చెప్పాడు క్రాన్‌షా.

బయట బెట్టీ కారు చప్పుడు, ఐలీన్ తలుపు తాళం తీస్తున్న చప్పుడు విన్న ఆల్బర్ట్ వెబ్బర్ చటుక్కున ఫోన్ కట్ చేశాడు. అతడి మొహంలో ఓ చిరునవ్వు పూచింది. V

తెలుగు కథ - బి.పి. కరుణాకర్

సాయం

ఉదయం తొమ్మిదంటే తొమ్మిదింటికి కాదుగాని అరగంట అటుగానో ఇటుగానో షాపు తెరుస్తూ ఉంటాను. నాది పెయింటింగ్ షాపు. ఫ్లెక్సీలు, బోర్డులు కూడా చేస్తూ ఉంటాను. అంత పెద్ద షాపేమీకాదు. ఎప్పటి పనులు అప్పుడు ఆట్టే సమయం తీసుకోకుండా ఇచ్చేస్తుంటాను. సంవత్సరాలుగా అక్కడ కూర్చుని ఉండటం వల్ల పెయింటు వాసనకు బాగా అలవాటు పడిపోయాను.

నాకు సహాయం చేయడానికి ఆ మధ్య ఎప్పుడో ఒక కుర్రాడిని పెట్టుకున్నాను. వాడు చాకులాంటివాడు. ఫలాన పనిచేయమని అతనికి రెండోసారి చెప్పాల్సిన అవసరం ఉండదు. నేను చెప్పినపని గురించి అడిగే లోపల 'చేసేశాను సార్' అంటాడు. మంచిగా పనిచేసేవాళ్లను ఎక్కువ జీతం ఎరవేసి మరొక షాపువాళ్లు తీసుకువెళ్లడం మామూలే. కానీ అతని జీతం విషయంలో నేనేం కొదవ చేయను. ఎందుకో ఎంతమంది ఎక్కువ జీతం ఎరవేసినా ఈ కుర్రాడు నన్ను వదలలేదు. మూడు సంవత్సరాలు పైగా నన్ను అంటిపెట్టుకుని ఉన్నాడు. తన పనులేవో తను చకచక చేసుకు వెళ్లిపోతుంటాడు. అవసరమయితే తప్ప నాతో కూడా ఎక్కువ మాట్లాడడు.

మధ్యాహ్నం సమయంలో ఆర్డర్స్ రావడం మొదలవుతుంటాయి. నాలుగైదు వీధుల వరకు మరొక షాపు లేకపోవడం వలన పని వత్తిడి ఎక్కువగానే ఉంటుంది. కొన్నిసార్లు రాత్రి పది దాటే వరకు కూర్చోవలసి ఉంటుంది. వాళ్ల వాళ్లకెవరికో బాగాలేదని పనికుర్రాడు రెండు రోజులుగా పనికి రావడం లేదు.

ఆ ఉదయం షాపు తెరిచేసరికి పది దాటింది. నేను చేతికి గడియారం పెట్టుకోను. గడియారమే కాదు నా పెన్సిలు కూడా పెయింటు వాసన వస్తుంటుంది. షాపులో గోడ గడియారం పెండ్యులం ఊడిపోయి, మేకు వదులయి షోపీస్‌లా గోడకు వేలాడుతోంది. అది ఎప్పటినుండి పనిచేయడం లేదో కూడా నాకు గుర్తులేదు. దాన్ని ఎప్పటికప్పుడు బాగు చేయించాలి అనుకుంటాను. అక్కడే ఆగిపోతాను.

కిటికీ రెక్కలు తెరుస్తూ ఆగాను. షాపు ముందు ఒకమ్మాయి చేతులు కట్టుకుని దీనంగా నిలబడి ఉంది. ఆ అమ్మాయికి పన్నెండు సంవత్సరాల వయసు ఉండొచ్చు. ఎర్రగా, సన్నగా ఉంది. జుట్టు పైపైన దువ్వుకున్నట్టుగా ఉంది. బూడిదరంగు ఫ్రాకు కొత్తగా లేదు. ఒక చేతిలో డబ్బులు దాచుకునే పోస్టాఫీసు డబ్బా ఉంది. చదువుకుంటున్న అమ్మాయిలానే ఉంది. అప్పుడప్పుడు చందాల కోసం స్కూలు పిల్లలు స్కూళ్ల తరఫున వస్తుంటారు. ఆ అమ్మాయి కూడా అలానే వచ్చి ఉంటుందనిపించింది. పరీక్షగా చూశాను. కానీ ఆ అమ్మాయి అలా కనిపించలేదు. ఆమె ముఖంలో విచారం గడ్డకట్టి ఉంది. కళ్లు ఉబ్బి ఎర్రగా ఉన్నాయి.

షాపులోకి వచ్చి "చాలాసేపటినుండి మీ కోసం ఎదురుచూస్తూ ఉన్నాను" అంది. ఆ మాటల్లో దుఃఖం, మృదుత్వం రెండూ ఉన్నాయి. ఆ పాపను కుర్చీలో కూర్చోమని సైగ చేశాను. కూర్చుంది.

నేనూ కూర్చుని "ఎందుకు? " అడిగాను.

"మీరు నాకో సహాయం చేసి పెట్టాలి"

"చెప్పమ్మా"

తను చెప్పాలనుకుంటున్న విషయం ఎలా మొదలెట్టాలో ఆ పాపకు అర్థం అవుతున్నట్టు లేదు. నేను జేబులోంచి సిగరెట్ పేకట్ తీసి బల్లమీద పెట్టి అందులోంచి సిగరెట్ తీసి వెలిగించాను. బల్లమీదయాష్ట్రే లేదు. ఎక్కడుందో వెతకాలి. ఆరిపోయిన అగ్గిపుల్లను బల్లకింద పడేశాను. షాపు మురికిగా ఉంది. కుర్రాడు ఉండుంటే షాపును ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచేవాడు. నేను చేసుకోడానికి కుదరడం లేదు. మునుపటంత శక్తి ఉండడం లేదు. కనీసం పట్టుమని నాలుగు గంటల పాటు నిలకడగా కూర్చోలేకపోతున్నాను.

పాప ముఖంలోకి చూశాను. నేను సిగరెట్ తాగడం తనకు ఇష్టమో, కాదో తెలియడం లేదు. ఇంట్లో నేను సిగరెట్ తాగడం నా భార్యా పిల్లలకు ఇష్టం లేదు. తాగనీయరు. షాపుకు వచ్చిన దగ్గరనుండి ఇంటికి వెళ్లే వరకు కనీసం పేకట్ సిగరెట్లు తాగుతుంటాను. చేతిలో సిగరెట్ లేకపోతే నాకు కొత్త ఆలోచనలు రావు.

"నీ పేరు? " అడిగాను

"సలోమి"

"ఏం చదువుతున్నావు? "

చెప్పి, ఆ అమ్మాయి అసలు విషయానికి వచ్చింది.

"మా నాన్న పేరు రవి... రవివర్మ, ప్రయివేటు కంపెనీలో ఎయిర్ కండిషన్ల పనిచేస్తుంటాడు. ఆయన ఆఫీసు ఎక్కడో నాకు తెలియదు. ఆయనకు నేనొక్కదాన్నే కూతుర్ని.." అంటోంటే ఆ పాప గొంతులో మార్పు వచ్చింది. కళ్లల్లో నీళ్లు తిరుగుతున్నాయి. ఎడమ చేయి కదుపుతూ ఏదో చెప్పడానికి ప్రయత్నిస్తోంది. కానీ ఎలా చెప్పాలో అర్థం కావడం లేదనుకుంటాను.

సలోమి ఏం చెప్పబోతోందో నేను ఊహించలేకపోతున్నాను. అర నిమిషం ఆగి తనను తను కూడగట్టుకుని "ఒక ఫ్లెక్సీలో అయిదారు మాటలు రాయడానికి ఎంత అవుతుంది? " అడిగింది.

"ఫ్లెక్సీ ఎంతుండాలి? "

"మామూలు క్లాసు బ్లాక్ బోర్డులో సగం. లేదా మూడో వంతయినా చాలు... అందరికీ కనబడేలా..."

"కనీసం అయిదు వందలవుతుంది. ఫొటో కూడా వేయాలి కదా? "

"అంకుల్ అంతా..! తక్కువకు కాదా? " సలోమికి వచ్చినప్పటంత బెరుకులేదు. తగ్గింది.

సామాన్యంగా ఈ విషయాలు పెద్ద వాళ్లు వచ్చి మాట్లాడతారు. ఆ వయసు పాప రావడం అదే మొదటిసారి. పెద్దవాళ్లయితే ఏ మొహమాటం లేకుండా వీలు కాదనో, నాకు పడదనో చెప్పొచ్చు.

"మీ ఇంట్లోని పెద్దవాళ్లు ఎవరయినా వస్తే బావుండేది"

"ఎవరూ లేరు అంకుల్. మా అమ్మ అవిటిది. కష్టంమీద వాకర్ సహాయంతో నడుస్తుంటుంది. అయినా ఇంట్లో ఖాళీగా కూర్చోదు. కుట్టుమిషనుతో చుట్టుపక్కల వాళ్లకు ఏవయినా కుట్టిపెడుతుంది.. ఎవరైనా ఏమైనా ఇస్తే తీసుకుంటుంది. తను చాలా కష్టపడుతూ ఉంటుంది" అంటూ సలోమి దుఃఖం ఆపుకోలేకపోయింది.

రెండు నిముషాల తర్వాత "ఇవేల్టితో మా నాన్న చనిపోయి మూడోరోజు.. డబ్బులు లేక మా నాన్న ఫొటో పేపర్లలో వేయించలేదు. నాన్న స్నేహితులు, దగ్గర బంధువులు ఆదుకున్నారు. ప్రతిదీ వాళ్లనడగడం ఏం బావుంటుంది? " అని తన



చేతిలోని డబ్బాను బల్లమీద పెట్టి-

"ఇందులో నాన్న, అమ్మ ఇచ్చిన చిల్లర డబ్బులు దాచుకున్నాను. ఎంతుంటుందో నాకూ తెలియదు. లెక్కపెట్టలేదు. మీరు అడిగినదానికన్నా ఎక్కువ ఉండొచ్చు. తక్కువయినా ఉండొచ్చు..." అని చేతులు జోడించి నాకు నమస్కరిస్తూ "మేం ఉన్న వాళ్లమేమీ కాదు అంకుల్..." అని వెక్కి వెక్కి ఏడుస్తూ అంది.

ఆ అమ్మాయిని చూసి దుఃఖాన్ని ఆపుకోవడం కష్టమనిపించింది. సిగరెట్ తాగ బుద్ధి కాలేదు. కిటికీలోంచి విసిరేశాను.

"మీ నాన్న ఎలా చనిపోయారు? "

"ఉదయం నాన్న స్కూటరు మీద ఆఫీసుకు వెళ్తూ.. చనిపోయారు. ప్రతిరోజూ నన్ను స్కూలు దగ్గర దింపేసి వెళ్తుంటారు నాకు సెలవున్న రోజుల్లో తప్ప. నిన్న కాక మొన్న ఉదయం ఎనిమిదిన్నరకు ఈ వీధి చివరి మలుపులోనే.. కనబడుతుండే ఆ స్తంభం పక్కనే.. నాన్నదేం తప్పులేదు... ఆర్.టి.సి. బస్సు వేగంగా వచ్చి నాన్న స్కూటరును వెనక నుంచి గుద్దింది. నాన్నా! అని నేను పెద్దగా అరుస్తూనే ఉన్నాను. వెనక కూర్చున్న నేను ఎగిరి గోడ పక్కన పడ్డాను. నాన్న మీంచి బస్సు వెళ్లిపోయింది. నాన్న బతికి నేను చనిపోయుంటే ఎంత బావుండేది? నాకు దెబ్బలేం తగల్లేదు. బస్సు డ్రైవరు బస్సును

ముందుకు తీసుకెళ్లి ఆపి ఎవరయినా పట్టుకుని తంతారేమోనని భయంతో బస్సు దిగి కండక్టరుతో కలిసి పారిపోయాడు... నా కళ్ల ముందు.. అప్పటి వరకు నవ్వుతూ మాట్లాడిన నాన్న..." అని సలోమి భోరున ఏడుస్తోంటే ఆ అమ్మాయిని ఎలా ఓదార్చాలో అర్థం కావడం లేదు. రుమాలు తీసి సలోమికి అందించాను.

కొద్దిసేపాగి "ఫ్లెక్సీలో ఏం రాయమంటావు? " అడిగాను.

ఫ్రాకు జేబులోంచి మడతలు పెట్టి ఉన్న తెల్లకాగితం నాకు అందించింది. మధ్యలో సగం కార్డు సైజులో ఓ ఫొటో ఉంది. చూశాను. రవివర్మ చామనచాయలో అందంగానే ఉన్నాడు. ఫొటో వెనక పుట్టిన తేది, చనిపోయిన తేదీలు ఉన్నాయి. చనిపోయేనాటికి అతని వయస్సు ముప్పయి ఏడు సంవత్సరాలు. ఆ కాగితంలో చిన్న చిన్న అక్షరాలతో ఇలా ఉంది:

"నాన్నా! అమ్మా, నేనూ బాగున్నాం. మీరు దేవుడి దగ్గర క్షేమంగా ఉన్నారని అనుకుంటున్నాం. నేను ఎంత ఓదారుస్తున్నా అమ్మ ఒక్కటే ఏడుస్తోంది. భోజనం సరిగా చేయడం లేదు. నాన్నా! అమ్మను ఎప్పుడూ తొందరపెట్టను. ప్రామిస్. అమ్మ కాలు నయం చేయమని దేవుడికి చెప్పండి. ప్రేమతో మీ సలోమి"

ఆ ఉత్తరం తనే రాసిందో, ఎవరిచేతయినా రాయించిందో నాకు అడగాలనిపించలేదు. ఒకటికి రెండుసార్లు చదివాక షాపు వెనుకకు వచ్చి అయిదు నిమిషాల పాటు చిన్నపిల్లాడిలా గట్టిగా ఏడ్చేశాను.

తర్వాత పట్టుదలగా కూర్చుని ఏడుపును ఆపుకుని అట్టే సమయం తీసుకోకుండా ఫ్లెక్సీ తయారుచేసి మధ్యాహ్నం రెండు గంటలు దాటాక రవివర్మ ప్రమాదానికి లోనయిన ప్రదేశంలో, దారి పక్కనే ప్రహరీగోడకు దగ్గరగా రెండు కర్రలు పాతి నిలబెట్టాం. అక్కడి ఇద్దరు ముగ్గురు పిల్లలు కూడా మాకు సహాయం చేశారు. నేను ఊహించిన దానికన్నా ఆ ఫ్లెక్సీ బాగా వచ్చింది. పని అయిపోగానే సలోమి ఫ్లెక్సీ ముందు మోకాళ్ల మీద కూర్చుని చేతులు జోడించి కన్నీళ్లతో ప్రార్థన చేసుకుని, తను కొనుక్కొచ్చిన కొవొత్తుల్లో తనొకటి వెలిగించి నాకొకటిచ్చి వెలిగించమంది. ఒక ఆత్మ కోసం అంత మంచిపని చేయడం నా జీవితంలో అదే మొదటిసారి. నా మనసు తేలికయినట్టు అనిపించింది.

ఆశ్చర్యకరమయిన విషయం ఏమిటంటే అరగంట తర్వాత మేం పెట్టిన కొవ్వొత్తుల చుట్టూ ఎవరెవరో ఇరవైకి పైగా కొవొత్తులు వెలిగించారు. తర్వాత నాకు సలోమి కనిపించలేదు. ఇంటికి వెళ్లి తన తల్లిని తీసుకొస్తుందేమో! అనుకున్నాను. ఆ మాట నాతో చెప్పి ఉంటే బావుండేది. డబ్బుల డబ్బా బల్లమీదే ఉంది. గంటలు గడిచాయి. సాయంత్రం అయింది. మరుసటి రోజు గడిచింది. సలోమి రాలేదు. ఎంతో మంది వచ్చి కొవొత్తులు పెట్టి నివాళులు అర్పిస్తున్నారు. అప్పుడప్పుడు ఆర్.టి.సి. బస్సు డ్రైవర్లు బస్సులు ఆపి కొవొత్తులు వెలిగిస్తున్నారు. వాళ్లలా చేస్తున్నప్పుడు నాకు సంతోషంగా ఉండేది.

నాకు ఇప్పటికీ ఆశ్చర్యం, బాధ కలిగించే విషయాలు ఏమిటంటే సలోమి ఇల్లు ఎంత ప్రయత్నించినా దొరకలేదు. మా చుట్టు పక్కల ఉన్న ప్రతి స్కూలులో వెతికాను. అటువంటి పేరుగల అమ్మాయి లేదని చెబుతున్నారు. డబ్బుల డబ్బా ఇప్పటికీ నా బల్లమీదే ఉంది. నేను భయపడేది ఒకటే. సలోమికి ఏమైనా అయిందా? ప్రతి ఉదయం నా షాపు షట్టర్ తీసేటప్పుడు నా వెనకే ఎవరో నుంచున్నట్టు అనిపిస్తుంటుంది. ఆగి చూస్తే ఎవరూ కనిపించరు. చల్లటి గాలి నా మీద కుమ్మరించినట్టుంటుంది. మరి ఏమిటో ఈ వింత... Ⓥ

సంస్కృత కథ

- సరోజ ధన్‌పాల్ చౌగ్‌లే



పొద్దున్నే ఇంట్లో పనులన్ని త్వరగా పూర్తిచేసుకోవాలి. తొమ్మిది గంటలకల్లా అబ్బాయి ఆఫీసుకు వెళతాడు. తొమ్మిది గంటల పదిహేను నిమిషాల కల్లా మనుమడు వాడి ఇంగ్లీషు మీడియం స్కూలుకి వెళ్ళాలి. కోడలు కూడా టీచరు కాబట్టి 10 గంటలకల్లా పాఠశాలకు వెళ్ళాలి. ఇవన్నీ సకాలంలో అందరికీ అందాలంటే పాపం కోడలికి చాలా కష్టంగా ఉంది. కోడలి అవస్థ, తొందర చూసి మామగారికి మనసులో జాలేసింది.

అందుకే యథాశక్తి తాను కూడా కోడలికి సహాయ పడాలి అనుకొని వంటింట్లోకి నడిచాడు. కాని ఆయన వంటింట్లోకి అడుగు పెట్టగానే కోడలు పెద్ద గొంతుకతో అరచినట్లుగా "ఏం కావాలి మీకు! అయిదు నిమిషాల ముందే టీ ఇచ్చాను కదా ఇలా మాటిమాటికి వంటింట్లోకి రాకండి, అదే మంచిది" అంది.

"అయ్యో! టీ కోసం కాదు, నీకే ఏదైనా సహాయం చేద్దామని వచ్చా" అతడి మాట పూర్తయ్యేలోపే "హాc! మీ సాయం నాకక్కర్లేదు కానీ, మీరు వచ్చి నా పనులు పాడుచేయకపోతే అదే పదివేలు. వాటిని మళ్ళీ సరిదిద్దుకోలేక ఇంతకింత శ్రమ పడాల్సి వస్తుంది" అని రుసరుసలాడిందా కోడలు.

"అది కాదు బిడ్డా" అని ఆయన ఏదో చెప్పేంతలోనే- "ఇక చాలు అదికాదు.. ఇదికాదు.. అని నసగకుండా బయటకు పోయి ప్రశాంతంగా డ్రాయింగ్‌రూంలో కూర్చోండి ఇవ్వాళ కొత్తగా ఏముంది" అంది వెటకారంగా.

"కాదమ్మా ఎందుకు పాడుచేస్తా? వంట చేయడంలో నాకు కూడా అనుభవం ఉంది కదా! అందుకే నీకు సాయపడి కొంత శ్రమ తగ్గిద్దామని వచ్చాను" సంజాయిషీగా అన్నాడు.

"నాకిష్టం లేదు. మీ సహాయం కొంచెం కూడా అక్కర్లేదు. వంటింట్లోకి మగవాళ్ళు రావడం నాకస్సలు ఇష్టముండదు" అని నిష్కర్షగా పలికి తన పని తాను చేసుకోసాగింది.

పాపం మామగారు అప్పటికి ఎక్కువ మాట్లాడం ఎందుకని నిట్టూరుస్తూ బయటకు వచ్చాడు. మధ్య గదిలోకి వచ్చి తూగుటుయ్యాల బల్ల మీద కూర్చొని మనస్సులోని ఆందోళనలతో సమానమైన వేగంతో ఊగసాగాడు.

తన ఇంటిలోనే తన మంచితనానికి ఈ విధంగా అవమానం జరుగుతున్నది. ఇలాంటి సంఘటనలే పునరావృతమవుతున్నాయి. ఇటువంటి మాటలే తాను మళ్ళీ, మళ్ళీ వినాల్సి వస్తుంది. తన బాధను ఎవరితో చెప్పుకోగలడు? కోడలిని ఏమైనా అంటే కొడుక్కి కోపం వస్తుంది.

"ఏమండీ వంటింట్లోకి మీరు వెళ్లడం కోడలి కోపానికి కారణమౌతుందని తెలుసుకోండి" అన్న భార్య మధురమ్మ మాటలు గుర్తుకు వచ్చాయి. అతడు నెమ్మ



దిగా భార్య గురించిన ఆలోచనల్లో ముని గిపోయాడు. ‘ఆమె ఎంత స్నేహంగా ప్రేమగా ఉండేది. తన ప్రతి పనిని ఎంతో ప్రేమతో చేసేది. అన్ని రకాలుగా తన బాగోగులు చూసుకునేది. కాని జీవితం లో మధ్యలోనే తన పాత్ర ముగించుకొని తన తోవలో తాను వెళ్ళిపోయింది’ అనుకున్నాడు. ఆయన జీవితం మధురమ్మ అకాల మరణంతో ఇటువంటి దీనావస్థకు గురి అయింది.

'ఇప్పుడు మధుర ఏ లోకంలో ఉందో? ! నా దీనావస్థను చూసే స్థితి ఉందా? ఆమె యుక్తవయస్కురాలైనప్పటి నుండి సంపూర్ణంగా తనతో గడిపిన జీవితకాలమంతా తీపిజ్ఞాపకాలతో కూడుకున్నదే. కాని ఈ జీవన సంధ్యలో ముసలితనాన్ని ఎలా అనుభవించాలి? ఏ తోవ కనిపించడం లేదు. ఏం చేయాలో అర్థం కావడం లేదు' అని తనలో తానే సంభాషించుకోసాగాడు.

ఇంతలో కడుపులో ఆకలి బాధ కూడా ఎక్కువయింది. వంటింట్లో నుండి వంట అయిపోయిన వాసన వస్తోంది. అది తల చుకోగానే ఆకలిబాధ మరింత ఎక్కువైంది. వంటింట్లోకెళ్ళి తానే వడ్డించుకొని సుష్టుగా తినాలి అని కూడా ఆలోచించాడు కానీ ఇంతకు ముందే కోడలి రుసరుసల రుచి చూసి ఉన్నాడు గనుక అది తలచుకోగానే

అనువాదం :
డా. డింగరి నరహరి ఆచార్య

అతనిలో నీరసం ఆవహించింది. లోలోపలే బాధపడుతూ ఏం చేయలేక అక్కడే కూచుండిపోయాడు.

మళ్ళీ ఆలోచనలో పడ్డాడు. శ్రీధర్‌కి నాలుగేళ్ళున్నప్పుడే మధుర స్వర్గస్థురాలైంది. అప్పటినుండి వంట చేయడం మొదలుపెట్టాడు. మొదట్లో అన్నీ కారంగానూ, ఉప్పగానూ, ఉడికీ ఉడకకనో అయ్యేవి కాని రాను రాను పాకకళా ప్రవీణుడయ్యాడు. పూరీలు, చపాతీలు, పాయసం, పులిహోర లాంటి వివిధ రకాల వంటలు చాలా నేర్పుగా చేయడం నేర్చాడు. కొడుకు శ్రీధర్‌ని కూడా చాలా శ్రద్ధగా నేర్పుగా సాది అభివృద్ధిలోకి తెచ్చాడు. కానీ ఇప్పుడు కోడలు రాగానే వంటింటి అధికారం చేపట్టింది. అటువైపు తన ప్రవేశాన్నే దాదాపు నిషేధించింది. పాపం ఆయనకి ఉన్న వయసు కన్నా పదేళ్ళ వయస్సు ఎక్కువైనంత బాధ కలిగింది. మనస్సులోనే బాధపడుతూ మోకాళ్ళ మధ్య తల ఇరికించుకొని మౌనంగా మథనపడసాగాడు.

చెప్పాలంటే ముందునుంచీ ఎందుకో ఆయన జీవితమంతా దయనీయంగా, వివర్ణంగా గడిచింది. ఆయన బాల్యంలోనే తల్లిదండ్రులను పోగొట్టుకొని వారి వాత్సల్యానికి నోచుకోలేకపోయాడు. అనాథగా బంధువుల దయాదాక్షిణ్యాల మీదనే గడుపుతూ వచ్చాడు. అందుకే దీనంగా, దుఃఖమయంగా, దరిద్రంగా నిరాసక్తంగా గడిచింది. కానీ ఇంత దయనీయమైన ఆయన జీవితం ఎప్పుడైతే మధురమ్మతో ముడిపడిందో అప్పటి నుండి రంగులమయంగా, ఆనందంగా, సుఖంగా మారిపోయింది. మధురమ్మ అడుగుల చప్పుళ్ళ లయబద్ధమైన మధుర నాదాలతో జీవితం హాయిగా సాగిపోయింది. అందుకే ఆమెను తన ఆరోప్రాణంగా చూసుకున్నాడు.

కొద్ది కాలానికే వారి కుటుంబ జీవన సాఫల్యంగా మధురమ్మ శ్రీధరునికి జన్మనిచ్చింది. వారి ఆనందానికి అవధిలేదు. జీవితం అత్యానందంతో నిండుగా కనిపించి... కొడుకును సాకడంలో, వాడి అభివృద్ధి ఆలోచనలతో భార్యతో సహా ఆనందాన్ననుభవించాడు. శ్రీధర్ బాల్య చేష్టలను దినమంతా చూస్తూ గడపడంలో తృప్తిపడ్డాడు. ఎప్పుడైతే మనిషి సుఖాల తీరం చేరినట్టుగా, ఉన్నత శిఖరాల నధిరోహించినట్లుగా భావిస్తాడో అప్పుడే దిగిపోవడం కూడా ప్రారంభమవుతుంది. అది దుఃఖానికి హేతువవుతుంది.

ఉత్సాహంగా సంతోషంగా గడుస్తున్న ఆ సంసార క్రీడ మధ్యలో మధురమ్మ అలసినట్లుగా శాశ్వత విశ్రాంతికన్నట్లుగా ఈ లోకం వదిలి వెళ్ళిపోయింది. తప్పని స్థితిలో భార్య మరణాన్ని విధిలేక విషం

లాగ దిగమింగాల్సి వచ్చింది. ఎంతమంది ఓదార్చినా ఆయన దుఃఖం శాంతించలేదు. కాని మధురమ్మ ప్రతిరూపమైన శ్రీధర్ తండ్రి మెడలో చేతులు వేసి కౌగలించు కొని ఆయన కళ్లు తుడుస్తూ "నాన్నా ఏడవకండి, మీరేడిస్తే నాకూ ఏడుపొస్తుంది! నాకు అమ్మ బాగా జ్ఞాపకం వస్తుంది" అన్న మాటలతో ఆ క్షణం నుండే తన దుఃఖాన్ని దిగమింగుకొని పిల్ల వాడిని చూసుకోవాలని గంభీరంగా వాడిని దగ్గరకు తీసుకున్నాడు. ఏడవకూడదని మనస్సులో నిశ్చయించుకొన్నాడు. తల్లి, తండ్రి తానే అయి కష్టపడి సాదుకోవాలని దృఢ సంకల్పానికి వచ్చాడు.

అనుకోనైతే అనుకున్నాడు కాని అనుకున్నంత తేలికేం కాదు. ఆ రెండు పాత్రలూ పోషించడం ఎంతో కష్టం. ఏ తండ్రైనా తండ్రిగా పిల్లలను ఆదరించగలడేమో కానీ తల్లిగా పనులు నిర్వహించడం అనేది కఠినపరీక్షే. కాని ఆ పరీక్షలో కూడా ఆయనే నెగ్గాడు. వాడికి సవతి తల్లి కష్టాలు తేవద్దనుకున్నాడు. రెండోపెళ్ళి చేసుకోకుండా ఉండిపోయాడు. తానే అన్ని అయి ఎన్ని కష్టాలైనా ఎదుర్కొన్నాడు. కొడుకు తిండి సుఖాన్ననుభవించాలని.. వాడికి అన్నీ చేసిపెట్టాలని కష్టపడి వంటలన్ని నేర్చుకోవడమే కాక రుచిగా కూడా చేయడం నేర్చుకున్నాడు. శ్రీధర్ కూడా తండ్రి అంటే అతి ప్రేమగా ఉండేవాడు. దానివల్ల సుఖ పడాల్సిన ఆయనకు ఆ రోజులు అలా కష్టాలతో గడిచిపోయాయి.

అతడి కష్టాలకు ప్రతిఫలంగా కొడుకు ప్రయోజకుడయ్యాడు. ఇరవై ఎనిమిదేళ్ల శ్రీధర్ ఉత్తమపౌరునిగా, పదిమందికి సాయపడే మంచివాడన్న పేరు తెచ్చుకొన్నాడు. అందుకే కొడుకు గురించి విన్నప్పుడు ఆయన కష్టాన్ని మరిచి ఆనంద బాష్పాలు రాలుస్తాడు. అదృష్టం కొద్దీ మంచి ఉద్యోగం కూడా దొరికింది. అందుకే అమ్మాయిల తండ్రుల చూపు అతనిపై పడింది. వాళ్ళలో ఒక అందమైన అమ్మాయిని చూసి ఇష్టపడటంతో పెళ్ళి కూడా చేశాడు. కాని... ఈ 'కాని' అనే పదం ఎవరి జీవితంలో రాదో వాళ్ళ జీవితాల్లో దుఃఖమనేదే ఉండదు. అయితే మనిషి ఏది రావద్దనుకుంటాడో అదే అతని ముందుకు వచ్చి కూర్చుంటుంది.

కాలం గడిచి ఉద్యోగ విరమణ చేశాడు. ఇక ఏ పనీలేదు అతడికి రోజులన్నీ ఎలా గడపాలో అర్థం కావడం లేదు. ఆయనకు ఎక్కువగా కలిగే చింత ఒకటే.. పూర్వం పొద్దుటి నుండి సాయంకాలం దాకా ఉద్యోగమే కాకుండా ఇంట్లో వంట దగ్గర నుండి ఇంటికవసరమైన సరుకులు కొనుక్కురా



వడం వరకూ అన్ని పనులతో కాలం గడ చిపోయేది.

మరి ఇప్పుడో! వంటిల్లు కోడలు స్వాధీనమయిపోయింది. కొడుకు ఉద్యోగ బాధ్యతల్లో మునిగి తేలుతుంటాడు. మనుమడితో ఆడుకునే ఆస్కారం కొంచెం కూడా లేకుండా పోయింది. ఎందుకంటే పొద్దున్నే వాడు అన్ని సబ్జెక్టుల కోసం ట్యూషన్‌కి వెళతాడు. అటునుంచి బడికి వెళ్లి, సాయంకాలం రాగానే టీవీ ముందు కూర్చుంటాడు. ఇక తాతయ్య చెప్పే కథలు వాడెక్కడ వింటాడు. ఆ విధంగా మెల్లమెల్లగా ఆయన అన్ని పనులకూ, అందరికీ దూరమవసాగాడు. దాంతో ఆయనలో ఏదో విరక్తి ప్రవేశించసాగింది.

అన్నిటినుండి విరక్తుడైనా కానీ అతని మనస్సు మాత్రం వంటిల్లంటే విరక్తిని చూపలేకపోతోంది. అంతేకాదు స్వయంగా రుచిగా చేసుకున్న మనిషి కనుక కోడలు వండిపెట్టే ఆ వంటలు కొద్దిగా కూడా మనస్సుకు రుచించే విధంగా ఉండడం లేదు. కొనుక్కొచ్చిన ఆహార పదార్థాలు ఆయనకు నచ్చవు. అందువల్లనే తృప్తిగా తిన్నట్లుండడం లేదు. ఎంత ఆకలేస్తున్నా తిండి తినాలన్న అపేక్ష తగ్గుతూ వస్తోంది. ఏదో కష్టంగా నాలుగు మెతుకులు బలవంతంగా నోట్లో పెట్టుకుని సగం ఆకలితోనే లేస్తున్నాడు. అది కోడలికి నచ్చకపోవడమేకాక ఆమెకు కోపం కూడా తెప్పిస్తుంది. "కరువు దినాల్లో ఇట్లా అన్నాన్ని వదిలేయడం మంచిదికాదు వూరికే రావడం లేదు ఎంతో కష్టపడితే దొరుకుతున్నది" అని ఆమె అనే మాటలు ఆయనను మరింత బాధపెడుతున్నాయి.

ఇవన్నీ కొడుక్కి చెప్పి కోడలు మీద పెత్తనం చేయాలన్నది కూడా ఆయనకు నచ్చనిది. కొడుకు కూడా "నాన్నా ఇప్పటి దాకా నాకోసం ఏళ్లుగా వండిపెట్టారు కదా ఎంతో కష్టపడ్డారు! మళ్ళీ వంటింట్లోకి ఎందుకు వెళతారు? మంచిగా హాయిగా కోడలు వండి పెడుతున్న వేడి పదార్థాలు తినక! మిగిలిన జీవితాన్ని సుఖంగా శాంతంగా ఆనందంగా గడపండి. విశ్రాంతి తీసుకోండి" అని అననే అన్నాడు.

అదే అతడిని బాధించేది. వంటింటికి దూరం చేయడంతో అతనికి తాను అనాథ అయినట్లు భావించాడు. ఆ విషయం అత డిని బాగా బాధించసాగింది. 'ఏం చేయాలి? కోడలు తన వంటింటిని ఆక్ర మించి, అందులో తనకు ప్రవేశం లేకుండా నిరోధిస్తుందని ఇతరులకు ఎలా చెప్పుకో వాలి? చెప్పుకోరానిది కూడా. అందుకే ఆయన మనసులోనే దుఃఖపడుతూ మౌన వేదన అనుభవిస్తున్నాడు.

మాట్లాడకుండా మౌనంగా ఉన్న ఆయ నను చూసి కొడుకూ కోడలూ నిశ్చింతగా ఉన్నారు తమనర్థం చేసుకున్నాడని. కాని ఆయన తన అభిలాషను వ్యక్తం చేయలేక బలవంతంగా అణచుకుని తననుండి ఏదో దూరమైనట్లుగా బాధపడుతూ దినదినం కృశించిపోతూ దుర్బలుడౌతున్నాడు. ఈ రోజు 'అవిధవా నవమి' అనగా భర్త ఉండగా చనిపోయిన భార్యలకు పూజచేసే దినం. అందుకే అతగాడు చాలా పొద్దు న్నే లేచాడు. గబగబా స్నానాదికాలు పూర్తి చేసుకొని పూజా కార్యక్రమాన్ని కూడా పూర్తికావించి ఉతికిన ధోవతి కట్టుకొని శుచిగా ప్రసాదం వండటం మొదలు పెట్టాడు. పూర్వం ప్రతి సంవత్సరం మధు రమ్మకు ఇష్టమైన వంటకాలను రకరకా లుగా చేసి నైవేద్యంగా పెట్టేవాడు. ఎప్పు డైతే కోడలు వచ్చిందో ఆమే ఈ పనిచేసి పెడ్తున్నది. కాని ఆమెకు ఆ పదార్థాలు చేయడంలో ఏ మాత్రం ప్రేమకాని, శ్రద్ధ కాని లేదు. ఏదో మొక్కుబడిగా చేయక తప్పదన్నట్లుగా తన ఇష్టం వచ్చింది వండి పెడుతోంది.

అందుకే ఈరోజు అతగాడు దృఢ నిశ్చ యానికి వచ్చాడు 'ఏమైనాకాని ఏ పరిణా మమైనా లెక్కచెయ్యదలచుకోలేదు స్వహ స్తాలతో అన్నీ వంటలు చేసి మధురకు నైవేద్యం పెట్టాలి' అనుకున్నాడు. అటు తర్వాత తాను కూడా తృప్తిగా భోంచేయా లనుకున్నాడు. అందుకే కోడలు లేవక ముందే వంట అంతా పూర్తి కావాలనుకొని పొద్దున్నేలేచి వంట ప్రారంభించి ఆరు గంటలకల్లా అన్నీ సిద్ధం చేశాడు.

ఒక పెద్ద పళ్ళెంలో పదార్థాలన్నీ సర్ది ఒక్కసారి తృప్తిగా చూసుకొన్నాడు. దేవుడి గదిలో ఆమె పటం ముందు వాటిని ఉంచాడు. ఆమె పటాన్ని శుభ్రంగా తుడిచి కుంకుమబొట్టు తీర్చిదిద్ది ఒక నూతన వస్త్రం చుట్టి మల్లెపూల దండ ఒకటి జడలో పెట్టినట్టు దానికి వేసి ఒక పీట మీద దాన్నుంచి ఎదురుగా నైవేద్యం పెట్టాడు. అంతకు ముందే ఆచోట ముగ్గు కూడా వేశాడు. అగరువత్తులు వెలిగిం చాడు. ప్రశాంత సౌమ్యమైన మనస్సుతో నీరాజనం సమర్పించాడు. ఇప్పుడాయన మనస్సు నిండా తృప్తి ఆనందం నిండి పోయింది. నైవేద్యం మీద నీళ్ళు ప్రోక్షించి ఎదురుగా తాను ఒక పీటమీద పద్మాసనం వేసుకొని కూర్చుండి ధ్యానం చేయసా గాడు. మనసులోనే మధురమ్మతో మాట్లాడసాగాడు.

"ప్రియమైన మధురా ఇది నాచేతులతో స్వయంగా అర్పిస్తున్న అంతిమ నైవేద్యం. నువ్వు లేకుండా ఈ జీవితంలో చాలా ఏళ్ళు గడిపాను. ఇవ్వాళ నా ఇంట్లోనే నే నొక కొత్త మనిషిలా ఉండాల్సి వస్తోంది. ఇందులో తప్పొప్పుల ప్రసక్తిలేదు. నా మ నసెందుకో సహించలేకపోతోంది. నీకే కా దు, నాకూ ఇది చివరి భోజనం కావాలని కోరుకుంటున్నాను, వింటున్నావా మధురా! త్వరగా నీదగ్గరికి రావాలనిపిస్తోంది"

ఆయనకు కన్నీళ్ళు ధారగా కారుతు న్నాయి. దేహమంతా కంపించిపోతోంది. మధురమ్మ ఫోటో ముందు తలవాలిపో యింది. భోజనం చేయకముందే స్వర్గస్థుడ య్యాడు. అతడ్ని స్వతంత్రుడిని చేస్తూ మృత్యువు ఆక్రమించింది. తాను కోరుకు న్నట్టుగానే అతడు ముక్తుడయ్యాడు. V



జర్మనీ కథ

అమ్మాయి మనసు

- నికోల్ డి బర్గన్

కథలోకి వెళ్ళే ముందు రచయితగా ఓ మాట. ఇది మీరు జర్మన్ భాషలో చదువుతున్నారు. కారణం నేను దీన్ని జర్మన్ భాషలో రాసాను. ఇందులోని అమ్మాయి పాత్ర భావాలతో మీరు తప్పక ఏకీభవిస్తారు. అందుకు కారణం దీన్ని రాసిన

నేను, చదివిన మీరు జర్మన్స్ అవటం వల్ల కాదు. నేను దీన్ని టర్కిష్ భాషలోకి రాసి, అది జర్మన్ భాషలోకి అనువదింపబడితే, అప్పుడు ఈ కథని మీరు చదివినా ఆ పాత్ర భావాలతో ఏకీభవిస్తారు. లేదా రష్యన్, ఇటాలియన్, నార్వేజియన్, చైనీస్... ప్రపంచంలోని ఏ ప్రాంతానికి చెందిన భాషలో ఈ కథ రాసినా, దాన్ని ప్రపంచంలోని మరే భాషలోకి అనువదించినా ఈ కథని చదివేవారు ఈ కథలోని అమ్మాయి భావాలతో ఏకీభవిస్తారు. కారణం ఆ భావాలు భాష లేదా దేశం లేదా సంస్కృతి అనే ఎల్లలకి పరిమితమైనవి కావు. ప్రేమ విశ్వజనీనం. అందుకే స్పందన ఒకేలా ఉంటుంది. ఇక చదవండి.

అనువాదం :
మల్లాది వెంకటకృష్ణమూర్తి

ఇది 16 ఏళ్ళ ఓ అమ్మాయి డైరీలోని ఓ పేజీ.

5-01 పి. యం.

అతను నాకు ఫోన్ చేస్తానని చెప్పిన సమయం దాటి ఓ నిమిషం అయింది. తను ఫోన్ చేస్తానని చెప్పాడు. మరి ఎందుకు చెయ్యలేదు?

సహనంగా ఉండు ఫోన్ చేస్తాడు. తప్పక ఫోన్ చేస్తాడు.

అతను మంచివాడు అని నా అంతరాత్మ చెబుతోంది.

5-05 పి. యం.

ఇంకా ఫోన్ రాలేదు. ఫోన్ చేస్తానని చెప్పాడు. అతను మంచివాడు.

5-11 పి. యం.

బహుశా అతను మంచివాడుగా కనపడేవాడు మాత్రమేనేమో? లేదు. ఫోన్ చేస్తాడు. ఓ అబ్బాయి మంచివాడుగా నటిస్తూంటే నేను తప్పక గ్రహించగలను.

5-17 పి. యం.

బహుశా ఇంకో రెండు, మూడు నిమిషాలాగి ఫోన్ చేస్తాడు. చెప్పిన టైంకి ఫోన్ చేస్తే తను నాతో మాట్లాడాలని తహతహలాడుతున్నాడని నేను అనుకుంటానని భావించి ఉంటాడు. అబ్బాయిల్లో అహం ఉంటుందా?

5-30 పి. యం.

ఇంతదాకా అతను నాకు ఫోన్ చేయకపోవడానికి కారణాలు...

1) అతని ఇల్లు తగలబడుతోందా?

2) అతని తల్లితండ్రులు అతనికి ఫోన్ ఉపయోగించకూడదని నిబంధనని విధించారా?

3) ఇవాళే అతని జ్ఞానదంతాన్ని పంటి డాక్టర్ తీసేసాడా?

4) అతని ఇంటి ప్రాంతంలోని ఫోన్స్ అన్నీ పాడయ్యాయా?

5) నా నెంబర్ పోగొట్టుకున్నాడా?

6) నేనంటే ఇష్టంలేదా?

7) కుక్కని వాకింగ్‌కి తీసుకెళ్తే మీద పిడుగు పడిందా?

5-32 పి. యం.

బహుశా అతనికి నేను నచ్చి ఉండను. అంతేకాదు అతను మరో అమ్మాయితో డేటింగ్‌లో ఉన్నాడేమో...

5-34 పి. యం.

అతను ఫోన్ చేయకపోతే నాకేంటి?

5-36 పి. యం.

(గణ గణ)

ఓ మై గోష్! ఫోన్ మోగుతోంది.

(గణ గణ)

(గణ గణ)

రిసీవర్ని ఎత్తాలా? ఎత్తాలి. చెప్పిన సమాయానికి ఫోన్ చేయలేక పోయినందుకు క్షమాపణని చెప్తూ జ్ఞానదంతాన్ని తీయించుకుని రావడం వల్ల ఆలస్యం అయిందని చెప్తాడేమో..

తన తల్లితండ్రులు ఫోన్‌ని ఉపయోగించవద్దనే నిబంధనని విధించడంతో తన మిత్రుడి ఇంటికి రహస్యంగా వెళ్ళి ఫోన్ చేస్తున్నాడేమో.. కానీ తన మిత్రుడి ఇంటికి వెళ్ళేసరికి అక్కడి ఫోన్స్ పనిచేయడంలేదు. వాటిని బాగు చేసాక తన వెంట నా ఫోన్ నంబర్ కాగితాన్ని తీసుకురావడం మరిచాడని గ్రహించాడు. థాంక్ గాడ్.

కుక్కని వాకింగ్‌కి తీసుకెళ్ళిన అతని మీద పిడుగు పడలేదు. అతని ఇల్లు తగలబడనందుకు కూడా..

(గణ గణ)

ఆరోసారి మోగాక ఎత్తుతాను. అందువల్ల నేను అతని ఫోన్ కాల్ కోసం ఫోన్ పక్కనే కూర్చుని వేచి ఉన్నానని అతనికి తెలీదు.

ఐదు... ఆరు...

"హలో? "

"హాయ్! మార్క్‌ని"

"మార్క్? "

"మార్క్ బారెస్. ట్రై సిటీ ఆల్ స్కూల్స్ ఫెయిర్‌లో నిన్న మనం కలిసాం. నువ్వు నాకు నీ నంబర్ ఇచ్చావు. ఈ సాయంత్రం ఫోన్ చేస్తానని చెప్పాను"

"ఓ! అవును. మార్క్ ఎలాఉన్నావు? "

"బావున్నాను. నువ్వెలా ఉన్నావు? "

"బావున్నాను"

"సారీ, నేను కొద్దిగా ఆలస్యంగా ఫోన్ చేస్తున్నాను. నేను నా కుక్కని వాకింగ్‌కి తీసుకెళ్ళాను"

"నా ఊహ కరెక్టే"

"సారీ? "

"ఏం లేదు"

"నేను ఆలస్యంగా ఫోన్ చేసినందుకు కోపం వచ్చిందా? "

"నిజానికి నువ్వు ఫోన్ చేస్తావన్న సంగతే మర్చిపోయాను"

మార్క్ ఆలోచనలు

'నేను ఫోన్ చేయకుండా ఉండాల్సింది. ఆమె నాతో బయటికి వెళ్ళే విషయంలో మనసు మార్చుకున్నట్లుంది. బహుశా నేను అందగాడ్ని కానని ఆమె భావిస్తూండి ఉండవచ్చు. లేదా ఆమెకి ఇప్పటికే ఓ బాయ్ ఫ్రెండ్ ఉండవచ్చు'

"బై"

"బై"

ఆమె ఆలోచనలు

అతని ఇంటి మీద పిడుగుపడి కాలితే బాగుండును. V

తెలుగు కథ

- కందిమళ్ళ ప్రతాపరెడ్డి

అనాథాశ్రమం

తెల్లవారింది. సూర్యకిరణాలు ఇంకా వేడెక్కలేదు. చల్లని గాలి వీస్తున్నది. హైదరాబాదు మహాత్మాగాంధీ బస్సు స్టేషన్ వచ్చీపోయే జనంతో సందడిగా వుంది. ప్లాట్ ఫారాల దగ్గర బస్సులు వరుసగా వున్నాయి. ప్లాట్ ఫారం నెంబరు, వెళ్ళే ప్రదేశం పేర్లతో బోర్డులున్నాయి.

రాఘవరెడ్డి దేవరకొండ వైపు వెళ్ళే ప్లాట్ ఫారం దగ్గరకెళ్ళాడు. అక్కడ ఒక దాని వెనకాల ఒకటి మూడు బస్సులున్నాయ్. ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్, హైటెక్ అని. పది, పదిహేను నిమిషాల తేడాతో మూడూ బయల్దేరబోతున్నాయి.

రాఘవరెడ్డి ఎక్స్‌ప్రెస్ బస్సులో ఎక్కి కిటికీ పక్కన కూర్చున్నాడు. ఐదునిమిషాల్లో బస్సు ప్రయాణికులతో నిండిపోయింది. బస్సు కదిలింది. రాఘవరెడ్డికి గతం కళ్ళముందు తిరిగింది.

ఒకప్పుడు తన ఊరికి పోవాలంటే రోజంతా పట్టేది. ఆ ఊరు హైదరాబాదు దారిలో దేవరకొండకి యాభై కిలోమీటర్ల దూరంలో వుంది. రహదారికి నాలుగు కిలోమీటర్ల దూరంలో గుట్టలు, చెట్ల మధ్య వుంది. ఊళ్ళో నుండి దండుబాట వరకు ఎడ్లబండిలో లేక కాలినడకన రావల్సి వచ్చేది. వర్షం పడ్డప్పుడు దారంతా బురదయ్యేది. ఎడ్లబండ్లు కూడా ఊళ్ళో నుండి వెళ్ళేవి కావు. పిల్లబాటన, కాలినడకన వెళ్ళవలసి వచ్చేది. అక్కడ ఊరు లేదు. నిలవడానికి బస్టాండు లేదు. చెట్టునీడన వచ్చీపోయే బస్సుల కోసం ప్రయాణీకులు గంటల తరబడి నిరీక్షించేవాళ్ళు. బస్సు ఎప్పుడొస్తుందో తెలిసేది కాదు. రోజుకు రెండు, మూడు ఎర్రబస్సులుండేవి. అవి ఎప్పుడూ ప్రయాణీకులతో కిక్కిరిసి వచ్చేవి. ఖాళీలేదని బస్సు ఆపకుండానే వెళ్ళిపోయేది. రోజంతా బస్సుకోసం చూసి, చూసి ఇంటికి తిరిగొచ్చేవాళ్ళు.

ఇప్పుడు ఊళ్ళోకి తారు రోడ్డు వున్నది. గంటకో బస్సు వచ్చిపోతున్నది. రాఘవరెడ్డి తండ్రి వీరారెడ్డి ఊళ్ళో పెద్ద భూస్వామి. ఊరికి పోలీసు పటేల్ గా పని చేశాడు. వంద ఎకరాల చెలక భూమి. అందులో మామిడి, జామ, నిమ్మచెట్లు వుండేవి. మిగతా భూమిలో రకరకాల పంటలు పండించేవాళ్ళు. పదెకరాల మాగాణి చెరువు కింద వుండేది. పుట్ల ధాన్యం గరిసెల్లో వుండేది. పది అరకల వ్యవసాయం. దొడ్డినిండా ఆవులు, బర్రెలుండేవి. రెండు వందల జీవాల (గొర్రెల) మంద వుండేది. జీతగాళ్ళు, పనోళ్ళు ఎంతో మందుండేవాళ్ళు. ప్రయాణానికి కచ్చడం బండి, పెద్ద గుర్రం, సైకిల్ వుండేవి.

వీరారెడ్డి కొడుకును బాగా చదివించాలని హైదరాబాద్ స్కూల్లో చేర్పించాడు. రాఘవరెడ్డి హైస్కూల్లో చదువుతున్నప్పుడు ఆకస్మికంగా తండ్రి చనిపోయాడు. గుండెపోటు వస్తే కచ్చడం బండిలో హైదరాబాదుకు తీసుకెళుతుండగా దారిలోనే

కన్నుమూశాడు. తండ్రి మరణంతో రాఘవరెడ్డి చదువు ఆగిపోయింది. ఊరికి చేరి వ్యవసాయం చూసుకున్నాడు. తండ్రి మరణం మరచిపోకముందే, తల్లి క్షయరోగంతో మంచంబట్టి కొద్దిరోజులకు చనిపోయింది. తల్లీతండ్రీ మరణం మానసికంగా అతన్నెంతో కృంగదీసింది. చిన్నవయస్సులోనే బరువు, బాధ్యతలు మీదబడ్డాయి.

మేనమామ కూతురు జానకమ్మతో రాఘవరెడ్డి పెళ్ళి జరిగింది.

కొడుకు పుట్టాడు. వీరారెడ్డి అని తండ్రి పేరు పెట్టుకున్నాడు. ఒక్కడే కొడుకు.. ఉన్నత విద్య చదివించి డాక్టరును చేయాలనుకున్నాడు. అతనిపైనే ఆశలు పెంచుకున్నాడు.

కొడుకు చదువు కోసం మకాం హైదరాబాదుకు మార్చాడు. ఆవులు, బర్రెలు, గొర్రెలు అమ్మేశాడు. భూమి కౌలుకిచ్చాడు.

కిరాయి ఇంట్లో, కౌలు డబ్బుతో సంసారాన్ని పొదుపుగా నెట్టుకొచ్చింది జానకమ్మ. కొడుకు చదువు, పెరిగే ధరలతో సంసారం గడవటం కష్టమయ్యింది. అవసరమైనప్పుడు అప్పుడింత, ఇప్పుడింత భూమిని అమ్మేశాడు రాఘవరెడ్డి. తాతముత్తాల నుండి వచ్చిన ఆస్తిని అమ్ముతున్నానని బాధపడ్డా.. అదంతా తన కొడుకు చదువు కోసం, అతన్నొక డాక్టరును చేయడం కోసమని సంతృప్తిచెందాడు రాఘవరెడ్డి.

వీరారెడ్డి ఎస్.ఎస్.ఎల్.సి.లో వుండగా వీరారెడ్డి అన్నది బాగాలేదనో, కొత్తగా వుండాలనో 'చైతన్య'గా పేరు మార్చుకున్నాడు. మురిపెంగా తండ్రిపేరు పెట్టుకుంటే ఎందుకు మార్చుకున్నాడోనని.. తండ్రి రాఘవరెడ్డి బాధపడ్డా చేసేదేమీలేక వూరుకున్నాడు.

ఎస్.ఎస్.ఎల్.సి.లో చైతన్యకు మంచి మార్కులొచ్చాయి. ఎంట్రెన్సు రాయించడానికి కోచింగ్ సెంటరులో చేర్పించాడు. కానీ ఉచిత సీటుకు రావలసిన మార్కులు రాలేదు. అయినా రాఘవరెడ్డి తన కొడుకును డాక్టరు చదివించాలనే పట్టుదల వదులుకోలేదు. డొనేషన్ కట్టయినా మెడికల్ కాలేజీలో చేర్పించాలనుకున్నాడు. ప్రైవేటు కాలేజీల చుట్టూ తిరిగాడు. 30 లక్షలు పెడితే తప్ప సీటు దొరికే అవకాశం కనిపించలేదు. ఎంతైనా సరే మెడికల్ కాలేజీలో చేర్పించవలసిందేనని రాఘవరెడ్డి, జానకమ్మ నిర్ణయించుకున్నారు.

భూమి అమ్మడం తప్ప మరో మార్గం వారికి కనిపించలేదు. భూమిని బేరం పెట్టాడు. తన చిన్ననాటి మిత్రుడు రమణ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. భూముల గురించి, ధరల గురించి అతనికి బాగా తెలుసు.

హైదరాబాద్‌లో ఉండి ఊళ్ళో వ్యవసాయం సాధ్యం కాదన్నాడు. వ్యవసాయ ఖర్చులు పెరిగినందున, వ్యవసాయ పనోళ్ళ కూలీల రేట్లు పెరిగినందున ఇక ముందు వ్యవసాయం లాభసాటి కాదన్నాడు. ఎలాగో కొంత భూమి అమ్మడానికి నిశ్చయించుకున్నందున మొత్తం అమ్మడం మంచిదని సలహా ఇచ్చాడు. పిల్లవాడి మెడికల్ కాలేజీ డొనేషన్, అతని ఫీజులు పోను మిగతా డబ్బుతో హైదరాబాద్ నగర శివార్లలో ప్లాటు కొనుక్కొని ఇల్లు కట్టుకుంటే మంచిదన్నాడు. బ్యాంక్ నుండి అప్పు కావాలన్నా దొరుకుతుంది. కొంతభాగంలో ఉంటూ మిగతా ఇల్లు కిరాయికిస్తే ఇల్లు గడుస్తుందన్నాడు. అనుకోకుండా భూముల ధరలు బాగా పెరిగాయి. ధర పెరుగుదల ఎంత కాలముంటుందో తెలియదు. అమ్మదలచుకుంటే ఇది సరైన సమయమన్నాడు. గతంలో వేలు చేసిన భూమి ఇప్పుడు లక్షలు పలుకుతుందన్నాడు. రమణ చెప్పింది నిజమేననుకున్నాడు రాఘవరెడ్డి.

ఊరితో బంధం తెగిపోకుండా.. తాత

ముత్తాతలు సంపాదించి ఇచ్చిన ఆస్తిని పూర్తిగా అమ్మకుండా కొంతైనా నిలబెట్టుకోవాలనుకున్నాడు రాఘవరెడ్డి. ఊరిలో ఉన్న ఇల్లు అతని తాతగారు కట్టింది. వందేండ్లు నిండినా చెక్కు చెదరకుండా ఉంది. అది కోటలా ఉంటుంది. ఆ రోజుల్లో ఇసుక, సున్నం, డంగ్ తిప్పి కట్టినది. నాలుగు గదులు, మధ్య విశాలమైన వరండా, వంటగది, స్నానాల గది, రెండు ధాన్యపు గరిసెలు, ఇంటి ముందు రాజప్రాసాదంలాంటి గేటు, చుట్టూ ఎకరం భూమి, దాని చుట్టూ ప్రహరీ గోడ.. ఇలా ఎంతో అందంగా ఉంటుంది ఆ ఇల్లు. దానికి పక్కన పది ఎకరాల తోటగెట్టు భూమి ఉన్నది. వాటిని మాత్రం మిగిలించాలనుకున్నాడు. మిగతా భూమిని అమ్మడానికి రమణ సహకరించాడు. నలభై అయిదు లక్షలుకు బేరమయ్యింది. పదిహేను లక్షలు అడ్వాన్సుగా నగదు ఇచ్చారు. రిజిస్ట్రేషన్ చేసి మిగతా డబ్బు తెచ్చుకోవడానికి రాఘవరెడ్డి ఊరికెళుతున్నాడు.

చాలాకాలం తర్వాత ఊళ్లో అడుగుపెట్టాడు. ఇప్పుడు ఊరెంతో మారింది. ఊరిదాకా తారురోడ్డుతో పాటు ఇంటింటికి కరెంటు వచ్చింది. గతంలో ఊళ్లో ఒకటి, రెండు సైకిళ్ళుండేవి. ఇప్పుడు సైకిళ్లే కాదు, మోటారు సైకిళ్ళు.. రెండు, మూడు కార్లు.. ఐదారు ట్రాక్టర్లున్నాయి. చిన్న చిన్న సరుకుల కొట్లు, బస్‌స్టాప్ దగ్గర టీ కొట్లు, పాన్‌షాపు వచ్చాయి. ఊరిలోని జనం కడుపు నిండా తింటున్నారో? లేదో గానీ, కొన్ని ఇళ్లకు సన్, టాటా, టీవీ నెట్ వర్కు కనెక్షన్‌లున్నాయి. చాలామంది దగ్గర సెల్‌ఫోన్లు కనబడుతున్నాయ్.


ఇవన్నీ బాగానే ఉన్నాయి కానీ, మనుషులు కూడా మారిపోవడం రాఘవరెడ్డికి నచ్చలేదు. ఒకప్పుడు అందరూ అన్యోన్యంగా ఉండేవాళ్ళు. వరుసలుబెట్టి పలకరించుకునేవాళ్ళు. తరాలు మారాయి. మనుషుల్లో మమతలు తగ్గాయి. ఆలోచనలు, అభిరుచుల్లో మార్పులొచ్చాయి. రాజకీయ పార్టీలు, కులాల పేరుతో జనం చీలిపోయారు.



తన తండ్రి చనిపోయిన తర్వాత ఊళ్ళో సర్కారు బడి పెడతారంటే ఎకరం స్థలం ఉచితంగా ఇచ్చాడు రాఘవరెడ్డి. అక్కడ బడి కట్టారు. ప్రాథమిక పాఠశాల బోర్డు పెట్టారు. ఇద్దరు పంతుళ్లొచ్చారు. ప్రారంభంలో స్కూలు బాగా నడిచింది.

ఇప్పుడు ఆ స్కూలు గోడలు కూలిపోతున్నాయ్. లోపల గబ్బిలాల కంపుగొడుతున్నది. పిల్లలు పదీ, పదిహేను మంది కూడా లేరు. పంతులెప్పుడొస్తారో? ఎప్పుడు పోతారో? తెలియదు. మధ్యాహ్న భోజన పథకం మాత్రం కొందరికి లాభసాటి వ్యాపారంగా ఉంది.

ఉన్నవాళ్ల పిల్లలు పట్నంలో ప్రైవేటు



స్కూళ్లల్లో చదువుతు న్నారు. పేదవాళ్ళు తమ పిల్లల్ని బడికి పంపకుండా నాలుగు పైసలు సంపాదించడానికి కూలి పనుల్లో పెడుతున్నారు. ఆడపిల్లలైతే వాళ్ళకు చదువే అక్కరలేదనుకుంటున్నారు.

స్కూలు పక్కన ఒక ఇంటిముందు డా॥ సదానంద్ అని బోర్డు ఉన్నది. ఊళ్ళో ఒక డాక్టరు కూడా ఉన్నందుకు ఆనందించాడు రాఘవరెడ్డి. వైద్య సదుపాయం లేక తన తండ్రి, తల్లీ మరణించడం గుర్తుజేసుకున్నాడు. ఊళ్ళోవాళ్ళు ఎందరో చనిపోయారు. తన కొడుకు డాక్టరు కాగానే ఊళ్ళోనే హాస్పిటల్ పెట్టించాలన్నది అతని కోరిక. అదే అతని జీవితాశయం.

ఊళ్ళో ఉండి పేదలకు వైద్యం చేస్తున్న డాక్టరును అభినందించాలనుకున్నాడు. అతని వివరాలు తెలిసి ఆశ్చర్యపోయాడు. అతను ఏ మెడికల్ కాలేజీలో చదవలేదు.

ఏ సర్టిఫికెట్ పొందలేదు. స్కూల్ ఫైనల్ కూడా పూర్తి చేయలేదు. టౌనులో ఒక ప్రైవేటు డాక్టరు దగ్గర కంపౌండర్‌గా కొన్నిరోజులు పనిచేశాడు. ఇంజక్షన్ చేయడం, గాయాలకు కట్లు కట్టడం నేర్చుకున్నాడు. డాక్టర్ పేషంట్లకు ఇచ్చే మందులు గుర్తుపెట్టుకున్నాడు. ఊళ్లోకొచ్చి డాక్టరు బోర్డు పెట్టాడు. అతను డాక్టరా? కాదా? అన్నది ఎవరూ అడగలేదు. ఆపదలో ఉన్నవాళ్లకు ఏదో సూదిమందు, మాత్రలు ఇస్తున్నందుకు సంతోషించారు. అతనికి సంపాదన బాగానే ఉన్నది. అప్పుడప్పుడు వచ్చిన రోగుల ప్రాణాలు పోయినా, రోగాలు ఎక్కువైనా అది తలరాత అనుకుంటున్నారు! చనిపోతే కాలం తీరిందనుకుంటున్నారు. కానీ, డాక్టరు కారణమని అనేవాళ్ళు లేరు.

సదానంద్ ఎవరా? అని ఆరాతీశాడు. అతను మాల చంద్రయ్య కొడుకని తెలిసి ఆశ్చర్యపోయాడు. చంద్రయ్య రాఘవరెడ్డి దగ్గర చాలాకాలం పనిచేశాడు. రాఘవరెడ్డి ప్రోద్బలంతోనే ఊళ్ళో స్కూలుబెట్టగానే కొడుకును అందులో చేర్పించాడు.

ఇక నాలుగు సంవత్సరాలు గడిస్తే చైతన్య ఇక్కడే హాస్పిటల్ పెడతాడు. చుట్టుపక్కల పది, పదిహేను గ్రామాల్లో ఎక్కడా ఎం.బి.బి.ఎస్. డాక్టరు లేడు. తన తండ్రి వీరారెడ్డి పేరుతో నిర్మించే హాస్పిటల్ ఆ లోటు తీర్చుతుందని తనలో తానే ఆనందించాడు రాఘవరెడ్డి.

రిజిస్ట్రేషన్ పూర్తిచేసుకొని 30 లక్షల చెక్కు తీసుకుని హైదరాబాద్‌కు బయల్దేరే ముందు నర్సిరెడ్డికి ఇల్లును జాగ్రత్తగా చూసుకొమ్మని చెప్పాడు. నర్సిరెడ్డి ఇంత కాలం భూమిని కౌలుకు చేస్తున్నాడు. ఇంట్లో ఒక మూలకు ఉంటున్నాడు.

బయల్దేరే ముందు తిరిగి ఎప్పుడొస్తానో అని తెలిసిన వాళ్ళందరినీ కలిసి హైదరాబాద్ బస్సెక్కాడు.

★ ★ ★

మిట్టమధ్యాహ్నం వేసవి కాలం ఎండ మండిపోతున్నది. ఇంటి ముందు ఆటో ఆగిన శబ్దం. వచ్చింది తన భర్తేనని జానకమ్మ గబగబా వెళ్లి తలుపు తీసింది.

రాఘవరెడ్డి ఆటో దిగి, ఆటోవాడికి డబ్బులిచ్చి ఇంట్లోకొచ్చాడు. ఎండలో ప్రయాణం.. చెమటతో చొక్కా తడిసింది. ముఖం నిండా చెమట చుక్కలున్నాయి. జానకమ్మ భర్త చేతిలోని బ్యాగు తీసుకున్నది.

రాఘవరెడ్డి పై పంచెతో ముఖం తుడుచుకుంటూ ఇంట్లోకొచ్చాడు. ఫ్యాన్ కింద మంచంపై కూర్చున్నాడు.

జానకమ్మ గ్లాసుతో మంచినీళ్ళు తెచ్చి

ఇచ్చింది. అతను గటగటా తాగేశాడు. ప్రాణం కుదుటపడినట్లయింది.

"ఏమి ఎండలో ఏమో! ఇప్పుడే ఇట్లుంటే మున్ముందు ఎట్లుంటదో? " అన్నాడు.

"అయినా! ఇంత ఎండలో ఎందుకొచ్చారు? రేపు పొద్దున్నే చల్లనిపూట బయల్దేరి రాకపోయారా? " అన్నది జానకమ్మ.

"వెళ్ళి రెండు రోజులయ్యింది. వెళ్లిన పని అయిపోయింది. ఇంకెందుకులే అని బయల్దేరాను"

"అంతా ఇచ్చారా? యేమైనా బాకీపెట్టారా? "

అతని గొంతు గద్గదమయ్యింది.

"అనుకున్నంత ఇచ్చారు... ఈనాటితో... తాతముత్తాతల నుండి కూడబెట్టిన ఆస్తిని అమ్ముకొని వచ్చాను జానకీ"

"పోనీలెండి! ఎందుకు బాధపడతారు? మీరేమైనా జల్సాలకు, షికార్లకు, తప్పుడు పనులకు ఖర్చు చేస్తున్నారా? మన బిడ్డకోసమేగదా! వందలు వేలైతే కాయకష్టం చేసైనా భూమిని కాపాడుకునేవాళ్ళం. లక్షలాయె ఎక్కడ తెస్తాం? తప్పకనేగదా! మీరీపనిజేశారు" అన్నది జానకమ్మ భర్తను సముదాయిస్తూ.

"నిజమే జానకీ! చైతన్య డాక్టరైతే ఈ భూమిలాంటివి ఎన్నో కొంటాడు. వాడు సుఖంగా ఉండాలనేగదా మన కోరిక" అన్నాడు రాఘవరెడ్డి.

★ ★ ★

ముప్పై లక్షలు డొనేషన్ కట్టి చైతన్యను మెడికల్ కాలేజీలో చేర్పించాడు. హాస్టల్లోనే ఉంచాడు. కాలేజీ ఫీజులు, హాస్టల్ ఖర్చుల కోసం- పది లక్షలు బ్యాంకులో డిపాజిట్ చేశాడు. ఆ డబ్బా దాని మీద వచ్చే వడ్డీ అతనికి సరిపోతుందనుకున్నాడు. మిగిలిన ఐదు లక్షలు పెట్టి రమణ చెప్పినట్లు నగర శివార్లో ప్లాటు కొన్నాడు. దానిపై బ్యాంకులో అప్పుదెచ్చి ఇల్లు కట్టాడు.

ఒక గదిలో ఉంటూ మిగతా ఇల్లు అద్దెకిచ్చారు. వచ్చే అద్దెతో జీవితాన్ని లాగుతున్నారు.

నాలుగు సంవత్సరాలు గడిచాయ్. చైతన్య చదువు పూర్తయ్యింది. డాక్టరు అయ్యాడు.

ఉద్యోగం కంటే ముందు పెళ్ళి సంబంధాలొచ్చాయి. డాక్టరును అల్లుడిగా చేసుకోవాలన్నది ఆడపిల్ల తల్లిదండ్రులకు క్రేజ్‌గా మారింది. ఎన్నో సంబంధాలొచ్చాయ్.

కట్న కానుకల గురించి రాఘవరెడ్డి, జానకమ్మ ఎప్పుడూ ఆలోచించలేదు. గౌరవం గల కుటుంబం, కలిసిపోయే మనస్తత్వం గల అమ్మాయి ఇంటి కోడలుగా కావాలనుకున్నారు. కోడలు తెచ్చే కట్నం డబ్బుకు కొడుకును అమ్ముకోవడం వారికిష్టం లేదు. తమ కొడుకే పెద్ద ఆస్తి. దానిముందు అన్నీ బలాదూర్ అనుకున్నాడు రాఘవరెడ్డి.

వెంకటరెడ్డి కూతురు సౌందర్యతో సంబంధం నిశ్చయమయ్యింది. అతను చాలాకాలంగా రాఘవరెడ్డికి పరిచయస్తుడే! జీవితంలో ఎన్నో కష్టాలు అనుభవించి స్వయంకృషితో పైకొచ్చాడు. దూరపు చుట్టరికం కూడా ఉన్నది. ఒకప్పుడతను పల్లెటూరులో ఐదెకరాల రైతు. వ్యవసాయంలో అప్పులు, తిప్పలు భరించలేక భూమిని అమ్ముకొని హైదరాబాదొచ్చాడు. నగర శివారులో రెండెకరాలు భూమి కొన్నాడు. అందులో బోరుబావి వేశాడు. రేకులతో రెండు గదులేసుకున్నాడు. నాలుగు బర్రెలు, కూరగాయల పంటలతో బతుకుదెరువు ప్రారంభించాడు. పాల వ్యాపారంతో వచ్చిన డబ్బుతో చుట్టుపక్కల భూమి అమ్మకాని కొచ్చినప్పుడు కొన్నాడు. పాల వ్యాపారం మానేసి రియల్ ఎస్టేట్ వ్యాపారంలో దిగాడు. వందలు, వేలల్లో కొన్న భూమి కోట్లకు అమ్మాడు. కోటీశ్వరుడయ్యాడు. ధనవంతుల జాబి



తాలో చేరాడు. నగర శివార్లలో ప్యాలెస్ లాంటి భవనం కట్టాడు. కార్లు, నౌకర్లు. వ్యాపారంలో ఒక్కొక్క మెట్టు ఎక్కుతూ వచ్చాడు.

అతనికి ఒక్కతే కూతురు సౌందర్య. పేరుకు తగ్గట్టుగా అందంగా ఉంటుంది. ఆడపిల్లకు చదువెందుకని హైస్కూలు విద్యతోనే చదువు మాన్పించింది తల్లి పార్వతమ్మ.

కట్నం కానుకల గురించి రాఘవరెడ్డి, జానకమ్మ అడగకపోయినా అమ్మాయి కున్న ఆస్తిపాస్తుల గురించి వెంకటరెడ్డి వివరించాడు.



"అమ్మాయి పేరుమీద బంజారాహిల్స్‌లో రెండు, హైటెక్ సిటీలో రెండు మూడుగదుల ఫ్లాట్లున్నాయ్. నగర శివారులో బంగళా ఉన్నది. 25 లక్షల ఫిక్స్‌డ్ డిపాజిట్లున్నాయ్. వ్యాపారమంతా 'సౌందర్య రియల్ ఎస్టేట్' పేరుతోనే ఉన్నది. ఆమె పేర ఉన్న ఆస్తి కోట్లలోనే ఉన్నది. అంతేగాక మాకొక్కతే కూతురు. మా ఆస్తంతా ఆమెదేగదా!" అన్నాడు వెంకటరెడ్డి.

సంబంధం ఖాయం చేసుకున్నారు. ముహూర్తం పెట్టుకున్నారు.

పెండ్లి ముహూర్తం దగ్గర పడుతున్నది.

పెండ్లి ఖర్చులు అమ్మాయి వాళ్ళు పెట్టుకున్నా, కాబోయే కోడలుకు కనీస లాంఛనాలు చేయాలి. పెద్దవాళ్ళతో సంబంధం.. దానికి తగ్గట్టుగా ఉండాలి. బంగారం, బట్టలు, ఇతర ఖర్చులు.. కనీసం పది లక్షలైనా కావాలి. చేతిలో నయాపైసా లేదు. ఇంటిమీద తెచ్చిన అప్పు, అప్పుగానే ఉంది. వడ్డీ పెరిగిపోతున్నది. ఏమి చేయాలో అర్థంగాక రాఘవరెడ్డి తలపట్టుకున్నాడు.

భర్త ఆవేదనను అర్థం చేసుకుంది జానకమ్మ.

"ఏమండీ! ఏమిటాలోచిస్తున్నారు?" అడిగింది.

"ఏమీ లేదు జానకీ! పెద్దవాళ్ళతో సంబంధం.. వాళ్ళ ముందు తలవొంపు గాకుండా ఉండాలి. నువ్వు చెప్పిన దాన్ని బట్టి కనీసం పది లక్షలైనా గావాలి! ఎక్కడ తేవాలని ఆలోచిస్తున్నా" అన్నాడు.

"చైతన్యను సలహా అడగకపోయారా?"

"వాడేం చెబుతాడు? పైగా అపార్థం చేసుకుంటాడు. కట్నం డబ్బుకు ఆశపడుతున్నామనుకుంటాడు! తన పెండ్లికి తననే డబ్బు అడుగుతున్నామనుకుంటాడు"

"నిజమే? మరేం చేద్దాం?" అడిగింది జానకమ్మ.

"అదే అర్థం కావడం లేదు. వందలూ, వేలైతే ఎక్కడైనా అప్పోసప్పో తెచ్చేవాణ్ణి. అప్పుగావాలంటే ఏదో ఒకటి కుదవబెట్టాలి! మన దగ్గరేముంది?"

"ఊళ్ళో ఇల్లు, ఇంక కొంత భూముంది గదా?" అంది జానకమ్మ.

"కానీ! అది"

"నాకు తెల్సండి. ఆ ఇంటిని మీ అమ్మానాన్న గుర్తుగా మిగిల్చారని.. అక్కడ చైతన్య ఆసుపత్రి పెట్టాలని కాపాడుతున్నారు. కానీ, అది అమ్మడం లేదుగా.. అప్పు కింద తనఖా పెడతాం. చైతన్యకు ఉద్యోగం వచ్చాక వాడే అప్పు తీర్చి ఇంటిని, భూమిని నిలబెడతాడు" అంది జానకమ్మ.

భార్య చెప్పింది బాగానే ఉన్నదనుకున్నాడు రాఘవరెడ్డి. విషయం మిత్రుడు రమణతో జెప్పాడు. పదిలక్షలు అప్పుగా కావాలన్నాడు.

"నీ కొడుకు డాక్టరు, నీకు రాబోయే వియ్యంకుడు కోటీశ్వరుడు. కోట్ల ఆస్తితో కోడలు ఇంటికి రాబోతుంది. పదిలక్షలు

ఒక లెక్కగాదు.. కానీ, అప్పు ఇచ్చేవాళ్ళు ఏదో తనఖా బెట్టకుండా ఇవ్వరు" అన్నాడు రమణ.

ఊళ్ళో ఉన్న ఇల్లు, భూమి తాకట్టు పెడ్తానని, సంవత్సరం తిరగకముందే అప్పుతీర్చి తన ఆస్తిని తిరిగి తీసుకుంటాన న్నాడు రాఘవరెడ్డి.

రమణ తనకు తెలిసిన వడ్డీ వ్యాపారితో మాట్లాడి పదిలక్షలు ఇప్పించాడు.

"లక్ష, రెండు లక్షలైతే నేను ఎట్లాగైనా సర్దేవాన్ని! పది లక్షలాయె.. అందుకే వడ్డీ వ్యాపారి దగ్గర తీసుకోవాల్సి వచ్చింది. అప్పిచ్చిన మనిషి కాబూలీవాలా లాంటోడు. అతనికి ప్రాణం కంటే డబ్బులే ముఖ్యం. అనుకున్న సమయానికి అప్పు చెల్లించకపోతే.. తాకట్టు పెట్టుకున్నది తిరి గివ్వడు" అని రాఘవరెడ్డికి హెచ్చరిక జేశాడు.

"అంతవరకు రానిస్తానా! సంవత్సర మన్నా.. వీలైతే అంతకంటే ముందే.. ఆ బాకీ సుక్తీ జేస్తా" ధీమా వ్యక్తం చేశాడు రాఘవరెడ్డి.

★ ★ ★

చైతన్య, సౌందర్యల పెండ్లి ఘనంగా జరిగింది.

పెళ్ళికాగానే భార్యాభర్తలు నెలరోజులు హనీమూన్ కెళ్ళారు.

తిరిగొచ్చిన తర్వాత చైతన్య అత్తగారిం ట్లోనే మకాం పెట్టాడు.

పెళ్ళయిన తర్వాత కోడలు తమ ఇంట్లో అడుగుబెట్టలేదు.

రాఘవరెడ్డి, జానకమ్మ రెండు మూడు సార్లు వెళ్ళి కొడుకు, కోడల్ని చూసి వచ్చారు.

కోడలు ప్రవర్తన చూసి జానకమ్మకు అనుమానం కలిగింది. కోటీశ్వరుని బిడ్డగా బట్టి తమను చిన్నచూపు చూస్తుందనుకు న్నది.

చైతన్య భార్య లేకుండా తమ ముందుకు రావడం లేదు.

ఇంటి విషయం, అప్పుల విషయం, చైతన్య భవిష్యత్తు గురించి ఏమీ ఆలోచి స్తున్నాడో తెలుసుకునే అవకాశం లభించ లేదు.

రెండుమూడు నెలలు గడిచిన తర్వాత చైతన్య ఒక్కడే ఇంటికొచ్చాడు. వారం రోజుల్లో అమెరికా వెళ్ళబోతున్నట్లు చెప్పాడు. పోస్టుగ్రాడ్యుయేషన్ చేయడానికి వెళుతున్నానని.. సౌందర్య కూడా తన తోనే వస్తుందని చెప్పాడు. రాఘవరెడ్డికి నోటమాట రాలేదు.

జానకమ్మ కంట తడిపెట్టుకుంటూ.. "అదేమిట్రా! నిన్నగాక మొన్న పెండ్ల య్యింది. అప్పుడే అమెరికాకా! నిన్ను

డాక్టర్ను చేసి మన ఊరిలో ఆసుపత్రి పెట్టించాలనుకున్నాడు మీ నాన్న! దాని కోసం ఎన్నో కలలుకన్నాడు.. ఎన్నో కష్టాలు పడ్డాడు. నిన్ను చదివించి డాక్టర్ని చేశాడు. ఆస్తంతాబోతే నువ్వే పెద్ద ఆస్తను కున్నాడు" అంది వచ్చే దుఃఖాన్ని ఆపు కుంటూ...

చైతన్య మాట్లాడలేదు.

రాఘవరెడ్డి కొడుకు మౌనం అర్థం చేసుకున్నాడు.

"నీ ఇష్టం చైతన్యా! పెద్దవాడివయ్యావు. నీకు మంచేదో! చెడేదో తెలుసు" అన్నాడు రాఘవరెడ్డి కళ్లనీళ్ళు జారకుండా జాగ్రత్తప డుతూ...

★ ★ ★

చైతన్య భార్యతో కలిసి అమెరికా వెళ్ళి రెండు సంవత్సరాలయ్యింది.

నెలకో, రెండు నెలలకోసారో రాఘవ రెడ్డి, జానకమ్మతో ఫోనులో మాట్లాడుతు న్నాడు. అప్పుల విషయం, ఇంటి విషయం మాట్లాడటం లేదు. సౌందర్య ఎంతో ప్రేమను కనబరుస్తూ తీయగా మాట్లాడు తోంది. "ఆరోగ్యం జాగ్రత్త.. మందులు వేసుకోవడం మరిచిపోవద్దు" అని సలహా యిస్తోంది.

రాఘవరెడ్డి, జానకమ్మలకు పరిస్థితి అర్థ మయ్యింది. అప్పటివరకు ఇంటి అద్దెతో కాలం గడుస్తోంది.

బ్యాంకు నోటీసు రాఘవరెడ్డిపై బాంబులా పడింది.

నెలరోజుల్లో అసలూ, వడ్డీ చెల్లించక పోతే ఇంటిని వేలం వేస్తామని హెచ్చరిం చారు. అసలూ, వడ్డీ కలిసి తడిసి మోప డయ్యింది. అమ్మినా ఇంటికి ఆ ధర వచ్చే ట్లులేదు. బ్యాంకు నోటీసు విషయం తెలిసి 10 లక్షలు అప్పిచ్చిన వ్యక్తి వచ్చాడు. సంవత్సరమన్నది.. రెండు సంవత్సరాలు దాటిందన్నాడు. అసలూ, వడ్డీ లెక్కగట్టి చెప్పాడు. వెంటనే చెల్లించకపోతే ఇల్లు, భూమిపై ఆశ వదులుకోవాలన్నాడు.

రాఘవరెడ్డి, జానకమ్మలకు ఏమి చేయాలో అర్థంగాక కంటతడి బెట్టారు.

ఆస్తి పోయింది. ఇప్పుడు పరువుపోయి బజారునపడే రోజొచ్చిందని కుమిలిపోతు న్నారు. చైతన్యకు విషయం చెప్పాలన్నది జానకమ్మ.

"అతనికి తెలియదా జానకీ! అన్నీ తెలిసే సంబంధం లేకుండా ప్రవర్తిస్తున్నా డంటే తెలియటం లేదా! వాడితో చెప్పినా ప్రయోజన ఉండదు" అన్నాడు.

"అయినా మన బాధ్యత. చెప్పి చూడండీ!" అన్నది జానకమ్మ.

ఒకరోజు రాత్రిపూట చైతన్యకు ఫోను జేసి విషయమంతా చెప్పాడు.

"నేనింకా స్థిరపడలేదు. ఇక్కడ ఇల్లూ, కారూ లేకుండా ఉండలేం. బ్యాంకు అప్పు తో ఇల్లూ, కారూ కొన్నాను. నెలనెలా ఇన్ స్టాల్‌మెంటు కట్టాలి. ఇంటి ఖర్చులు, వచ్చే జీతం సరిపోక ఇబ్బందులు పడు తున్నాం. మా మామను డబ్బుడిగితే మన కుటుంబం పరువుబోతుంది. మీరే! ఏదో ఒకటి చెయ్యండి" అని తనకే బాధ్యత లేద న్నట్లు సమాధానం చెప్పాడు.

ఒకవైపు వడ్డీ వ్యాపారి, మరోవైపు బ్యాంకువాళ్ళ వొత్తిడి ఎక్కువయ్యింది.

రాఘవరెడ్డి విషయమంతా చెప్పి రమణ సలహా అడిగాడు.

తన నిస్సహాయతను తెలియజేస్తూ ఒక పరిష్కారమార్గం చెప్పాడు రమణ.

అమెరికాలో ఉంటున్న వ్యక్తి ఒకరు తన తల్లిదండ్రుల పేరిట ఇక్కడొక అనాథాశ్రమం పెట్టాలనుకుంటున్నాడు. అక్కడ బాగా సంపాదించాడు.

"అనాథాశ్రమం పట్టణాలకు దూరంగా పల్లె వాతావరణంలో వుండాలట. దానికి అనుకూలమైన స్థలం చూడమన్నాడు. దానికోసమే వెతుకుతున్నా. బాగా ఆలోచిస్తే ఊళ్ళో వున్న మీ ఇల్లు, స్థలం దానికి సరిగ్గా సరిపోతుందనుకుంటున్నా. నువ్వు సరేనంటే దాన్ని చూపిస్తా.. అది అమ్ముడుబోతే.. అప్పుపోను అంతో ఇంతో.. మిగులుతుంది. అది మీ ఖర్చులకు సరిపోతుంది. లేకపోతే అప్పిచ్చినోడే దాన్ని మింగేస్తాడు" అన్నాడు రమణ.

రాఘవరెడ్డికి అంతకంటే మరోమార్గం కనిపించలేదు. సరేనన్నాడు. అది అమ్ముడుబోయింది.

వడ్డీవ్యాపారి అప్పుబోను యాభైవేలు మిగిలింది. కొడుకు చేత హాస్పిటల్ పెట్టించాలనుకున్న స్థలంలో అనాథాశ్రమం వచ్చింది. తాము కోరుకున్నదేమిటి? జరిగిందేమిటని రాఘవరెడ్డి, జానకమ్మ కంటతడి పెట్టారు.

★ ★ ★

అర్ధరాత్రి టెలిఫోన్ మోగింది.

రాఘవరెడ్డి రిసీవర్ ఎత్తాడు.

"హల్లో! ఎవరూ? " అడిగాడు.

"నేను మామయ్యా! సౌందర్యను" అవతల గొంతు పలికింది.

"ఏమమ్మా! అంతా బాగేనా? " అడిగాడు.. అంతకంటే యింకేమీ అనలేక.

"మేము బాగానే వున్నం. మీరెట్లున్నారు? అత్తమ్మ ఆరోగ్యం ఎట్లుంది? బి.పి, షుగర్‌లకు రెగ్యులర్‌గా టెస్టులు చేయించుకుంటుందా? మీ ఆరోగ్యం జాగ్రత్త!" అంది.

"అట్లాగేనమ్మా!"

"మామయ్యా! మొన్న మీరు ఫోన్లో మాట్లాడినప్పటి నుంచి మీ అబ్బాయి సరిగ్గా నిద్రబోవటంలేదు. మీ గురించే ఆలోచిస్తున్నాడు. అమ్మానాన్నకు ఏమీ చేయలేకపోతున్నామని బాధపడుతున్నాడు. అమెరికాలో వున్నామేగానీ మనసంతా మీదగ్గరే వున్నది. మీరిక్కడికి రారు. మేమక్కడికి రాలేము. మీరీ వయస్సులో ఒంటరిగా వుండటం మంచిది గాదు. ఎవరైనా తోడుండాలి. అందుకే మీ అబ్బాయి, నేను ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చాం!" అంది.

"ఏమిటమ్మా అదీ? " ఆసక్తితో అడిగాడు రాఘవరెడ్డి.

"ఏమీలేదు మామయ్యా! ఇంట్లో మీరిద్దేరగా వుండేది! అంతపెద్ద ఇల్లెందుకు? ఇల్లు అమ్మేసి.. అప్పులు దీర్చి.. వృద్ధాశ్రమంలో వుంటే.. మీకు నలుగురు తోడుగా వుంటారు గదా? " అంది.

రాఘవరెడ్డికి తలతిరిగినట్లయ్యింది. నోటమాట రాలేదు. రిసీవర్ పెట్టేశాడు. వచ్చే దుఃఖాన్ని ఆపుకోలేకపోయాడు.

భర్త బాధను అర్థం చేసుకుంది జానకమ్మ. విషయం తెలిసిపోయింది. ఇలాంటిది జరుగుతుందని ఎప్పుడో ఊహించింది. గుండె నిబ్బరం చేసుకుంది.

"కొడుకుని డాక్టర్ని చేయాలని ఎన్నో కష్టాలు పడ్డారు. ఎన్నెన్నో కలలు కన్నారు. కొడుకు డాక్టరైతే కష్టాలు తీర్తాయనుకున్నారు. కానీ వాడు రెక్కలొచ్చిన పక్షిలా భార్యతో కలిసి ఎగిరిపోయాడు. ఇప్పుడు మీకు నేను, నాకు మీరు తప్ప ఎవరున్నారు? బతికిన నాలుగురోజులు కోడలు కోరుకున్నట్లు ఏ వృద్ధాశ్రమంలోనైనా గడుపుదాం.." అంది జానకమ్మ వచ్చే దుఃఖాన్ని దిగమింగుతూ.. భర్తకు ధైర్యం చెపుతూ..

"వృద్ధాశ్రమం కాదు జానకీ! అనాథాశ్రమం వెతుక్కోవాలి!" రాఘవరెడ్డి కళ్ళల్లో నుంచి కన్నీళ్ళు బొటాబొటా రాలాయి.

మలయాళ కథ

- అంబికా సుతన్ మాంగడ్



జడివానలో

ఆకాశం నుండి కారే కన్నీళ్ళలాగ వాన చినుకులు నల్లటి తారురోడ్డును తడిపేసాయి. నల్లటి దుప్పటి ధరించినట్లుగా వున్న ఆ అర్ధరాత్రి అంధకారంలో జుమైలా ఊపిరి బిగబట్టుకొని వీధుల గుండా పరిగెడుతోంది. ఆమె తన ఆక్రందన గొంతులోనే అదిమిపట్టి ఆ అర్ధరాత్రి పరుగులు తీస్తూనే వుంది. పరిగెడుతున్నపుడు కాళ్లకు అడ్డుపడకుండా కుడిచేత్తో పరికిణీ కొంచెం పైకెత్తుకుని మాటిమాటికీ వెనక్కి

తిరిగి చూస్తూ పరిగెడుతోంది. దారి అంతా నిశ్శబ్దంగా వుంది. ఆమె వానలో తడిసిముద్దయింది. రెండుసార్లు కాలు జారి పడటం వల్ల ఒళ్ళంతా బురదతో అలుముకుపోయింది. కాని ఆమెకు అదేమి పట్టినట్లులేదు. అప్పుడు ఆమెకు తనని తాను రక్షించుకోవడమే ధ్యేయం. అలా పరిగెడుతూ హైవే దాకా వెళ్ళేసరికి ఊపిరి కాస్తా ఆగిపోతుందేమోనని ఆమె భయం. మెయిన్‌రోడ్డు కూడా నిర్మానుష్యంగా వుంది.

ఒక్క వాహనం కూడా కనబడటం లేదు. వెనక్కి తిరిగిచూసింది. తనని వెంబడించేవాళ్ళ అడుగుల చప్పుడు విని పించడం లేదు కదా అనుకుంది. వాళ్ళకి బందీగా చిక్కుతానేమోనని ఆమె భయప డుతుంది. 'ఓ భగవంతుడా! నన్ను రక్షించు' ఆమె మనస్ఫూర్తిగా వేడుకుంది.

ఏదో వాహనం వస్తున్న చప్పుడు విని జుమైలా కళ్ళు తెరిచింది. అకస్మాత్తుగా రోడ్డంతా కాంతిమంతమయింది. ఒక కారు ఆ వానలో జ(రుమంటూ దూసుకు వచ్చింది. జుమైలా నడిరోడ్డు మీదకు వచ్చి మధ్యలో నుంచుని లిఫ్టు అడిగింది. 'మళ్ళీ తను ఇంకొక ప్రమాదంలో చిక్కుకోవటం లేదు కదా' ఆమెకు అనుమానం కలిగింది.

కారు కొంచెం ముందుకు వెళ్ళి అకస్మా త్తుగా వెనక్కి వస్తోంది. జుమైలాకి కంగారు ఎక్కువ అయింది. ఆమె కారు నడిపే వ్యక్తిని చూసింది. గుండ్రటి కళ్ళ జోడు, గుబురు మీసాలున్న ముప్పై, నలభై ఏళ్ళ మధ్య వయస్సు కలిగిన మనిషి. మొదటి చూపులోనే ఈ మనిషి మంచివాడు కాదేమోనన్న అనుమానం కలిగింది. గుప్పుమన్న సారా వాసనతో ఒక్కసారిగా అనుమానం బలపడింది. కాని రోడ్డు మీద అలా వూరికే నిల్చునుంటే కలిగే భయంతో జుమైలా ఉలిక్కిపడింది.

ఇంక రెండోసారి ఆలోచించకుండా తెరచిన తలుపులోంచి లోపలికి దుమికింది.

కారు వెడుతుంటే తలుపుకున్న అద్దం దానంతట అదే పైకి లేచింది. బయట ప్రపంచానికి ఏమీ కనబడకపోయినా ముందు కలిగిన విస్మయం భయంగా మారింది. ఆమె క్రీగంట అతని చేష్టలు గమనిస్తూ కూర్చొని వుంది.

మొదటి మలుపు తిరిగాక ఆ కళ్ళజోడ తను ఆమె కేసి చూడకుండానే "ఎక్కడ దిగాలి? " అని గంభీరంగా అడిగాడు.

జుమైలా అతడికేమని బదులివ్వాలో తెలియక మౌనంగా కూర్చొనుంది.

"రేపు సమ్మె కారణంగా రోడ్డు మీద బళ్ళు లేవు" మళ్ళీ అతడే అన్నాడు.

ఏ జవాబు రాకపోయేసరికి అతను బండి వేగం తగ్గించి జుమైలాని చూశాడు. ఆమె కంగారుగా వుందని తెల్సుకొని "నీ పేరేమిటి? " అని తీక్షణంగా అడిగాడు.

ఆమె పేరు చెప్పింది. అతడు నవ్వాడు "జుమైలా! పేరు బాగుంది. నా పేరు శివ దాసు, క్లబ్‌లో పార్టీ జరిగింది. రెండు పెద్ద రౌండ్లు వేసానులే. అందుకే ఆలస్య మయింది" శివదాసు పకపక నవ్వాడు.

"అందుకే నీ అదృష్టం బాగుంది. మత్తులో లేకపోతే నేను బండి ఆపను"

నవ్వుతుంటే అతని వళ్ళంతా కదిలిపో తోంది. జుమైలాకి భయం ఎక్కువ యింది. బండివేగం తగ్గించినపుడు చీక టిలో బయటకు దుమికి ఎట్టైనా పారిపో వచ్చునని కూడా ఆమె ఆలోచించింది. రెండు మలుపులు తిరిగాక రోడ్డు సాఫీగా వుంది. వర్షం తగ్గిపోయింది.

"ఎమ్.జి.రోడ్ వచ్చింది. ఎక్కడ ది గాలి? " వైపర్ ఆపు చేసి శివదాసు అడి గాడు. అయినా జవాబు రాకపోయేసరికి ఆమె కేసి గుడ్లురిమిచూసాడు. జుమైలా ఏడవటం మొదలెట్టింది. శివదాసు మత్తు దిగిపోయింది. బండి ఆపి కళ్ళు విప్పార్చి ఆమె కేసి ఆశ్చర్యంగా చూసాడు. పది,

పన్నెండేళ్ళ చిన్న పిల్ల. క్రింద పెదవి నించి రక్తం కారుతోంది. అరచేతిలో కూడా రక్తం కనబడింది.

"పడిపోయావా ఏమిటి? రక్తం వస్తోందే? " జవాబివ్వలేని అశకత్తతో జుమైలా అతనికేసి సూటిగా చూసింది. శివదాసుకి విషయం అర్థమయింది.

"నిన్నెవరు బాధపెట్టారు? పద, మనం ఇప్పుడే పోలీసుస్టేషన్‌కి వెళ్ళి రిపోర్టు చేద్దాము"

"వద్దు సార్. వాళ్ళంటే నాకు భయం. నేను కొంచెం ముందుకెళ్లాక ఎక్కడోక్కడ దిగిపోతాను. నన్ను కొందరు వెంటాడుతు న్నారు" స్టీరింగ్ మీద ఉన్న అతని చేతులు పట్టుకొని ఆమె ప్రార్థించింది.

"ఎవరు వాళ్లు? " శివదాసుకి ఆశ్చర్యం కలిగింది.

కొద్దిక్షణాలు మౌనంగా ఉన్నాక జుమైలా తన విషయమంతా అతనికి చెప్పనా వద్దా అనే సంకోచంలో పడింది.

"రెండేళ్ళుగా నేను తాజుద్దీన్‌భాయ్ ఇంట్లో పనిమనిషిగా ఉన్నాను. మా ఇల్లు చాలా దూరంగా బదిరమపల్లెలో ఉంది" ఆఖరికి ఆమె చెప్పేసింది.

"నీకు నీవాళ్లు ఎవరూ లేరా? "

"నాన్న, అమ్మ, నేను, ఇద్దరు చెల్లెళ్లు, చిన్ని తమ్ముడు. నాన్నకు అనారోగ్యం. అమ్మ కూలిపని చేసి సంసారాన్ని పోషి స్తోంది. కాని ఆ సంపాదన అంతా నాన్న మందులకే సరిపోతోంది. ఇంట్లో తరచు పస్తులే. ఆ కష్టకాలంలో మా దూరపు బంధువు తాజుద్దీన్ తన భార్యతో మా ఇంటికి వచ్చాడు. అతని భార్య బీబీజాన్ నన్ను తనకు తోడుగా తనింటికి రమ్మని, వంటలో కాస్త సహాయంగా ఉంటే చాలని, పైగా నన్ను మంచి స్కూలులో చేర్పిస్తా నని చెప్పడంతో నాన్న, అమ్మ కళ్ళలో నీళ్లు చిప్పిల్లాయి. కనీసం ఇంట్లో ఒకరైనా మంచి తిండి తిని సుఖంగా బ్రతుకుతార నుకొని అమ్మ నన్ను వాళ్ళతో పంపింది" ఆ చీకట్లో కళ్లు అటూ ఇటూ కూడా తిప్ప కుండా జుమైలా చెప్పింది.

"మరి తరువాత? "

"స్కూల్లో ఎక్కడ చేర్పించారు? అను



క్షణం పనితోనే సరి. ఆ ఇంటికి రోజూ అతిథులు వస్తుంటారు. నేను గదిలో ఒక్కర్తినీ ఉంటే తాజుద్దీన్ ఇబ్బంది పెట్టే వాడు. పైగా ఇతరులను కూడా నాగది లోకి పంపించి తలుపులు మూసేవాడు. తనేకాక ఇతర జాతుల మనుష్యులు కూడా వచ్చేవారు. నా నోట్లో గుడ్డలు కుక్కే-సే వారు"

"తాజుద్దీన్ భార్య ఇంట్లో ఉండేది కాదా? "

"ఉండేది! నేను ఏడుస్తూంటే నన్ను మౌనంగా ఉండమనేది. పైగా నేను నా ఇంటికి తిరిగి వెళ్ళేటప్పుడు బోలెడు డబ్బు ఇస్తానని చెప్పేది"

"మరి, నువ్వు తిరిగి మీ ఇంటికి ఎందుకు వెళ్ళలేదు? " ఆమె సుకుమార శరీరం మీద దృష్టి మరల్చి అతను అడి గాడు.


"వాళ్ళు వెళ్లనిచ్చినప్పుడుకదా? అమ్మని చూడాలని చాలాసార్లు జాలిగా అడిగాను. ఇంటికి వెడతానంటే కొట్టేవారు. ఒకసారి నెత్తిమీద వేడినీళ్ళు గుమ్మరించారు. మానాన్న బ్రతికి ఉన్నాడో లేదో కూడా తెలియదు. మా చిన్ని తమ్ముడు, చెల్లెళ్ళు అందరినీ చూడాలని ఎంతగానో కోరుకు న్నాను. కాని నన్ను ఇంటి బయటకు అడు

గుపెట్టనివ్వలేదు. నాలుగు నెలలుగా బందీగా ఉన్నాను”

“మరి నువ్వు తప్పించుకుని ఎలా బయటపడ్డావు? ” విస్మయంగా అడిగాడు శివదాసు.

జుమైలా తన ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని ఆ ఇంటి నుండి తప్పించుకోవడం గుర్తుచేసుకుంది. తాను తప్పించుకోవడంపై ఆమెకే నమ్మకం కలగలేదు. కానీ, అది జరిగింది.

ఒక రోజున పాయిఖానా కిటికీకి ఉన్న లావుపాటి ఇనుప చువ్వలలో ఒకటి తేలికగా కదలడం చూసింది. లాగితే తేలికగా వచ్చేసేలాగా ఉంది. ఏదో రోజున అది తనకు ఉపయోగపడుతుందని మనస్సులో అనుకుంది. ఆ రోజు విషయమంతా స్ఫురణకొచ్చింది.



“ఆ రోజున తాజుద్దీన్ ఇంట్లో లేడు. ఆ రాత్రి అతని భార్య నల్లగా లావుగా ఉన్న ఒకడిని జుమైలా గదిలోకి పంపించింది. అతనిని చూసి జూమైలా భయపడిపోయింది. గదిలో మూలగా నక్కి ఉన్న జుమైలా దగ్గరకి బీబీ వచ్చి ఆయన పెద్ద ఆఫీసరు నువ్వు ఏదైనా పేచీపెడితే చంపేస్తానంది. బీబీ బయటకు వెళ్ళగానే వాడు ఆమెను గట్టిగా పట్టుకొని బాధపెట్టసాగాడు. పెదవులు కొరికేసాడు. జుమైలా సవ్వడికాకుండా ఏడుస్తోంది. అతడి దాష్టీకాన్ని చాలాసేపు భరించిన తర్వాత ఆమె బాత్‌రూమ్‌లోకి దూరింది. వెంటిలేటర్‌పై కాంతి పడగానే ఆమె బుర్రలో మెరుపు మెరిసింది. వెంటనే ఆ ఇనుపచువ్వ తీసుకొని బయటకు వచ్చింది. మంచం మీద ఇటూ అటూ పొర్లుతున్న ఆ లావాటివాడి తలమీద చువ్వతో మోదింది. వాడు అరవలేదు, మూలగలేదు. తలవేలాడేసి చేష్టలుడిగి చూస్తున్నాడు.

పరుపు మీద రక్తపు చుక్కలు పడుతున్నాయి. జుమైలా మెల్లగా తలుపు తెరచి అడుగులో అడుగువేసుకుంటూ ఎదురుగా వున్న తలుపు తెరచి వరండా దాటి పరిగెడుతూ ప్రహరీ గోడ దగ్గరకొచ్చింది. దాన్ని దూకడానికి ప్రయత్నిస్తుంటే గుడ్లురిమి చూస్తూ వరండాకేసి పరిగెత్తుకొస్తున్న బీబీ కనబడింది. ఆ గాబరాలో ఆమె గోడ దాటి బయట కాలువలో పడిపోయింది. కాళ్ళు, చేతులు బురదలో కూరుకుపోయాయి. అయినా తొందరగా లేచి చీకటిలోనే పరుగెత్తింది.

శివదాసు ఆ అమ్మాయికేసి ఆశ్చర్యంగా

చూసాడు. తను విన్నదంతా ఏమైనా కల్పిత కథా? అతడు నమ్మలేకపోతు న్నాడు. కాసేపు స్తబ్దత తర్వాత అకస్మా త్తుగా కారువేగం తగ్గింది. ఒక ఇంటి ఆవ రణకేసి ముందుకు సాగింది. అక్కడ ఒక్కటే ఇల్లుంది. చూడగానే జుమైలాకి భయంవేసింది.

శివదాసు దిగి ఆమెవైపు తలుపు తెరి చాడు. "రా జుమైలా" అన్నాడు. ఆమె దిగింది ఆ పిల్లకి తన గుండె చప్పుడు విని పిస్తోంది. అతడు తాళంతీసి తలుపు తెరచి "లోపలికి రా" అన్నాడు.

"వద్దు సార్! నేను వెళ్ళిపోతాను"

"ఓహోహో! ఇంత అర్ధరాత్రి ఒక ఆడ పిల్ల ఒంటరిగా రోడ్డు మీద తిరగడం ప్రమాదకరం. పైగా రేపు సమ్మె కూడా వుంది"

జుమైలా క్రీగంట అతన్ని అనుమానంగా చూస్తూ సంకోచంగా అక్కడే నిల్చుంది. ఏ మగాడినీ ఆమె నమ్మే స్థితిలోలేదు. పైగా అతను సారాయి తాగి వున్నాడు.

శివదాసు వెనక్కితిరిగి వచ్చి ఆమె భుజా లపై చెయ్యివేసి "రా! జుమైలా" అన్నాడు.

జుమైలా కొంచెంగా వణికింది. అయినా ధైర్యం కూడదీసుకొని లోపలికి నడచింది. తనలోని వణుకుని అణుచుకొని అతనితో నడుస్తూ-

"ఇక్కడ వేరే ఎవరూ లేరా?" అని అతన్ని సహజంగా అడిగింది.

"లేరు"

చొక్కా గుండీలు విప్పుకొంటూ శివదాసు టెలిఫోన్‌కేసి వెడుతుంటే జుమైలా కంగారు పడింది. అతడో నెంబరు తిప్పు తుంటే "మీరేం చేస్తున్నారు?" అని అడు గుతూ అతనికేసి వేగంగా అడుగేసింది. భయకంపితురాలై అతని చేతులు పట్టు కొని "ఎవర్ని పిలుస్తున్నారు మీరు?" అని అడిగింది.

"ఎందుకలా అడుగుతున్నావు?" శివ దాసు పెదాలపై చిరునవ్వు తెచ్చుకోవడా నికి ప్రయత్నించాడు.

"సార్! మీరు కావాలంటే నన్ను ఏమైనా చెయ్యండి కాని మీ స్నేహితులను మాత్రం పిలవద్దు. ఇప్పటికే నా శరీరం భరించలేని స్థితిలో ఉంది"

అరచేతుల్లో మొహం దాచుకుని ఆమె వెక్కివెక్కి ఏడ్వసాగింది.

"ఎందుకు భయపడతావు? అందరూ ఒక్కలా వుండరు" రిసీవర్ పెట్టేసి ఆమె భుజాలు తడుముతూ అన్నాడు శివదాసు.

జుమైలా అతని మాటలు వినడం లేదు. ఆమె దృష్టి అంతా తన భుజాల మీద వేసిన అతని చేయి గురించే, అదే ఆలో చన. ఏదో ఒక క్షణంలో అతని చేయి

పాములాగ పడగ విప్పి తన శరీరాన్ని చుట్టేస్తుందేమోనని ఆమె భయం. నిశ్చేష్టు రాలై అలాగే నిల్చుంది.

శివదాసు తన బెడ్‌రూమ్‌లోకి వెళ్ళి బీరువాలోంచి తువాలు తీసుకొని వచ్చే లోగా జుమైలా ఫ్రిజ్ మీద వున్న ఫొటో ఫ్రేమ్‌లో తన ఈడుదైన నవ్వుతున్న ఒక ఆడపిల్ల ముఖాన్ని శ్రద్ధగా చూసింది. అది చూసి శివదాసు ఆ ఫొటో గురించి అడుగుతుందేమోనని భయపడి ఆమె చెయ్యి పట్టుకొని బాత్‌రూమ్ కేసి తీసుకుపోయాడు.

తువాలు ఆమె చేతికిచ్చి "సరిగా స్నానం చేయి, శరీరం అంతా బురదగా వుంది" అన్నాడు.

ఆమె బుర్ర ఊపుతూ "నాకు బాగా ఆకలిగా వుంది. కూడా కడుపులో మంటగా వుంది" అంది.

"త్వరగా స్నానం చేసిరా! తిందువు గాని" అన్నాడతడు.

అతని మాట వినగానే ఆమె బట్టలు విప్పేసింది. పెట్టీకోటు వగైరా ఏమీ లేవు. తన ఎదురుగా ఎటువంటి సంకోచం లేకుండా నగ్నంగా నిలబడిన ఆమెను చూసి శివదాసు ఉలిక్కిపడ్డాడు.

"సిగ్గు ఆమె ఎప్పుడో మర్చిపోయింది" అనుకున్నాడు అతను.

ఆమె శుష్కశరీరం మీద నరాలు బయటకు పొడుచుకువచ్చాయి. అతను వెంటనే ముఖం తిప్పుకున్నాడు. ఏదో అనుమానం వచ్చి మళ్ళీ చూసేసరికి ఆమె వీపు మీద పెద్ద పుండు కనబడింది. గాయం చాలా వరకు మానిపోయింది. కాని ఒకవైపు నుంచి చర్మం ఊడిపోయి ఎర్రగా కన్పిస్తోంది.

"ఇది ఎలా జరిగింది పిల్లా?" ఆందోళనగా అడిగాడు శివదాసు.

"నా ఏడుపు ఆపడానికి తాజుద్దీన్ వేడి పట్టకారుతో వాత పెట్టాడు" అలా చెపుతున్నపుడు ఆమె పెదాలపై కొంచెం వెకిలిగా నవ్వు కనబడింది కానీ శివదాసు మాత్రం అవాక్కయిపోయాడు.

"అతడు నన్ను ఇంకా బెదిరించాడు - నీ గదిలో కనుక అతిథులు వున్నప్పుడు నువ్వు కనుక అరిచావో ముక్కలు, ముక్కలుగా నరికేసి నది ఒడ్డున పాతేస్తాను అన్నాడు. తరువాత నేను మౌనంగా ఏడుస్తుండేదాన్ని. అతడు ఏం చెప్పినా చేసి తీరాల్సిందే!!"

జుమైలా స్నానంచేసి వచ్చేలోపు శివదాసు ఫ్రిజ్‌లోంచి బ్రెడ్, పాలు బయటకు తీసాడు. పాలు వెచ్చపెట్టేడు. బ్రెడ్ మీద నెయ్యిరాసి పెనంమీద వేయించి కంచంలో పెట్టి బల్లమీద ఉంచాడు.

జుమైలా ఇంకా బయటకు రాలేదు. ఈలోగా శివదాసుకి మరో విషయం గుర్తొచ్చింది. అతను బెడ్‌రూంలోని అలమారా దగ్గరకు వెళ్ళాడు. చాలా రోజులుగా తెరవక పోవడం వల్ల అది అంతా దుమ్ములో ఉంది. అలమారా తెరిచాడు. ముక్కవాసన వేస్తున్నా అది అతనికి ప్రియంగా అన్పించి వాసన చూసాడు. అన్ని అరలలోనూ రంగు రంగుల బట్టలు సర్ది ఉన్నాయి. వాటిని ఇటుఅటూ తడుముతుంటే అతని చేతులలో వణుకు బయలుదేరింది.

ఒక లంగా, జాకెట్టు తీసి చూశాడు. జుమైలాకి సరిపోతుందనుకున్నాడు. బట్టల వాసన చూస్తూ అతడు హాల్‌లోకి వచ్చాడు. అవి ఒళ్ళో పెట్టుకొని జుమైలా గురించి ఎదురుచూస్తున్నాడు.

స్నానం చేసి తువ్వాలు కప్పుకొని జుమైలా బయటకు వచ్చింది. ఆమెకేసి చూడటానికి కూడా సాహసం చేయలేక శివదాస్ ఆమె ముందుకు బట్టలు తోసాడు. ఏదారి గుండా ఆమె బెడ్‌రూం కేసి వెళ్ళిందో అక్కడ నేలమీద నీటిచుక్కలు ఏర్పడ్డాయి. తన కూతురికి స్నానం

చేయించడం అతనికి గుర్తు వచ్చింది. బట్టలు వేసుకుని సంతోషంగా పరిగెత్తు కుంటూ ఆమె బయటికి వచ్చింది. ఆమెను చూసి శివదాసు విభ్రమంలో పడిపో యాడు. పరికిణీ రెండు చేతులతో పట్టు కుని కుడి ఎడమల వైపు త్రిప్పుతూ "నాకు సరిపోయాయి" అంది.

"సరే, మాటలు తరువాత. తిండి చల్లారిపోతుంది" అన్నాడు శివదాసు. వెంటనే ప్లేటు చేతిలోకి తీసుకుని బ్రెడ్ పూర్తిగా తినేసింది. పాలగ్లాసు అడుగున వున్న పంచదారనువేలితో తీసి నాకుతూ "నా కడుపు నిండి పోయింది" అంది. శివ దాసుకి దగ్గరగా కుర్చీలో కూర్చొని ఆమె ఆవలింతలు తీస్తూ "నాకు నిద్రొస్తోంది" అంది.

అనువాదం :
డా॥ హెచ్.ఎస్.ఎమ్. కామేశ్వరరావు

అకస్మాత్తుగా ఆమె దృష్టి షోకేస్ కేసి పడింది. పరుగెట్టుకుంటూ వెళ్ళి అద్దం జరిపి ముఖమల్‌తో చేసిన ఎలుగుబంటి బొమ్మ తీసింది. ఆమె కళ్లల్లో ఆనందం వెల్లివిరిసింది.

"నేను ఇది కొద్దిసేపు నా దగ్గర ఉంచు కోనా" ముద్దుముద్దుగా అడిగింది. శివ దాసు తల ఊపాడు. కన్నీళ్ళు ఆపుకోవడా నికి లేచి బెడ్‌రూం కేసి వెళ్ళిపోయాడు. అతను దుప్పటి మారుస్తున్నప్పుడు ఎలు గుబంటి బొమ్మను గుండెలకు హత్తుకుని జుమైలా ఆనందంగా అతని దగ్గరకు వచ్చింది.

"నేనెక్కడ పడుకోవాలి? " ఆమె అమా యకంగా ప్రశ్నించింది.

"నీ గురించే పరుపు మీద కొత్త దుప్ప టేసాను. నేను క్రింద చాప మీద పడుకుం టాలే"

"నేల మీద ఎందుకు? పరుపు మీద ముగ్గురు పడుకోవడానికి చోటు ఉంది కదా" జుమైలా వింతగా అడిగింది.

జుమైలాలో భయం తొలగిపోతున్నం దుకు శివదాసుకి బాగుందనిపించింది. ఆమె ఉత్సాహంగా పరుపు మీదికి ఎక్కి ఎలుగుబంటిని గుండెకు హత్తుకుని సంతో షంగా నిద్రలోకి జారుకుంది. ఆ దృశ్యం శివదాసు మనసును పిండినట్టయింది. అతడు వెంటనే వణుకుతున్న చేతులతో అలమారాలోంచి రంగు రంగుల పువ్వుల దుప్పటి వెదికి తీసాడు. అది విప్పి జుమై లాకి కప్పుతుంటే ఆమె అల్లరిగా సగం కళ్ళు తెరిచింది. తన కూతురు కూడా అలాగే సగం కళ్ళు తెరిచి అల్లరిగా నవ్వడం అతనికి గుర్తొచ్చింది. శివదాసు ఆమె చెవుల దాకా దుప్పటి కప్పాడు. తన కూతురుకి కూడా అలాగే చేస్తే బాగుం డేది. ఆ తరువాత అలవాటు ప్రకారం ఆమె నుదుటి మీద ముద్దు పెట్టుకుని "గుడ్‌నైట్ పిల్లా" అన్నాడు.

దీపం ఆర్పేసి శివదాసు చాప మీద పడుకున్నాడు. తనని ఎవరో "గుడ్ నైట్ నాన్న" అన్నట్లు వినబడింది. సందేహం లేదు, నిజంగానే వినబడింది. అతనికి నిద్ర రావడం లేదు.


"జుమైలా" అతను మెల్లగా పిలిచాడు. ఆ పిల్ల జవాబు ఇవ్వలేదు. బహుశా నిద్ర పోయిందేమో, గట్టిగా పిలిచాడు ఆమె మేలుకొంది.

"అమ్మా! నేను కాసేపు నీ దగ్గర పడు కోనా? "

"తప్పకుండా!" సగం నిద్రలోనే ఆమె జవాబిచ్చింది.

శివదాసు లేచి జుమైలా దగ్గర పడుకు న్నాడు. కళ్ళలో కన్నీళ్ళు రానివ్వకూడదని అతను నిశ్చయించుకున్నాడు కానీ పడుకో గానే జుమైలాని గుండెలకు హత్తుకొని వెక్కివెక్కి ఏడ్వసాగాడు.

తెలుగు కథ



అపాత్ర పింఛను

- గాడేపల్లి సుబ్రహ్మణ్యం

సుబ్బారావు ఏసీటీవోగా పనిచేసి రిటైరయ్యారు. సర్వీసులో ఉన్నప్పుడు ఏం సంపాదించారో..? ఎలా సంపాదించారో..? అన్న విషయం అందరికీ తెలిసినదే! కానీ పెన్షను కూడా ప్రభుత్వం వారు ఇచ్చేది రిటైరయినప్పుడు ఉన్న జీతం కంటే కూడా ఎక్కువ తీసుకున్నారు. డెబ్బై నాలుగు వయస్సు వచ్చింది. చిన్నా చితకా

రోగాలు తప్ప చెప్పుకోదగ్గ జబ్బులు దగ్గరకు రాలేదు. పిల్లలిద్దరూ పెళ్లిళ్ళై వారివారి ఉద్యోగాలు చేసుకుంటున్నారు. చిన్నవాడి దగ్గర కొన్నాళ్లూ, పెద్దవాడి దగ్గర కొన్నాళ్లూ ఉంటూ దంపతులు చీకూచింతా లేకుండా బతికేస్తున్నారు.

అయితే కాలం ఎప్పుడూ ఒకలా ఉండదు కదా! భార్య లక్ష్మి ఒక రోజు రాత్రి నిద్రపోయింది.. తెల్లారి లేవలేదు. ఒక డాక్టరుని పిలిచే అవకాశం ఇవ్వకుండా ఆమెకు శాశ్వత నిద్ర పట్టింది. దినవారాలు ఘనంగానే చేశారు.

కోడళ్ళుకూడా మామగారికి టైముకు భోజనం, కాఫీలు, ఫలహారాలు ఇస్తూ ఆయన్ని బాగానే చూసుకునేవారు. అయితే భార్య ఉన్నప్పుడు అవసరాలు కనుక్కొని చూసుకోవడం జరిగేది. అది పోయి ఇప్పుడు అడగాల్సిన అవసరం వస్తోంది. భార్య పోయాక ఆయన ఆరోగ్యం కూడా అంతంత మాత్రంగానే ఉంటోంది.

ఆ సమయంలో సుబ్బారావు దూరపు బంధువు కొడుకు ముప్పై అయిదేళ్లవాడు అకస్మాత్తుగా స్కూటర్ యాక్సిడెంటులో పోయాడు. అతనికి భార్య, పదేళ్ల కొడుకు ఉన్నారు. ఏదో ప్రైవేటు కంపెనీలో పని చేసేవాడు. ఆ కంపెనీ ఇచ్చిన డబ్బు పోయినప్పుడు కర్మలు కోసం సరిపోయింది. వారికి సుబ్బారావు నెలనెలా ఓ వెయ్యిరూపాయలు ఇచ్చేవాడు. ఆ డబ్బుకి ఏ ఖర్చు సరిపోతుంది. బంధువుల్లో ఎవరికి తోచింది వారు ఇచ్చి ఆ కుటుంబాన్ని వీధిన పడకుండా చేశారు. అయితే ఇలా ఎంతకాలం చేస్తారు?

సుబ్బారావుకి ఈ మధ్య రాత్రుళ్లు సరిగ్గా నిద్ర పట్టడం లేదు. అంతర్మథనం ఎక్కువయింది. ఈ జీవితం ఏమిటి? ఎందుకు? దానికో అర్థం ఉందా? పునర్జన్మ ఉంటుందా? పాపపుణ్యాలు జమ ఉంటాయా? ఇటువంటి ప్రశ్నలకు సమాధానాలు వెతుకుతున్నారు. ఆధ్యాత్మిక పుస్తకాలు చదవడం, భక్తి ఛానల్, జీయర్‌స్వామి ప్రవచనం వినడం వంటివి చేసేవారు. అయినా ఆయనకు సమాధానాలు దొరకలేదు.

ఒక రోజు ఉన్నట్టుండి ఒక ఆలోచన వచ్చింది. 'మళ్ళీ పెళ్ళి చేసుకుంటే ఎలా ఉంటుంది? అని.. అయితే ఈ ఆలోచన వెనక స్వార్థంలేదు. తనకి ఇరవై అయిదు వేల వరకూ పెన్షను వస్తోంది. తను ముందు పోయి భార్య బతికుంటే, ఆవిడ పోయేంతవరకూ దానిలో సగం పెన్షను ఆవిడ జీవితాంతం వచ్చేది. ఇప్పుడు ఆవిడపోయింది కాబట్టి, తనుపోతే ఆ పెన్షను పూర్తిగా పోతుంది. తను ఉండగా వేరే పెళ్ళిచేసుకుంటే తను పోయాక ఆవిడకి సగం పెన్షను వస్తూ ఉంటుంది. తన దూరపు బంధువు పోయాక అతని భార్య ముప్పై ఏళ్ల వయస్సులోనే విధవరాలయి, ఆర్థిక ఇబ్బందులు పడుతోంది. ఇప్పుడు ఆ అమ్మాయిని తను రిజిస్టర్ పెళ్ళి చేసుకుంటే తనుపోయాక ఆవిడకు జీవితాంతం ఎంతో కొంత పెన్షను వస్తుంది, పేరుకి పెళ్లి కానీ ఆవిడ వేరేనే ఉంటుంది. దీనిలో ఏ విధమైన వికారాలకీ లోను కావలసిన అవసరం లేదు' అని మనసులో అనుకున్నాడు.

తన మనసులోని ఆలోచనని ఇద్దరు కొడుకులతో చెప్పారు. కోడళ్లతోకూడా ఈ విషయం చర్చించారు.

ముందు అందరూ "ఛ ఛా" అన్నా ఆయన వివరంగా చెప్పాక దానిలో అంగీకరించకపోవడానికి ఆర్గ్యుమెంట్లు దొరకలేదు. పోతే అవతల పార్టీ.. అంటే ఆ విధవరాలికి నచ్చచెప్పడానికి చాలా రోజులు పట్టింది. చివరికి అంతా "ఓకే" అనుకున్నాక రిజిస్ట్రారు ఆఫీసులో నోటీసు ఇచ్చి, పిల్లలిద్దరూ సాక్షులుగా సుబ్బారావు

మళ్ళీ పెళ్లి కొడుకు అయ్యారు. రిజిస్ట్రారు ఆఫీసునుంచి అటే వాళ్లింటికి వెళ్లింది కొత్త పెళ్లికూతురు సంధ్య. లాంఛనంగా అబ్బాయి దత్తత కార్యక్రమం కూడా అయ్యింది.

సంధ్య వాళ్లబ్బాయి శ్రీనివాస్‌కి పదేళ్లు. స్కూల్లో ఇంటి పేరు మార్చడానికి డిక్లరేషన్ ఇచ్చి తను మళ్లీ పెళ్లిచేసుకున్న సంగతి సుబ్బారావు ప్రభుత్వానికి తెలియజేసి, కావలసిన కాగితాలు అన్నీ సమకూర్చగలిగారు. పరపతిగల సుబ్బారావు రెండో పెళ్లి చేసుకున్న రోజునుంచి తన పెన్షనులోనుంచి సగం సంధ్యకి ఇవ్వడం మొదలు పెట్టారు. అందుకు సుబ్బారావు పిల్లలు కూడా ఒప్పుకున్నారు.

★ ★ ★

సుబ్బారావు కూడా భార్యలాగే ఒక రోజు నిద్రలేవలేదు. సంధ్య తన జీవితంలో రెండోసారి విధవ అయింది. అయితే పెళ్లి అయ్యాక కూడా బొట్టూ అదీ పెట్టుకోకుండా అలవాటు చేసుకున్నందువల్ల పెద్దమార్పు కనిపించలేదు. పెన్షను ఆవిడకి డైరెక్టుగా రావడం మొదలైంది. సుబ్బారావు పిల్లలతో సంధ్యకు ఎప్పుడూ రాకపోకలు లేవు. ఇప్పుడూ లేవు. ఎవరి బ్రతుకులు వాళ్ళు బతుకుతున్నారు. సంధ్యకి ఆర్థిక ఇబ్బందులు తీరాయి. కుర్రాడిని చదివించి బి.ఏ., బి.ఎల్. చేయించింది. శ్రీనివాస్ బి.ఎల్.లో సహాధ్యాయిని ఊర్మిళని చేసుకుంటానంటే సంధ్య అభ్యంతరం చెప్పలేదు. శాఖ మార్పు వంటి చిన్న విషయాలని పట్టించుకోవడం ఎప్పుడో మానేసింది.

కొడుకూ, కోడలూ ఇద్దరూ లాయర్లు. ఇద్దరూ రెండు చేతులా సంపాదించకపోయినా హాయిగా బతకడానికి సరిపడా సంపాదిస్తున్నారు. ఇంతలో సుప్రీంకోర్టు తీర్పు ఒకటి వచ్చింది. రెండో భార్యకు కూడా భర్త సంపాదన మీద హక్కు ప్రసాదిస్తూ. సుబ్బారావుగారి పిల్లలు, శ్రీనివాస్ దంపతుల ఆర్థికస్థాయి కన్నా ఎన్నోరెట్లు పైనున్నారు. ఆయన ఆస్తిని అనుభవిస్తున్నారు. ఒక రోజు ఊర్మిళా శ్రీనివాస్‌లకు జీవితాన్ని మార్చేసే ఓ ఆలోచన వచ్చింది. సుబ్బారావు ఆస్తిలో వీళ్లకి కూడా వాటా ఉండాలని! ఈ ఆలోచన విషయం సంధ్యకి చెప్పకుండా సుబ్బారావు ఇద్దరు అబ్బాయిలకీ నోటీసులు జారీ చేసారు ఊర్మిళ, శ్రీనివాస్‌లు.

ఈ నోటీసులు చూసి సుబ్బారావు అబ్బాయిలూ, కోడళ్లూ అవాక్కయ్యారు. చట్టపరంగా సంధ్య సుబ్బారావు విధవ భార్య అన్న విషయం ప్రభుత్వం నిర్ధారించింది. కానీ ఆస్తిలో వాటా అడగడం ఎంతవరకు సబబుగా అనిపించి నోటీసులిప్పించిందో.. అడగడానికి సంధ్య ఇంటికి వెళ్లారు సుబ్బారావు కొడుకులు, కోడళ్ళు. ఆ సమయంలో ఊర్మిళ శ్రీనివాస్‌లు కోర్టుకి వెళ్ళారు.

కానీ అక్కడి పరిస్థితి మరోరకంగా ఉంది. ఈ నోటీసులు ఇచ్చిన సంగతి సంధ్యకి తెలిసింది. అప్పటివరకూ సుబ్బారావుగారు ఆ కుటుంబానికి దేవుడు. అలాంటివాడికి ఈ ద్రోహం తలపెట్టడం ఆవిడకి మింగుడుపడలేదు. అందుకే కొడుకూ కోడల్ని కోర్టుకి వెళ్లనిచ్చి నిద్ర మాత్రలు మింగింది సంధ్య.

సుబ్బారావుగారి అబ్బాయిలు తలుపు తడుతూ ఉంటే ఎంతకూ తలుపు తియ్యలేదు. ఇరుగుపొరుగువారు వచ్చి తలుపులు బాదినా లాభం లేకపోయింది. కిటికీలోంచి చూస్తే అప్పటికే అంతా అయిపోయింది.

ఊర్మిళా శ్రీనివాస్‌లు వచ్చి తలుపులు విరగ్గొట్టి లోపలకి కెళ్లారు. చిలక ఎప్పుడో ఎగిరిపోయింది. లాయర్ బుద్ధి ఇంత పని చేస్తుందని వారి ఊహకు కూడా అందలేదు. Ⓥ

కన్నడ కథ

- ఈశ్వరచంద్ర

మునెమ్మ

అమ్మాయిని మెట్టినింటివారికి అప్పగించేటప్పుడు ము నెమ్మ తల్లితండ్రులు చాలా ఏడ్చారు. అందరు తల్లిదండ్రులూ ఏడుస్తారు. పద్దెనిమిది, ఇరవైయేళ్లు కంటి ముందు పెరిగిన కన్నబిడ్డను జీవితాంతం విడిచి ఉండటం కష్టం. కానీ మునెమ్మ విషయంలో మరొక బాధాకరమైన విషయం ఉంది. ఆమె పుట్టుగుడ్డి. భర్త ఇంటి అపరిచిత వాతావరణానికి ఎలా సర్దుకుంటుందో? అని తల్లిదండ్రుల బెంగ.

పుట్టింట్లో ఉన్నప్పుడు ఇల్లు, ఇంటి చుట్టుపక్కల స్థలాలు బాగా పరిచయమైనందువల్ల ఎవరి సహాయమూ లేకుండా ఆమె పాటికి ఆమె తిరుగుతూ తనకు సాధ్యమైన పనులన్నీ చేసుకునేది. రాను రాను పనిచేయడం ఆమెకు ఎంత అలవాటైపోయిందంటే ఆమె తల్లి తన కూతురు గుడ్డిదనే విషయమే మరిచిపోయింది. ఉదయం లేచి కసువు చిమ్మి ముంగిట్లో కళ్ళాపి చల్లేది. పాత్రలు కడిగేది, పిండి విసిరేది. పక్కింటి పుట్టీరి వెంబడి చెరువు పోయి బట్టలు ఉతుక్కుని వచ్చేది. తల్లికి ఆమె భారమే కాలేదు.

చిన్నపిల్లగా ఉన్నప్పుడు మాత్రం తల్లికి చాలా కష్టంగా ఉండేది. ఆమె కూతురి పట్ల అప్పుడప్పుడు విసుక్కోవటమూ జరిగింది. అయితే మునెమ్మ కళ్లు కనిపించక బురదలోనో, రొచ్చులోనో పడి లంగాను మురికి చేసుకుని వచ్చినప్పుడు తల్లికి హృదయం పిండినట్టయ్యేది. మునెమ్మ పెరిగి పెద్దవుతున్నకొద్దీ ఆమెను చూసుకునే బాధ్యత తల్లికి తగ్గినప్పటికీ, ఆలోచన మాత్రం పెరుగుతూనే ఉంది. ముందు ముందు ఈమె గతి ఏమిటి? అని. తామిద్దరు ఉన్నన్ని రోజులు సరే. ఆ తరువాత?

మునెమ్మ లక్షణంగా పెరిగింది. కళ్లు లేవు అనే లోపం తప్ప ఆమెను చేయి కడుక్కుని ముట్టుకోవాలి- అలాంటి అందమైనరూపం ఆమెది. దేవుడు మంచి స్వరాన్ని కూడా ఇచ్చాడు. ఆమె పల్లెపదాలు పాడగా వినడమే ఒక అందం, ఆనందం.

దేవుడి సృష్టిలో మునెమ్మకూ ఒక భర్త పుట్టాడు. అన్నసంద్రానికి చెందిన మునెప్పణ్ణ అనే బీదవాడతను. చదవటం, రాయటం రాని పల్లెటూరి పిల్లవాడు. అతను ప్రైమరీ స్కూల్లో జవానుగా ఉండేవాడు. అతడికి నెలకు ముప్పై రూపాయల జీతం. సొంత పెంకుటిల్లు ఉంది. ఖాళీ సమయంలో వెదురు చీల్చి బుట్టలు అల్లేవాడు. అతడి ఒంటరి జీవనం ఎలాగో సాగిపోయింది. అతడి బీదతనంలో శుల్కం ఇచ్చి కన్యను తెచ్చుకునే చైతన్యం లేదు. చుట్టుప్రక్కల ఉన్న బంధువులు ఎవరూ సహాయం చేసే స్థితిలో లేరు. తండ్రి చనిపోయిన తరువాత శ్రాద్ధకర్మలు చేయడానికి చేసిన రెండు వందల రూపాయల అప్పు ఇంకా తల మీదనే

కూర్చునుంది.

అయితే మునెప్పణ్ణకూ వివాహయోగం కలిసి వచ్చింది. శుల్కం ఇవ్వకుండా, అధిక ఖర్చు చేయాల్సిన అవసరం లేకుండానే మునెమ్మ అతడి భార్య అయింది. భార్య గుడ్డిదైతే ఏమి? లక్షణంగా ఉంది. ఎవరి సహాయమూ లేకుండా ఇంటి పనులు చేసుకుని పోతుంది. దాంతోపాటు బుట్టలు అల్లడం నేర్పిస్తే రోజుకు ఓ ఎనిమిదణాలు సంపాదించవచ్చు. భార్యకు ఇంతకంటే ఏమి అర్హతలు కావాలి? బంధువులు ఎవరు ఎన్ని మాటలు చెప్పినా మునెప్పణ్ణ చెవులు లొంగలేదు. మునెమ్మను ధైర్యంగా చేయి పట్టుకుని తన ఇంటికి తెచ్చుకున్నాడు. మునెమ్మ జీవితపు చీకట్లో ఇప్పుడు దీపాన్ని వెలిగించి పెట్టినట్టయింది.

కొత్త ఇంటిని సర్దుకోవటం ఆమెకు కష్టంగానే అనిపించింది. ఎన్నిసార్లు గోడకు ఢీకొట్టుకుందో, ఎన్నిసార్లు పాత్రలు పడవేసిందో! తల్లి అల్లుడింట్లో నాలుగు రోజులుండి అన్నీ సర్దిపెట్టి, కూతురికి గురుతులు చెప్పి వొదల్లేక వొదల్లేక వొదిలిపోయింది. మునెమ్మ కొత్త సంసారం మొదలైంది.

మొదటిసారి భర్త కౌగిట్లో మునెమ్మ అడిగింది.

"నేను గుడ్డిదాన్నని మీకు విసుగా? "

"లేదు మునెమ్మా. నీవు గుడ్డిదానివైతే ఏమి? నేను నీకు కన్నులు కానా? " అన్నాడు మునెప్పణ్ణ.

మునెమ్మ సంతోషంతో ఏడ్చింది. గద్గద కంఠంతో "మీరు దేవుళ్ళు" అంది. మునెప్పణ్ణ ఆమె కన్నీళ్లు తుడిచి, మాటలు మరిపించడానికి "అది కాదు మునెమ్మ నీ పేరుతో నిన్ను పిలవటం పెద్ద తిప్పలయింది నాకు" అన్నాడు.

ఆమె కంగారుగా "ఎందుకు? " అంది.

"నిన్ను పిలిస్తే భార్యను తల్లీ అని పిలిచినట్టు అవుతుంది కదా? "

మునెమ్మ ఫక్కున నవ్వింది. నవ్వుతూనే.. "అలాగైతే మున్నీ అనండి" అంది.

"మున్నీ"

"ఓ..."

"మున్నీ"

"ఓ... అన్నాను"

"ఓ...ఓ...ఓ..."

★ ★ ★

మునెమ్మ పక్కింట్లో తిమ్మరాయి అనే పిల్లవాడు ఉన్నాడు. వాడికి పధ్నాలుగేళ్ల వయస్సు. ప్రైమరీ స్కూలు చదువు ఆగిపోయింది. తండ్రి పశువులు కాయటానికి వొదిలాడు.

మునెమ్మ మునెప్పణ్ణ భార్యగా వచ్చిన తరువాత వారింటికి తిమ్మరాయి రాకపోకలు ఎక్కువయ్యాయి. "యక్కా... యక్కా" అంటూ ఆమె చెప్పిన పనులన్నీ చేసిపెట్టేవాడు. అంగడి నుంచి కావలసిన సామాన్లు తెచ్చిచ్చేవాడు. అందులోనే చిల్లర డబ్బులు కొట్టేసేవాడు.

ఇంట్లో ఉన్న నాలుగు గేదెలను ఉదయమే తోలుకుపోయి గుట్టల పొదల్లో గడ్డి మేయించి చెరువులో నీళ్లు తాపించుకుని పది గంటలకంతా ఇంటికి తోలుకుని వస్తే తిమ్మరాయి పని అయిపోతుంది. అటు తరువాత వాడు రాజా. మునెమ్మ ఇంటికి వచ్చి ఆమె ఏదైనా ఇస్తే తినటం, ఏదైనా

చెపితే తెచ్చివ్వటం. లేదంటే ఊళ్లో బలాదూరుగా తిరగటం..

తిమ్మరాయి వయసుకు మించి పెరిగాడు. వాడిలో కామం కళ్ళు తెరుస్తోంది. జతగాళ్లు పశువులను తోలుకుని మేతకు వెళ్ళినపుడు, పశువులు కాసే అమ్మాయిలతో చేసే కుర్రచేష్టలను చెబుతున్నప్పుడు నోరు వెళ్లబెట్టుకుని వినేవాడు. అతడిలో కుతూహలం రోజురోజుకూ రెక్కలు విప్పుతోంది. తెరచాటున్న స్త్రీ దేహంపై తీరని ఆశలను రేకెత్తిస్తోంది.

ఒకసారి పశువులను మేతకోసం తోలుకుపోయినపుడు అతడి తలలో పురుగు కొరికినట్లయ్యింది. ఇన్నాళ్ళు స్ఫురించనే లేదు కదా! అనుకున్నవాడు అనుకున్నట్లుగా పశువులను పరుగెత్తించుకుంటూ ఇంటికొచ్చాడు. ఇంత త్వరగా వచ్చినందుకు ఇంట్లో వాళ్లు అడిగితే.. ఏదో సమాధానం చెప్పి కొంచెంసేపు అటూ ఇటూ తిరిగి తరువాత మెల్లగా మునెమ్మ ఇంట్లోకి దూరాడు.

మునెప్పణ్ణ ఎనిమిది గంటలకు స్కూలుకు వెళతాడు. మునెమ్మ అంతలో అతడికి రొట్టె కాల్చి ఇస్తుంది. లేకపోతే సద్ది ముద్ద ఉంటే ఉప్పు మజ్జిగ వేసుకుని చీకి తిని, నీళ్ళు తాగి స్కూలుకు వెళతాడు. మధ్యాహ్నం ఇంటికి రావడం పన్నెండున్నరకు. అప్పుడు భోజనం. తరువాత కొద్దిసేపు పడుకుంటాడు. మూడుగంటలకంతా హెడ్‌మాస్టర్ ఇంటికి వెళ్లి ఏమైనా పని ఉంటే చేసి పెట్టడం, సాయంత్రం ఇంటికొచ్చి వెదురు చీల్చి, బుట్టలు అల్లడం. ఇదీ మునెప్పణ్ణ దినచర్య.

తిమ్మరాయి మునెమ్మ ఇంట్లోకి వచ్చినప్పుడు మునెప్పణ్ణ లేడు. అప్పటికే స్కూలుకు వెళ్లాడు. మునెమ్మ వంట ఇంట్లో రొట్టెలు ఒత్తుతోంది. తిమ్మరాయి సద్దు చేయకుండా తలుపు దగ్గర నుంచుని చూశాడు. కళ్లున్నదానిలా మునెమ్మ రొట్టెలు ఒత్తుతోంది. కాల్చుతోంది. రొట్టె కాలటం ఆమెకు ఎలా తెలుస్తుందో? పొయ్యి మంట దగ్గర ఎలా జాగ్రత్తగా ఉంటుందో అని తిమ్మరాయి మొదటిసారిగా మునెమ్మ గురించి ఆలోచించాడు. అతడికి మునెమ్మ ఒక ఆశ్చర్యంగా కనిపించింది. "యక్కా" అని పిలవాలనుకున్నవాడు ఊపిరి బిగపట్టి నుంచున్నాడు. ఆమె రొట్టెలు చేయడం పూర్తవుతోంది అనిపించగానే తిమ్మరాయి సద్దుచేయకుండా అలాగే స్నానాల గదిలోకి వెళ్ళి మూలలో దాక్కుని నుంచున్నాడు.

తరువాత ఐదు నిముషాల్లో తల వాకిలి తలుపు చేరవేసి మునెమ్మ స్నానాల గదిలోకి వచ్చింది. చేతిలో మడిచి పట్టుకుని వచ్చిన చీరను కట్టమీద పెట్టి జాలాట్లోకి దిగింది. మొదట రవిక విప్పి మూలకు వేసింది. అది వచ్చి తిమ్మరాయి మీద పడింది. వాడు అలాగే దెయ్యం పట్టినవాడిలా నుంచున్నాడు. గుండె దడదడా కొట్టుకోసాగింది. కాళ్ళు గజగజా వొణకసాగాయి. నాలుక ఎండిపోయింది. కళ్ళు బైర్లు కమ్మాయి. ఎదుట కలలా మునెమ్మ నిలబడి ఉంది. మసక వెలుతురులో ఆమె నిండు యవ్వనపు దేహం తిమ్మరాయికి కొత్తగా ఉంది. మునెమ్మ కూర్చుని నీళ్లు నింపుకుని ఒంటిమీద పోసుకుంటోంది. చవుడు మట్టితో ఒంటిని పరపరా రుద్దుకుంటోంది. ఆమె పాలిండ్లు పావురాల్లా ఎగురుతున్నాయి. మోరీలో జలజలమని నీళ్ళు ప్రవహించాయి. మునెమ్మ స్నానం చేసి లేచి నుంచుంది. చేతులతో తడుము కుంటూ ఉతికిన చీర చుట్టుకుని స్నానాల గది నుంచి బయటికి వచ్చేంతలో తిమ్మరాయి తలవాకిలి దగ్గరకి వచ్చాడు. మెల్లగా తలుపు తీయబోయాడు. కిర్ అంది. తిమ్మరాయి గుండె గుభేల్‌మంది. మునెమ్మ ఒళ్ళు దాచుకుంటూ "ఎవర్రా"? అంది.



"నేను తిమ్మను"

"ఓ నీవా, కొంచెం ఆగు, చీర కట్టుకుం టున్నాను" అని మునెమ్మ గబగబా చీర కట్టుకుంది. గొంతు పైనున్న రవిక లాక్కుని పావురాలను గూటికి చేర్చింది.

"రా తిమ్మా, ఏమి ఈవాళ చాలా తొంద రగా వచ్చేశావు? " అంది.

తిమ్మరాయి లోపల ఉండగానే తలుపు లాగి కిర్ అనిపించి, ఎద కొట్టుకుంటున్నా "ఏమో విసుగొచ్చి తొందరగా వచ్చాను" అన్నాడు. కొంచెం సేపు అక్కడే కూర్చుని తరువాత బయటికి పరుగెత్తాడు.

★ ★ ★

తిమ్మరాయికి ఇప్పుడు స్నేహితులతో చెప్పుకోవటానికో విషయం దొరికింది. తనకు కలిగిన అద్భుత అనుభవాన్ని వాడు కొండాజీ దగ్గర చెప్పుకున్నాడు. కొండాజీ ఆ ఊళ్లోని పోకిరి కుర్రాళ్ళ గురువు. పొగరుగా పెరిగాడు. మిడిల్ స్కూల్‌కు మూడేళ్ళు మన్నుమోసి చేతులు జోడించాక ఊరి దున్నపోతులా తిరగసా గాడు. వారి వీరి తోటల్లోని చెట్ల కాయలు దొంగిలించటం, చిక్కుడు కాయల కోతల ప్పుడు మూటలు మూటలు కాయలు దొంగిలించి సంతలో అమ్మడం అతడికి అలవాటు.

తిమ్మరాయి మాటలు అతడి నోట్లో నీళ్ళూరించింది. మునెమ్మ గుడ్డిది అనే కారణంగా ఇన్నాళ్లూ అతడి కంట పడ లేదు. 'ఇంత సులభంగా ఒక స్త్రీని చూడ గలిగే అవకాశాన్ని ఎందుకు వదులుకో వాలి? ' అనుకుని అతడు తిమ్మరాయి వెంటపడ్డాడు. తిమ్మరాయి దిగులుప డ్డాడు. ఎందుకు చెప్పానా అని తనని తనే తిట్టుకున్నాడు. మునెప్పణ్ణకు తెలిసిపోతే ఏమి గతి? అని భయపడ్డాడు. కొండాజీ వాడ్ని వొదల్లేదు. సంతలో శెనగపప్పు, మరమరాలు, ఉల్లిపాయ పకోడీలు కొనిస్తా నని ఆశ చూపించాడు. తిమ్మరాయి నోట్లో నీళ్ళూరాయి. మిరపకాయ బోండా రుచి నాలుకకు తాకినట్టయ్యింది.

"రేపు రా చూద్దాం" అని మాట ఇచ్చే శాడు. ఆ రేపు ఆదివారమైంది. మునెప్ప ణ్ణకు సెలవు రోజు. అతను ఇంటి ముందే వెదురు చీలుస్తూ కూర్చుని ఉన్నాడు. కొండాజీని చూసి "ఏమి కొండాజీ, ఈ వైపు వచ్చావు? " అన్నాడు.

"లేదు... హహహ... ఊరికే వచ్చాను... మా తిమ్మరాయి వెంట వచ్చాను" అని పళ్లు కొరికి ముఖం మాడ్చు కున్నాడు. మునెమ్మ లోపల కనిపిస్తుందా అని గుమ్మంలోంచి చూపులు లోపలికి పరిచాడు. కనిపించలేదు.

ఆదివారానికి ఓ సోమవారం ఉంటుంది. అదీ వచ్చింది. వాళ్ళూ వచ్చారు. మునెమ్మ స్నానాల గది తలుపు వేసుకోవటానికి ముందే లోపల దూరే శారు. సద్దు లేకుండా ఊపిరి పీలిస్తే ఎక్కడ తెలిసిపోతుందేమోనని ఊపిరి బిగ పట్టుకుని మూలలో గోడకు అంటుకుని నుంచున్నారు. మునెమ్మ ఎదపైకి చీర లాక్కునేటప్పుడు తన కాలు ఎక్కడ తొక్కి గుట్టు రట్టవుతుందేమోనని తిమ్మరాయి కంగారుగా కాలు వెనక్కి లాక్కున్నాడు. కొండాజీ ధూర్తుడైనా వొణికాడు. మునెమ్మ స్నానానికి దిగింది. తన మర్యాద నీరు కారిపోతున్న విషయం అవగాహన లేకుండా దుస్తులు విడిచింది. నీళ్ళు పోసు కోసాగింది. పావురాలు అటూ ఇటూ కదు ల్తున్నాయి.

"మునెమ్మా! తానం చేస్తున్నావా? " అని అరుస్తూ గీజమ్మ తలుపు తోసుకుని లోప లికి వచ్చింది. వచ్చినామె కొండాజీనీ, తిమ్మరాయినీ చూసి ఆశ్చర్యపోయింది. ఒక్కక్షణంలో వాళ్లు అక్కడికి ఎందుకు వచ్చారో అర్థమైంది. ఏమి చేయాలో తోచ లేదు.. అంతలో చెమటలు పట్టిన కొండాజీ నోటి మీద వేలు పెట్టి ఆమెను

ఊరుకోమన్నట్టు సూచించాడు.

గీజమ్మ భర్త వొదిలేసిన ఆడది. రెండు గేదెలు, రెండు ఆవులను పెట్టుకుని పాలమ్మి జీవితం సాగిస్తోంది. ఒంట్లోని కోరికలకు వాళ్లతో వీళ్ళతో స్నేహం చేసింది. కొండాజీ మూడు, నాలుగుసార్లు ఆమె ఇంటికి పొద్దుపోయాక వెళ్ళి వెన్న తిని, పాలు తాగి వచ్చాడు. అక్కడ పాలు, నెయ్యి సమృద్ధి. అలాంటి కొండాజీ ఇప్పుడు ఇక్కడ మునెమ్మ వొంటిని వొలిచి చూస్తున్నాడు.

గీజమ్మ దెయ్యం పట్టినదానిలా నుంచుండిపోయింది. అంతలో మునెమ్మనే-

"ఏమక్కా? " అంది.

"విసిరిన పిండి ఒక పావు కావాల్సి ఉండింది"

"అక్కడ ఉన్న మట్టిపాత్రలో ఉంది. తీసుకో అక్కా.. ఇప్పుడే స్నానానికి దిగాను"

అనువాదం : రంగనాథ రామచంద్రరావు

గీజమ్మ ఒక్క క్షణం ఏమి చేయాలో తోచక అలాగే నిలబడింది. కొండాజీ నోటి మీద పెట్టిన వేలును ఇంకా తీయలేదు. గీజమ్మ వంటింట్లోకి వెళ్లి పిండి తీసుకుంది. "సాయంత్రం విసిరి ఇస్తాను మునెమ్మా" అని అరిచి చెప్పి సమాధానానికి ఎదురుచూడక గబగబా వెళ్ళిపోయింది.

ఆ తరువాత ఏమైందో ఏమో! మరుసటి రోజు అదే సమయానికి కొండాజీ వచ్చినప్పుడు మునెమ్మ ఇంటి తలవాకిలి భద్రంగా వేసి ఉంది. బచ్చులు ఇంటి మోరీ నుంచి నీరు జలజలమని ప్రవహిస్తోంది. 'చేయిచ్చింది లంజముండ' అని తిట్టుకుంటూ కొండాజీ నేరుగా గీజమ్మ ఇంటికి వెళ్లాడు.

గేదెకు కుడితినీళ్ళు కలుపుతోంది గీజమ్మ.

"ఎందుకయ్యా పొద్దునే వచ్చావు? " అని ఏమీ తెలియనిదానిలా అడిగింది.

కొండాజీ లోపలికి వెళ్ళి రాతికట్టమీద కూర్చున్నాడు.

"పాపం కళ్ళు లేని ఆడపిల్లను ఇలా మోసం చేయొచ్చా కొండాజీ? "

"నీవు వెళ్ళి అంతా చెప్పేశావా? "

"లేదు స్వామీ!"

"మరి ఈరోజు తలుపు వేసి ఉంది"

"ఈ రోజూ వెళ్లావా? పెద్దమనిషి వయ్యా"

"చెప్పావా లేదా? ఎప్పుడు వెళ్ళావో చెప్పు? "

"సాయంత్రం విసిరిన పిండి ఇవ్వటానికి వెళ్ళాను. నీవు వచ్చావని చెప్పలేదు. ఎప్పుడూ సమయం ఒక్కలా ఉండదు. ఎవరంటే వాళ్ళు వస్తుంటారు. స్నానం చేయాలంటే తలుపు మూసి గడియ వేసుకుని చేయమన్నాను. అంతే" అని గీజమ్మ కిలకిలా నవ్వుతూ.. "అంతగా కావాలంటే నేను లేనా? " అని కొండాజీ చేయి పట్టి లాగి ఎదకు హత్తుకుంది. అతడు కరిగాడు.

★ ★ ★

మధ్యాహ్నం స్కూలు నుంచి మునెప్పణ్ణ వచ్చినప్పుడు ఇంటి తలుపు గాలికి కొట్టుకుంటోంది. పడసాలలో మునెమ్మ ఈత చాప మీద చేయి ఒత్తుగా పెట్టుకుని పడుకుని నిద్రపోయింది. లోపల వంటింట్లో లొచలొచమని వచ్చే సద్దు విని అతను అక్కడికి వెళితే ఒక నల్లకుక్క రొట్టె తినడంలో మునిగి ఉంది. మునెప్పణ్ణ పొయ్యి దగ్గరున్న ఆరిన కట్టెపేడును తీసుకుని కుక్కను ఒక్కదెబ్బ వేశాడు. అది కుయ్‌మని అరిచి కడవను దొర్లించి దబదబా బయటికి పరుగుతీసింది. తాగే నీళ్ళంతా నేలపై పడి రొట్టెలు తేలాడసా

'చతుర' నవలకు అంపశయ్య నవీన్ నవలా పురస్కారం

'చతుర' 2009 ఫిబ్రవరి సంచికలో ప్రచురితమైన శ్రీ వేంపల్లె గంగాధర్ **నేలదిగిన వాన** నవలకు **'అంపశయ్య నవీన్ నవలా పురస్కారం'** లభించింది. 2009 నుంచి 2011 మధ్య వెలువడిన ఆయా రచయితల తొలి నవలల్నే నిర్వాహకులు ఈ పురస్కారానికి పరిశీలించారు. ఈ నేపథ్యంలో 'నేలదిగిన వాన' పురస్కారం దక్కించుకుంది. గత ఏడాది కూడా చతురలో ప్రచురితమైన శ్రీ శిరంశెట్టి కాంతారావు నవల **'ఆకుపచ్చ విధ్వంసం'** ఈ పురస్కారానికి ఎంపికైన సంగతి విదితమే.



గాయి. ఇంతలో మునెమ్మ అదిరిపడి లేచి కంగారుగా ఎవరో దొంగ వచ్చాడేమోనని అరవసాగింది.

"నా గ్రహచారానికి ఈ గుడ్డి ముండను కట్టుకున్నాను కదప్పా. కుక్క వచ్చి రొట్టెలు తిన్నా, రొచ్చు చేసినా గురకలు పెడుతోంది.. లంజ ముండను తెచ్చి..." అని అరుస్తూ ఎదురుగా వస్తున్న మునెమ్మ ముఖం, మూతి చూడకుండా రెండు దెబ్బలు వేశాడు మునెప్పణ్ణ.

ఏమైందో తెలిసేలోపే మునెమ్మ దెబ్బలు తిని తడబడింది. ఆమె దృష్టిలేని కళ్ళలో ఏడుపు దిగ్గున తోసుకొచ్చింది. దెబ్బకన్నా అధికంగా భర్త మాటలు మండే కొరివిలా ఆమెకు గుచ్చుకున్నాయి.

"దరిద్రపు ముండా! ఆ కుక్క చేసిన రొచ్చు చూడకూడదా? నీవు ఒట్టి గుడ్డిదానివనుకున్నాను. నీకు చెవులు కూడా వినిపించవా? " అని గర్జించాడు మునెప్పణ్ణ. మునెమ్మ కాళ్లూ చేతులు వొణికాయి. ఆమె నుంచున్న చోటనే కూలబడి వెక్కి వెక్కి ఏడ్వసాగింది. మునెప్పణ్ణ రాతికట్ట మీద కూర్చుని, కళ్ళను గట్టిగా మూసుకుని తల కొట్టుకున్నాడు. చివరికి తల మీద చేయి పెట్టుకుని మౌనంగా కూర్చున్నాడు. కోపం కొంచెం తగ్గాక కడుపు కాలటం మునెప్పణ్ణకు తెలిసింది. ఆ వైపు గోడ పక్కన ముద్దగా మునెమ్మ పడి ఉంది. ఆమెను చూస్తుండగానే మళ్ళీ కోపం పొంగింది. పాపం కళ్ళు లేనిది అనే దానికన్నా ఎక్కువగా అలాంటిదాన్ని ఎందుకు పెళ్లి చేసుకున్నానురా దేవుడా! అని తిట్టుకున్నాడు.

హెడ్‌మాస్టర్ "తొందరగా భోజనం చేసి రా! తాలూకాకు వెళ్ళాలి" అని చెప్పాడు. అప్పటికే సమయం అయింది అని అనుకున్నవాడు నేలన పడి ఉన్నదానిని అలాగే వొదిలిపెట్టి, ఒక్క మాట మాట్లాడకుండా "వెళుతున్నాను" అని కూడా చెప్పకుండా వెళ్ళిపోయాడు. సద్దు అర్థమై "భోజనానికి..." అని అనుమానంగా అడిగినా, బిగుసుకున్న ఆమె క్షీణ స్వరం అతడికి వినిపించలేదో, వినిపించినా విసుక్కుని వెళ్ళాడో తెలియలేదు. మునెమ్మ చెవి యొగ్గి కూర్చునే వింది మునెప్పణ్ణ చెప్పుల కిర్ కిర్‌మనే సద్దు క్షీణమై చివరకు శూన్యమైంది. ఏమి చేయాలో తోచక, చుర్రుమంటున్న చెంపలను సవరించుకుంటూ కారుతున్న కన్నీళ్ళను చెరగులోకి ఇంకించసాగింది.

★ ★ ★

కూర్చున్నట్టే పొద్దు కరిగి చీకటి పడటం మునెమ్మకు అర్థమైంది. రోజూ దీపాలు వెలిగించే పని మునెప్పణ్ణది. లాంతరు చిమ్నీని తుడిచి, నూనె ఉందో లేదో చూసి అతను దీపం వెలిగించేవాడు. ఈవేళ ఎంతసేపయినా అతను రాలేదు. మునెమ్మకు చీకటి, వెలుతురూ ఒకటే. అయినా భర్త వచ్చినప్పుడు ఇల్లు చీకటిగా ఉండకూడదనుకుని లాంతరు వెలిగించటానికి ప్రయత్నించింది. దీపం చిన్నగా ఉందో, పెద్దగా ఉందో, పొగ వస్తుందో, మసిబారుతోందో తెలియలేదు. వంట పొయ్యి అయితే మంట వేడికి పొయ్యిలోని మంట ఎంత స్థాయిలో మండుతుందో తెలిసిపోయేది. చేయే కంటి పని చేసేది. ఇప్పుడు చేయి కూడా ఓడిపోయి కూర్చుంది. పక్కింటామెను పిలిచి దీపాన్ని సరిచేయించింది. అటు తరువాత వంట ఇంటిని శుభ్రం చేసి భర్త వస్తాడేమోనని ఎదురు చూస్తూ కూర్చుంది.

వీధిలో కాలి చెప్పు చరక్ పరక్ సద్దు వినిపిస్తే భర్త వచ్చాడేమోనని సిద్ధమయ్యేది. మళ్ళీ కాదని తెలిసినపుడు ఎదురు చూడటంలో జారిపోయేది. ఉదయం నుంచి ఆయన కడుపుకు ఏమీ లేదు. తనకూ లేదు. కోపగించుకుని ఎక్కడికి పోయారో? ఏమైనా తిన్నారో లేదో?

నూనె అయిపోయి దీపం ఎప్పుడో ఆరిపోయింది. అది ఆమెకు తెలియనే లేదు. ఆకలి కేకలు ఆపుకోలేక వంటింట్లోకి వెళ్ళి రెండు రొట్టెలను కంచంలో పెట్టుకుని పచ్చడి వేసుకుని కూర్చుంది. ఉదయం చేసింది ఇప్పుడు చల్లబడి గట్టిగా కరకర అంటోంది. ఎంత ప్రయత్నించినా సమాధానంలేని మనస్థితి వల్ల తినటానికి మనసొప్పలేదు. ఆమెకెందుకో తల్లి గుర్తొచ్చింది. ఏడుపొచ్చి చిన్నపిల్లలా ఏడవసాగింది.

★ ★ ★

రాత్రంతా మునెప్పణ్ణ రాలేదు. రాత్రంతా మునెమ్మకు నిద్ర లేదు. తెల్లవారేలోగా ఆమె భయంతోను, చింతతోను సగం చచ్చిన జీవియైంది. తిమ్మరాయిని కేకేసి పిలిచి హెడ్‌మాస్టర్ ఇంటికి వెళ్ళి విచారించుకుని రమ్మని చెప్పింది. వాడు అరగంటలో వెళ్ళివచ్చాడు. ఏదో పని మీద వారు తాలూకాకు పంపారట. ఈరోజు కాకపోతే రేపు రావచ్చుట.

అది విన్నాక ఆమె కాస్త సమాధానపడ్డది. అయినా తనకు చెప్పకుండా పోయినందుకు దుఃఖం. 'నేనే నీ కళ్ళలా లేనా?' అని చెప్పినతను ఇప్పుడు గుడ్డితనాన్నే ఎత్తిచూపుతూ తిట్టి కొట్టి పోయినందుకు భయం. ఎక్కడ వొదిలేసిపోతారో అనే బతుకు భయం. వీటి మధ్యనే మునెమ్మ మొత్తం పగలును ఎలా గడిపిందో? తిన్నదో, వొదిలేసిందో? చీల్చిపెట్టిన బద్దలను పెట్టుకుని ఒకటి రెండు బుట్టలు అల్లింది. విసుగొచ్చినప్పుడు వెనుకటి రోజు చేసి పెట్టిన ఎండిపోయిన రొట్టె తిన్నది. రాత్రికి భర్త రావచ్చని వేడి వేడిగా సంగటి, ఆకుకూర పప్పు చేసింది. దీపం వెలిగించి పెట్టి ఎదురుచూసింది. ఎనిమిది, తొమ్మిది గంటలప్పుడు భర్త వచ్చిన చప్పుడయ్యింది. చెప్పులు వదిలిన సద్దు. అలాగే ఆత్రంగా భర్త కరుణాపూరితమైన మాట కోసం ఎదురుచూస్తూ నుంచుంది.

"యెక్కా, మునెప్పణ్ణ వచ్చాడు" అని తిమ్మరాయి అనటం వినిపించింది. ఆశ్చర్యపోయింది. మళ్ళీ బెదిరింది. కోపం తగ్గిందో లేదో అని ఎదురుచూసింది. ఆతురత చెందింది. భర్త మాట్లాడలేదు.

"యెక్కా, మునెప్పణ్ణకు ఇంకా కోపం తగ్గలేదు" అన్నాడు తిమ్మరాయి. నిట్టూర్చింది. భర్త కాళ్ళు ఎక్కడున్నాయో తెలిస్తే పట్టుకుని 'నా తప్పంతా కడుపులో పెట్టుకోండి' అని వేడుకోవాలని తపించింది. మళ్ళీ బెదిరి మౌనం వహించింది. ఏడ్పు

వచ్చింది. పెదవులు కరిచి పట్టుకుంది.

"యెక్కా మునెప్పణ్ణకు భోజనం పెట్టవా? "

చీరచెంగుతో కన్నీళ్లు తుడుచుకుని కాళ్ళూ చేతులు కడుక్కోవటానికి నీళ్ళు ఇచ్చింది. కాళ్ళు కడుక్కుని పిచికారిలా నీళ్ళు ఉమ్మటం వినగానే వంటింట్లో చప్పుడు చేస్తూ కంచం పెట్టి అతను లోపలికి రాగానే ముద్ద, జోరుపప్పు వడ్డించింది. అతను మాట్లాడకుండా ముద్ద తుంచుకోవడం, చారులో దొర్లించుకోవటం, గుటుక్కున మింగటం, నమిలే చలనాల వల్ల ఈ పాటికి ముగించి ఉండొచ్చు అనుకుంటూ మరొక ముద్దను వడ్డించింది. మునెప్పణ్ణ మాట్లాడకుండా మింగుతున్నాడు. అతడి కోపం ఇప్పటికైనా తగ్గకూడదా? అని మునెమ్మ లోలోపల మథనపడసాగింది.

"యెక్కా నేను తినటానికి వెళతాను" అని తిమ్మరాయి పరుగెత్తాడు.

మునెప్పణ్ణ వొదిలేసిన కంచంలోనే మునెమ్మ ముద్ద పెట్టుకుని కూర్చుంది. ముక్కను గుటుకుమనేటప్పుడు పడసాలలో ఈత చాప మీద గుడారాన్ని, కంబళిని పరుస్తున్న సద్దు వినిపించింది. మునెమ్మ భోజనం ముగించి వచ్చేంతలో మునెప్పణ్ణ పడుకున్నాడు. ఆమె తలుపు వేసి అతడి పక్కకు వచ్చింది. చాలాసేపటి వరకు ఇద్దరూ మౌనంగా ఉన్నారు. కేవలం ఉచ్ఛ్వాస నిశ్వాసలు వినిపిస్తున్నాయి. అటు తరువాత మునెప్పణ్ణ ఆమె మీద చేయి వేశాడు. ఎదకు హత్తుకున్నాడు. అతడి కఠిన బాహువులు ఒంటిని బిగిస్తున్నాయి. మునెమ్మకు ఏడ్పు వస్తోంది. ఏడ్వటానికి కూడా ధైర్యం లేదు. మాట్లాడించాలో వద్దో అని వెనుకా ముందు చూస్తోంది. ఏమీ చేయక ఊరుకుంది. అతడి పట్టుకు ఒంటిని పరుస్తూ అతడ్ని లోనికి తీసుకుంది.

మునెప్పణ్ణ ఆమెను కలిశాడు. అతడి రభస, ఊపిరుల వేగం, భుజాల బిగువు ఆమెను ఆశ్చర్యపరిచింది. ఈ రోజు అతనిలో ఎన్నడూ లేని ఉత్సాహం కనిపిస్తోంది.

అతడు పక్కకు తిరిగిన తరువాత క్షమను యాచిస్తున్నట్టు అతడి ముఖం మీద చేతులు కదిలించింది. మీసాలు అడ్డుపడ్డాయి. మునెప్పణ్ణకు మీసాలు లేవు.

మునెమ్మకు ఒక్క క్షణంలో అంతా అర్థమైపోయింది. పక్కన ఉన్నవాడిని గట్టిగా

కాలితో జాడించి తన్ని దిగ్గున లేచి కూర్చుంది. "ఎవడ్రా నీవు? ఎవడివిరా?" అని కాళికలా గర్జించింది. చేతికి చిక్కాడే మోనన్నట్టు రోషంతో చేతిని విసిరింది. నేలకు చేయి తాకి దెబ్బ తగిలింది. గాజులన్నీ విరిగి ముక్కలయ్యాయి. "నోరు తెరిచి మొరగరా మర్యాదలేనోడా.." అని అరిచింది. లేచి పట్టుకుని కొడదామని ఆవేశం వచ్చినా, కళ్ళున్న వాడితో తన ఆట చెల్లుతుందా? అని దిగ్భ్రాంతితో నుంచుంది. అంతలో తలుపు గడియ తీసిన సద్దయి, ఎవరో పారిపోయిన చప్పుడైంది. తననే చీల్చి పొడిచి పొడిచి బుట్టలో నింపుకుని పోతున్నట్టయి మునెమ్మ నుంచున్న చోటనే కుప్పలా కూలింది. ఆమె కళ్ళ నుంచి నీళ్ళు ధారగా కారసాగాయి. చాలా సేపటి వరకు బోర్లా పడి ఏడ్చింది. ఒళ్ళంతా రోషం, నిస్సహాయత, తీవ్ర దుఃఖం కలిసి ఉడికిపోతోంది. కొద్దిసేపటి తరువాత లేచి కొట్టుకుంటున్న తలుపును మూసి మళ్ళీ బొంత మీద కూర్చుంది. పడుకోలేకపోయింది. ఒంటికంతా బురద మెత్తుకున్నట్టుంది. తన గుడ్డితనపు దౌర్భల్యాన్ని దురుపయోగం చేసిన పాపాత్ముడు పడుకున్న స్థలంలో తానూ పడుకోవటానికి ఆమెకు మనస్సు రాలేదు. గోడకు ఒరిగి అలాగే కూర్చుంది. తెల్లవారింది.

★ ★ ★

పొద్దున్నంతా మునెమ్మ పిచ్చిదానిలా కూర్చున్న చోటనే కూర్చుంది. పొయ్యి వెలిగించాలని, వంట చేయాలని, నీళ్ళు కాచాలని- ఆమెకు అనిపించలేదు. ఉదయం బస్సులో తాలూకా నుంచి బయలుదేరి పదిన్నరప్పుడు మునెప్పణ్ణ వచ్చాడు. భార్య స్థితి చూసి అతడికి జాలి వేసింది. తానే కోపగించుకుంటే పాపం ఆమెను అడిగేవారు ఎవరు? అని కరిగిపోయాడు. ఆమెకు చెప్పకుండా రెండు రోజులు ఇల్లు వొదిలి పోయినందుకు కలవరపడ్డాడు. ఎంత కష్టపడ్డదో, లోపల ఎంత బాధపడిందో, తిన్నదో, లేదో... అనే ఆలోచనలన్నీ వచ్చి అతను భార్యను మృదువుగా పలకరించాడు. ఒళ్ళు నిమిరాడు. ముట్టినందుకే మునెమ్మ ఏడ్చేసింది. అతడిని కౌగిలించుకుని వెక్కి వెక్కి ఏడ్చింది. ఆమె దుఃఖం అతడికి అర్థం కావటంలేదు.

"ఏడ్వకు మున్నీ... ఇంకెప్పుడూ ఇలా చేయను. నిన్ను వొదిలి వెళ్ళను. కోప్పడను..." అని బుగ్గలు నిమిరి, కన్నీళ్ళు తుడిచి, ఓదార్చాడు. కొత్తగా కొని తెచ్చిన నేత చీరను ఇచ్చాడు. హోటల్ నుంచి తెచ్చిన టిఫిన్ పొట్లం అందించాడు. వాటన్నిటికన్నా అధికంగా మునెమ్మ అతడిని పట్టుకుని వేలాడుతూ ఏడ్చింది.

"ఇంకెప్పుడూ నన్ను వొదిలి వెళ్ళకండి" అని ఒట్టు పెట్టింది. అతడితో ప్రమాణం చేయించుకుంది. ఆమె దుఃఖం తగ్గి ఏడ్పు నియంత్రణలోకి రావటానికి చాలా సమయం పట్టింది.

★ ★ ★

ఒక వారం గడిచినా మునెమ్మ అదే ఆలోచనా వలయంలో ఉంది. తనదే తప్పు అనే ప్రశ్న ఆమెను తొలిచేస్తోంది. అతడి శరీర పరిమాణం భర్త శరీరాన్నే పోలుతుంది. అతను మాట్లాడకపోవడం వల్ల గుర్తుపట్టడానికి అవకాశం లేకుండా పోయింది. అతడి రభస కాస్త ఆశ్చర్యం కలిగించినా, అనుమానం పుట్టించినా, ఆ అనుభవపు తీవ్రతలో దానికంత తావుండలేదు. తనను భర్త ముట్టుకోవటమే క్షమించినట్టు కాదా! అనే భ్రమపు సంభ్రమంలో ఆమె తన సూక్ష్మజ్ఞానాన్ని పోగొట్టుకుంది. అతడు భర్త కాదు అనే జ్ఞానం కలిగిన క్షణంలో ఆమెకు తనను


Sivaji

నిప్పుల్లోకి ఎత్తి విసిరినట్టయ్యింది. తన గుడ్డితనం తన శీలాన్ని కాపాడుకోవటానికి అడ్డమైనందుకు మండిపడింది. దేవుడ్ని తిట్టుకుంది. ఎందుకు నన్ను గుడ్డిగా పుట్టించావు? ఇప్పుడు నా భర్తకు ఎలా నా శరీరాన్ని ఇవ్వాలి? అంటూ నిప్పును మింగినదానిలా మునెమ్మ లోపలే బాధను అనుభవించింది.

ఒక వారం తరువాత తిమ్మరాయి జంకుతూ ఆమె ఇంట్లోకి వచ్చాడు. వాడే వచ్చాడని అర్థం కాగానే మునెమ్మ ఒళ్ళంతా మండిపోయింది. అయితే తాను పాడవ్వటం వాడికీ తెలుసు. అది బయటి ప్రపంచానికి వ్యాపించకుండా చూసుకోవాలనుకుంటే, అతడి మీద కోపం చూపిస్తే సాగదు అనే ఆలోచన ఆమెలో నెమ్మదిగా కలిగింది.

“తిమ్మరాయి, ఆ రోజు నీవు ఎవర్ని పిలుచుకొచ్చావు? ” అని మెల్లగా అడిగింది. వాడు ఒక్కసారికే జవాబివ్వలేదు.

“ఎందుకలా చేశావు తిమ్మరాయి? నాలాంటి గుడ్డిదాన్ని ఇలా మోసం చేయొచ్చా? ” అని మళ్ళీ ప్రశ్న వేసింది.

“నాకేం తెలుసు అతనలా చెప్పాడు. నేను చేశాను”

“ఎవరలా చెప్పారు? ”

“కొండాజీ”

మునెమ్మ అతడి పేరు వినివుంది. అయితే పరిచయం లేదు. ఆ వ్యక్తి వచ్చి భర్తలా నటించి, తనను కలిసి వెళ్ళాడు అనిపించి ఆమెకు ఏడ్పు వచ్చింది. తిమ్మరాయి ఎదుట ఏడ్వలేదు.

“యెక్కా నాకిప్పుడు రెండు రూపాయలు ఇవ్వు” అన్నాడు తిమ్మరాయి.

“ఎందుకు? ”

“ఎందుకో కావాలి. ఇవ్వు”

“నేనెక్కడ్నుంచి తెస్తాను”

“ఎలాగైనా ఇవ్వు. లేదంటే అందరికీ చెప్పేస్తాను”

“ఏమని? ”

“అదే కొండాజీ వచ్చిన విషయం...”

మునెమ్మ వొళ్ళు సన్నగా వొణికింది. దిక్కుతోచని దానిలా ఒక్క క్షణం మౌనంగా నించుంది. అటు తరువాత లోపలికి వెళ్ళి మట్టికుండలో పెట్టిన డబ్బులోంచి రెండు ఎనిమిదణాలను తెచ్చిస్తూ “ఇంతే ఉంది. మళ్లీ ఎవరికీ చెప్పకు” అంది.

తిమ్మరాయి వెళ్ళిన తరువాత, తాను మరొక పాపం చేసిందని అనిపించసాగింది మునెమ్మకు. గతంలో జరిగిపోయిందాన్ని దాచిపెట్టడం సరియైనదేనా? ఈవాళ మూసిపెట్టినా మళ్ళీ ఎన్నడైనా చెరువులో శవంలా పైకి తేలదా? అప్పుడు

తెలిస్తే భర్త ఆ విషయాన్ని ఎలా ఎదుర్కొంటాడు? - అనే ప్రశ్నలు ఆమెను వేధించసాగాయి. అలాగని భర్త దగ్గర చెప్పుకోవడం సాధ్యమా? దాని పరిణామం ఏమవుతుంది? - అన్నది ఆమె చిట్టిబుర్రకు అందలేదు. ఎందుకు నేను గుడ్డిదానిలా పుట్టాను? పుట్టినా నాకు పెళ్లెందుకు చేశారు? అని మునెమ్మ మథనపడసాగింది.

సంత రోజున తిమ్మరాయి మళ్ళీ హాజరై ఆమెను డబ్బులు ఇవ్వమని అడిగాడు. కొండాజీయే వాడ్ని పురికొల్పి పంపి ఉండాలని ఆమెకు అనిపించింది.

"నీకేమీ తమాషా అయిందా తిమ్మరాయి! ఇలా అప్పుడప్పుడు వచ్చి డబ్బులు అడిగితే నేనెక్కడ్నుంచి తెచ్చేది?" అని మునెమ్మ అసహాయతతో అడిగింది. తిమ్మరాయి లొంగలేదు. తన అస్త్రం బయటికి తీశాడు. ఆమె లొంగాల్సి వచ్చింది.

ప్రతిసారీ ఇలా దోపిడికి గురైన తరువాత మునెమ్మ చాలా క్షోభపడేది. అతడికి ఇలా అవకాశం ఇవ్వకుండా ఉండాల్సింది. అయితే ఇప్పటికే రుచి మరిగినవాడు అవసరమొచ్చినప్పుడల్లా రాసాగాడు. అతడికి తన దగ్గరున్న చిల్లర డబ్బంతా ఇచ్చి ఇచ్చి అలసిపోయింది మునెమ్మ. తిమ్మరాయి ఆశ తగ్గలేదు.

సులభంగా దొరికిన ఆమె రక్తాన్ని జలగలా పీల్చసాగాడు. ఆమె జీవచ్ఛవంలా తయారైంది.

ఒకరోజు ఆమె దగ్గర ఒళ్ళు చీల్చినా మూడు కాసులు పుట్టేట్టు లేదు. తిమ్మరాయి వచ్చి డబ్బులు అడిగాడు.

మునెమ్మ లేదంది. ఈ విధంగా గుడ్డిదాని దగ్గర ఆట ఆడకూడదని వేడుకుంది. కన్నీళ్ళు నింపుకుని ఏడ్చింది. అతడు వినలేదు.

"డబ్బులు ఇవ్వకుంటే మునెప్పణ్ణకు చెప్పేస్తాను" అని బెదిరించాడు. ఆమెకు ఎక్కడా లేని కోపం వచ్చింది.

"చెప్పుకో పోరా" అని వాడిని గట్టిగా తోసేసింది. తిమ్మరాయి భయపడి పైకిలేచాడు. తరువాత తోక ముడుచుకుని వెళ్ళిపోయాడు.

తిమ్మరాయి చెప్పటానికి మునుపే తానే తన భర్తకు చెప్పేస్తే అనే ఆలోచన వచ్చింది. దాన్ని ఊహించుకుంటూనే ఆమెకు భయమేసింది. చెప్పాలా? వద్దా? అనే ఊగిసలాటలోనే పగలు గడిచి రాత్రి వచ్చేలోగా ఆమె మనస్సు ఒక నిర్ణయానికి వచ్చింది.

భర్త ఇంటికి వచ్చాక ఆమె తన గుడ్డితనాన్ని తిట్టుకుంటూ, తనను మోసం చేసిన జుగుప్సాకరమైన కథను ఏడుస్తూ భర్త దగ్గర చెప్పుకుంది.

మునెమ్మ మాటలు గొంతు నుంచి ఆగి ఆగి వస్తున్నాయి. మానసిక హింస వలన ఆమె ఒళ్ళు పిండిన పిప్పి అయింది. భోరుమని ఏడ్చింది. మొత్తుకుంది. ప్రాధేయపడింది.

"చెప్పు దేవుడా తప్పు నాదా? నాకేం తెలుసు? మీరే వచ్చారనుకున్నాను. అసలే గుడ్డిదాన్ని.." అని వెక్కివెక్కి ఏడ్చింది.

మునెప్పణ్ణ ఆమె మాటలు విని దిగ్భ్రాంతి చెందాడు. ఒక్కసారి లోతైన నీళ్ళలో మునిగినట్టయింది. ఒంట్లో నిప్పు మండసాగింది. రాయిలా కూర్చున్నాడు. ఎదురుగా మునెమ్మ ప్రాధేయపడుతూ ఏడుస్తోంది.

శరీరాన్నే దోసిలి చేసుకుని వేడుకుంటోంది. పసిబిడ్డలా ఉండే మునెమ్మ మోసపోయింది. ఇప్పుడు ఆమెను ఏం చేయాలి? ఏం చేస్తే ఆమె బాధ తీరుతుంది.

మునెప్పణ్ణకు బాధ కలిగింది. ఆమె ముఖాన్ని తన రెండూ చేతులతో పట్టుకున్నాడు. ఆమె దృష్టిహీనమైన కళ్ళ నుంచి ఆగకుండా రాలుతున్న కన్నీటిని బొటన వేలితో తుడవసాగాడు. V

మయన్మార్ కథ

- ఖి ఉ త్రో

దుష్టనాయిక

"రామాయణాన్ని నవలగా రాసిన ఆ యువరచయిత మీరేనా? " ఆ పెద్దావిడ నన్ను ప్రశ్నతో పలకరించింది.

"అవునండీ!" అని సమాధానమిచ్చాను.

"ఓహ్ బాగుంది. మా మేనేజరు అంటూ ఉంటాడు, మీరు రామాయణాన్ని ఆధునిక నవలగా బాగా తీర్చిదిద్దారని. నేను మీ నవల చదవలేదుగానీ, జనాలు అనుకుంటుండగా చాలాసార్లు విన్నా" తనని పిన్నిగా పరిచయంచేసుకుంటూ, నన్నో పిల్ల రచయితగా భావిస్తూ చనువుగా మాట్లాడిన ఆ స్త్రీ వంక గాభరాగా చూశాను. దాదాపు ఆమె వయసు యాభై ఉండవచ్చు. బక్కపల్చని శరీరం. స్నేహం ఆత్మీయత కలబోసిన మొహం ఆమెది!


ఆమే తిరిగి "మీరు నవలా రచయిత అయితే నేను నా కథని చెప్తా" అంది. నాకు తలా తోకా ఏమీ అర్థం కాలేదు.

అప్పుడే నాటకమండలి నిర్వాహకుడు అక్కడికొచ్చి "ఓహో! అప్పుడే మా ఖిన్‌మీ మిమ్మల్ని కల్సిందా? ఈవిడ మా నాటకాల్లో ప్రసిద్ధ దుష్టనాయిక, ముఖ్యంగా రామాయణం నాటకంలో గాంమీ భూమికను ఈమెలా అద్భుతంగా ఎవరూ పోషించలేరు. అంతా ఈమె అసలు పేరు మర్చిపోయి 'గాంమీ ఖిన్‌మీ' అనే పిలుస్తారు" అని ఆమె గురించి చెప్పాడు. నాకు ఆ మహానటిని చూసి ఆశ్చర్యం, ఆనందం కలిగాయి.

"మీ నవలల్ని నేనెప్పుడూ చదవనే లేదు. మా కళాకారులంతగా చదువుకున్నవారు కారు. ఒకవేళ కాస్తోకూస్తో చదువుకున్నవారు కూడా నాటక మండలిలో చేరిన తర్వాత అంతా మర్చిపోతారు. ఓ రచయితగారూ! నా కథ మీకు విన్పిస్తా. నా కథను 'గాంమీ పిన్ని రంగస్థల అనుభవాలు' అన్న పేరుతో నవలగా రాయండి" అని నా సమాధానం కోసం ఎదురుచూడకుండా తన కథను ప్రారంభించిందామె!

"నేను ఊర్నించి పారిపోయి నాటకమండలిలో చేరా, హీరోయిన్ అవ్వాలనే ఆశతో. బక్కగా ఉన్నా, నా మొహంలో కోమలత్వం, చపలత్వం, ఆకర్షణ లేవని దుష్టనాయికగా మారాను. ఆ వేషాలతోనే మంచిపేరు సంపాదించాను. బాగా గొంతెత్తి అరిచేదాన్ని. బానే వేషాలు రాసాగాయి. నాకు అంతగా చదువు రాకపోయినా డైలాగ్స్ బాగా బట్టీ కొట్టేదాన్ని. ఒకటి రెండుసార్లు వినగానే పాటలు నోటికి వచ్చేసేవి. ఒక్కోసారి పరిస్థితికి అనుగుణంగా నాటకంలో లేని డైలాగ్స్‌ని కూడా అప్పటికప్పుడు కల్పించి చెప్పగలిగేదాన్ని. ఒక్కోసారి ప్రాంప్టింగ్ కూడా లభించేది"

రామాయణంలో నేను వేసే పాత్ర గాంమీ. ఆమె దశాననుడైన రావణుని చెల్లి. దూత్, ఖర్ అనే ఇద్దరు కొడుకులున్నారామెకి. రామలక్ష్మణులపై ప్రతీకారం తీర్చుకునే పాత్ర ఆమెది! నేను కూడా ఆ పాత్రలో బాగా లీనమై నటించేదాన్ని. బాగా పరవశమైపోయేదాన్ని కూడా! ప్రస్తుతం ఈ దేశంలో రామాయణాన్ని విభిన్న నాటకమండలులు తమ తమ పద్ధతుల్లో ప్రదర్శిస్తున్నాయి. విదేశాల్లో ధనుర్భంగం, వనవాసం, సీతాపహరణం



లాంటి ఘట్టాలు ప్రదర్శించి ప్రథమ బహుమతులు కైవసం చేసుకుంటున్నాయి.

నేనైతే కేవలం నా పాత్ర డైలాగులే కాకుండా ఇతర పాత్రలవి కూడా నేర్చుకుని వారు మర్చిపోయినప్పుడు అందించేదాన్ని. స్టేజీ ఎక్కగానే నా బాధలు, శోకం, చింత అన్నీ మాయమయ్యేవి. నా జీవితం గూర్చే పూర్తిగా మర్చి ఆ పాత్రలో తేఃఇథో మహారాజు దశానన సోదరిగా, దూత్, ఖర్‌ల మాతగా, లంకా ద్వీపపు అద్భుత నారి గాంమీగా పరకాయ ప్రవేశం చేసే దాన్ని" అని చెప్తూ కాసేపు ఆగింది.

"నాకు ఇద్దరు కొడుకులు. పెద్దవాడు పదిహేనేళ్ల లాంగవే. చిన్నవాడు పదమూడేళ్ల లాహవే. నా భర్త ఓ చెట్టియార్ దగ్గర కారు డ్రైవరుగా పనిచేస్తూ పెరూలో యాక్సిడెంట్‌లో చనిపోయాడు. లాంగవేకి సంగీతమంటే ఇష్టం కాబట్టి నాటకమండలిలో సంగీత విభాగంలో పనిచేస్తుండే

అనువాదం :
అచ్యుతుని రాజ్యశ్రీ

వాడు. అంటే వారికి కావల్సిన గరం చాయ్, సిగార్‌లు అందించడం! ఇంకా తాను చేయాల్సిన పని కంటే ఐదురెట్లు ఎక్కువ పని, చాకిరీ చేసేవాడు. చిన్నాడు సెట్స్ వేయటంలో, కర్టెన్ వేసి, తీసే పనిలో ఉండేవాడు. కర్టెన్ లాగి తీసే వాడు మాంచి గాఢనిద్రలో ఉన్నప్పుడు, మూడు రూపాయలిచ్చి నా కొడుక్కి ఆ పని అప్పగించేవాడు. రాత్రంతా నటించినందుకు నాకు పదిరూపాయలు వస్తే, నడుం విరిగేలా పని చేసినందుకు పెద్దాడికి ఐదు, చిన్నాడికి మూడు రూపాయలు దొరికేవి. ఎప్పుడైనా నాటకం లేకపోయినా, లేక మధ్యలో ఆగిపోయినా ఆరోజు పస్తే.

ఇక నాటక కంపెనీ ఓనర్ ఫ్రీ షో నిర్వహిస్తే, కళాకారులమంతా పైసా తీసుకోకుండా నటించాలి. అలా నెలకి డబ్బు గిట్టుబాటు అయ్యే ఓ పదిహేను నాటకాల్లో నటించేదాన్ని.

ఓసారి పెద్దాడికి మలేరియా వచ్చింది. అప్పు పెరిగింది. నాకా వయసు మీద పడ్తోంది. నాటకాలు ఆడటం తక్కువైంది. పెద్దాడికి మందు, చిన్నాడికి తెగిన చెప్పులు కుట్టించేందుకు కూడా చిల్లిగవ్వ లేని పరిస్థితి నాది! నాకు రాత్రంతా ఆడ్తే వచ్చే ఆ పదిరూపాయలు ఏ మూలకి? ఆ రాత్రి రామాయణం వేస్తున్నాం. కొడుకుల్ని వెతుకుతూ గాంమీ బైలుదేరింది. కొడుకుల పాదచిహ్నాలు గుర్తించి అడవిలోకి ప్రవేశించిన ఆమెకి తలలు తెగిన కొడుకులు కనపడతారు. గాంమీ పాత్రలో నేను తాండవ నృత్యం చేయాల్సిన సన్నివేశం అది! ఇది నాకు పరీక్షా సమయం! నేపథ్యంలో వాద్యాలు మోగుతుంటే, పుత్రశోకం, ప్రతీకారేచ్ఛతో ఆ పాత్రలో జీవించి నృత్యం చేస్తున్న నాకు హఠాత్తుగా ఏమైందో తెలీదు. పెద్దాడు జ్వరంతో బాధపడటం, చిన్నాడికి చెప్పులు కుట్టించడానికి చేతిలో చిల్లిగవ్వ లేకపోటం, అప్పుల బాధ గుర్తుకొచ్చి ఏడుపొచ్చింది. అయినా తమాయించుకుని నా పాత్ర డైలాగులు చెప్పాను.

రావణ సభకెళ్లి భోరున ఏడ్వటం అద్భుతంగా అభినయించాను. కానీ జ్వరంతో బాధపడ్తూ స్టేజికి దగ్గర్లో కూచున్న నా పెద్దకొడుకు నిద్రలోకి జారినట్లున్నాడు, కేవలం వాడి తల మాత్రమే కన్పడ్తోంది గానీ శరీరం కన్పడటం లేదు. భయంతో చిన్నకొడుకు వైపు చూశాను. కిరీటాలు తగిలించి ఉన్న వెనుకవైపు కూచున్న కారణంగా వాడు కూడా కన్పడకపోటంతో నా వళ్లు జలదరించింది. దూతా, ఖరా తలలు తెగి అడవిలో వేలాడుతోన్న బాధను అభినయిస్తున్న నేను నిజంగా ఆ సంఘటన జరిగిందనే భయపడ్డాను. రావణ పాత్ర

ధారి ఎదుట నా తల గిర్రున తిరుగు తుంటే ఎలాగో డైలాగులు చెప్పసాగాను.
కానీ మధ్యలోనే తొలిసారి నా స్టేజీ జీవితంలో డైలాగులు మర్చిపోయాను. నేను ఏడుస్తూ వెక్కుతూ చెప్పాల్సిన డైలాగులు అవి! కానీ నా ఇద్దరి కొడుకుల తలలు మాత్రమే కన్పించటంతో గాభరాగా ఏడుస్తూండిపోయాను. ఆర్కెస్ట్రా కరుణర సాన్ని చిలికిస్తూ పాట వినిపిస్తున్నా, అన్న రావణుని ఎదపై వాలి భోరుమని ఏడ్వా ల్సిన నేను శిలాప్రతిమలా ఉండిపోయా ను. "ఏడు, ఇంకా ఏడు, ఖిన్‌మీ" అని డైరె క్టరు అరుస్తున్నా, నా తల తిరిగిపోసాగిం ది. మూర్ఛ వచ్చేలా ఉంది. నా ఇష్టం వ చ్చిన డైలాగులు చెప్పసాగాను. నా ఈ కొత్తరకపు డైలాగులకి ఆర్కెస్ట్రా ఏం వాయించాలో తెలీక ఆపేశారు. ప్రేక్షకు లంతా ఏమీ అర్థంగాక నోరు వెళ్లబెట్టుకు చూడసాగారు. నా చిన్నకొడుకు కూడా సంగీతం విన్పడకపోటంతో కర్టెన్ లాగ లేదు. నాటకం నావల్ల రసాభాస అయింది. అంతే, ఆరోజు డ్రామా కంపెనీ వారు నాకు ఒక్క పైసా ఇవ్వలేదు. నా మీద నేను కంట్రోలు కోల్పోవటంతో ఆ పూట బత్తెంకి కత్తెర వేటుపడింది"
ఖిన్‌మీ తన నాటకానుభవాల్ని ఇలా ఓ కథలా నన్ను రాయమని కోరింది. దాన్ని పబ్లిష్ చేయమన్నది కూడా! ఇలాంటి విషాద హాస్యాస్పద ఘట్టాలు ఆమె జీవితంలో, ముఖ్యంగా ఆమె అభిన యించేప్పుడు జరగరాదని మనస్ఫూర్తిగా ఆ తథాగతుని ప్రార్థిస్తున్నాను. V

తెలుగు కథ

- వాలి హిరణ్మయీదేవి

స్వప్నసాకారం

ఆశ్రమం నుండి ఇంటికొచ్చి పడక్కుర్చీలో అలసటగా వాలింది లక్ష్మి. "ఆస్తంతా రాయించుకొనేంతవరకూ ఎంతో ప్రేమ చూపించారు. ఆ తర్వాత వాళ్ళ అసలు రంగు చూపించారు. ఆ నరకాన్ని తట్టుకోలేక పోతున్నానమ్మా. నెలకు ఇంతంటూ కట్టుకోలేను. మీరు నాకు కాస్త చోటిస్తే ఏదో ఓ పని చూసుకొంటూ, నాకొచ్చిందంతా ఇస్తుంటానమ్మా" అంటూ వచ్చిన ఆ మధ్యవయసావిడే కళ్ళలో మెదులుతూంటే- 'మనుషులెంత స్వార్థంగా మారిపోతున్నారు. ఈ వయసులో ఇప్పుడీవిడ కష్టపడవలసి రావడం దురదృష్టకరం. తనను కొన్ని ఫండ్స్ చేతికందితే, ఎలాంటి ఫీజు వసూలు చేయకుండానే ఆశ్రమం నడిపించేది. తను నామినల్‌గా వసూలు చేసే ఫీజు కూడా కట్టుకోలేని అభాగినుల కోసం, తనింకా శ్రమపడవలసి ఉంది. భగవంతుడా! అలా సాయం చేసేందుక్కావలసిన శక్తిసామర్థ్యాలూ, అండదండలూ నాకందించు స్వామీ!' అని వేడుకొంది. ఉద్యోగ విరమణ తర్వాత 'ఆశ్రమమే' ఆఫీసైందామెకి. ఇంతలో ఫోన్ రింగయింది.

"హలో, అత్తమ్మా, నేను రాజీవ్‌ని"

'రాజీవ్ ఎప్పుడూ ఫోన్ చేయడు, దీప్తి మాట్లాడాక "హలో ఎలా ఉన్నారు? " అని మాత్రమే అడుగుతాడు. అలాంటిది ఈ వేళలో ఈ ఫోనేంటి? ' అని కాస్త కలవరపడుతూనే "ఆ చెప్పు బాబూ! దీప్తి కులాసానే కదా? " అనడిగింది ఆదుర్దాగా.

"ఆ.. తను కులాసానే.. మీరు నాకో ఫేవర్ చేయాలి" అన్నాడు సంశయంగా.

"ఏంటది? " ఆశ్చర్యంగా అడిగింది లక్ష్మి.

"దీప్తికి ప్రెగ్నెన్సీ కన్ఫర్మయింది. కానీ తను అబార్షన్ చేయించుకొంటాననంటోంది. నాకిష్టం లేదు. మీరే ఎలాగయినా నచ్చజెప్పాలి" అన్నాడతను. ఆనందం, ఆందోళన సమపాళ్ళలో కలిగాయామెకి.

"నేనా? మీ మాటే వినంది నా మాట వింటుందా? అయినా మొదటిదే కదా, ఎందుకు వద్దంటోంది? " బాధగా అడిగింది.

"తనకున్న గోల్ రీచ్ కావాలంటే, ఇదొక అడ్డంకి అట. ప్లీజ్ ఎలాగయినా మీరే దీప్తికి చెప్పాలి. బై" అని అల్లుడు ఫోన్ పెట్టేయగానే, లక్ష్మికి జరిగిన సంఘటనలన్నీ కళ్లముందుకొచ్చాయి. గతాన్ని గుర్తుకు చేసుకొంటే ఒరిగేదేం లేదనుకుంటూనే ఆమెకి గతం కళ్ళ ముందు మెదిలింది.

★ ★ ★

"అమ్మవారికే శఠగోపం" పేరిట వస్తోన్న ప్రోగ్రాంని చూస్తూ నివ్వెరపోయింది లక్ష్మి. 'దేవాలయ గోపురానికి ఇరవై నాలుగు కారెట్ల బంగారానికి బదులు పద్నాలుగు కారెట్ల బంగారం వాడి మోసం చేస్తున్నారట.. 'హు... ప్రజల్లో రాన్రానూ పాపభీతనేదే లేకుండా పోతోందేంటో..' అనుకుంది మనసులో భారంగా.

"అబ్బ.. అన్నీ పిచ్చి ప్రోగ్రామ్స్ చూస్తా


Amar

వేంటి? ” అంటూ తల్లి చేతిలోని రిమోట్‌ని విసురుగా లాక్కొని, సోఫాలో కూర్చుని ఛానల్స్‌ని మార్చసాగింది దీప్తి.

కూతురి ప్రవర్తనతో లక్ష్మి ముఖం చిన్న బోయింది. కాలేజ్‌లో చేరేంతవరకూ 'అమ్మా, అమ్మా' అంటూ తన వెంటే తిరిగే దీప్తిలో మార్పు చోటు చేసుకోవడం ఇటీవలనే మొదలైంది.

ఓసారి "మా స్నేహితుల తల్లిదండ్రులు ఎన్ని గొడవలున్నా, కలిసి మెలిసే ఉంటున్నారు. నువ్వూ అలా ఉండుంటే నాకిన్ని అవమానాలుండేవి కాదు" అంది.

"దీప్తీ! నేను పడ్డ కష్టాలన్నీ నీకు చెప్పి నీ మనసెందుకు బాధపెట్టాలని ఎప్పుడూ వివరంగా చెప్పలేదు. శతథా ప్రయత్నించి సాధ్యపడక నిన్ను తీసుకొని పట్నానికి వచ్చేశానమ్మా.. నీకోసం, నీ చదువు కోసం ఎన్ని తిప్పలు పడుతున్నానో చూస్తూనే ఉన్నావుగా.." అంది లక్ష్మి.

"అదే ఆ బాధలన్నీ పడడం ఎందుకు? కాస్త నాన్నతో అడ్జస్ట్ అయితే నేనిలా సింగిల్ పేరెంట్ చైల్డ్‌గా ఇన్ని అవమానాల్ని ఎదుర్కొనే దాన్నికాదు. ప్రతి పైసానీ ఆచి తూచి ఖర్చు పెట్టే ఖర్మ తప్పేది.."

"నాకోసం రేయింబవళ్ళు కష్టపడుతున్నావమ్మా!" అంటూ బాధపడే దీప్తి, ఇప్పుడు నాపై కత్తిగట్టినట్లు "నేను కంప్యూటర్ ఇన్‌స్టిట్యూట్‌లో చేరాలి. రేపటికల్లా ఇరవై వేలు కావాలి!" అంటూ తనకేం కావాలన్నా డిమాండ్ చేయడం మొదలుపెట్టింది. తన శక్తికి మించినవే అయినా కూతురి భవిష్యత్తు బావుండాలనీ, తండ్రిలేని లోటుని తెలియకూడదని అమర్చడం మొదలు పెట్టినా, తనతో ముందులా కలివిడిగా మెలగకపోవడం లక్ష్మి మనసుకెంతో బాధని కల్గించసాగింది.

'దీప్తి 'అమ్మా' అని పిలిచి ఎన్నిరోజులైందో' అని లక్ష్మి మనసులో అనుకొనేది. పోనీ వివరంగా గతమంతా చెప్పేస్తే సరి అనుకొంటే, ఏనాడూ ఆ అవకాశం ఇవ్వ లేదు. ఉన్నట్టుండి ఒకరోజు "మా కాలేజ్ కాంపస్ ఇంటర్వ్యూలో నెగ్గాను. డెలాయిట్‌లో జాబ్. నెలకి ఇరవై అయిదువేల జీతం" అంటూ గర్వంగా చెప్పింది. లక్ష్మికి ఆనందం కన్నా భయం, ఆందోళనా ఎక్కువగా కలిగాయి.

తను పాతికేళ్ళుగా పనిచేస్తున్నా.. చేస్తున్నది ప్రైవేట్ జాబ్ కావడం వల్లనేమో, ఈ రోజుకీ తన జీతం పన్నెండు వేలే.. అలాంటిది ఎలాంటి ఎక్స్‌పీరియన్స్ లేని దానికి అంత జీతమంటే ఆందోళన కలిగి అదే వ్యక్తం చేసింది.

"నువ్వో కూపస్థ మండూకానివి. లోకం సంగతే తెలీదు. ఇదే నేను నైట్‌షిఫ్ట్‌లకు ఒప్పుకుంటే నలభై, యాభై వేలిచ్చే జాబ్‌లూ వున్నాయ్. నువ్వు ఒప్పుకోవని, దీంతో సరిపెట్టుకోవలసి వస్తోంది" అంది అసంతృప్తిగా. జాబ్‌లో చేరి సంపాదన మొదలయ్యేసరికి లక్ష్మి పట్ల మరింత నిర్లక్ష్యం పెరిగింది దీప్తిలో. అదెంతో బాధ కల్గిస్తున్నా 'చిన్నతనం' అని సరిపెట్టుకొంటూ, తన పనులతో బిజీగా వుంటూ బాధల్ని మరిచే ప్రయత్నం చేయసాగింది లక్ష్మి. చూస్తుండగా రెండేళ్ళు గడిచాయ్.

జ్వరంతో ఉన్నా ఆఫీస్‌కి బయలుదేరుతున్న లక్ష్మిని చూస్తూ "ఇంకా ఆ పిచ్చి జాబ్ చేయడం ఎందుకు? మానేయొచ్చుగా? " అంది దీప్తి. చివుక్కుమంది లక్ష్మికి.

ఆ పిచ్చి జాబే తమ ఇద్దరికింత కూడు పెట్టిన సంగతి మరిచిపోయిన కూతురికేం చెప్పాలనుకొంటూ నిట్టూర్చి "నాకూ టైంపాస్ అవ్వాలి కదా!" అని చెప్పి కదిలిందక్కడి నుండి. తనన్నా, తను చేసే పనులన్నా గిట్టకుండా అవుతోందేంటి? ఈ అమ్మాయికి.. మొన్నటికి మొన్న "రోజూ బాల్కనీలో గింజలవీ చల్లడం మానెయ్. ఆ పిట్టలూ, పావురాలూ ఆరేసిన నా బట్టల్ని పాడు చేస్తున్నాయి" అని విసుక్కుంది.



"ఇవాళ కొత్తగా మొదలెట్టింది కాదు
కదే.. ఆరిన వెంటనే బట్టల్ని తీసేయొ
చ్చుగా.. ప్రకృతి సమతుల్యతకు పక్షులెంతో
అవసరం. ఆ పక్షులకు జల్లే పిడికెడు
గింజల వల్ల..."
"అబ్బ సోది చెప్పకు. వినే టైమ్
లేదు" అని చిరాకు పడ్తూ వెళ్ళిపోయింది.
లక్ష్మి మనసు చిన్నబోయింది. తన వెనుకే
తిరుగుతూ, తన చిట్టి చేతులతో ఆ పను
ల్ని ఎంతో ఇష్టంగా చేసే దీప్తిలో ఈ మాే
ల్పంటి? తన పట్ల ఈ చిన్నచూపేంటి?
అనుకుంటూ బాధపడింది లక్ష్మి.
డబ్బెక్కువ చేతిలో ఆడటంవల్ల బట్టల
కు, మేకప్ సామగ్రికి, విచ్చలవిడిగా ఖర్చు
పెడుతోన్న దీప్తిని వారించబోతే "ఇన్నా
ళ్ళూ దరిద్రంలోనే మగ్గాం కదా. ఇప్పు
డన్నా ఫ్రీగా ఖర్చుపెట్టుకోనీ.." అని పెడ
సరంగా జవాబిచ్చిన దీప్తిని చూస్తే కొత్తగా
భయమూ మొదలయింది లక్ష్మిలో.
"డబ్బుని మనం కాపాడితే, అది మనల్ని
కాపాడుతుంది" అన్న నీతిని బోధిస్తూ,
తనని పెంచిన తల్లి గుర్తొచ్చింది. "ఒక
రూపాయ్‌ని వ్యర్థంగా ఖర్చు పెట్టకపోతే
ఆ రూపాయ్‌ని మనం సంపాదించినట్టే"
అని చెప్పే తండ్రి వల్ల పొదుపుగా
వుండటం అలవాటయిన లక్ష్మికి దీప్తి

చేసే ఖర్చులన్నీ పిచ్చి ఖర్చులుగా తోచేవి. ఆ విషయంలో ఎంత వద్దనుకున్నా అప్పుడప్పుడు ఇద్దరికీ గొడవలు తప్పేవి కాదు.

"నువ్వో పీనాసివి. డబ్బుని ఎంజాయ్ చేయలేని దానివి" అని ఛీత్కరించేది దీప్తి.

ఆ మాటలు చాలా కష్టాన్ని కల్గించేవి లక్ష్మికి. ఎందుకంటే ఆమెకో చిరకాల స్వప్నం వుంది. ఉద్యోగ విరమణ తర్వాత తను ఊరి చివర కొన్న స్థలంలో ఓ వృద్ధాశ్రమం నెలకొల్పాలని.. పిల్లల నిర్లక్ష్యానికి గురయిన తల్లిదండ్రులకో ఆసరా కల్పించాలని. అలా చేసి తన భుక్తికి- కాలక్షేపానికి మాత్రమే కాక, సమాజానికీ సేవ చేయాలని ఆశ. అందుకే ప్రతి నెలా తన జీతం నుండి కొంత సేవ్ చేస్తూ వస్తోంది. ఆమె జాబ్‌లో చేరిన కొత్తలో కొన్న కొన్ని షేర్స్, పదిహేనేళ్ల తర్వాత బాగా రేట్ పెరగడంతో వాటిని అమ్మి ఫిక్సడ్ డిపాజిట్ చేసింది అందుకోసమే.

గూడు కట్టుకొనేందుకు పిట్టలు ఒక్కో గడ్డిపోచా తెచ్చుకొంటున్నట్లు తన కల నిజం చేసుకొనేందుకు, తన వంతు కృషి చేస్తూ వస్తోంది లక్ష్మి. అందుకే అత్యవసరమనుకొన్నవాటికి తప్ప, అన్య విషయాలకు ఖర్చు చేయని తన పద్ధతి పీనాసితనంగా దీప్తికి కన్పించడంలో వింతేముందిలే అనుకొనేది.

ఉన్నట్టుండి ఓ రోజు "అమ్మా, ఇతను నా కొలిగ్ రాజీవ్. మేమిద్దరం పెళ్ళి చేసుకోవాలనుకొంటున్నాం!" అంటూ ఓ యువకుడ్ని పరిచయం చేసింది.

ఎన్నో రోజుల తర్వాత తనని 'అమ్మా' అని పిలిచినందుకు కల్గిన సంతోషం, ఆ మాటలతో ఆవిరైంది. ఆమె దృష్టిలో దీప్తింకా పసిపిల్లే. పెళ్ళిలాంటి పెద్ద నిర్ణయాన్ని తొందరపడి తీసుకుంటోందేమోనన్న ఆందోళనతో ఆ యువకుడిని పరిశీలనగా చూసింది.

పొందిగ్గా, వినయంగా ఉన్న రాజీవ్‌ని చూస్తే కాస్త ఊరట కల్గింది. కూతురిది మంచి సెలెక్షనే అనుకొంటూ.. "మీ పేరెంట్స్‌కీ విషయం చెప్పారా? అందరికీ అంగీకారమేనా? " అనడిగింది చిన్నగా.

"ఆ విషయాలన్నీ రాజీవ్ చూసుకుంటాడ్లే" అంది తేలిగ్గా దీప్తి. రాజీవ్ వెళ్ళిపోయాక "దీప్తీ వాళ్ళ వివరాలిస్తే మన వాళ్ళతో చెప్పి.." అంటూ ఇంకా ఏదో అనబోతున్న లక్ష్మి మాటలకు అడ్డొస్తూ, "అమ్మా, మనల్ని ఇంతకాలం ఎవరూ పట్టించుకోనేలేదు. మన ఆర్థిక పరిస్థితి కాస్త మెరుగు కాగానే, చుట్టాలమంటూ మన వెనుక తిరుగుతున్నారు. అలాంటి వాళ్ళకి ఏమీ చెప్పాల్సిన అవసరంలేదు" అంది ఖరాఖండీగా.

"పెళ్ళంటే నలుగురి సాయం కావాలి తల్లీ" అంది లక్ష్మి నచ్చజెబుతున్నట్లు.

"అక్కర్లేదు. మేం చేసుకోబోయేది రిజిస్టర్ పెళ్లి. దానికి మనుషుల సాయం అక్కర్లేదు. పైగా 'చట్టంలో' రిజిస్టరవుతుంది కాబట్టి నువ్వు బెంగ పడాల్సిందీ లేదు" అంది తేలిగ్గా.

రాజీవ్ తన పేరెంట్స్‌ని ఒప్పించేందుకు రెండు నెలలు పట్టింది. ఆ తర్వాత పదిమంది స్నేహితుల మధ్య వారికి 'రిజిస్టర్ మ్యారేజ్' జరిగింది.

అత్తా, మామలు, ఇద్దరు ఆడపడుచులు, ఇద్దరు మరుదులు- వీళ్ళతో దీప్తి ఎలా నెగ్గుకొస్తుందోనని లక్ష్మి కలవరపడింది గానీ దీప్తి వాళ్ళందరితో కలిసిపోవడం చూసి ఊపిరి పీల్చుకుంది.

ఇంటి పనులతో, ఉద్యోగంతో బిజీగా మారిన దీప్తి తనింటికి అంతగా రాకున్నా, 'పోన్లే సుఖంగా అక్కడే వుండనీ' అనుకుంటూ ఏ రెండు, మూడు నెలలకో ఓసారి వెళ్ళి తనే చూసి రావడం అలవాటు చేసుకుంది లక్ష్మి.

రోజులు గడుస్తున్నాయ్ వేగంగా. సంక్రాంతి పండుగకి వచ్చిన దీప్తి, నెల్రోజు

లైనా తిరిగి అత్తగారింటికి వెళ్ళక పోవడంతో లక్ష్మిలో కంగారు మొదలయింది. రాజీవ్ అప్పుడప్పుడు వచ్చి మాట్లాడి వెళ్లడం, ఇద్దరూ షికార్లకు తిరగడంతో అంతగా భయపడాల్సింది లేదని నిబ్బరం కలిగింది. అయినా తల్లిగా కూతురి కాపురం గురించి తెలుసుకోవలసిన హక్కూ, బాధ్యతా వున్నాయనుకొంటూ కూతురి మూడ్‌ని గమనించి "దీప్తీ మీ అత్తగారింట్లో అంతా బానే ఉంది గదా!" అని అడిగింది.

ఏ కళనుందోగానీ తల్లికి మెల్లిగా ఒక్కో విషయం చెప్పసాగింది దీప్తి.

"మా అత్తగారింట్లో అందరితో ఎంతో కలిసిపోవాలనే ప్రయత్నించానమ్మా. మనింట్లో నీకు పిసరెత్తు సాయం చేయని నేను వంటపనీ, ఇంటిపనీ చేశాను. మంచితనంతో వాళ్ళ మనసుల్ని గెలవాలనుకున్నా.. కట్నకానుకలు తేలేదన్న ఒక్క కారణాన్ని మనసులో ఉంచుకొని మొత్తం పనంతా నా తలకి రుద్దారు. అంతవరకూ అన్ని పనుల్ని చేసుకొనే మా అత్తగారు కీళ్ళనొప్పులంటూ పడకేసింది. ఇక ఆడబడుచులకి వాళ్ళ కాలేజీలు, తిరుగుళ్ళు. మా మామగారు రిటైర్ అయ్యారన్న మాటేగానీ ఇంటిపట్టునుండరు. స్నేహితులంటూ తిరుగుతూ వుంటారు. వాళ్ళని ఇంటికి తీసుకొచ్చినప్పుడల్లా టీ, టిఫిన్లు అందిస్తూ ఉండాలి. ఇక మా మరుదులిద్దరూ ఉద్యోగస్థులన్న మాటేగానీ తెచ్చిందాంట్లో ఏ కొంతో రాజీవ్ చేతిలో పెట్టి, మిగిలింది హాయిగా ఖర్చు చేసుకుంటూ, స్నేహితులతో పిక్నిక్‌లకు వెళుతూ ఎంజాయ్ చేస్తుంటారు. రాజీవ్ వాళ్ళనింకా చిన్న పిల్లల్లాగే ట్రీట్‌చేస్తూ ఇంటిపనులేవీ చెప్పకుండా తలకెక్కించుకుంటున్నాడు. ఇవన్నీ నాకు నచ్చక, ఇంటి మంచి గురించే మాట్లాడినా రాజీవ్ విన్పించుకోవడం లేదు. ఆదివారంవస్తే రేషన్ తేవడం, మార్కెట్‌కెళ్ళి కూరగాయలవీ తేవడం, కరెంట్ బిల్‌లు కట్టడం వంటి పన్లన్నీ రాజీవ్ చేస్తుంటాడు. నాకేమో కిచెన్‌లో సరిపోతుంది. లేకపోతే పెండింగ్ వర్క్స్‌తో రోజు గడిచిపోతుంది. ఓ ముద్దూ ముచ్చటా, సినిమా, షికారు లేకుండా అవుతోంది. ఎప్పుడూ పనీ, పని. బాగా అలసిపోతున్నాను. పోనీ అంతచేసినా ఎవరి నోటి వెంటా చిన్న ప్రశంస వుండ దు. గుర్తింపు అసలే లేదు. అందుకే 'మనిద్దరం వేరుకాపురం పెడదాం. అందుకు ఒప్పుకుంటేనే వస్తాను. లేకుంటే లేదు' అని మొండిపట్టు పట్టి వచ్చేశాను" అంది దీప్తి.

"రాజీవ్ పెద్ద కొడుకయినందుకు ఇంటి బాధ్యత పట్టించకోక తప్పదు కదా తల్లీ. ఈ వయసులో తల్లిదండ్రులను వదిలెయ్యటం ఎవరూ హర్షించదగిన పని కాదు కదా. ఇక పని విషయం అంటావా, ఓ పని మనిషిని పెట్టుకొని మేనేజ్ చెయ్యి" అంది లక్ష్మి.

"అదీ అయింది. పనిమనిషి చేసే పని వాళ్లకి నచ్చదట. ఫ్రీగా అన్నీ నేను చేస్తుంటే వాళ్ళకేం ఎన్నన్నా చెబుతారు. అదే మేం లేకుంటే, మరుదులకి, ఆడపడుచులకీ కాస్త పనీ పాటా వస్తాయ్. బాధ్యతలూ తెలుస్తాయ్. మళ్ళీ వంటా, పనీ మీద పడితేనే మా అత్తగారు తెచ్చిపెట్టు కొన్న రోగం పారిపోతుంది. ఇంటిపనులు మీదబడితే, మావగారి షికార్లూ తగ్గుతాయ్. అందుకే రాజీవెంత బతిమాలుతోన్నా మొండికేసి వెళ్లకుండా ఉన్నాను" అన్నది దీప్తి.

"కానీ తెగేదాకా లాగడం మంచిది కాదమ్మా! ఆలోచించుకో.." అంది లక్ష్మి.

"నీకు నేనిక్కడుండటం ఇష్టం లేకపోతే చెప్పు. వేరే రూమ్ చూసుకొని ఒక్కదాన్నయినా వుంటాగానీ.. మళ్ళీ ఆ కొంపకెళ్ళేది లేదు" అంది దీప్తి దూకుడుగా.

'అంత పని చేసినా చేసే రకం' అని

లక్ష్మి మౌనం వహించింది.

కాగల కార్యం గంధర్వులే తీర్చినట్లు దీప్తి, రాజీవ్‌లను వాళ్ళ ఆఫీస్‌వాళ్ళు అమెరికా పంపించడంతో ఆ సమస్య పరిష్కారమైంది. ఇప్పుడు దీప్తి చెప్పినట్లే ఆమె అత్తగారింట్లో అన్నీ హర్షణీయమైన మార్పులు వచ్చాయి. ఇటు దీప్తి, రాజీవ్‌లు చిలకా గోరింకల్లా అమెరికాలో సెటిల్ అయ్యారు.

★ ★ ★

ఐదేళ్ళుగా వాళ్ళు సుఖంగా, సంతోషంగా వుంటున్నారని నిశ్చింతగా తన పనుల్లో లీనమయిన లక్ష్మి ప్రశాంత మానస సరోవరంలో రాజీవ్ మాటలు రాళ్ళు విసిరినట్లయ్యాయి. గతంలోనుండి ఈ లోకంలోకి వచ్చిన లక్ష్మి దీప్తి తన మాటల్ని మన్నిస్తుందన్న నమ్మకం లేకపోయినప్పటికీ, ప్రాణమాగక ఫోన్ తన చేతిలోకి తీసుకొంది. దీప్తి లైన్‌లోకి రాగానే- "అమ్మా దీప్తి! నేనో శుభవార్త విన్నాను తల్లీ.. ఎంత ఆనందంగా వుందో.." అంది.

"ఓ... రాజీవ్ చెప్పేశాడా? అదేంటో ఎంత కేర్ తీసుకొన్నా ఇలా జరిగిందేంటో ప్చ్" అంది దీప్తి.

"తల్లీ! ఏం జరిగినా మన మంచికే అనుకోవాలి. దయచేసి నా మాట వినమ్మా. ఇప్పుడు అబార్షన్ వంటి పనులేవీ చేయకు. అంతగా అయితే ఓ పాపో బాబో పుట్టాక ఏకంగా ఫామిలీ ప్లానింగ్ చేయించుకో.. ఈ బిడ్డను వద్దనుకోకమ్మా.." రిక్వెస్టింగా అంది లక్ష్మి.

"మీకేం? మీరందరూ ఎన్నో చెబుతారు. కానీ నాకో గోల్ ఉంది. ఇంకా కొన్ని సమస్యలున్నాయి. అందుకే 'వద్దు' అనుకొంటున్నా" అంది దీప్తి.

"సమస్యలు వస్తూనే వుంటాయ్! అయినా మీ ఆడబడుచుల పెళ్ళిళ్ళు చేసేసారు. మీ మరిది పెళ్ళీ అయింది. ఆ కోడలు అత్తమామల్ని చూసుకొంటోంది. ఇక మిగిలిన మరిది పెళ్ళీ అవుతుందిలే.. నా మాట విని..."

"అమ్మా! మా ఇంటిని తాకట్టులో పెట్టి ఆ డబ్బుతో, మేం దాచిపెట్టినదాంతో మా ఆడబడుచుల పెళ్ళిళ్ళు చేసాం. ఇప్పుడా ఇంటిని విడిపించాలి. మేం కాస్త బ్యాంక్ బాలెన్స్ మెయిన్‌టెయిన్ చేయాలి. మేమిక్కడ తీసుకొన్న ఇంటికి డబ్బు కట్టేదుంది. ఇవన్నీ అయ్యాక అప్పుడు 'బేబీ' గురించి ఆలోచిస్తా" అంది దీప్తి.

"మనక్కావాలనుకొన్నప్పుడే పిల్లలు పుట్టరమ్మా.. మన పావనీ ఆంటీకి ఇప్పుడు పిల్లలు కావాలని వుంది. లక్షలకొద్దీ డబ్బు ఖర్చుచేస్తోన్నా ఏ ప్రయత్నమూ ఫలించటంలేదు. ఇప్పుడీ ప్రెగ్నెన్సీని ఆక్సెప్ట్ చెయ్ తల్లీ.. ప్లీజ్ నా మాట..."

లక్ష్మి ఇంకా ఏదో చెబుతూంటే ఫోన్ కట్ అయింది. ఆమెకర్థమయింది దీప్తి ఈ విషయంలో స్ట్రాంగ్‌గా వుందని, తన మాట వినదని. దాంతో ఉస్సూరంటూ కూర్చుండి పోయింది. తర్వాత రెండు, మూడు సార్లు దీప్తికి ఫోన్ చేయబోయింది గానీ 'స్విచ్ఆఫ్' అని రావడంతో మాట్లాడేందుకు కుదర్లేదు. దాంతో ఒకటే ఆరాటం మొదలైంది.

నాల్రోజుల తర్వాత రాజీవ్ ఫోన్ చేసాడు. "అత్తమ్మా! చాలా థాంక్స్. మీరేం చెప్పారోగానీ దీప్తి ఇప్పుడు 'బేబీ కేర్' పుస్తకాలని చదువుతోంది. అన్నట్లు తనకి మార్నింగ్ సిక్‌నెస్, అదే వేవిళ్ళు. చాలా ఇబ్బందిపడుతోంది. నేను మీరిక్కడికి వచ్చేందుకు టికెట్ పంపిస్తాను. వారంలో అన్నీ రెడీ చేసుకోండి" అంటూ ఫోన్ పెట్టేసాడు. లక్ష్మికి కరచరణాలాడ లేదు ఆనందంతో.

దీప్తివాళ్ళు అమెరికా వెడుతూ తనకీ వీసా తీసుకొంటుంటే "ఎందుకే ఈ అనవసరపు ఖర్చులు? పొరుగూరికే వెళ్ళని నేను విదేశాలకెడతానా? ఏమన్నానా?" అందప్పుడు.. కానీ అదిప్పుడు అక్కరకొ

చ్చిందే అనుకొంది.

చకచకా పనులు ముగించుకొని అమె రికా వెళ్ళేందుకు ఫ్లైట్ ఎక్కింది. అమెరికాలో అడుగుపెట్టగానే అదో వింత ఆనందం, సంభ్రమం కలిగాయి. చిన్నబొజ్జతో దీప్తి నిండుగా కన్పించేసరికి ఆ ఆనందం రెట్టింపైంది. పూర్వంలా గాక తనతో ఎంతో ప్రేమగా మసలుతోన్న దీప్తిని చూస్తోంటే కడుపు నిండిపోసాగింది.

'తల్లి విలువ తెలిసివచ్చిందా? లేక ప్రస్తుతం తన సహాయం కావలసి వుండి ఇలా వుంటోందా?' అన్న అనుమానం చిరుచేపలా కదలాడేది లక్ష్మికి.

దీప్తి సూక్ష్మగ్రాహి కాబట్టి అది గ్రహించి "అమ్మా! ఆ రోజు నువ్వు నన్ను అబార్షన్ చేసుకోవద్దని చెప్పావ్ చూడు. ఆ మరుసటిరోజే పెద్దమావయ్య ఫోన్ చేసి "దీప్తీ, నీకు చాదస్తంగా అనిపించినా ఫర్వాలేదు గానీ వెంటనే తలారా స్నానం చెయ్. మీ నాన్న చనిపోయాడు" అని చెప్పాడు. "ముక్కు మొహం తెలీని ఆ వ్యక్తి గురించి, నేనిప్పుడు స్నానం చేయాలా?" అన్నాను. దాంతో "నువ్వా మనిషిని చూసావమ్మా!" అంటూ అతని వివరాలు చెప్పాడు. అవి విని నిర్ఘాంతపోయాను. అప్పుడే తెలిసిందమ్మా నీ మంచితనం, నీ ఓపిక, నీ వివేకం. అన్నీ అప్పుడు తెలిసాయి. అవన్నీ తెలీని నిన్ను నేనెంత బాధపెట్టానో తలుచుకొంటున్న కొద్దీ ఎంత ఏడ్పొచ్చిందో తెలుసా! అమాంతం ఇండియాకొచ్చి నీ కాళ్ళమీద పడాలన్నంత పశ్చాత్తాపం కలిగింది.." అంది తల్లి వళ్ళో వాలుతూ.

లక్ష్మి ఆశ్చర్యంగా దీప్తినే చూడసాగింది. ఆమె చెంపలమీద ముత్యాలసరాలు తెగిపడ్డట్లుగా వెల్లువవుతోన్న కన్నీటిని తుడుస్తూ "ఏమంటున్నావమ్మా..?" అంది అస్పష్టంగా లక్ష్మి.

"నేనోసారి మావయ్యావాళ్ళ ఊరికి వెళ్ళినపుడు, మామయ్య కూతురు రాధ, మావయ్యతో "నాన్నా! నా ఫ్రెండ్ పెళ్ళికి వారం ముందే రమ్మంది. ఒక్కదానివీ అంత దూరం ఎందుకు? అంటూ వద్దన్నావ్. ఇప్పుడు దీప్తి వచ్చిందిగా, అదిగూడా ఆ ఊరు చూసినట్లు వుంటుంది. నాకు తోడుగా వుంటుంది. వెడతాం నాన్నా" అంటూ ప్రయాణానికి ఒప్పించింది. ఇద్దరం వెళ్ళాం. రాధ తన ఫ్రెండ్‌తో గడుపుతూంటే, నా దృష్టి ఎదురింటి అమ్మాయ్ మీద పడింది. గుళ్ళో కన్పించి, నాతో పరిచయమూ పెంచుకొంది. చిత్రంగా ఆ అమ్మాయంటే చాలా ఇష్టం, అపేక్ష కలిగాయ్. ఏదో మాట్లాడుతూ "మీ నాన్న గారేం చేస్తుంటారు?" అనడిగాను. "పీకల దాకా తాగి మా అమ్మనూ, మమ్మల్నీ పీక్కుతింటుంటాడు" అంది నిర్లిప్తంగా. ఆశ్చర్యంగా చూసాను ఆమెవైపు. మళ్ళీ ఆ అమ్మాయి మాట్లాడుతూ "తండ్రి గురించి ఇలా చెప్పుకొనే ఖర్మ బహుశా, మాకే పట్టిందేమో. పైసా సంపాదించడు. అమ్మా, మేము నానా కష్టాలు పడి సంపాదించిదంతా లాక్కొని తాగుడికి, పేకాటకీ, ముండలకీ తగలేస్తూ ఉంటాడు. ఈయనతో ఎన్నాళ్ళని వేగుతాం? మనమెటన్నా వెళ్ళిపోదాం అని అమ్మతో ఎన్నిసార్లు అన్నా వినదు, వట్టి పిరికిది. 'మగతోడు లేకపోతే ఎలా?' అంటుంది. దాంతో భరించాల్సి వస్తోంది" అంది కోపంగా.

మేడమీదనుండి అప్పుడప్పుడు వాళ్ళింటి వైపు చూసేదాన్ని. అతడు తాగి వచ్చి చేసే రాద్ధాంతం చూస్తోంటే భయంగానూ, అసహ్యంగానూ అన్పించేది.

ఆ అమ్మాయికి జ్వరం వచ్చిందని రాధ చెబితే, చూడటానికి వెళ్ళాను. వంటి నిండా వాతలు, తట్లు చూసి "ఏమయింది?" అనడిగాను. దాంతో పాపం ముఖం చేతుల్లో దాచుకొని ఏడుస్తూ "ఏం చెప్పమంటావ్. డబ్బున్న ఓ మనిషిని

తీసుకొచ్చాడు. వాడితో రాసుకు పూసుకు తిరగమని చెప్పాడు. "నువ్వసలు కన్నతం డ్రివేనా? " అని ఎదురుతిరిగితే, ఇదుగో ఇలా, బెల్ట్‌తో బాదాడు. నాక్కాస్త ఓపిక రానీ, ఈసారి గనుక నామీద చెయ్యి చేసు కొంటే, ఓ పెద్ద బండరాయి వాడినెత్తిన పడేసి చంపేస్తాను" అంది ఆవేశంగా.

ఆ అమ్మాయి 'కసి' ఆక్షేపించదగింది కాదని ఆ క్షణంలో అనిపించింది. ఇదంతా ఎందుకు చెబుతున్నానంటే, ఆ అమ్మాయి తండ్రే, నీ భర్తని... సారీ నా తండ్రని, మావయ్య ఫోన్‌లో చెబితే తెలిసింది.

నువ్వతడిని వదిలిరావటం ఎంత కరెక్ట యిన పనో తెల్సిందమ్మా. నేను కాలేజ్‌లో చేరాక, నీ గురించి తేలిగ్గా మాట్లాడిన వారి ప్రభావంతో, నిన్నెంత నిర్లక్ష్యంగా చూసిందీ, అప్పటి నా ప్రవర్తనా తల్చుకొని బాధపడని క్షణం లేదనుకో. నేనలా ప్రవ ర్తించినా అనుక్షణం నా క్షేమం కోసమే అల్లాడే నిన్ను, తల్లిగా పొందడం నేనేనాడో చేసుకొన్న పుణ్యమమ్మా. అందుకే చంద్రు డికో నూలుపోగులా, నీ చిరకాల స్వప్నం సాకారమయ్యేందుకు, నా వంతుగా నేనూ ఆర్థికంగా సాయం చేయాలనుకొంటు న్నాను. నీకు నగలు కొనిచ్చినా కలగని సంతోషం, నేనీ పనిచేస్తే కలుగుతుంది. రాజీవ్ గూడా ఈ విషయంలో ఇక్కడి తన ఫ్రెండ్స్‌తో, ఛారిటీ సంస్థలతో మాట్లా డతానన్నాడు. తన ఫుల్ సపోర్ట్‌నిస్తాన న్నాడు. అందుకే మరో మూడేళ్లు ఇక్కడే వుండి సంపాదించిదంతా ఆశ్రమా నికివ్వాలనుకొంటున్నాం" అంది దీప్తి.

లక్ష్మి మనసంతా ఆనందంతో నిండిపో యింది. కూతురు ఆశ్రమానికి సాయం చేస్తానన్నందుకు కాదు, తను రియలైజ్ అయినందుకు.. తన కోరికకు 'విలువ' ఇస్తున్నందుకు. దీప్తి తల నిమురుతూ "నీ తప్పు నువ్వు తెలుసుకొన్నావు.. పశ్చాత్తా పానికి మించింది లేదు. ఆశ్రమానికి కావ లసిన ఫండ్స్ గురించి అక్కడ నేనూ, మరికొందరం ఎలాగూ ప్రయత్నిస్తున్నాం. నాకోసం నువ్వు మరింత శ్రమకు లోన వ్వడం నాకిష్టం లేదు" అంది లక్ష్మి.

"అమ్మా! నాకోసం నువ్వు నీ జీవితాన్నే కోల్పోయావు. అయినా చెక్కుచెదరని దీక్షతో నీలాంటి బాధాగ్రస్తులను ఆదుకోవ డానికి ఎంతో కష్టపడుతున్నావ్. ఓ మంచి పనికి నావంతుగా నేనూ ఇంతో అంతో సాయం చేస్తేనే నీ కూతురిగా నా జన్మ సార్థకమవుతుంది. మా సాయాన్ని అంగీ కరిస్తేనే నువ్వు నన్ను క్షమించావని అను కొంటాను. అంతే!" అంది దీప్తి.

"సరేనమ్మా, మంచిపని చేస్తానంటే వద్దని ఎలా అంటాను? కానీ ముందు నీ డెలివరీ గానీ, నన్ను నా మనవడితో ఎంజాయ్ చేయనీ.." అంది లక్ష్మి నవ్వుతూ.

దీప్తికి నెలలు నిండి పండంటి బాబు కలిగాడు. లక్ష్మి తీసుకొనే జాగ్రత్తలవల్ల, మంచి పోషణ వల్ల బాబు బొద్దుగా ముద్దుగా తయారయ్యాడు. వాడేం చేసినా వారికి అపురూపమే. వాడి ఆటపాటల్లో మైమరచిపోతూ "అత్తమ్మా, మీ వల్లనే ఈ బంగారుకొండ నాకు దక్కాడు" అనేవాడు రాజీవ్. బాబుకి సంవత్సరం నిండేవరకూ అక్కడే వుండి, తిరిగి ఇండియాకి వచ్చే స్తోంటే లక్ష్మికి తన ప్రాణాలనక్కడే వదిలి వస్తున్నట్లు అన్పించింది. కన్నీళ్ళనాపుకో వటం కష్టమయింది.

జీవితంలోని ఆటుపోట్లకి కన్నీరు చిందించని ఆమె, మనవడిని వదలలేక కన్నీరు కారుస్తూంటే దీప్తి, రాజీవ్‌ల హృద యాలు ద్రవించాయి. తనని తాను కంట్రోల్ చేసుకొంటూ, తన స్వప్నం సాకా రమయ్యే రోజు ఇంకెంతో దూరంలో లేదులే అనుకొనేసరికి ఎప్పట్లా మారింది లక్ష్మి. ఆమె అడుగులు లక్ష్యంవైపు బలంగా పడ్డాయి.

అమెరికా కథ

- ఎడ్వర్డ్ డి. హోక్

చీకటి

విధి నిర్వహణలో తొందరపాటు ప్రదర్శించిన కారణంగా కెండెల్ తన పోలీస్ ఉద్యోగం పోగొట్టుకున్నాడు.

మద్యం అమ్మే దుకాణంలో ఒక రాత్రి వేళ ఒక వ్యక్తి చొరబడ్డాడు. మద్యం సీసా మూత తెరచి ఆత్రంగా తాగబోతున్నాడతడు. కెండెల్ అతడిని వెంటాడుతూ వచ్చి అతడి చేతిలోని మద్యం సీసాను పిస్టల్‌గా పొరబడ్డాడు. సీసాను ఎత్తి పెట్టి చూపాడు చొరబాటుదారుడు.

అప్పటికే కెండెల్ అతడి మీద తన పిస్టల్‌ని గురిపెట్టాడు. గురి పెట్టడమే తడువుగా పిస్టల్‌తో అతడిని కాల్చేశాడు. కెండెల్ నుండి పిస్టల్‌ను స్వాధీనపరచుకుని అతడిని ఉద్యోగం నుండి తొలగించారు.

తన ప్రియురాలు శాండీతో పాటు కెండెల్ పొరుగు జిల్లాకు పారిపోయాడు. ఒక చిన్న పట్నంలో వాళ్లిద్దరూ తల దాచుకున్నారు. కెండెల్ అక్కడే ఉద్యోగం వెతుక్కుంటున్నాడు.

ఆ చిన్న పట్టణానికి దగ్గరలో ఒక సరస్సు ఉంది. ఆ సరస్సు ఒడ్డున పర్యాటక శాఖ వారి కుటీరాలు ఉన్నాయి. వాటిని అద్దెకు ఇస్తుంటారు. వాటిని అద్దెకు తీసుకుని విందులు, విలాసాల్లో మునిగితేలుతుంటారు పర్యాటకులు. కెండెల్ అనేక రకాల ఉద్యోగ ప్రయత్నాలు చేసి చివరికి పోలీస్ ఉన్నతాధికారిని సంప్రదించాడు.

“రాత్రిపూట గస్తీ అధికారిని తప్పించాం. ఆ ఉద్యోగం ఒకటి ఖాళీ ఉంది. శాంతి, భద్రతల్ని పరిరక్షించడంతో పాటు చిన్నపిల్లలూ, మైనారిటీ తీరని వాళ్లూ మద్యం సేవించకుండా చూడాలి. వారానికి డెబ్బై అయిదు డాలర్లు జీతం!” అన్నాడు పోలీస్ ఉన్నతాధికారి.

కెండెల్ ఆయనకి కృతజ్ఞతలు చెప్పాడు.

కెండెల్‌కి ఒక పిస్టల్‌ని అందిస్తూ “దీన్ని ఎంతో విచక్షణతో ఉపయోగించాలి సుమా! కుటీరాలను అసాంఘిక కార్యక్రమాల కోసం ఎవరూ ఉపయోగించకుండా చూడాలి!” అన్నాడు పోలీస్ అధికారి.

కెండెల్ ఎంతో సంతోషంతో తమ అద్దెయింటికి తిరిగివచ్చాడు. ఉద్యోగం దొరికినందుకు శాండీ సంతోషించింది. ఆమె భుజం మీద చేతులు వేసి “మనం ఈ రోజు నుండి సంసార జీవితంలో అడుగు పెట్టవచ్చును!” అన్నాడు.

శాండీ తల అడ్డంగా ఊపి “నేను కూడా ఉద్యోగం సంపాదించుకోవాలి. మీ ఒక్క జీతం మన సంసార జీవితానికి అసలు సరిపోదు. భద్రత దొరికే వరకూ మనం పెళ్లి కూడా చేసుకోవద్దు!” అంది.

కెండెల్‌కి చెప్పినట్టుగానే శాండీ ఆ రోజే ఓ ఉద్యోగం వెతుక్కుంది. ఆమెది సూపర్ మార్కెట్‌లో ఉద్యోగం. అయితే ఆమెకు పగలు ఉద్యోగమైతే కెండెల్‌కు రాత్రి ఉద్యోగం.

పోలీస్ అధికారిని ఆ సాయంత్రం కలి

శాడు కెండెల్.

"ఎంతో అవసరమైతే తప్ప పిస్టల్ ఉప యోగించవద్దు!" అన్నాడు అధికారి. "అలా గేనండి" అన్నాడు కెండెల్.

"సరస్సు చుట్టూ గస్తీకారులో తిరగండి. ప్రతి కుటీరాన్ని పరిశీలించండి. పిల్లలు దొరికితే మాత్రం వాళ్లను జాగ్రత్తగా చూసుకోవాలి. వాళ్లు మరల మరలా ఆ ఛాయలకు రాకుండా గట్టిగా బుద్ధి చెప్పాలి! పెద్దవాళ్ల విషయంలో మాత్రం ఎప్పటికప్పుడు నాకు తెలియపరచాలి. ఎలాంటి చర్యలు చేపట్టాలో వివరించి చెబుతాను!"

"తప్పకుండానండి! ఈరోజే బయల్దేరుతున్నాను..."

"మంచిది. నేను కూడా ఈ రాత్రి వేళ తూర్పుప్రాంతంలో సంచరిస్తాను. నా గురించి మీరు చూడనక్కర్లేదు"

అత్యుత్సాహంతో కెండెల్ స్వయంగా కారు నడుపుకొంటూ బయల్దేరాడు. కొంత సేపు గస్తీ తిరిగాక శాండీ ఉద్యోగం చేసే సూపర్‌మార్కెట్‌కి చేరుకున్నాడు. తనకు ఉద్యోగ బాధ్యతల్లో భాగంగా ఇచ్చిన పిస్టల్‌ని శాండీకి చూపించాడు.

"మరో పిస్టలా? మీ చేతిలో పిస్టల్ మామూలుగా వూరుకోదు" అంది శాండీ.

"ఇది నా ఉద్యోగ ధర్మం" అన్నాడు కెండెల్.

"రాత్రిళ్లు పిల్లలు చట్టవ్యతిరేకంగా ప్రవర్తిస్తేనో...!"

"అలాంటి సంఘటన ఇంకా ఎదురుకాలేదు కదా!"

"మద్యం దొంగను కాల్చినట్టు కాల్చరు కదా!"

"కాల్చను కాని... మనం ఎప్పుడు పెళ్లి చేసుకుంటాం? "

"చేసుకుందాంలెండి. కానీ మీరు మరో హత్య చేయవద్దు!"

"ఎందుకు చేస్తాను!" అన్నాడతడు ముందుకు వాలుతూ. వాళ్ల పెదవులు సుతారంగా రాసుకున్నాయి తప్పితే చుంబన కార్యక్రమేమీ జరగలేదు.

కెండెల్ వెళ్లిపోయాడు. అర్ధరాత్రి వేరే పోలీస్ అధికారి అతడిని విధి నిర్వహణ మధ్యలో కలుసుకున్నాడు. చాలా చలిగా ఉంది. పున్నమి వెన్నెల పుచ్చపువ్వు మాదిరిగా భూమి మీదకు జారుతోంది.

"శీతాకాలం అని ఎంత మాత్రం నిర్లక్ష్యంగా ప్రవర్తించక! వాళ్లు చలిలో కూడా తుంటరి పనులు మానరు!" అన్నాడు పోలీస్ అధికారి.

వారి మాటల్లో భాగంగా కెండెల్ గతంలో తన ఉద్యోగం పోవడానికి కారణం వివరిస్తూ "ఇంతకు ముందు పొరపాటున ఒకడిని కాల్చి చంపాను. అందుకే నా ఉద్యోగం వూడిపోయింది!" అని చెప్పాడు.

అతడి నిజాయితీని పోలీస్ అధికారి ఎంతగానో మెచ్చుకున్నాడు. తరువాత ఎవరి విధి నిర్వహణ మీద వాళ్లు వెళ్లిపోయారు.

కుటీరాలు తనిఖీ చేశాడు కెండెల్. సరస్సు ఒడ్డున కొంతమంది పిల్లలు కేరింతలు కొడుతూ ఆడుకుంటున్నారు. పోలీస్ వాహనం చూసి వాళ్లు దూరంగా పారిపోయారు. కెండెల్ బార్‌లో ప్రవేశించాడు. ఎవరి మటుకు వారు తాగుతున్నారు. అక్కడ పిల్లలు లేరు. కెండెల్ శాంతించాడు.

తాగుబోతుల్లోంచి ఒకడు ముందుకొచ్చాడు. అతడిని ప్రశ్నార్థకంగా చూశాడు కెండెల్.

"నన్ను మిల్ట్ అంటారు. మీ కంటే ముందు మీలాగా ఈ విధులు నిర్వహించాను" అన్నాడతడు.

కెండెల్ అతడితో కరచాలనం చేశాడు.

"అయితే ఎందువల్ల ఉద్యోగం మానుకున్నారు? " అడిగాడు కెండెల్.



"మీ అధికారికి నేనంటే అసూయ! ఏం? ఈ మాత్రం ఉద్యోగం లేకపోతే నేను బతకలేనా!" అన్నాడతడు.

"అసూయా - ఎందువల్ల? "

"మనకేం తెలుస్తుంది చెప్పండి! ఆయననే కారణం అడగండి! మీకైనా చెబుతాడేమో!" నవ్వాడు మిల్ట్.

తెల్లవారే సమయానికి ఇంటికి చేరుకున్నాడు కెండెల్. శాండీ గాఢ నిద్రలో ఉంది. బద్ధకంగా కళ్లు తెరచి చూసింది కొద్దిసేపయ్యాక.

"ఎలా వుంది ఉద్యోగం? " అడిగిందామె.

క్లుప్తంగా వివరించాడతడు.

అతడు నిద్రపోయాడు. సూపర్ మార్కెట్‌కి పోవడానికి ఆమె తయారవుతోంది.

★ ★ ★

రెండోరాత్రి కూడా మామూలుగానే గడిచింది.

మిల్ట్ గురించి అధికారిని అడిగాడు కెండెల్.

"నీ వ్యవహారం నువ్వు చూసుకో!" కసురుకున్నాడు అధికారి.

కెండెల్ మారు మాట్లాడలేదు. అవును. తనకెందుకొచ్చిన గొడవ.

అయితేనేం? మిల్ట్ మాత్రం కెండెల్‌ను విడిచిపెట్టలేదు. బార్‌లో తాగుతూ అతడికి కనిపించాడు.

"మీ గురువు కారణం చెప్పాడా? " అని అడిగాడు.

"నేను అడగలేదు!" అన్నాడు కెండెన్.

"మంచిది. నీ పనేదో నువ్వు చూసుకో!" నవ్వాడు మిల్ట్.

బార్ యజమాని ఉచితంగా కెండెల్‌కి మద్యం అందించాడు. బయట ధారాపాతంగా మంచు కురుస్తోంది. మిల్ట్‌ను ఆ రాత్రి అనుసరించాలని అతడు నిర్ణయించుకున్నాడు.

మిల్ట్ తన కారులో అంతటి మంచు వాతావరణంలోనూ బయల్దేరి వెళ్లిపోయాడు. కెండెల్ అతడిని కొంత దూరం వరకూ అనుసరించాడు కాని- అతడి కారు ఒక మలుపులోకి తిరిగి మాయమైపోయింది.

మరునాటి సాయంకాలం తన విధి నిర్వహణకు వెళ్లే ముందు కెండెల్ తన కాబోయే భార్య శాండీ పనిచేసే సూపర్ మార్కెట్‌కి వెళ్లాడు. అక్కడ అతడి గుండె జలదరించే దృశ్యం ఒకటి కనిపించింది.

శాండీ, మిల్ట్ చిరకాల పరిచయస్తుల మాదిరిగా, పాత స్నేహితుల మాదిరిగా నవ్వుకుంటూ మాట్లాడుకుంటున్నారు.

కెండెల్ అటు నడిచాడు. అసలేమీ అవాంఛితం జరగలేదని తన మనస్సుకు తాను నచ్చచెప్పుకుంటున్నాడు. అతడు ఇటూ అటూ నడిచాడు. శాండీ వద్దకు చేరుకున్నాడు. అప్పటికి మిల్ట్ వెళ్లిపోయాడు.

"అతడు ఎవరు..? " అడిగాడు కెండెల్, "..నీ స్నేహితుడా!"

"స్నేహితుడేమిటి!" తెల్లబోయింది శాండీ.

"ఇప్పుడే కదా చూశాను. నవ్వుతూ మాట్లాడుతున్నావు కదా!"

"ఓహ్! అతడా? ఎంతోమంది వినియోగదారుల్లో అతడు ఒకడు. ఇక్కడిక్కడే సంచరిస్తుంటాడు. అంతే!" అంది శాండీ.

ఇక కెండెల్ ఆ సంగతి ప్రస్తావించలేదు. అటు తర్వాత శాండీ కూడా అతడిని తమ పెళ్లి గురించి రెట్టించనూ లేదు. పెళ్లి అవసరాన్ని ఆమె మరిచిపోయినట్టే ఉండిపోయింది.

★ ★ ★

సోమవారం సాయంత్రం కెండెల్‌కు హాలిడే. అందువల్ల అతడితో పాటు శాండీని కూడా తమ యింటికి భోజనానికి పిలిచాడు పోలీస్ అధికారి.

శాండీకి కూడా పరాయి వూళ్లో ఆ మాత్రం పరామర్శ అవసరమనిపించింది.

పోలీస్ అధికారి భార్యకు ముప్పై అయి దేళ్ల వయస్సు ఉంటుంది. ఆమె సౌం దర్యం ఆడదైన శాండీనే చూపు తిప్పుకోని వ్వలేదంటే కెండెల్ పరిస్థితి ఏమిటి!? అతిథి మర్యాదల్లో కూడా ఆమె ఎంతో శ్రద్ధ చూపించింది.

భోజనం ముగిశాక అధికారితో పాటు కెండెల్ క్రింది అంతస్తులోని వర్క్ షాపులోకి ప్రవేశించాడు.

అధికారి అక్కడ రకరకాల పనిముట్లూ, ఆయుధాలూ చూపించాడు. అధికారికి విధి నిర్వహణ పట్ల, గృహనిర్వహణ పట్లా ఉన్న నిబద్ధత అతడికి మరింత బాగా అర్థ మయ్యింది.

మాటల సందర్భంలో మిల్ట్ గురించి బయటపడ్డాడు పోలీస్ అధికారి. మిల్ట్ ప్రవర్తన ఆయనకి నచ్చేదికాదు. అలాంటి వాడికి అసలు తాను ఎందుకు ఉద్యోగం

అనువాదం :
ఎం.వి.వి. సత్యనారాయణ

యిచ్చాడో అర్థంమయ్యేదికాదట.

తరువాత రాత్రే మిల్ట్ కనిపించాడత డికి. బార్‌లో తాగాడు మిల్ట్. కాటేజెస్ వైపు అంత రాత్రివేళ కారులో వెళ్లిపో యాడు. ఆ కుటీరాలు అతడు గుర్తుపెట్టు కున్నాడు.

కుటీరంలో మిల్ట్ గనక ఉంటే అతడిని ఇంటికి పొమ్మని చెప్పవలసి ఉంది. అయితే కెండెల్ తన నిర్ణయం వాయిదా వేసుకున్నాడు. మిల్ట్ మీద పిస్టల్ పేల్చవ లసి ఉంటుందని కెండెల్ నిర్ణయించుకునే ఉన్నాడు.

అందువల్ల తాత్కాలికంగా మిల్ట్‌ను విడి చిపెట్టాడు.

కెండెల్‌కి ఆ రాత్రి పోలీస్ అధికారి కొంతమంది సంఘవిద్రోహ శక్తుల పేర్లు రాసియిచ్చాడు.

"మిల్ట్ కనిపించాడా! అడిగాడు అది కారి.

"ఇలా కనిపించి అలా మాయమ య్యాడు!" చెప్పాడు కెండెల్.

★ ★ ★

శాండీకి, తనకూ మధ్య దూరం పెరిగి పోయిందని కెండెల్ వూహించుకుంటు న్నాడు. ఎందువల్లో ఆమె అంతగా సాన్ని హిత్యం ప్రదర్శించడంలేదు.

"ఏమిటి సంగతి? " అడిగాడు కెండెల్ చివరికి-

"సూపర్ మార్కెట్లో చాల రద్దీగా ఉంటోంది. అలిసిపోతున్నాను!" చెప్పింది శాండీ.

"అదీ సరే, వాడు మరల వచ్చాడా!" అడిగాడు కెండెల్.

ఎవరి గురించి అతడు అడుగుతున్నాడో ఆమెకు అర్థమయ్యింది. "వాడు ఆ చుట్టు ప్రక్కలనే తిరుగుతుంటాడని చెప్పాను కదా!" అంది.

కెండెల్ బలంగా విశ్వసించాడు.

"నువ్వు మారిపోయావు కెండెల్! దొంగ లను పిస్టల్‌తో కాల్చాక నీలో చాలా మార్పు వచ్చింది!"

"నీకు అలా అనిపిస్తోందా! ప్రస్తుతం ఉన్న పిస్టల్‌తో నేను పనేపెట్టుకోలేదు!" అంటూ కెండెల్ నిష్క్రమించాడు.

ఆ రాత్రి చాలా చలిగా ఉంది. శాండీ మాటలు అతడిని విపరీతంగా బాధిం చాయి.

సరస్సు చుట్టూ ప్రదక్షిణలు చేశాడు కెండెల్. మిల్ట్ నడిపే కారు ఎక్కడైనా కనిపిస్తుందేమోనని అతడు నిఘా పెట్టాడు. కుటీరాల చాటున దాచాడాకా రును?

అర్ధరాత్రి కావస్తోంది.

చలికి సరస్సు గడ్డ కట్టుకుపోయింది. కెండెల్ తనయింటిని సమీపించాడు.

అంత రాత్రివేళ కూడా కెండెల్‌కి ఆమె తన గదిలో కనిపించలేదు. ఆమె పడుకునే పరుపు కూడా శుభ్రంగా ఉంది. ఎలాంటి ముడతలూ ముద్రలు పడలేదు.

శాండీ ఎక్కడికి పోయింది? వెలుపల చలిపంజా చాలా కిరాతకంగా ఉంది. అతడు తిరిగి సరస్సును సమీపించాడు. బార్‌లో తాగుబోతులు అతడికి తెలియని వాళ్లే. బార్ యజమాని అతడికి మద్యం అందించాడు. బార్‌గుమ్మం వద్ద తాగుతూ నిలబడ్డాడతడు.

అతడిలో వెర్రికోపం జడలు విప్పుకుంటోంది.

బార్‌లోంచి బయటపడ్డాడు. మిల్ట్ నడిపే కారు అతడికి ప్రక్క నుండే దూసుకుపోవడం అర్థమైంది. కారులో అతడి ప్రక్కగా ఒక యువతి ఉంది. కారు లోపలి వెలుగులో ఆమె అస్పష్టంగా కనిపించి కారుతోపాటు మాయమైపోయింది.

ఆమె శాండీ అయివుంటే ఆమెను చంపి తీరవలసిందే. కెండెల్ ఒక స్థిర నిశ్చయానికి వచ్చాడు.

★ ★ ★

"రాత్రి ఎక్కడికి వెళ్లావు?" కెండెల్ ఉదయాన్నే లేవగానే అడిగాడు. తన గొంతు మామూలుగానే ధ్వనించే ప్రయత్నం చేశాడతడు. "రాత్రా! రెండో ఆటకు సినిమాకు వెళ్లాను!" అంది శాండీ.

"చలిలో ఎలా తిరిగి వచ్చావు!"

ఆమె సిగరెట్ వెలిగించుకుంది. సమాధానం యిచ్చే ముందు అతడి నుండి కొద్దిగా దూరం జరిగింది. "ఇక్కడే ప్రతి రాత్రి గడపాలంటే ఎంత విసుగ్గా ఉంటుందో ఊహించలేవా? అర్థం చేసుకోవాలి కదా!"

"అవును బాగానే అర్థం చేసుకున్నాను!" అన్నాడు కెండెల్.

మధ్యాహ్నం గడిచిపోయింది. చలి గాలులు వీచడం మొదలయ్యాయి. సరస్సు పైన ఆకాశంలో చీకటి తెరల ఛాయలు ప్రత్యక్షమవుతున్నాయి. పట్నంలోకి కూడా చీకటి తెరలు క్రమంగా దిగబడుతూ

న్నాయి.

బార్‌నూ, బార్ వెనక ఉన్న కుటీరా లనూ ఒకసారి పరిశీలించాడు కెండెల్. కారును ఒక ప్రక్కగా రోడ్డుకి దూరంగా నిలబెట్టాడు. మిల్ట్ అక్కడే ఎక్కడో కారును దాచిపెట్టుకుని కుటీరాల్లో రాత్రిళ్ళు గడుపుతుంటాడని అతడికి తెలుసు.

కుటీరాల ప్రక్కనే ఉన్న ఇళ్లను కూడా కెండెల్ విడిచిపెట్టలేదు. అసాధారణమైన అంశం ఏదీ అతడికి కనిపించలేదు. అక్రమ చొరబాటుదారులు అతడికి కనిపిం చలేదు. అటుప్రక్క కుటీరాలు కూడా తిరిగి వచ్చాడు. ఒక కుటీరం కిటికీ చెక్క విరిగిపోయి ఉంటే కెండెల్ ఆ కిటికీలోంచి లోపలికి ప్రవేశించాడు.

కుటీరం ఎంతో అందంగా అలంకరించ బడివుంది. ఐశ్వర్యవంతుల భవంతి మాదిరిగా ఉంది. కుర్చీలూ, బల్లలూ, తెల్లటి వస్త్రాలు కప్పబడి ఉన్నాయి- దుమ్ము పడకుండా.. అలాంటి ఇంటి అమ రికను అతడెప్పుడూ చూసి ఉండలేదు. కొయ్య సామాగ్రిని కూడా చూడలేదు.

మెట్లు ఎక్కి పడకగదిలో ప్రవేశించాడు. అక్కడ అతడికి కావలసిన వస్తువులు కని పించాయి. పడకగదిలో కుప్పలు కుప్ప లుగా బీర్ సీసాలు ఉన్నాయి. ఎవరో బీర్లు తాగారే తప్ప కొయ్య సామాగ్రి మీద తెల్లటి వస్త్రాలను వాళ్లు తాకనైనా తాకలే దని కెండెల్‌కి అర్థమయింది.

యాష్‌ట్రే చూశాడు కెండెల్. కాల్చి వది లిపెట్టిన సిగరెట్ వుంది అక్కడ. శాండీ కాల్చే సిగరెట్ అచ్చంగా అలాంటిదే! అయినా సరే తనకి ఏమంత నమ్మకంగా లేదు.

నేలమీద ఉండగా చుట్టిన కాగితం ఉంది. శాండీ తన లిప్‌స్టిక్ తుడుచుకుని కాగితం చుట్టి పారేసివుంటుంది. ఆ కాగి తపు ఉండను అందుకుని సాపు చేశాడ తడు. అతడికి లోపల్లోపల బెదురుగానే ఉంది.

పోలీస్ అధికారి రాసి యిచ్చిన సంఘ వ్యతిరేక శక్తుల పేర్లు ఆ కాగితంలో రాయబడి ఉన్నాయి. ఆ కాగితం శాండీ తన పర్స్‌లో దాచివుంచుకుని ఉంటుంది.

అతడు తలుపు తెరిచాడు. తిరిగి కిటికీ లోంచి బయటపడ్డాడు. మిల్ట్ ఇప్పుడు ఎక్కడున్నాడో - అతడైతే కిటికీలోంచి బయటపడడు కదా! అర్ధరాత్రి పూట ఏంచేస్తాడు? మిల్ట్ ఏ ఆడదాన్నీ ఈ రాత్రికి తీసుకురాకపోవచ్చు. ఇంతకు ముందు రాత్రే కదూ శాండీని తీసుకువ చ్చాడు. ఆమె వచ్చినట్టున్న రుజువును నాశనం చేయకుండానే మరో ఆడదాన్ని తీసుకురాకపోవచ్చు. ఏమో- శాండీనే

మరోసారి ఈ అర్ధరాత్రి వస్తుందేమో!

బార్‌కి వెళ్లాడు కెండెల్. రెండు మోతాదుల మద్యం సేవించాడు. సరస్సును కారులో చుట్టివచ్చాడు. మిల్ట్ నడిపే కారు దొరికితే బాగుండును. అర్ధరాత్రి దాటాక బార్‌లో అడిగాడు-

"మిల్ట్ కనిపించాడా!" అని..

"కనిపించాడు. బీర్‌సీసాలూ, సిగరెట్స్ కొనుక్కున్నాడు"

ధన్యవాదాలు చెప్పుకుని కెండెల్ తిరిగి కారెక్కాడు. ఒక టెలిఫోన్ బూత్ వద్ద కారాపి తమకు ఇల్లు అద్దెకిచ్చిన యజమానికి ఫోన్ చేశాడు. శాండీ ఇంట్లో లేదట!

కుటీరం వద్దకు తిరిగివచ్చాడు. కుటీరంలో దీపాలు లేవు. చెట్టు క్రింద ఒక ప్రక్కగా కారు నిలబెట్టివుంది. ఆ కారు మిల్ట్ వాడేదే! కుటీరంలో మిల్ట్, శాండీ కలిసి ఉన్నారన్నమాట.

కారును దూరంగా ఆపి కుటీరానికి తిరిగి వచ్చాడు కెండెల్. పిస్టల్‌ని చేత్తో తడుముకున్నాడు.

అతడికి శరీరమంతా కంపరం రేగుతోంది. తెరచివుంచిన కిటికీలోంచి కుటీరంలోకి ప్రవేశించాడు.

కెండెల్‌కి ఆడామగా గొంతులు కలబోతగా వినిపిస్తున్నాయి. గుసగుసలు, 'నవ్వులు' ! మెట్లెక్కి పడకగది వైపు కదిలాడు.

పడకగది తలుపు తెరిచే ఉంది. గుమ్మం వద్దే కొన్ని నిముషాల పాటు నిలబడ్డాడతడు. తన కళ్లు చీకటికి అలవాటు పడేవరకూ ఓపికపట్టాడు. అతడికి సంబంధించిన అలికిడి గదిలో ఉన్నవారికి వినిపించలేదు.

"మిల్ట్... !" పిలిచాడు కెండెల్.

మిల్ట్ ఆ చీకట్లోకి చూశాడు. తుళ్లిపడి చప్పున బెడ్ మీద లేచి కూర్చున్నాడు. తిట్టుకుంటూనే కూర్చున్నాడు.

"ఏమిటిది ఛండాలంగా!" అన్నాడు మిల్ట్.

అక్కడ ఉన్న మహిళ గొంతులో ఆర్తనాదం ప్రతిధ్వనించింది. ఆమె భయంతో వణికిపోతోంది.

ఆర్తనాదం వినిపించినవైపు పిస్టల్ పేల్చాడు కెండెల్. తరువాత ట్రిగ్గర్‌ని నొక్కి పట్టిఉంచాడు. అతడిని వారించడానికి ఇప్పుడతడి పక్కనే పోలీస్ అధికారి లేడు.

ఆరు బుల్లెట్లూ ఒకదాని వెనక ఒకటి అతడి పిస్టల్‌నించి దూసుకుపోయాయి. తరువాత పిస్టల్‌ని నేలకేసి కొట్టాడు కెండెల్.

ముందుకు నడిచి అగ్గిపుల్ల వెలిగించాడు. నేలమీద మిల్ట్ బోర్లా పడి ఉన్నాడు. అతడి శిరస్సు చుట్టూ రక్తం మడుగు కట్టింది.

ఆమె మాత్రం దుప్పటికింద ఉంది. ప్రాణం ఎప్పుడో పోయింది.

నెమ్మదిగా దుప్పటి తప్పించాడు కెండెల్.

ఆమె శాండీ కాదు. పోలీస్ అధికారి భార్య. అపురూప సౌందర్యవతి. అతడికి తెలుసు. ఈ సారి పారిపోవడానికి అతడికి మరో పట్నమంటూ లేదు, ఇంకో కొత్త జీవితం కూడా లేదు.

అయినా అతడు కదులుతున్నాడు. పరుగులు తీస్తున్నాడు. Ⓥ

తమిళ కథ

-తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి
ఎం. కరుణానిధి

ఉడుత పిల్ల


రాయి విసరగానే పావురాల గుంపు బెదిరి గాల్లోకి ఎగిరిపోయినట్టు, పవిత్ర మేరీమాత బడిగంట మోగగానే, పిల్లలు తయారుగా ఉంచుకున్న తమ పుస్తకాల సంచుల్ని వీపులకు తగిలించుకొని బయటికి పరుగులు తీశారు. తెలియకుండానే వారి పాదాలు వాళ్ల ఇళ్లకేసి పరుగులు తియ్యసాగాయి. బడినుండి కాస్త దూరంగా శాఖలు శాఖలుగా వేరయ్యే వీధుల్లో ఆ పిల్లలూ వేరయిపో



యారు. గుంపులుగా బయలుదేరిన ఆ పసిపిల్లలు కాసేపటికి ముగ్గురు నలుగురుగానూ, మరికాసేపటికి ఒకళ్ళిద్దరుగానూ తమతమ ఇళ్లకు వెళ్లే దారిలో నడుస్తున్నారు.

అలా నడుస్తున్న వాళ్లల్లో ఫరూక్ కూడా ఒకడు. వాడికి పదేళ్లుండొచ్చు! సగం చేతుల గళ్లచొక్కా, పచ్చటి రంగులోని ప్యాంటూ... తల పైభాగాన తెల్లటి





కుళ్లాయి. గంటకొట్టగానే ఉత్సాహం పొంగుకొచ్చి, తర్వాత నడవటం మొదలెట్టి, ఆ తర్వాత అతడు మేఘంలా వీధిలో కదలసాగాడు. కాసేపటికంతా ఆ నడకను కూడా తగ్గించి, దేన్నో జాగ్రత్తగా చెవులొగ్గి విన్నాడు.

సమీపంలో ఎవరో సభలో మాట్లాడుతున్న శబ్దం అది. ఫరూక్ ఆగిపోయాడు. మాటలు స్పష్టంగా చెవుల్లో పడటానికి ఆ వీధి చివరన నిలబడ్డాడు.

"... నాలుగొందల ఏళ్ల చరిత్రకు సొంతమైన బాబర్ మసీదును కూలగొట్టింది భయంకరమైన మతోన్మాదపు పైశాచికత్వం కాదా? అలాంటి మతోన్మాదానికి మనం రవ్వంతయినా అవకాశమివ్వొచ్చా? ఆలోచించి చూడండి! 'కరసేవ' అన్న పేరుతో మసీదును కూలదోసి మహా విద్రోహానికి చోటిచ్చి, ఈ దేశాన్నే రక్తపు మడుగు చేసేశారు. కనుక మతోన్మాదానికి మన తమిళ నేలపై ఏ మాత్రం అనుమతి లేదన్న నిర్ణయాన్ని అందరమూ చేతులు కలిపి బలపరుద్దాం. శాంతిని చేకూరుద్దాం"

ఆ విన్నపాన్ని ఆహ్వానిస్తున్నట్టుగా కరతాళ ధ్వనులు మిన్నుముట్టాయి.

"ఇప్పటివరకూ తమ గొప్ప సందేశాన్నిచ్చిన మన ప్రియతమ నాయకులు శ్రీ తంబిదురై గారికి ఈ శాలువను బహూకరిస్తున్నాం"

మళ్లీ కరతాళ ధ్వనుల మధ్య ఆయనకు శాలువ కప్పాక, ఏవో దేశభక్తి పాటలు స్పీకర్‌లో నుండి వినబడసాగాయి.

ఫరూక్ ఆ పాటల్ని వింటూ మళ్లీ తమ ఇంటికేసి నడక మొదలుపెట్టాడు. వాడి మనసులో మాత్రం 'బాబర్ మసీదు - కరసేవ' అన్న మాటలు అలల్లా గింగిరాలు తిరగసాగాయి. మరో రెండు వీధులు దాటి ఉంటాడు.

అప్పుడు వాడి దృష్టి అక్కడ జరుగుతున్న మరో సభలోని ఉపన్యాసం వైపు మళ్లింది. దాన్నీ వినాలన్న కుతూహలంతో అక్కడే నిలబడ్డాడు.

"..అయోధ్యలో రాముని ఆలయం ఉన్న

ప్రదేశంలోనే బాబర్... మసీదు కట్టాడని చెప్పటానికి ఆధారాలున్నాయి. అందుకని బాబర్ మసీదు అలానే ఉంచి, పక్కనే రాములవారి ఆలయమూ నిర్మించవచ్చని వాదించిన వాళ్ల మాటల్ని నిజమైన భక్తులు అంగీకరించటం లేదు. అందుకని ఆ మసీదును కూలదోయటంలో ఏ విధ మైన నేరమూ లే..."

ఉన్నట్టుండి స్పీకర్ నుండి వస్తున్న ఆ మాటలు ఆగిపోయాయి. ఎందుకు ఆ మాటలు ఆగిపోయాయన్న కారణాన్ని తెలుసుకునే ఆసక్తి లేకుండానే ఫరూక్ అక్కడ నుండి మెల్లగా కదిలి ముందుకు నడవసాగాడు.

...బాబర్ మసీదు.. కరసేవ... మతోన్మాదం... రాముని ఆలయం... అయోధ్య... ఈ మాటల్ని ఈ మధ్య వాడు పదే పదే వింటున్నాడు. అలా విన్నా వాటిని గురించి వాడు ఏనాడూ లోతుగా ఆలోచించలేదు. ఇప్పుడు స్పీకర్‌లో రెండు సభల్లోనూ మాట్లాడిన వాళ్ల మాటలు విన్నా, దాని గురించి పూర్తి వివరాలు తెలుసుకోవాలన్న ఆసక్తి వాడికి లేదు.

అయినప్పటికీ ఇప్పుడు వాడి మనసులో కదలాడిన 'బాబర్ మసీదు - కరసేవ' అన్న ఆ రెండు మాటలతో పాటు 'రాముని ఆలయం - అయోధ్య' అన్న మరో రెండు మాటలూ వచ్చి చేరాయి.

సాయంత్రపు గాలులు ఫరూక్ ఒంటిని మెల్లగా స్పృశిస్తున్నాయి. అది వాడికి ఎంతో ఉత్సాహాన్ని కలిగిస్తున్నా, ఆ స్పీకర్లలో నుండి రెండు రకాలుగా వినిపించిన అభిప్రాయాలు కాస్త అయోమయానికి గురిచేశాయి. ఫరూక్ ఇల్లు చేరుకోవటానికి ఇంకా రెండు వీధులు దాటవలసి ఉన్నప్పటికీ, మధ్యలో దట్టంగా పెరిగిన వృక్షాలు కలిగిన ఒక వీధిలో ఏదో సినిమాను చూస్తున్నట్టుగా కాళ్లూ చేతులూ ఊపుకుంటూ మెల్లగా నడుస్తున్నాడు.

"ఏరా ఫరూక్, ఇది వీధి అనుకున్నావా? డ్రామాలేసే స్టేజీ అనుకున్నావా? డ్యూయట్ డ్యాన్సా? నన్నూ చేర్చుకుని ఆడతావా? "

కూరగాయలమ్మే ముసల్ది వ్యాపారం ముగించుకుని ఖాళీ గంపతో ఎదురుపడి ఈ ప్రశ్నను అడిగేసరికి, ఫరూక్ ఠక్కున బదులిచ్చాడు.

"నువ్వు నన్నెత్తుకొని ఆడవే ముసల్దానా! కుదరకపోతే ఇంట్లో మీ ముసలాయన ఎదురుచూస్తుంటాడు. అక్కడికెళ్లి ఆయనతో కలిసి డిస్కో వెయ్యి!" అన్నాడు.

ఇది విన్న ముసల్దానికి నవ్వూ, కోపమూ రెండూ వచ్చాయి. భర్తతో నాట్యమాడుతున్నట్టు ఊహించుకోగానే సిగ్గూ, బిడియం కూడా ముంచుకొచ్చాయి. ఫరూక్ బుగ్గ మీద చిన్నగా తడుతూ-

"ఒరేయ్, ఇబ్రహీం కొడకా! నీకెంత నోటి దురుసురా" అని చెప్పి, "చదువులేని ఇబ్రహీం భాయ్‌కి కొడుకుగా పుట్టి ఎంత ధైర్యంగా మాట్లాడుతున్నావ్!" అంటూ వాడిని ముద్దుపెట్టుకుని అక్కణ్ణించి కదిలింది.

ఆమె అక్కణ్ణించి వెళ్లిపోయినా ఫరూక్‌కు ఆ ముసల్దాని మీదున్న అభిమానమూ, ఇష్టమూ వాడి మనసులో నిండిపోయింది.

ఆ ముసల్ది సమీపంలోనే ఉన్న కాలనీలో ఉంటున్నందున ఆ వీధిలో నుండి అడ్డుగా వెళ్లే సన్నటి గల్లీ గుండా వెళ్లటాన్ని చూస్తూ నిలబడ్డ ఫరూక్‌కు... సమీపంలో నుండి ఏదో దబ్బున క్రిందపడ్డ శబ్దం వినిపించింది. తల పైకెత్తి చూశాడు. మళ్లీ చెట్టు కిందికి తన దృష్టిని సారించాడు.

చెట్టుకొమ్మ నుండి ఒక ఉడుతపిల్ల పట్టుతప్పో, కాలుజారో నేలమీదపడి, భయపడిపోయి చలనం లేకుండా ఉంది. ఫరూక్‌కు ఆ ఉడుతపిల్ల మీద జాలి కలిగింది. వెంటనే పరుగెత్తుకెళ్లి దాన్ని తన చేతిలోకి

తీసుకుని ధైర్యమిచ్చాడు.

ఉడుతపిల్ల సన్నటి కంఠంతో 'కిచ్ కిచ్' మంటూ మూలిగింది. తన చేతివేళ్లతో వాడు దాన్ని మృదువుగా నిమిరాడు.

ఉడుతపిల్ల వాడి అరచేతిలో పక్కకు దొర్లి తనకు ప్రాణం ఉందన్న విషయాన్ని తెలియజేసింది. ఫరూక్ ఎంతో లాఘవంగా దాన్ని గట్టిగా పట్టుకొని, ఒక చేతిలో ఉంచుకొని, మరో చేతిని దానికి రక్షణగా మూసి ఉంచి తన ఇంటికేసి పరుగెత్తాడు.

ఈ ఉడుతపిల్లను ఇంట్లో ఉంచుకొని పెంచుకోవాలి. దానికి పళ్ళరసాన్ని తాగించాలి. దాని చిన్ని బొజ్జకు ఒక స్పూనో, రెండు స్పూన్లో పళ్ళరసమయితే చాలు. బడికి వెళుతున్నప్పుడు దాన్ని తన సంచిలో పెట్టుకొని భద్రంగా తీసుకెళ్లాలి. ఇలా గంతా ఊహించుకుంటూ నడుస్తున్న ఫరూక్‌కు ఉడుత గురించి బళ్లో టీచరు చెప్పిన కథొకటి గుర్తుకొచ్చింది. ఆ తీపి జ్ఞాపకంతో అరచేతుల మధ్య ఉడుత పిల్లను భద్రంగా ఉంచుకొని వాడు ఇంట్లోకి అడుగుపెట్టాడు.

"అమ్మా! పప్పా ఇంకా రాలేదా?" అంటూ ఎంతో ఆతృతగా అడిగిన కొడుకుతో- "పప్పా... మాంసం కొట్టు బాకీని వసూలు చేసుకొని సాయంత్రానికి తిరిగొస్తానని చెప్పారు. ఇప్పుడొచ్చేస్తారుగా..." అని బదులిచ్చింది ఫరూక్ తల్లి.

సరిగ్గా అప్పుడే.. వాడి తండ్రి... మాం

సం కొట్టు నడిపే ఇబ్రహీం... తన పెద్ద పెద్దమీసాలను మెలి తిప్పుతూ, నడుముకు కట్టుకున్న లుంగీపైన, పట్టుకోసం బిగించి కట్టిన పచ్చటి కాన్వాస్ బెల్టును మళ్ళీ లాగి బిగించి కట్టుకుంటూ...

"ఏరా, వచ్చేశావా! ఇవ్వాళ మీ స్కూల్లో ఏమిటి విశేషాలు?" అని అడుగుతూ లోపలికి వచ్చాడు.

"పప్పా! ఇదిగో చూడు. ఉడుతపిల్ల! చెట్టుకింద కనిపించింది. దీన్ని నేను పెంచుకుందామనుకుంటున్నాను"

ఫరూక్ తల్లిదండ్రులు ఆశ్చర్యంగా వాడి చేతిలోని ఉడుతపిల్లను చూశారు. వాళ్లూ దాన్ని ప్రేమతో నిమిరారు.

"పప్పా! ఈ ఉడుతపిల్ల సామాన్యమైనదేమీ కాదట. రామాయణంలో రాముడూ, ఆయనతో కలిసి కోతులూ లంకకు వారధి

అనువాదం : జిల్లేళ్ళ బాలాజీ

కట్టి రావణుడి మీదికి సైన్యంతో దండెత్తినప్పుడు, ఉడుత కూడా ఆ వారధి కట్టటానికి రాముడికి సాయపడిందట. అందుకు రాముడు ఉడుత వీపుమీద మూడు వేళ్లతో ఆప్యాయంగా రాస్తూ మెచ్చుకున్నాడట. అందుకే దీని వీపుమీద మూడు గీతలున్నాయట. మా టీచరు పోయిన వారం క్లాసులో చెప్పింది!"

ఫరూక్ చెప్పింది వినగానే ఇబ్రహీంకు కోపం ముంచుకొచ్చింది. రాముడి పేరు, ఆయన ఆప్యాయతగా తడిమిన ఉడుత, లంకకు వారధి, అయోధ్య, బాబరు మసీదును కూలదోయటం... ఇవన్నీ బేరీజు వేసుకున్నాడు కాబోలు! ఫరూక్ చెప్పిన కథను అతను ఇంతవరకూ విన్నదిలేదు.

"రేయ్, ఫరూక్! ఈ ఉడుతపిల్ల మనింట్లో ఒక్క క్షణం కూడా ఉండకూడదు. ఇది ఇక్కడుంటే రామభక్తుడైన ఉడుత ఉండే ఇల్లనుకొని దీన్ని కూలదోయటానికి వస్తారు! మర్యాదగా ఇప్పుడే దీన్ని ఎక్కణ్ణించి తీసుకొచ్చావో అక్కడే వదిలెయ్! ఊ... వెళ్లు!"

"ఇది నోరులేని జీవి. ఇదేం చేస్తుంది పప్పా? పాపం, పోతే పోనీ.. నేను జాగ్రత్తగా పెంచుతాను!"

"ఒరేయ్! నా మాటనే కాదంటావా? ఈ ఉడుత రాముడికి సాయం చేసిందని నువ్వే చెప్పి, దీని మీదున్న మూడు గీతలూ రాముడు గీసిన గీతలని చెప్పాక కూడా దీన్ని ఇక్కడ ఉంచటమా? వీల్లేదు. ఇప్పుడే తీసుకెళ్లి దీన్ని వదిలేసి రా వెళ్లు!"

ఫరూక్ కన్నీళ్లు పెట్టుకుంటూ అలాగే నిలబడ్డాడు. ఉడుతపిల్లను దీనంగా చూస్తూ తన తల్లికేసి చూశాడు. ఆ తల్లి ఇద్దరికీ మధ్యస్థంగా ఒక సామరస్యమైన ఏర్పాటు చేసింది.

"పోతే పోనియ్యండి. ఈ చీకట్లో దీన్ని ఎక్కడికని తీసుకెళ్లి వదిలిపెట్టగలడు? ఫరూక్ మంచి పిల్లాడు. మన మాటల్ని తప్పకుండా వింటాడు. తెల్లారగానే తీసుకెళ్లి వదిలిపెట్టి వచ్చేస్తాడు. నాయనా ఫరూక్? నేను చెప్పింది చేస్తావు కదూ? ! పొద్దున్నే తీసుకెళ్లి వదిలెయ్యాలి!"

"సరేనమ్మా!" బదులిచ్చాడు ఫరూక్.

రాత్రి ఆ ఉడుతపిల్లను వెదురుగంప కింద మూసిపెట్టి, దాని పక్కనే ఒక చాప పరుచుకుని రక్షణగా పడుకున్నాడు ఫరూక్. ఆ రాత్రంతా వాడు నిద్రపోలేదు. ఒక చిన్న స్పూన్‌తో ఆరెంజి పండు ముక్కను దానికి పెట్టాడు. అది తన బుజ్జినోటితో తినటాన్ని ఆనందంగా చూస్తూ రాత్రంతా గడిపాడు.

తెల్లారగానే తండ్రి చెప్పినట్లుగా ఉడుత పిల్లను తీసుకుని దాన్ని ఎక్కడ భద్రంగా వదిలిపెట్టాలా? అని ఆలోచిస్తూ, దాన్ని మొదట చూసిన చెట్టు దిశగా ఫరూక్

నడవసాగాడు.
"ఏరా! ఉదయాన్నే ఎక్కడికి రా వెళుతున్నావ్? నీ కివ్వాళ బడి లేదూ? చదువుకోకుండా ఎందుకిలా తిరుగుతున్నావ్? " అని ప్రశ్నిస్తూ ఎదురుపడ్డ వ్యక్తి, అనంత అయ్యంగార్ - ఆ ఊళ్లో సనాతన ఆచారాలను పాటిస్తున్న వ్యక్తుల్లో ఒకరు. ఆయన అడిగిన ప్రశ్నకు బదులివ్వకుండా ఫరూక్ అలాగే నిలబడ్డాడు.
"ఏమిట్రా ఆ చేతిలో ఉన్నదీ? ఏం పెట్టుకుని ఏడ్చావ్? "
"ఉడతపిల్ల! దీన్ని పెంచుకుందామని తీసుకెళ్లాను..."
ఫరూక్ మాటల్ని పూర్తిచేసేలోపు అనంత అయ్యంగార్ అదిరిపడి- "ఏంటీ, ఉడుతను పెంచుకోవటమే- అందులోనూ నువ్వు పెంచుకోవటం. ఉడుత ఆ శ్రీరాముడి కటాక్షం పొందిన జీవి కదరా! దాన్ని మీరు చేత్తో తాకటమే నేరం కదా? " అంటూ దెప్పి పొడిచాడు.
సరిగ్గా అప్పుడే అక్కడికి చేరుకున్నాడు ఫరూక్ తండ్రి ఇబ్రహీం.
"ఏంటి పెద్దాయనా, ఎందుకు పిల్లాణ్ణి కోపగించుకుంటున్నారు? ఏం తప్పుచేశాడు నా కొడుకు? ..!"
"ఇబ్రహీం! నీకు విషయం తెలియదా? ఉడుతను పెంచుకుంటాడట వీడు! అది రాముడి యొక్క శిష్య ప్రాణి! దాన్ని పెంచుకోవటానికి మీ మతస్తులకు ఏం హక్కు ఉందని? మహా పాపం కదా!"
చీదర కలిగించే ఆ మాటల్ని విన్నాక ఇబ్రహీంకు కోపం నషాళానికెక్కింది. వెంటనే హక్కులు గురించి నిలదీయటం ప్రారంభించాడు.
"ఏం మేం పెంచితే ఏంటట? అయోధ్యలో మా మసీదు ఉండకూడదని కూల్చేశారుగా.. ఉడుతను కూడా పెంచుకోకూడదా? బాగానే ఉందే మీ న్యాయం? "
"ఏంటిది? నన్ను న్యాయం అడగటానికి వచ్చేశారే? ఉడుతపిల్లకూ, అ యోధ్యకూ ఎందుకు ముడిపెడుతున్నారు? "
"మీరే ఉడుతపిల్లకూ, రాముడికీ ముడి పెడుతున్నారు"
"నువ్వే అయోధ్య గురించి మాట్లాడి మా హిందువుల మనోభావాలను గాయపరుస్తున్నావు"
"మర్యాదగా మాట్లాడండి! నువ్వూ, గివ్వూ అంటూ ఏకవచనంలో మాట్లాడితే నేనూ మాట్లాడుతాను!"
ఇద్దరి మధ్యా మాటా మాటా పెరగటంతో ఆ చెట్టు కిందికి హిందువులూ, ముస్లిములూ ఇరువైపులా వందల సంఖ్యలో వచ్చి గుమిగూడారు. ఏ క్షణాన్నయినా అక్కడ మత ఘర్షణకు దారి తీయవచ్చన్న సూచనలు కనిపిస్తున్నాయి.
ఈ విషయాన్ని తెలుసుకున్న ఫరూక్ తల్లి, తలమీదికి బురఖా లాక్కుంటూ అక్కడికి పరుగెత్తుకొచ్చింది. అక్కడున్న చెట్టు వెనక దాక్కుని.. "ఒరేయ్, ఫరూక్! అంతా నీ వల్లే జరిగింది. ఆ ఉడుతపిల్లను విసిరి పడేసి వచ్చేయ్. లేకుంటే ఈ ఊళ్లో పది తలలు తెగుతాయి"
అక్కడ ఆవేశంగా నిలబడ్డ ఇరు వర్గీయులూ గొంతు వినిపించిన దిశగా నడిచారు. ఫరూక్ "అమ్మా..." అని అరుస్తూ చెట్టు దగ్గరికి పరుగెత్తుకుని వెళ్లి, తల్లిని గట్టిగా కౌగిలించుకుని కన్నీళ్లు కారుస్తూ ఆ ఉడుతపిల్లను ఆ చెట్ల మధ్య నేలమీద మెల్లగా విడిచిపెట్టాడు.
ఉన్నట్టుండి ఎక్కడ నుంచో ఒక డేగ రెక్కల్ని వేగంగా ఆడిస్తూ ఆ ఉడుతపిల్ల మీదికి దూకి, అదే వేగంతో ఆ అల్పజీవితో సహా ఆకాశంలోకి ఎగిరిపోయింది.
ఇరు వర్గీయులూ వేర్వేరు దారుల్లో అక్కణ్ణించి వెళ్లిపోయారు. ఆ ఊరి ప్రశాంతతను ఆ ఉడుతపిల్ల కాపాడి, దానికి చేతనైన త్యాగాన్ని చేసింది. కానీ ఫరూక్ మాత్రం ఉడుతపిల్లను ఎగరేసుకు వెళ్లిన డేగ వైపే చూస్తూ కన్నీళ్లు కారుస్తూ నిలబడ్డాడు. V

తెలుగు కథ

- కాటూరు విజయలక్ష్మి

అహల్య

"**ను**వ్వు చాలా అదృష్టవంతుడివిరా.!"

"ఎందుకని? "

"పెళ్లికూతురు పేరుకు తగినట్టే అందాల రాశి!"

"ఆమె పేరేంటి? " కుతూహలంగా అడిగాడు ఆనందరావు.

"అహల్య" మందహాసంతో అన్నాడు నరేంద్ర.

"ఈ పేరు ఎక్కడో విన్నట్టుందే!? " అంటూ బుర్ర గోక్కున్నాడు ఆనందరావు.

"రాముడి పాదస్పర్శతో నిజరూపం పొందిన గౌతమ మహర్షి భార్య అహల్య.."

"అవ్రోయ్! గుర్తొచ్చింది. అందం సంగతి సరే! శీలం మంచిదేనా.."

"నోర్ముయ్యరా..! అహల్యలందరికీ అలాంటి కథలే ఉంటాయా? "

"సరదాకి అన్నాలే.. సరే.. పెళ్లి చూపులెప్పుడు? "

"రేపే.."

"అహల్య ప్రస్తుతం ఏం చేస్తోంది? "

"ఎమ్.ఎస్. చేస్తోంది. నీకు తగిన జోడీ. ఇద్దరూ డాక్టర్లుగా చక్కగా ప్రాక్టీసు చేసుకోవచ్చు"

"ముందు పెళ్లిచూపులు కానీ..." అన్నాడు ఆనందరావు.

★ ★ ★

"నాయనా! మా మనమరాలు అపరంజి బొమ్మ. అపురూపంగా పెరిగింది. పిల్లని ప్రేమగా చూసుకుంటే నీ పేరుకి తగినట్టే ఆనందపడతావు.." అంది అహల్య నాయనమ్మ.

ఆవిడ ఎంత మాటకారో ఆవిడ మాటలే చెబుతున్నాయి. అందులో హెచ్చరిక కూడా దాగి ఉందా? ! ఆవిడ మొహంలో ఆ భావాల కోసం వెతుక్కున్నాడు ఆనందరావు.

ఆవిడ పేరు గంగాయమ్మగారు. గంగలాగానే నిండుగా ఉంది. బాణాలు వదిలిన ధనుస్సులా నిశ్చలంగా ఉంది. ఆవిడ నుంచి చూపులు తిప్పుకుని పెళ్లికూతుర్ని చూశాడు ఆనందరావు.

అప్పటిదాకా ఆనందరావువైపే చూస్తున్న అహల్య ఉలిక్కిపడి చూపులు తిప్పుకుంది. ఫర్వాలేదు ఆడతనం పదిలంగానే ఉందనుకున్నాడు.

"పెళ్లికూతురు నాకు నచ్చింది..." అన్నాడు ఆనందరావు.

"ఆయన కూడా నాకు నచ్చారు" అంది అహల్య.

ఎన్నికల ఫలితాలు ప్రకటించాక ఇక సస్పెన్సు ఏముంటుంది సంబరాలు గాక? ! - వేడుకల మధ్య వైభవంగా పెళ్లి జరిగిపోయింది.

అహల్య ఆనందరావు అర్ధాంగి అయింది. 'రిసెప్షన్'కి మిత్రులందరూ వచ్చారు.


అందరి చూపులూ అహల్య మీదనే! కథ అక్కడే మొదలయింది...

★ ★ ★

"ఏమిటదోలా ఉన్నారు? "

"ఎలా ఉన్నాను? "

"అదోలా..."
"అదోలా - అనే జబ్బేమన్నా ఉందా?"
"అబ్బే అది కాదు..."
"మరేంటి?"
"పరధ్యానంగా... ఏదో ఆలోచిస్తూ..."
"పరధ్యానం చెయ్యడానికి నేనేమైనా నీలా అందమైన ఆడపిల్లనా?"
"అదేంటి అందమైన ఆడపిల్లలు పరధ్యానం చేస్తారా?"
"అందులో సందేహమేముంది?"
"మీరు నన్ను సందేహిస్తున్నారా?"
"ఏమో! నాకు తెలియదు"
"నేనలాంటిదాన్ని కాదండీ..."
"ఎలాంటి దానివి కాదు?"
"అదే... మీరూహిస్తున్నట్టు..."
"నేనేం ఊహిస్తున్నాను?"
"అంటే నా గురించి మంచిగానే అనుకుంటున్నారా?"
"అలాగని నీతో చెప్పానా?"
అహల్యకి మౌనమే మేలనిపించింది. ఇంకేం మాట్లాడకుండా వంటింట్లోకి వెళ్లిపోయింది. 'డిసెక్షన్'లో కప్పల బాధ ఇలాగే ఉంటుంది కాబోలు! అనుకుంటూ.. వెనకాలే వచ్చాడు ఆనందరావు.
"ఏమిటలా సీరియస్‌గా వెళ్లిపోతావ్? నాతో మాట్లాట్టం కూడా ఇష్టం లేదా?"
"..."
"అంత బాధగా ఉంటే చెప్పు నేను కూడా మాట్లాడటం మానేస్తాను"
"..."
"ఓ.కే. ఈ క్షణం నుండీ మనిద్దరికీ మాటల్లేవ్!" అని వెళ్లబోతున్న ఆనందరావుని చెయ్యి పట్టుకుని అహల్య ఆపింది.
"ఎందుకలా న్యూనతాభావాన్ని పెంచుకుంటున్నారు?"
"న్యూనతో, గీనతో నాకు తెలీదు. నిన్ను చూస్తున్న కొద్దీ భయంగా ఉంది"
"ఎందుకు భయం?"
"యాభై కిలోల బంగారం దొరికిందనుకో.. దాన్ని ఎలా కాపాడుకోవాలో తెలియకపోతే భయం వెయ్యదూ?"
"మీరేం చెబుతున్నారో నాకర్థం గావటం లేదు"
"నీ బరువెంత?"
"యాభై అయిదు కిలోలు"
"అయిదు కిలోలు తక్కువ చెప్పానన్న మాట! నేను చెప్పిన బంగారానివి నువ్వే..."
ఆమె నిర్ఘాంతబోయింది.
"నన్ను మీరు అనుమానిస్తున్నారా?"
"నిన్నెందుకు అనుమానిస్తాను?"
"మరి?"
"లోకం గురించి భయపడుతున్నాను"
"అసలెందుకు మీకు భయం?"
"ఇంత అందాన్ని చూసిన ఏ గాడిద కొడుకైనా నా అదృష్టానికి ఏడవకుండా ఉంటాడా? అదే నా ఏడుపు!!"
"ప్లీజ్... మిమ్మల్ని మీరు కంట్రోల్ చేసుకోండి" ప్రార్థనగా అంది అహల్య.
"నేనూ అదే అనుకుంటున్నాను. కానీ ఎలాగో అర్థం కావటం లేదు" అన్నాడు ఆనందరావు.
అహల్య ఏమీ మాట్లాడలేదు. అప్పటి నుంచి ఆనందరావు ఈ విషయంపై ఆలోచించడానికే రోజులో ఎక్కువ భాగం గడిచిపోతోంది.
రాత్రిపూట ఆలోచనలతో సిగరెట్లు కాలిపోతున్నాయి.
నిద్రపోతే 'మారువేషంలో ఏ దేవేంద్రుడొస్తాడో' నన్నట్టు కలత నిద్రతో కలవరపడుతున్నాడు.
మిత్రులెవర్నీ ఇంటికిరానియ్యడు. అహల్య మిత్రురాళ్లకీ అదే మర్యాద!
'ఏమో... ఎవరెలాంటివాళ్లో! తన బలహీనతల గురించి అహల్య, స్నేహితులకి చెప్పేస్తే, వాళ్లు ఓదార్చి మరో మంచివాడితో జతగలుపుతారేమో! అహల్య తనకి విడాకులిచ్చి ఇంకో పెళ్లి చేసుకుంటుం



దేమో! అలాంటి అవకాశం లేకపోతే లేచి పోతుందేమో!' ఇలా సాగుతున్నాయి ఆనందరావు ఆలోచనలు.

ఫలితంగా అహల్య ఇంట్లో ఉండగానే తాళం వేసి ఆస్పత్రికి వెళ్తున్నాడు ఆనందరావు.

★ ★ ★

"నాయనా నీతో మాట్లాడాలి" అంటూ నేరుగా ఆస్పత్రికొచ్చేసింది గంగాయమ్మ!

ఆనందరావు గతుక్కుమన్నాడు. అతని కళ్లకి ఆవిడ పోలీసు ఇన్స్‌పెక్టర్లా ఉంది.

"పేషెంట్లను చూశాక మాట్లాడుకుందాం!" అని చెప్పాడు ఆవిడతో..

"నేనూ పేషెంటునే! ఫీజు ఇచ్చే మాట్లాడతా... ఇదిగో వంద రూపాయలు" అంటూ టేబుల్‌మీద పేపరు వెయిట్ కింద ఆ నోటును పెట్టింది.

"చెప్పండి..." అన్నాడు ఆనందరావు.

"నేను కాదు. నువ్వే చెప్పాలి.." అంది గంగాయమ్మ.

"ఏం చెప్పాలి? "

"నువ్వు అహల్య ఇంట్లో ఉండగా ఎందుకు తాళంవేసి వస్తున్నావ్? నేను అహల్యతో కిటికీలోంచి మాట్లాడి నేరుగా ఇక్కడికొస్తున్నాను"

"ఏం చెప్పింది? "

"ఏమీ చెప్పలేదు కాబట్టే ఇక్కడికొచ్చా. లేకపోతే తాళం పగల కొట్టి వెంట బెట్టుకెళ్లేదాన్ని"

"ఇంతకీ ఏమిటీ విషయం, మీకు తాళం చెవి కావాలా? "

"అసలు విషయం కావాలి!"

"ఏమిటా అసలు విషయం? "

"మీ మగాళ్ల సంగతి ఎవరికి తెలీదు? అనుమానప్పీనుగులు. నా మొగుడు బతికున్నంతకాలం రాబందులా పీక్కుతిని, అనుమానంతోనే గుండె ఆగి చచ్చాడు. నువ్వు డాక్టరువి. అందరి రోగాలూ కుదురుస్తావు. నీ రోగం ఎవరు కుదర్చాలి? "

"నాకేం రోగం ఉంది? "

"అనుమానం పెనురోగం. అంతకంటే భయంకరమైన రోగం ఏముంది? ఈలోకంలో.."

"మీరు నన్ను అపార్థం చేసుకుంటున్నారు.."

"నేనంత పిచ్చిదాన్నేమీకాదు. అమాయకత్వం నటించకు. పెద్దలు ఎప్పుడో చెప్పారు. 'భార్యారూపవతీ శత్రుః' - అని. నా మనవరాల్ని నువ్వు శత్రువుగా భావిస్తే వెంటనే నాతో పంపెయ్యి. ఆ చావేదే నువ్వు వంటరిగా చావు. నిత్యం దాన్ని మాటల ఈటెలతో పొడిచి పొడిచి చంపకు.."

"నేను మాటలతో పొడుస్తున్నానని అహల్య చెప్పిందా? "

"ఏ అహల్యా చెప్పదు! చెప్పలేదు. కానీ, లోకంలో ఆడకూతుళ్లందరికీ గుచ్చుకుంటున్న కత్తులివే. చేవగల మగాడు ప్రేమతో, నమ్మకంతో పెళ్లాన్ని కాపాడుకుంటారు. అందంగా ఉన్న ఆడాళ్లందరూ శీలం లేని వాళ్లుకారు. అలాగే అందంగా లేని ఆడాళ్లందరూ శీలవతులు కారు. శీలానికీ, అందానికీ సంబంధంలేదు. అనుమానం ఉన్న చోట ఆనందం ఉండదు. నువ్వు నేతిబీరకాయలో నెయ్యిలాంటివాడివి. అహల్యే కాదు. నువ్వు ఇంకో ఆడదాన్ని చేసుకున్నా అది సుఖపడలేదు! నీ పేరేంటి? ఆనందరావా? రాదు... నీకు ఆనందభావాలు రావనే ఆ పేరు పెట్టారు నీ తల్లిదండ్రులు.."

ఆనందరావు మధ్యలో కలుగజేసుకుని "అవతల పేషెంట్లు ఎదురుచూస్తున్నారు" అన్నాడు.

"ఇంకో వందరూపాయలివిగో.. ఇంకో పేషెంటు ఫీజు కూడ నేనే ఇస్తున్నా తీసుకో.." అంటూ ఇందాకటి నోటుకి జత కలిపింది.

"ఏమిటి నాకీ హింస? "

"కాకినెంత తోమినా హంస అవుతుందా? తోముతున్నంతసేపూ హింస హింస అనుకుంటుంది. నువ్వూ అంతే!"

"ఇంతకీ నేనేం చెయ్యాలి? " తలపట్టుకున్నాడు ఆనందరావు.

"ఏం చెయ్యాలో నువ్వే నిర్ణయించుకోవాలి. అహల్యతో అనుమానాలు లేని కాపురం చెయ్యడమా!? లేక నేను అనుమానప్పీనుగునని వప్పుకుని, అహల్యని నాతో పంపెయ్యడమా? అదీ నీ ముందు ప్రశ్న"

"ఏమిటీ పరీక్ష నాకు? " వాపోయాడు ఆనందరావు.

"పరీక్షకాదు. శిక్ష! నువ్వు సవ్యంగా ప్రవర్తించకపోతే మిగతా జీవితమంతా శిక్షగానే ఉంటుంది.."

"అంటే నా మీద కేసుపెడతారా? "

"ఇప్పుడే ఏం చెప్పగలం? "

"నేను మంచీళ్లు తాగొచ్చా? "

"రెండు గ్లాసులు తాగు.."

గటగటా రెండు గ్లాసుల మంచినీళ్లు తాగేసి "నేను మారిపోయాను" అన్నాడు ఆనందరావు.

"మంచినీళ్లుతాగి ఎవరూ మారిపోరు! మంచి మనసు చేసుకుని మారతారు.."

"ఇప్పుడదే జరిగింది! మీ మాటలవల్ల నా మనసుని ఉతికి ఆరేసినట్లయింది.."

"ఇస్త్రీకూడా చెయ్యాలిగా.."

"ఇక అదికూడా మిగిలిందా? కానీండి..."

"చివరగా చెబుతున్నా, నేను నా మొగుడ్ని కాబట్టి వదిలేసా. నా మనవరాలు నాకు పంచప్రాణాలే కాదు. ఆరో ప్రాణం కూడా. దాని మనసు కష్టపడితే నేనెంతకైనా తెగిస్తా.."

"అంటే ఏం చేస్తారు? "

"మీ ఇంటిముందు పబ్లిక్ పంచాయితీ పెట్టటం దగ్గర్నుంచీ, నిన్ను చెప్పుతో బాదటం, ఇంకా కోపం తీరకపోతే నిన్ను చంపి, హాయిగా శేషజీవితం జైల్లో గడిపేయటం వంటి పనులన్నీ చేస్తాను"

"వద్దు.. దయచేసి మీరలాంటి క్రిమినల్ ఆలోచనలు చెయ్యకండి. నేను అహల్యకి మంచి మొగుడిగా ఉంటాను. ప్రామిస్.."

"నీ కన్సల్టింగ్ ఫీజు ఇంకో వంద ఇస్తున్నా.."

"వద్దు వద్దు.. ఈ రెండొందలు కూడా తీసుకోండి. ఇవిగో ఇంటి తాళం చెవులు. ఇకనుండీ నేను ఆనందరావుని కాను. ఆనందమూర్తిని. అహల్యని పువ్వుల్లో పెట్టుకుని చూసుకుంటాను.."

"నమ్మొచ్చా? !"

"తేడా వస్తే ఇందాక మీరు చెప్పినవన్నీ చేయొచ్చు."

"సరే.. ఆ మాటన్నావు గనక శాంతిస్తున్నా. లేకపోతే ఉగ్రగంగ అయ్యేదాన్ని..."

"ఇప్పటిదాకా అలాగే ఉన్నారుగా.."

"అది ఆరంభం మాత్రమే.. అసలు రూపం కాదు.."

"అదిచాలు! డోసెక్కువైతే తట్టుకోలేను.. ప్లీజ్.. అవతల పేషెంట్లు.."

"సరే.. అదేదో చూసుకురా... ఒక్కటి గుర్తుపెట్టుకో..! ఆడదానిలో పువ్వులాంటి మెత్తదనం, కత్తిలాంటి కరుకుదనం, అగ్నిలాంటి ఆగ్రహం అన్నీ ఉంటాయి.. తెలుసా!"

"అన్నీ ఇప్పటిదాకా చూసానుగా మీలో.."

"అహల్యలో కూడా ఇవన్నీ ఉంటాయని గుర్తుంచుకో.."

"గుర్తుంచుకుంటాను!"

"వస్తా.."

"మంచిది.."

సునామీ తొలగిపోయినట్లు ఊపిరిపీల్చుకుని, పేషెంట్లను పంపమనే సంకేతంగా కాలింగ్ బెల్ నొక్కాడు ఆనందమూర్తి! V

బల్గేరియా కథ

- యోర్దాన్ యోవ్కోఫ్

వరదొచ్చె.. వనితా వచ్చె!

తన మద్యం దుకాణం గుమ్మంలో నిలబడి, బయట కుండపోతగా కురుస్తోన్న వర్షాన్ని చూస్తున్నాడు ఫిలిప్.

పొద్దున్నే తుంపరగా మొదలై... జోరు వానగా మారి, ఇప్పుడు మిన్నూ మన్నూ ఏకం చేసేస్తోంది.

ఊరు ఊరంతా తడిసి ముద్దైపోయింది.

వాగులూ వంకలూ పొంగి పొర్లుతున్నాయి.

ఆకాశాన దట్టమైన మబ్బులు కమ్మటంతో తోవ మసకమసకగా కనిపిస్తోంది.

జోడు గుర్రాల బండి ఒకటి దూరం నుంచి వస్తోంది. అందులో ఓ పెద్ద పీపా ఉంది.

ఓ గుబురు మీసాల వ్యక్తి ఆ బండిని తోలుతున్నాడు.

అతను తిన్నగా బండిని దుకాణం వద్దకు తీసుకువచ్చి ఆపి కిందకు దిగాడు.

సంచిలో నుంచి ఇంత గడ్డిని తీసి గుర్రాలకు మేత వేశాడు.

★ ★ ★

"రావయ్యా కోల్యో రా! ఈ జోరు వానలో ఎక్కడికి వెడుతున్నావ్? " అంటూ ఆహ్వానించాడు ఫిలిప్.

"ఈ పీపాను బస్తీలో ఓ షాపుకు చేర్చాలి. వాళ్ళకిది అత్యవసరంగా కావాలిట"

"అయితే మాత్రం? ఈ దోవ నీకు కొట్టిన పిండి గనుక బురదకూ నీళ్ళకూ వెరవకుండా నువ్వు వంతెన వరకూ వెళ్ళగలవనుకో!

అవతల లోయకు వెళ్ళే తోవలో చక్కీ దగ్గర ఎక్కడెక్కడి నీళ్ళూ వచ్చి చేరాయంటున్నారు. లోతు ఎంతుందో కూడా అంతు చిక్కటం లేదంటున్నారు. మొండిగా ముందుకు వెడితే మునిగిపోతావ్!"

"నాలాంటి నిరుపేద మునిగిపోతే ఈ లోకానికేం నష్టం లేదు గానీ... ఓ గ్లాసుడు మద్యం ఇవ్వు. ముందు మద్యం చుక్కలు గొంతులో పడాలి!" తన ఉన్ని టోపీని తీసి గట్టిగా పిండి బల్లమీద ఆరబెడుతూ అన్నాడు కోల్యో.

బండి నడపటం అతని వృత్తి. ఏ కాలంలోనైనా... ఏ సమయంలోనైనా అతని బండి రోడ్లమీద కనపడుతూనే ఉంటుంది.

అందరూ అతన్ని గుబురు మీసాల నల్ల కోల్యో అంటారు.

★ ★ ★

"నీ భార్య చనిపోయి రెండేళ్ళవుతోంది కదా! మళ్ళీ పెళ్ళి చేసుకోరాదూ? యుద్ధం తరవాత చాలామంది వితంతువులైన యువతులు కనపడుతున్నారుగా!" మద్యం గ్లాసు అందిస్తూ అన్నాడు ఫిలిప్.

"ఆ మాట నిజమేకానీ... సరైన వాళ్ళను వెతుక్కోవాలిగా! నా పనితో నాకు సరిపోతోంది. బండి తోలితే వచ్చే డబ్బుతోనే సంసారాన్ని ఈదాలి" అది తన శక్తికి మించిన పనే అన్నట్లుగా మాట్లాడి, మళ్లీ తనే -

"మా ఇరుగూ పొరుగూ ఇళ్ళలోని ముసలమ్మలు దయగలవాళ్ళూ, మంచి



వాళ్ళొ గనుక నా పిల్లల ఆలనా పాలనా చూస్తున్నారు. లేకపోతే ఆ పనులు కూడా నేనే చూసుకోవాల్సి వచ్చేది. ఇల్లు కదలటానికి ఉండేది కాదు" అన్నాడు.

"మీ ఊళ్ళో అవివాహితలెవరూ లేరా? "

"స్తాకియా అని ఒకామె ఉంది. ఆమె అయితే నాకు ఈడౌతుందనిపించింది. అందుకే అడిగించాను"

"మరి ఏమయింది? " ఆసక్తిగా అడిగాడు ఫిలిప్. "ఒకరోజున నేను అశ్వశాలలో గుర్రాలను శుభ్రం చేసేటప్పుడు వాటిని తిడుతుంటే... ఆ తిట్లు అటుగా వెడుతున్న ఆమె చెవిన పడ్డాయిట"

"ఛీఛీ! నోట్లోంచి అటువంటి చెడు మాటలు వస్తున్నయ్యంటే.. ఖచ్చితంగా అతను చెడ్డవాడే అయ్యుంటాడు. అతన్ని నేను చేసుకోను!" అని నా సంబంధం ప్రసక్తి తెచ్చిన పెద్దమనిషికి తేల్చి చెప్పేసిందిట"

"నువ్వు ఆ నోరులేని గుర్రాలను తిడతావా? "

"ఉట్టి తిట్లు కాదు. బండ బూతులు తిడతాను"

కోల్యో అలా చెప్పగానే "అయితే నువ్వు చెడ్డవాడివే!" తేల్చేశాడు ఫిలిప్.

"అవి పశువులు ఫిలిప్! పశువులు! భయం లేకపోతే మాట వినవు. కాలితో ఒక్క తాపు తంతయ్! ఎగిరి అంత దూరాన పడతాను. చావు తప్పి కన్ను లొట్టపోయినంత పనవుతుంది. అందుకనే వాటిని తిట్టీ కొట్టీ నా అధీనంలో ఉంచుకుంటాను. తిట్టేప్పుడు తిట్టినా పెట్టేప్పుడు వాటి కడుపు నిండేట్లుగా మరింత దాణా వేస్తాను. వాటి శరీర శుభ్రత పట్ల జాగ్రత్త వహిస్తూ ప్రేమగా చూసుకుంటాను" అంటూ ఆ మూగజీవాలనుతానెంత బాగా చూసుకునేది ఏకరువు పెట్టాడు కోల్యో.

"ఇదంతా ఆ స్తాకియాకేం తెలుసూ? వెనకా ముందూ ఎవరూ లేకపోయినా... జరుగుబాటు కష్టమౌతున్నా... ఆమెకు పొగరుకు మాత్రం తక్కువ లేదు. ఆ పొగరుబోతునెవరు చేసుకుంటారూ? " పనిలో పనిగా స్తాకియాను తిట్టిపోశాడు కోల్యో.

"పోనీలే! నీకు తగిన సంబంధం చూడమని మీ ఇరుగు పొరుగు ముసలమ్మలకే చెప్పకపోయావా? " అన్నాడు ఫిలిప్.

"చెప్పాననుకో! కుదరాలిగా! నాదేమో జీవితాంతం గ్యారంటీగా ఉండే పక్కా నలుపు రంగు! దానికితోడు మీసాలు దట్టంగా పెంచుతాను.

పైగా నేనెవరితోనన్నా మాట్లాడుతుంటే పోట్లాడుతున్నట్లుంటుంది. దేవుడు నాకు అంత పెద్ద గొంతు నిచ్చాడాయె! దాన్ని తగ్గించుకోవటం నావల్ల కాదు!

దానికితోడు చిన్న చిన్న పిల్లలున్న ఇల్లు నాది. వాళ్ళందర్నీ పెంచి పెద్ద చెయ్యవలసిన బాధ్యత కూడా నాకు కాబోయే భార్య మీద ఉంటుంది.

ఇటువంటి సంబంధం చేసుకోవటానికి ఎవరు ముందుకు వస్తారూ?

సరేలే!... నా వేదన నాతోపాటే ఉండేట్లుంది. అది తీరే దారి కనపడటం లేదు గానీ... ఇక నే వెడతాను" అంటూ టోపీని పిండి తలమీద పెట్టుకుని, బండి ఎక్కి గుర్రాల్ని అదిలించాడు కోల్యో.

★ ★ ★

మునిమాపు వేళ...

దుకాణానికి వచ్చిన కొద్దిమందీ వెళ్ళిపోవటంతో ఈ ముసురులో ఇక వచ్చే వాళ్ళెవరూ ఉండరులే అనుకుంటూ పద్దు పుస్తకం ముందేసుకు కూర్చున్నాడు ఫిలిప్.

బయట గుర్రపు డెక్కల చప్పుడు వినిపించింది.

"స్తోయాన్! ఎవరో వచ్చినట్లున్నారు చూడూ!" అంటూ నౌకర్ని పిలిచాడు.

ఆ కుర్రాడు గుమ్మంలోకి తొంగి చూస్తూ... "ఎర్ర రుమాలు తలకు చుట్టి

కున్న ఓ యువతి బండి దిగుతోంది" అన్నాడు.

తలెత్తి చూసిన ఫిలిప్‌కి నల్లమీసాల కోల్యో లోపలికి వస్తూ కనిపించాడు. వెనకాలే ఆమె వస్తోంది.

"చెబితే వినకుండా వెళ్ళావు. నదిని దాటలేక వెనక్కి వచ్చేశావు కదూ! పోనీలే... క్షేమంగా చేరావు... అంతేచాలు! ఈమె ఎవరు? " కోల్యోను లోపలికి ఆహ్వానిస్తూ అన్నాడు ఫిలిప్.

"అదంతా ఓ పెద్ద కథ. నిదానంగా చెబుతాను గానీ... తను తడిసి ముద్దైపో యింది. కాస్త చలి కాచుకోనిస్తావా? " అడి గాడు కోల్యో.

"దానికేం భాగ్యం!" అంటూ చూసీ చూడనట్లుగా ఆ యువతిని చూడసాగాడు ఫిలిప్.

ఆమె వయసు ముప్పైకి కొంచెం అటూ ఇటూగా ఉంటుంది.

సన్నగా పచ్చని పసిమి రంగులో ఉంది.

పెద్దపెద్ద బూడిద రంగు కళ్ళు కన్నీ ళ్ళను దాచుకోవటానికి ప్రయత్నిస్తున్న ట్లుగా తడితడిగా ఉన్నాయి.

తీర్చిదిద్దినట్లుగా ఉన్న కనుబొమలు ఆ కళ్ళ అందాన్ని మరింత ఇనుమడింపజేస్తు న్నాయి.

అతను తననే చూస్తున్నాడని గమనిం చిన ఆమె బిడియపడుతూ తలవంచు కుంది.

బుగ్గలు ఎరుపెక్కాయి.

"లోపల పొయ్యి మండుతూనే ఉంది. కావలసినంత సెగ" అంటూనే నౌకర్ని చేతులతో సైగచేసి పిలిచి-

"స్తోయాన్! ఈమెను వంటింట్లోకి తీసు కెళ్ళు! అలాగే అమ్మగార్నడిగి తినటానికి ఏమన్నా తీసుకురా! కొత్తగా ఇప్పుడేం తయారు చెయ్యక్కర్లేదులే. ఉన్నవేవో ఇమ్మను!" అని పురమాయించాడు.

ఆమెకు దారి చూపిస్తూ లోపలికి తీసు కువెళ్ళాడు నౌకరు స్తోయాన్.

★ ★ ★

కోల్యో కళ్ళల్లో కళ్ళు పెట్టి చూస్తూ, "ఇప్పుడు చెప్పు!" అన్నాడు ఫిలిప్.

"అర్జెంటుగా ఓ గ్లాసుడు మద్యం ఇవ్వు. తాగుతూ చెబుతాను"

ఆమె ఎవరో తెలుసుకోవాలనే ఉత్సా హంతో ఉన్న ఫిలిప్ గబగబా గ్లాసు నింపి తెచ్చాడు"

చటుక్కున ఆ గ్లాసు అందుకుని, కాస్త మద్యం గొంతులో పోసుకుని చెప్పటం మొదలుపెట్టాడు కోల్యో.

"నేను ఇక్కడి నుంచి త్వరత్వరగా వెళ్ళి వంతెన దాటాను. చక్కీ దగ్గరకు వెళ్ళే వరకూ నీళ్ళను అసలు లెక్క చెయ్యలేదు. కేస్నాఫ్ లిస్కీ లోయను సమీపించాక చూద్దునుగదా... ఓహో! ఏమి అద్భుత దృశ్యం!

ముందుకు వెళ్ళే దారిలేక బండిని ఆపి... ఆ అనంత జలరాశిని విస్మయంగా చూస్తూ నిలబడిపోయాను...

సూర్యుడు కూడా మెల్లమెల్లగా ఆ నీటి అంచుకు దగ్గరగా వెళ్ళి అక్కడ మునిగిపో వటంతో చీకట్లు కమ్ముకున్నాయి.

అంతలోనే డమడమలాడుతూ ఆకా శంలో ఉరుములు ఉరమసాగాయి. సర సర సటుక్కుమంటూ మెరుపులు మెరవ సాగాయి.

ఆ వెలుగులో ఓ స్త్రీ ఆకృతి మెల్లమెల్లగా కదులుతూ నావేపుకే వస్తూ కనిపించింది.

అది దెయ్యమేమోనన్న భావన... అసలే చలితో గజగజలాడిపోతున్న నాలో భయాన్ని పెంపొందించటంతో నా ఆపాద మస్తకం వణికిపోసాగింది.

అది వచ్చి పీక పట్టుకుంటుందేమోనని ఓ పక్క ఖంగారు పడుతూనే... చూసీ చూడనట్లుగా దాని కదలికలను గమనించ సాగాను.

ఆ ఆకారం ఒక్కసారిగా ఒంగుని.. వరా

హంలా పాకుతూ నీళ్ళలోకి వెళ్లసాగింది. అది నీళ్ళలోకి దూకాలనుకుంటున్న ఓ స్త్రీ ఆకృతి అని గ్రహించగానే, 'ఆగు! ఆగు!' అని అరుస్తూ నేను కూడా పరుగెత్తు కుంటూ వెళ్లి నీళ్లలోకి దిగాను. ఆమె వద్దని వారిస్తున్నా, బిగ్గరగా అరుస్తూ నన్ను తిడుతున్నా పట్టించుకోకుండా... ఆ వరదనీటిలో పడబోతున్న ఆమెను గట్టిగా పట్టుకుని వెనక్కు లాగి, రెండు చేతులతో ఎత్తితెచ్చి బండిలో కుదేసి ఇక్కడకు తీసు కువచ్చాను" అంటూ గ్లాసులో మిగిలిన మద్యాన్ని గొంతులో పోసేసుకున్నాడు కోల్యో.

"ఊఁ!" అంటూ కథను వింటున్నట్లుగా ఊఁ కొట్టాడు ఫిలిప్.

"ఊఁ లేదు! ఆఁ లేదు! ఇంకో గ్లాసుడు మద్యం తీసుకురా! నాకింకా చలీ, వణుకూ తగ్గలేదు"

ఫిలిప్ లేచి చటుక్కున గ్లాసు నింపి తెచ్చిచ్చాడు. ఆ గ్లాసును అందుకుని మద్యాన్ని తాగుతూ గుటకలు వేస్తూ మళ్ళీ చెప్పటం మొదలుపెట్టాడు కోల్యో.

"దారి పొడుగునా ఎన్నెన్నో కబుర్లు చెబుతూ ఆమెకు ధైర్యాన్ని నూరిపోశాను. చిన్న చిన్న ప్రశ్నలు వేసి జవాబులు రాబ డుతూ ఆమెను గురించి వివరాలు తెలుసు కున్నాను. నా మాటలతో ఆమెకు కొంత భరోసా లభించిందనుకుంటాను. అయి తే.. ఇక్కడికి వచ్చేవరకూ ఆమె బిగ్గరగా రోదిస్తూనే వుంది. ఆడవాళ్ళు రోదనతో తమ గుండె బరువును దించుకుంటారని నీకు తెలుసుగా!" అంటూ ఫిలిప్ వంక చూశాడు కోల్యో.

"అయితే ఇప్పుడు ఏం చేద్దామనుకుంటు న్నావ్? "

"ఆమెను నాతోపాటు తీసుకువెడదామ నుకుంటున్నాను"

కోల్యో దగ్గరకు వచ్చి అతని చెవిలో ఏదో గుసగుసలాడాడు ఫిలిప్.

"ఛత్! నేనటువంటి వాణ్ణికాను. ఇలాంటి మాటలు మాట్లాడితే నాకు కోపం వస్తుంది ఫిలిప్!" అంటూ మిగిలిన మద్యాన్ని గడగడ తాగేశాడు కోల్యో.

"ఇంతకీ ఆమె ఎవరో చెప్పనేలేదు" అన్నాడు ఫిలిప్.

"ఆమె కూడా నాలాంటి పేదదే. బతుకు తెరువు కోసం అక్కడే నివాసం వుండే ఒప్పందంమీద బస్తీలోని ఓ ఆస్పత్రిలో పరిచారికగా చేరిందట. అక్కడ కొంత మంది ఆమెను రకరకాలుగా వేధించటం మొదలుపెట్టారుట. అదీకాక... అస్త మానం రకరకాల రోగులకూ సేవలు చేసీ చేసీ ప్రాణం బేజారైపోయిందిట. ఆ యాతనలూ, బాధలూ భరించలేక... విసిగి వేసారిపోయి... ఇక ఉద్యోగం ఒదు లుకుందామనుకుని, ఆస్పత్రి నుంచి బయ టికి వచ్చేసిందిట!"

"అరె! అసలే పేదదంటున్నావు. ఉన్న ఉద్యోగం కూడా ఒదులుకుందా? ఎప్పుడూ? "

"ఇవాళే! ఇలాంటి వాతావరణంలో అయితే తప్పించుకోవటం తేలికని ఆస్పత్రి లోనుంచి చల్లగా జారుకుందిట!

పెట్టె చేతపట్టుకుని, వర్షంలో తడుస్తూ.. కష్టపడి నడుచుకుంటూ, ఎలాగోలా కేస్సా ప్ విస్కీలోయ అవతలివేపు వరకూ రాగ లిగిందట. వర్షం మరింత పెద్దదై... ఈదు రుగాలులు కూడా ఉధృతమవుతుండటం తో ఇక ఆమె అడుగులు ముందుకు పడ టం కష్టమైపోయిందిట.

తను పడుతున్న కష్టాలన్నిటినీ తలుచు కుంటుంటే దుఃఖం ముంచుకువచ్చి, నిరాశ, నిర్వేదం మనసంతా నిండిపోవ టంతో... చావే శరణ్యమనుకుంటూ... వెళ్లి ఆ వరద నీళ్ళలో పడి కొట్టుకుపోదా మనుకుందిట. అదీ సంగతి"

వెనక గది తలుపులు తెరుచుకుని ఆమె దుకాణంలో అడుగుపెట్టింది. రొట్టెలూ,



బ్రెడ్.. ఇతర తినుబండారాలూ తీసుకుని ఆమె వెనకాలే వచ్చాడు స్తోయాన్. ఆమె పొడి దుస్తులు ధరించింది. కొంచెం తేరు కున్నట్లు కనిపిస్తోంది. పాలిపోయిన బుగ్గ ల్లోకి రంగూ, కళ్ళలోకి మెరుపు వచ్చాయి.

"పరాస్కెవిత్సా! చలి కాచుకున్నావా? రా! ఇలా వచ్చి కూర్చో!" బెంచిమీద చోటు చూపిస్తూ ఆమెను సాదరంగా పిలిచాడు కోల్యో.

ఆమె చిరునవ్వు నవ్వుతూ వచ్చి అతనికి

కాస్త దూరంగా కూర్చుంది.

తినుబండారాలను ప్లేట్లలో వడ్డించసాగాడు స్తోయాన్.

"అబ్బో! పదార్థాలు చాలానే వున్నాయి. తినటానికి మాక్కాస్త సాయం చెయ్యకూడదూ! అందరం కలిసి తిందాం రా!" అంటూ ఫిలిప్‌ను పిలిచాడు కోల్యో.

"నేను తరవాత తింటానులే... మీరు కానివ్వండి" అన్నాడు ఫిలిప్.

"సరే! నువ్వు మొదలుపెట్టు పరాస్కెవిత్సా! చాలా అలిసిపోయి వున్నావు. ఎప్పుడు తిన్నావో ఏమో!" అంటూ తను కూడా తినటం మొదలుపెట్టాడు కోల్యో.

"నువ్వేం మొహమాటపడకు! ఈ ఫిలిప్ చాలా మంచివాడు. ఈవేళ కాని వేళలో కూడా మనకు ఆహారం సరఫరా చేస్తున్నాడు చూడు. అతను మనవాడే!"

తింటున్నంతసేపూ ఎంతో మర్యాదను

అనువాదం :
శీతంరాజు పద్మావతి

పాటించాడు కోల్యో. ఆచితూచి మాట్లాడాడు.

ఫిలిప్ కూడా హాస్యాలాడకుండా గౌరవప్రదంగానే సంభాషించాడు. కోల్యో మరో గ్లాసుడు మద్యం తెప్పించుకుని తాగటంతో భోజన కార్యక్రమం ముగిసింది. ఇద్దరూ కాసేపు విశ్రాంతి తీసుకున్నారు.

★ ★ ★

"పరాస్కెవిత్సా! ఇక మనం బయల్దేరాలి. లోపల్నించి నీ పెట్టి తెచ్చుకో! ఇంకా ఆలస్యం చెయ్యటం మంచిది కాదు" అన్నాడు కోల్యో.

"..."

"ఆలోచనలో పడ్డావేమిటి? "

"నీటి ఉధృతి భయంకరంగా వుంది. గుర్రబ్బండి ప్రయాణం సాగుతుందో లేదో ననీ..."

"ఆ నీళ్ళతో ఇప్పుడు మనకు సంబంధం లేదు. ఇటు కొండదారిన వెడదాం"

"ఎవరన్నా నా కోసం వెతుక్కుంటూ వచ్చి గొడవ చేస్తారేమోననే భయం కూడా నన్ను వెంటాడుతోంది"

"ఎందుకంత భయం? నేనున్నాను గదా! నీ జోలికి రావాలనుకునేవాళ్ళు ముందుగా నన్నెదిరించాలి. నీ వెంట పడ్డ వాళ్లను నాకు చూపించు... దీనితో వాళ్ళ పని పడతాను" తన నడుం బెల్టులో బిగించి కట్టిన చాకుమీద చెయ్యి వేసి చూపిస్తూ అన్నాడు కోల్యో.

ఫిలిప్‌తో చెప్పి ఆమె పెట్టెను తెప్పించి బండిలో పెట్టించాడతను. అది తడిసిపోకుండా పీపా చాటుకు జరిపి, గుర్రాలను సిద్ధం చేసి... ఆమెను బండి ఎక్కించాడు.

బండిలోని ఎక్కువ చోటును ఆ రెండు వస్తువులూ ఆక్రమించటంతో... మిగిలిన ఆ కాస్త జాగాలో వాళ్ళిద్దరూ సర్దుకుని కూర్చున్నారు.

ఫిలిప్ బండి దగ్గరకు వెళ్ళి... కోల్యో తలను వంచి, అతని చెవిలో మళ్ళీ ఏదో గుసగుసలాడాడు.

"నోర్మూయ్! ఏం మాట్లాడుతున్నావ్ ఫిలిప్? అసలు నా గురించి ఏమనుకుంటున్నావ్ నువ్వు? ఇలా అయితే మళ్ళీ నీ ముఖం చూడను" అంటూ తన నీలం రంగు పర్సుని తీసి... బిల్లు చెల్లించి, కోపంగా గుర్రాలమీద కొరడా ఝుళిపించాడు కోల్యో.

★ ★ ★

రెండుమూడు నెలల తరవాత హఠాత్తుగా ఓ మధ్యాహ్నం వేళ మద్యం దుకాణంలో ఊడిపడ్డాడు కోల్యో. అతనిలో మార్పు కొట్టొచ్చినట్టు కనపడుతోంది.

గుబురు మీసాలను నీట్‌గా అందంగా కట్ చేయించుకుని, పరిశుభ్రమైన దుస్తులు ధరించి... మనిషి నిండుగా సంతో

షంగా కనపడుతున్నాడు.

"రావయ్యా కోల్యో... రా! ఇన్నాళ్ళూ ఏమైపోయావ్" అంటూ సాదరంగా ఆహ్వానిస్తూనే, "అన్నట్లు... ఆమె ఎక్కడుంది" అని ఆరా తీశాడు ఫిలిప్.

"ఇంకెక్కడుంటుందీ? మా ఇంట్లోనే వుంది"

"అయిందా! అదే నేనంటే... అప్పుడు నువ్వు నామీద అంతెత్తున ఎగిరావుగా"

"ఛత్... అలా కాదు. నే చెప్పేది విను. ఇప్పుడు ఆమె నా ఇంటి ఇల్లాలు"

"నిజమా? "

"ముమ్మాటికీ... ఆ రోజు రాత్రి నేను ఆమెను మా ఇంటికి తీసుకువెళ్ళాను. రెండుమూడు రోజులు వుండి విశ్రాంతి తీసుకోవటానికి అతికష్టం మీద ఆమెను ఒప్పించాను.

ఇంకేముందీ? .... సముద్రం ఒడ్డునున్న బండరాతికి పాచి అతుక్కుపోయినట్లుగా నా పిల్లలు ఆమెకు అతుక్కుపోయారు.

మూడురోజులు పోయాక 'మీ ఇంటికి తీసుకువెళ్ళి దింపుతాను పద!' అన్నాను.

'ఉన్నచోటే బాగుంది. నేను ఎక్కడికీ రాను' అని తేల్చి చెప్పింది.

చేసేదేంలేక, ఒక్కణ్ణే బయల్దేరి... వాళ్ళ స్వగ్రామమైన త్యొస్కోవేల్స్ లోని వాళ్ళింటికి వెళ్ళాను.

ఆమె ఒక వితంతువని తెలిసింది.

ఆ ఇంట్లో పాపం ఆమెను గురించి పట్టించుకునే వాళ్ళే లేరు.

ఆమెరాక కోసం ఎదురు చూసేవాళ్ళు కూడా లేరు.

ఆమెను వివాహం చేసుకుంటానని నేనే వాళ్ళవాళ్ళతో చెప్పి... అందుకు అవసరమైన డాక్యుమెంట్లను తయారు చేయించుకుని తిరిగివచ్చాను.

సాక్షులుగా నలుగురు పెద్దమనుషులను పిలిచి, మా ఊళ్ళోని బంధుమిత్రుల సమక్షంలో నిరాడంబరంగా ఆమెను వివాహం చేసుకున్నాను"

"భలే భలే! నీకు వెతుక్కునే శ్రమలేకుండానే, నీకు నచ్చిన... నిన్ను మెచ్చిన వధువు వచ్చి నీ ఒళ్ళో వాలిందన్నమాట!"

"అవును. ఆ రోజున ఆ వరద రాబట్టి.. అంత మంచిమనిషి నా కంటపడి నా వెంట వచ్చింది.

నా పిల్లలకు తల్లినీ, నాకు ఇల్లాలినీ ప్రసాదించిన ఆ వరదకు ఎన్నిసార్లు ఎంత ఘనంగా కృతజ్ఞతలు తెలియజేసినా తక్కువే అవుతుంది.

అందుకనే ఆ వరదకూ... ఆ వరద రోజున నా జీవితంలోకి వచ్చిన వనితకూ నీ మద్యంషాపు తరపున మరోసారి ధన్యవాదాలు తెలియజేస్తున్నాను"

"చాలా సంతోషం కోల్యో! అందుకో నా అభినందనలు! ఈ శుభ సందర్భంలో నీకు మద్యం పార్టీ ఇస్తాను. నువ్వెంత తాగితే అంత..."

"ఒద్దు బాబూ... ఒద్దు! ఇప్పుడు నేను మద్యం ముట్టటం లేదు"

"ఎందుకని? "

"ఇప్పుడు నాకు కుదురుగా తీర్చిదిద్దిన ఇల్లుంది. అందులో కళకళలాడుతూ తిరిగే పిల్లలున్నారు.

నా కోసం ఎదురు చూసే ఇల్లాలుంది.

మంచి మనసున్న అంత చక్కని చుక్క ఇంటిలో ఉండగా... నీ మద్యం షాపులో దొరికే మద్యం చుక్కలతో నాకేం పని?

ఇటుగా వెడుతూ... ఓసారి నిన్ను చూసి పోదామని వచ్చాను. అంతే!" అంటూ చరచరా బయటకు వెళ్ళి, బండి ఎక్కి.... 'ఛల్ ఛల్' అంటూ హుషారుగా ప్రేమతో గుర్రాలను అదిలించాడు కోల్యో.

గుర్రబ్బండి వాయువేగ మనోవేగాలతో పరుగెత్తసాగింది.

నోరెళ్ళబెట్టి ఆ దృశ్యాన్ని చూస్తూ... తన మద్యం షాపు ముందు స్థాణువులా నిలబడిపోయాడు ఫిలిప్. V

- జాయిస్ కరోల్ ఓట్స్

నగరం

"నేను నీకు చెప్పినట్లుగా నిన్ను ఆల్బనీ స్టేట్ యూనివర్సిటీకి ఇంటర్వ్యూకి కారులో తీసుకెళ్ళలేను"

ఇరవై ఏళ్ళ కేథరిన్‌కి ఆమె తండ్రి ఆ విషయం చెప్పగానే దుఃఖం వచ్చింది,

"కానీ నువ్వు తీసుకెళ్ళకపోతే నేను టీచర్ల ఇంటర్వ్యూకి ఎలా హాజరవగలను? ఇంక నన్ను తీసుకెళ్ళేవారు ఎవరున్నారు? " తండ్రిని అడిగింది.

"ఏం చెయ్యను? శనివారం ఉదయం నన్ను పనికి రమ్మని ఫ్యాక్టరీ మేనేజర్ కోరాడు. ఎలా కాదనను? " తండ్రి బాధగా చెప్పాడు.

కేథరిన్‌కి తెలుసు, శనివారం పని చేస్తే తన తండ్రికి ఒకటిన్నర రెట్లు అధికంగా జీతం ముడుతుందని, కుటుంబ ఆర్థిక పరిస్థితి దృష్ట్యా ఆయన దాన్ని వదులుకోకూడదని. తండ్రి సంపాదించేది తమ కుటుంబానికి సరిపోదని కూడా కేథరిన్‌కి తెలుసు. అందుకే టీచర్స్ ఇంటర్వ్యూకి వెళ్తోంది. తను కూడా కొంత డబ్బు ఇంటికి పంపవచ్చు. పైగా తన వల్ల తండ్రికి కొంత ఖర్చు తగ్గుతుంది.

"పోనీ కారు నాకిస్తే, నేనే వెళ్ళొస్తాను" సూచించింది.

"న్యూయార్క్ ట్రాఫిక్ మన ఊరు పోర్ట్ ఓరిస్కాని ట్రాఫిక్‌లా కాదు. పార్కింగ్ ప్లేస్‌లు తక్కువ. ఒన్ వేలు ఎక్కువ. డ్రైవర్లు దురుసుగా డ్రైవ్ చేస్తారు. రూట్లు అయోమయంగా ఉంటాయి. నేనే న్యూయార్క్‌లో డ్రైవ్ చేయడానికి భయపడ్తాను. కాబట్టి కారు ఇవ్వను" ఆయన ఖండితంగా చెప్పాడు.

"అమ్మ నా పక్కనే కూర్చుంటే? "

"ఇద్దరూ అయోమయాలే. ఐనా నీకు ఇక్కడ ఓ ఉద్యోగం వచ్చిందిగా? " నవ్వాడు.

"కాని నాకు న్యూయార్క్‌లో పని చేయాలని ఉంది. ఇక్కడి కన్నా అక్కడ జీతం ఎక్కువ"

అంతటితో ఆ సంభాషణ ముగిసింది. ఆ రాత్రి కేథరిన్ తన తండ్రిని అడిగింది.

"ఆల్బనీకి గ్రే హౌండ్ బస్‌లో వెళ్తాను"

"అంతదూరం ఒంటరిగానా? " కేథరిన్ తల్లి వెంటనే అడిగింది.

"నాతో పాటు నా క్లాస్‌లోని ఇంకో అమ్మాయి కూడా వస్తోంది. మేము ఒకరికొకరం తోడుగా ఉంటాం" కేథరిన్ అబద్ధం చెప్పింది.

"ఆమె తండ్రికి కూడా దింపే అవకాశం లేదా? ఆమెకీ ఇంటర్వ్యూ ఉందా? " తండ్రి అడిగిన ప్రశ్నల్లోనే జవాబు దొరకడంతో కేథరిన్ ఔనన్నట్లుగా తల ఊపింది.

చివరికి పోర్ట్ ఓరిస్కానీ నించి రాత్రి పదకొండు పదికి బయలుదేరి, మర్నాడు ఉదయం ఏడు ఏభైకి న్యూయార్క్‌లోని ఆల్బనీకి చేరే బస్‌లో కేథరిన్‌కి టిక్కెట్



రిజర్వేషన్ చేయించాడాయన. తన కూతుర్ని ఇంటర్వ్యూకి తీసుకెళ్లలేకపోతున్నాననే అపరాధ భావన ఆయనలోంచి తొలగిపోయింది. టికెట్‌ని చూసి కేథరిన్ ఆనందంగా నవ్వింది. అంత దూరానికి అలా ఒంటరిగా రాత్రి ప్రయాణం చేస్తూ వెళ్ళడం సాహసమే అని ఆమెకి తెలుసు. కానీ, ఇంటర్వ్యూకి హాజరు కావాలంటే తప్పదు అది. తన తల్లిదండ్రులకి కేథరిన్ చెప్పిన ఏకైక అబద్ధం అది.

"అదేం పిచ్చిది కాదు. జాగ్రత్తగా వెళ్ళి రాగలదు" కేథరిన్ తండ్రి దిగులు పడుతున్న తన భార్యతో చెప్పాడు.

కేథరిన్ తండ్రి ఆ రాత్రి గ్రే హౌండ్ బస్ స్టేషన్‌కి తన కూతురితో కారులో

పదకొండు గంటలకి చేరాడు. కేథరిన్ స్నేహితురాలు ఏదని ఆయన అడగలేదు. తల్లి వచ్చి ఉంటే అడిగేదని కేథరిన్‌కి తెలుసు.

"జాగ్రత్తగా వెళ్ళిరా. గుడ్‌లక్" అంటూ తండ్రి వెళ్ళిపోయాడు.

బస్‌లోని ప్రయాణికుల్లో ఎక్కువ మంది మగవాళ్ళే. కొద్దిమంది మహిళలు ఉన్నా వారిలో ఎవరూ ఒంటరిగా వెళ్తున్న దాఖలాలు లేవు. బంగారు రంగు జుట్టుగల ఒకామె బస్సు బయలుదేరడానికి ఓ నిమిషం ముందు ఎక్కింది. ఆమె తన పక్కన ఉన్న ఖాళీ సీట్లో కూర్చుంటుందని కేథరిన్ ఎదురు చూసింది. కాని ఆమె ఓ మగవాడి పక్కన 'సీట్ ఖాళీగా ఉందా?' అని అడిగి కూర్చుంది. కేథరిన్‌కి రెండు వరసల ముందే వారిద్దరూ కూర్చున్నారు. బస్సు బయలుదేరాక అతని మాటలే ఎక్కువగా వినిపించాయి. చాలామంది ప్రయాణికులు నిద్రపోయారు. కాని పైనున్న రీడింగ్ లేంప్ వెలుగులో కేథరిన్ తనతో తెచ్చుకున్న 'ది హెయిరీ ఏప్' అనే సర్రియల్ నాటకం చదవసాగింది. కొద్దిసేపటికి ముందుకూర్చున్న బంగారు జుట్టు ఆమె కంఠం కోపంగా వినిపించింది.

అనువాదం :
యం. ఊహ

"నో సర్"

"ఏం? ఏమైంది?" అతని నవ్వు.

కాని అప్పటికే ఆమె సీట్లోంచి లేచి తన కోటు, చిన్న బేగ్ అందుకొని కోపంగా బస్సు వెనక్కి నడుస్తూంటే, అతని మాటలు వినబడ్డాయి.

"ఆగు, వెళ్ళకు. నేను ఇబ్బంది పెట్టనులే"

ఆమె కేథరిన్‌ని చూసి ఆగింది.

"నీ పక్కన కూర్చోవచ్చా?"

కేథరిన్ తల ఊపింది. ఆమె కేథరిన్ పక్కనే కూర్చుని చెప్పింది.

"వాడు పెద్ద మనిషి అనుకున్నాను. ఉత్త వెధవ"

"ఐ యాం సారీ" కేథరిన్ చెప్పింది.

"ఆ వెధవ నన్ను తప్పుగా అర్థం చేసుకున్నాడు. బస్సుల్లో ఇంత కంటే మంచి వాళ్ళు తారసపడరు"

ఆమె తన కోపం తగ్గాక కేథరిన్‌తో చెప్పింది.

"నా పేరు కార్లా. మొదటి అక్షరం కె"

"నా పేరు కేథరిన్. నా మొదటి అక్షరం కూడా 'కే'నే"

"నేను ఆల్బనీకి వెళ్తున్నాను. నువ్వు?"

"నేను కూడా ఆల్బనీకే" కేథరిన్ చెప్పింది.

కేథరిన్ తన పుస్తకం మూసేసి లైటార్పి నిద్రకి ఉపక్రమించింది. వంటరిగా బస్‌లో ప్రయాణించే థ్రిల్ వల్ల ఆమెకి వెంటనే నిద్ర పట్టలేదు. హైవేలో ఎదురుగా వచ్చే వాహనాల హెడ్‌లైట్ల కాంతి ఆమె మీద పడి మాయమవుతోంది. మేఘాల్లోంచి వెన్నెల కాంతి మందంగా కనిపిస్తోంది.

తెల్లవారు ఝామున మూడు పదికి గ్రేహౌండ్ బస్ రాత్రంతా తెరచి ఉండే రెస్టారెంట్ గల ఓ పెట్రోల్ బంక్‌లో ఆగింది. కార్లా కేథరిన్‌ని మోచేత్తో పొడిచి నిద్ర లేపి చెప్పింది.

"మెలకువగా ఉన్నావా? బస్ పది నిమిషాలసేపు ఆగుతుంది"

బస్సులోంచి తక్కువమంది దిగారు. బయట గాలి చల్లగా మొహానికి తాకింది. ఇద్దరూ చలికి రెస్టారెంట్‌లోకి పరిగెత్తారు. వారిని చూసి లోపలికి వెళ్తూ ఒకతను ఆగి తలుపు తెరిచి అలాగే నిలబడ్డాడు.

"వాడి వంక చూడక. వాడో దుర్మార్గుడు" కార్లా హెచ్చరించింది.

ఆమె లోపలికి వెళ్ళాక కేథరిన్ అతనికి థాంక్స్ చెప్పింది. కార్లా చెప్పింది నిజమే అని ఆ వెంటనే తెలిసింది.

"పరుగెత్తుతూంటే నీ వక్షోజాలు భలే ఊగుతున్నాయి" అతను కేథరిన్‌తో చెప్పాడు.

ఆ మాటలు విననట్లుగానే కేథరిన్ లోపలికి వెళ్ళింది. కార్లా జెల్లీ డఫ్‌నట్‌ని కొని సగం కేథరన్‌కి ఇచ్చి చెప్పింది.

"నేనింత తినలేను"

ఆమె డి-కెఫినేటెడ్ కాఫీని తాగింది.

మర్నాడు ఉదయం బస్ ఆల్బని గ్రేహౌండ్ బస్‌స్టేషన్‌లో ఆగింది. కేథరిన్ ఉమన్స్ రూం (బాత్ రూం)ని ఉపయోగించుకుని, సరాసరి ఆల్బనీ యూనివర్సిటీకి వెళ్ళాలనుకుంది. కాని కార్లా చెప్పింది.

"మా ఇల్లు యూనివర్సిటీకి దగ్గరే నేను తప్ప మా ఇంట్లో ఎవరూ లేరు. అక్కడికి వచ్చి ఫ్రెష్ అయి వెళ్ళచ్చు"

ఇద్దరూ టేక్సీలో బయలుదేరారు. కేథరిన్ మేప్‌ని చూస్తూ తను వెళ్ళేదారి ఆల్బనీ యూనివర్సిటీకి సమీపంలో ఉందో లేదో తనిఖీ చేసింది. అది గమనించి కార్లా చెప్పింది.

"అంత పెద్ద బస్టాండ్‌ని చూసి బిత్తర పోయావు. నీకంతా కొత్త అని అర్థమై మా ఇంటికి పిలిచాను. కానీ ఇలా న్యూయార్క్‌లో కొత్తవాళ్ళు ఎవరు పిలిచినా వెళ్ళకూడదు. ఆడవాళ్ళయినా సరే. ఎక్కువ మంది దుర్మార్గులే ఉంటారు"

★ ★ ★

అది సింగిల్ బెడ్‌రూం అపార్ట్‌మెంట్. తమ ఇంటికి ఆరురెట్లు చిన్నదైన దాని అద్దె ఎంతో విని కేథరిన్ ఆశ్చర్యపోయింది.

"న్యూయార్క్‌లో జీతాలు ఎక్కువ అని ఇక్కడ ఉద్యోగం చేయడానికి ఉత్సాహపడ్డాను. కానీ ఒక్క ఇంటి అద్దే ఇంత ఎక్కువా? "

కార్లా నవ్వి జవాబు చెప్పింది.

"ఇక్కడ వచ్చే జీతాలు బొటాబొటిగా సరిపోతాయి. అందుకే కనీసం ఇద్దరు, ముగ్గురు కలిసి ఇలాంటి చిన్న అపార్ట్‌మెంట్లని తీసుకుంటారు"

"మగ, ఆడ అనే విచక్షణ లేకుండా అని విన్నాను? " కేథరిన్ అడిగింది.

"అవును. మనకి ఆడవాళ్ళే దొరకాలని వేచి ఉంటే నెలనెలా అంత అద్దె కట్టడం కష్టం. అదృష్టం బావుంటే, మంచి మగాళ్ళే దొరుకుతారు. వాళ్ళేమైనా చేస్తే చట్టం ఏం చేస్తుందో ముందు రోజే బెదిరింపుగా చెప్పాలి. ఆల్కహాల్, సిగరెట్లు ఇంట్లో నిషిద్ధం అని ముందే చెప్పాలి. తాగి వస్తే తలుపు తీయకూడదు. మన విలువైన కాగితాలు, డబ్బు ఎప్పుడూ భద్రంగా ఉంచుకోవాలి. మన వస్తువులు వాడినా భరించాలి"

అదంతా విని కేథరిన్ ఆశ్చర్యపోయింది.

క్లోజెట్‌లోని టవల్‌ని కార్లా తీసిస్తూంటే మగవాళ్ళ దుస్తులు చూసి, ఆమె అపార్ట్‌మెంట్ మేట్ మగవాడని గ్రహించి అడిగింది.

"అతనెలాంటివాడు? "

క్రితం రాత్రి బస్‌లో తన పక్కసీట్లో కూర్చున్న వ్యక్తిని తిట్టిన ఓ బూతు తిట్టుని అతను ఎలాంటివాడో చెప్పడానికి కార్లా ఉపయోగించింది. కేథరిన్ త్వరగా స్నానం ముగించింది. ఇంటర్వ్యూకి అవసరమైన పుస్తకాన్ని చదువుకుంటూంటే కార్లా కూడా తయారైంది. ఇద్దరూ కలిసి బయట బ్రేక్‌ఫాస్ట్ చేయాలి అనుకున్నారు. కార్లా రూంమేట్ చేతిలో ఓ కార్డ్‌బోర్డ్ బాక్స్‌తో లోపలికి వచ్చాడు. చెవులమీద పడే జులపాల జుట్టుగల అతను బయటకి వెళ్తున్న కార్లాని విష్ చేసి కేథరిన్ వీపు కింద గిల్లాడు.

"ఓ రోజు తాగి వచ్చి వీడు నానా రభస

చేసాడు. నైన్ లెవెన్‌కి ఫోన్‌చేసి పోలీసుల్ని పిలిచాను. ఈ నెల ఏడో తారీకు కల్లా అపార్ట్‌మెంట్ ఖాళీ చేస్తానని వారికి హామీ ఇచ్చాడు" కార్లా చెప్పింది.

"ఐదు నిమిషాల నడకతో చేరుకోగల చిన్న రెస్టారెంట్‌కి చలిగాలిలో ఇద్దరూ నడిచి వెళ్ళారు. రెండిళ్ళ మధ్యగల సన్న సందుల్లో పేవ్‌మెంట్ మీద కార్డ్ బోర్డు పెట్టెలని కోసి, పరుచుకుని దుప్పట్లు కప్పుకుని పడుకున్న వాళ్ళని చూసి కేథరిన్ ఆశ్చర్యపోయింది.

"వాళ్ళెవరు? " అడిగింది.

"కొందరు పేదవారు. మరి కొందరు అద్దె చెల్లించలేని కొంత ధనవంతులు. మరి కొందరు ఎయిడ్స్ రోగగ్రస్థులు. న్యూయార్క్‌లో ఉచితంగా దొరికేది అదే. అలాంటి వారికి ఇళ్ళు అద్దెకి దొరకవు"

"పాపం! స్నేహితులు లేనివారన్నమాట"

"న్యూయార్క్‌లోని స్నేహితులు చిన్న ఊళ్ళల్లోని స్నేహితుల్లాంటివారు కాదు. తమకి లాభం ఉంటే స్నేహం అంటారు. లేదా దూరంగా ఉంచుతారు" కార్లా చెప్పింది.

అంత చెత్త బ్రేక్‌ఫాస్ట్‌ని కేథరిన్ తన జీవితంలో ఎన్నడూ తినలేదు. జిడ్డుగా ఉన్న ఆమ్లెట్, చల్లారిపోయిన ఏపిల్‌పై దాని ధర తమ ఊళ్ళోని భోజనం ధరకి మూడురెట్లు ఉండటం చూసి అబ్బురపడింది. కార్లా కేథరిన్‌కి బస్‌స్టాండ్‌ని చూపించి ఆల్బనీ యూనివర్సిటీకి ఏ నంబర్ బస్ ఎక్కాలో చెప్పి ఆఫీస్‌కి టైమైయిందని సబ్ వే వైపు బయలుదేరింది. పది అడుగులు వేసి, ఏదో ఆలోచన వచ్చినట్లుగా వెనక్కి తిరిగి వచ్చి కేథరిన్‌తో చెప్పింది.

"పొరపాటున కూడా రాత్రి తొమ్మిది తర్వాత ఇక్కడ సబ్‌వేని ఎక్కకు. ఒక్కోసారి ప్రాణాలే పోవచ్చు. వంటరిగా ఉన్నా ఫర్వాలేదు కాని ఇంకో ఊరునించి వచ్చావని తెలిస్తే మాత్రం ప్రమాదం"

బస్‌లో కేథరిన్ తనపక్కన కూర్చున్న అతన్ని అడిగింది.

"పోలీస్ కార్ల అలారం సౌండ్ ఎక్కువసార్లు ఎందుకు వినిపిస్తోంది? "

"ఇది న్యూయార్క్ కాబట్టి. ఇక్కడ రోడ్డు ప్రమాదాలు, హత్యలు చాలా ఎక్కువ. నువ్వు ఈ ఊరికి కొత్త అన్న సంగతి ఎవరికీ తెలియనీయవద్దని నా సలహా. నీ పక్కన ఏం జరుగుతున్నా, ఓ మనిషి ఇంకో మనిషిని చంపినా, ఏం జరగనట్లే ప్రవర్తించాలి. అది న్యూయార్క్ సంస్కృతి"

కేథరిన్ ఇంక అతనితో ఏం మాట్లాడలేదు. ఎత్తయిన స్కై స్క్రేపర్లు, రోడ్లమీద తిరిగే ఖరీదైన కార్లు, విశాలమైన రోడ్లు ఆమెని పెద్దగా ఆకర్షించలేదు.

యూనివర్సిటీ కేంపస్‌లో బస్ దిగి కేథరిన్ పదకొండు గంటలకి డాక్టర్ వెర్నర్ ఛాంబర్‌కి చేరుకుంది. అతని సెక్రటరీకి తనకి వచ్చిన ఉత్తరాన్ని చూపించింది.

"నీ ఇంటర్వ్యూని పదకొండు నించి ఒకటి ఇరవైకి మార్చారు" సెక్రటరీ చెప్పింది.

ఎందుకని కేథరిన్ ప్రశ్నించలేదు. అక్కడే కూర్చుంది. ఆ అమ్మాయి కేథరిన్ అక్కడ లేనట్లుగానే తన పనిలో నిమగ్నమైంది.

పన్నెండుకి ఆ అమ్మాయి లేచి వెళ్ళి, పన్నెండున్నరకి మళ్ళీ వచ్చాక కేథరిన్ అడిగింది.

"నేను లంచ్ చేయడానికి దగ్గరలో ఏదైనా రెస్టారెంట్ ఉందా? "

ఆమె ఓ కూపన్ ఇచ్చి చెప్పింది.

"దీన్ని చూపిస్తే, యూనివర్సిటీ కేంటీన్‌లో అనుమతిస్తారు. కాని ఒకటి ఇరవై కల్లా ఇక్కడ ఉండాలి. లేదా నీ ఇంటర్వ్యూ రేపటికి వాయిదా పడచ్చు"

"నేను వెళ్ళి వచ్చేంత టైం ఉందా? "

కేథరిన్ అడిగింది.

"చెప్పలేను"

ఆమె కమిట్ అవదల్చుకోలేదు అనుకుంది కేథరిన్. ఇందాక తను లంచ్‌కి వెళ్ళేప్పుడు పొరుగూరు నించి వచ్చిన తన లంచ్ సంగతి ఆమె అడిగి ఉండవచ్చుగా అనుకుంది. ఆ కూపన్‌ని వెనక్కి ఇచ్చేసింది. డాక్టర్ వెర్నర్ దగ్గరికి సెక్రటరీ కేథరిన్‌ని ఒకటిన్నరకి పంపింది.

ఆయన ఏభై ఏళ్ళ హిస్పానిక్ (మెక్సికన్). మొహం తీక్షణంగా ఉంది, ఆమె ఫైల్‌ని తిరగేసి అందులోకి చూస్తూనే అడిగాడు.

"నువ్వు అంకిత భావంతో విద్యాబోధన చేయగలనని రాసావు. నీకు ఎందుకలా అనిపించింది? "

తను ఆ మాటలు రాసినట్లుగా కేథరిన్‌కి గుర్తు లేదు. కాని అతనికి ఏదైనా చెప్పాలి. ఇంతదూరం ఇంత శ్రమపడి వచ్చిన తను నిరాకరింపబడకూడదు. ముందు తడబడుతూ మొదలుపెట్టి, తర్వాత ఆత్మవిశ్వాసంతో తను చెప్పేది పూర్తి చేసింది. తనకి చదువంటే ఇష్టం అని, తన తాతయ్య, అమ్మమ్మలు హంగరీ నించి వలసదారులుగా వచ్చినప్పుడు ఇంగ్లీస్ రాదని, చదువు విలువ తెలియని ఆ తరం వారు తన తల్లిదండ్రులని పెద్దగా చదివించలేదని, కానీ అమెరికాలో చదువు చాలా ముఖ్యం కాబట్టి అలాంటి విద్యని తను పిల్లలకి నేర్పించదలచానని చెప్పింది.

"డాక్టర్ వెర్నర్, నేను నా జీవితాన్ని బోధనకే అంకితం చేయదల్చుకున్నాను. కానీ నా అప్లికేషన్‌లో నేనలా రాసానని అనుకోవడం లేదు"

గుడ్. టీచర్లు అబద్ధాలు ఆడకూడదు. నువ్వు రెండువారాల తర్వాత తిరిగి ఆల్బనీకి రావాల్సి ఉంటుంది. నిన్ను ఎన్నిక చేసాను" అతను నవ్వుతూ చెప్పాడు.

కేథరిన్‌కి ఉద్యోగం వచ్చినందుకు పెద్దగా సంతోషం కలగలేదు. తన బస్ ఐదు ముప్పైఅయిదుకి బయలుదేరుతుందని, కాబట్టి అపాయింట్‌మెంట్ లెటర్‌ని సాధ్యమైనంత త్వరగా టైప్ చేసి ఇవ్వమని ఆయన్ని కోరింది.

★ ★ ★

సాయంత్రం ఐదు ముప్పైఐదుకి ఆల్బనీ నించి పోర్ట్ ఓరిస్కానీకి బయలుదేరిన బస్‌లో కేథరిన్ కూడా ఉంది. గతరాత్రి బస్‌లో సరిగ్గా నిద్రపోని కేథరిన్‌కి బస్ కుదుపులకి నిద్ర పట్టేసింది. రాత్రి రెండుం పావుకి బస్ పెట్రోల్‌బంక్‌లో ఆగింది. నిద్రలో ఉన్న కేథరిన్‌ని లేపడానికి పక్కన ఎవరూ లేరు.

మర్నాడు ఉదయం ఆరున్నరకి బస్సు దిగి, తనని రిసీవ్ చేసుకోవడానికి వచ్చిన తల్లిదండ్రులని చూసి, ఆనందంగా ఇద్దర్నీ ఆలింగనం చేసుకుంది.

"నీ ఫ్రెండ్ బార్బరా ఏది? " తల్లి అడిగింది.

"అది రావడం అబద్ధం. లేకపోతే నువ్వు పంపవని అలా చెప్పాను. నేనొక్కదాన్నే వెళ్ళి వచ్చాను చూశావా? "

"ఇంతకీ ఏమైంది? " తండ్రి అడిగాడు.

అపాయింట్‌మెంట్ లెటర్ కవర్ ఆయనకి చూపించింది.

"ఎప్పుడు చేరాలి? " తల్లి ఆనందంగా అడిగింది.

"నేను ఈ ఉద్యోగంలో చేరడం లేదు"

"అదేం? "

"న్యూయార్క్ కంటే మన ఊరే ఎన్నోరెట్లు మంచిది. ఇక్కడ మనిషి మనిషిగా బతుకుతాడు. ఒకరినొకరు రక్షిస్తారు. ఈ ప్రదేశాన్ని వదిలి నేను బయటికి వెళ్ళదలచుకోలేదు" కేథరిన్ చెప్పింది.

కార్లో ఇంటికి వెళ్తూ కేథరిన్ చెప్పే ఒకో అనుభవాన్ని ఆమె తల్లిదండ్రులు విస్ఫారిత నేత్రాలతో వినసాగారు. V

పాఠకమహాశయులకు మనవి!



మూడున్నర దశాబ్దాలుగా తెలుగు, భారతీయ భాషలు, ప్రపంచ భాషల్లోని అత్యుత్తమ కథలతో విశ్వకథావేదికగా విశేషంగా అలరిస్తున్న **విపుల** విశిష్ట ప్రయోగంగా పాఠకదేవుళ్ల జేజేలందుకుంటోంది.

గత ఆరేళ్లుగా కాగితం ఖర్చు, ముద్రణ, రవాణా, పంపిణీ ఖర్చులు, అదనపు సాంకేతిక వ్యయాలు ఇబ్బడి ముబ్బడిగా పెరిగినా ఇప్పటివరకు **విపుల** ధర పెంచలేదు.

ఇప్పుడీ భారం మరింతగా పెరిగిన నేపథ్యంలో అనివార్యంగా **విపుల** ధర సవరించక తప్పడం లేదు.

ఆ మేరకు ఈ నెల నుంచి **విపుల** విడిప్రతి **12/-** రూపాయలు అవుతోందని గమనించ ప్రార్థన.

సహృదయ పాఠకులు, సాహిత్యాభిమానులు పరిస్థితులను అర్థంచేసుకొని, ఎప్పటిలాగే ఆదరిస్తారని ఆశిస్తున్నాం.

విడిప్రతి రూ. **12/-** అయినా ఏడాది చందా రూ. **140/-** మాత్రమే!

– మేనేజర్
వసుంధర పబ్లికేషన్స్

ముషాయిరా

మనిషంటే...



మనసు కావ్యాన్ని
వ్యాఖ్యానించుకొంటే
ఎటువంటివాడు మనిషో తెలుస్తుంది
నడుస్తున్న చరిత్రలో మనిషి
మహానగరంలో మాయగాడు

హోదాకోసం భార్యను తార్చే రసికరాజు
పంచదార పూసిన విషపు సూక్తితో
వేలమంది శ్రమ ఫలితాన్ని
ఎగరేసుకు పోతున్నవాడు
ఆకలి బాధతో కాళ్లూ కడుపూ ముడుచుకొని
మరణ బాధపడుతున్న మనిషి వేదనను
సినిమాగా చూస్తున్నవాడు

రెక్కలు విప్పుకొని మకరందం
నింపుకొంటున్న పుష్పాలను
స్వీయ పైశాచిక శృంగారానందం కోసం
రేకులను తెంపుతూ ఆడుకొని
సంపద కోసం షోకేసుల్లో
బొమ్మలుగా మార్చి
అమ్ముకొంటున్న వ్యాపారి

పిల్లలను ఎత్తుకుపోయి
వికలాంగులను చేసి
వారు తెచ్చే బిచ్చపురాళ్లతో
కోట్లకు పడగెత్తుతున్న మాఫియా
ఇవి మనుషుల ముఖాలు కావు

నిజంగా మనిషంటే
మనిషి కోసం- మమత కోసం
అనుబంధం కోసం- అనురాగం కోసం
కలిమి లేముల్లో- కష్టసుఖాల్లో
అసమానతల విషం లేకుండా చేసి
సమతామృతాన్ని తాగిస్తూ
శ్రమ సౌందర్యంతో
జీవితానికి జెండాగా నిలబడేవాడు

– వల్లభాపురం జనార్దన

శిక్షణ




అన్నీ ఉన్న ఐశ్వర్యవంతుడే అయినా
అపుడపుడూ నాకేమిస్తావంటూ
కొంటెగా అడుగుతాడు
నావి అనుకున్నవాటన్నిటినీ
మరెవరికో పంచేసి
నన్నేడిపించాలని చూస్తాడు
నేనెవరికీ యివ్వనంటూ
దేన్నైనా గట్టిగా పట్టుకుంటే
నా గుప్పెటలో నుంచి దానిని
సున్నితంగా తప్పిస్తాడు
ఉక్రోషంతో నేను వాదనకు దిగితే
'నేనిచ్చిందే కదా తల్లీ!' అంటూ
నాన్నలా నవ్వుతాడు
ప్రలోభాలనే బండరాళ్లను
తెలియక మెడకి కట్టుకున్న ప్రతిసారీ
పరీక్షల ప్రవాహానికి కట్టలు తీస్తాడు
తెలివి తెచ్చుకుని
నేనా బరువులొదిలించుకునే వరకూ


నిర్లిప్తంగా నను గమనిస్తాడు
మరొకప్పుడు...
నేనూహించని పురస్కారాలని
పూలదండలా నా మెడలో వేస్తాడు
నేను దానిని తడిమి మురిసే లోపు
ఆ పూరేకులన్నీ నావైపే రాల్చేసి
వాటి వెనుకనున్న సూత్రాన్ని
గమనించమంటాడు
నిష్కామమనే నాపని
తయారుచేసుకునే వరకూ

– టి. శ్రీవల్లీ రాధిక

నవ్వుల విందు


నీ మీద ఒట్టు వచ్చే సంవత్సరం దాక మందు ముట్టను. ఈ రోజుకి వదిలేయవే...!!!
DEC 31 14
నాగ్రాజ్.


అవి గొబ్బెమ్మలు కావండీ! సంక్రాంతి వెరైటీ స్వీట్స్ చేసిందండీ మా అమ్మ..!!
భాను


ఈ మధ్య నా కథలేవీ తిరిగి రావడం లేదు సెలెక్ట్ అవుతున్నాయనుకున్న మాట..!!
సెలెక్టా, పాడా, తిరిగి వచ్చినవన్నీ దాచి, భోగి మంటల్లో వేసారు పిల్లలు..!!
కవిశ్రీ రచయిత
భాను

